ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ పంచమి మ.3.50 వరకు అనంతరం షష్ఠి; నక్షత్రం: పూర్వాభాద్ర రా తె.5.18 వరకు అనంతర ఉత్తరా భాద్ర; అమృతకాలం: రా.7.15 నుండి 9.00 వరకు; వర్జ్యం: ఉ.9.58 నుండి 11.43 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.12 వరకు, మ.12.24 నుండి 1.12 వరకు ; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ.3.00 నుండి 4.30 వరకు

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:57 • సంచిక:267 • శుక్రవారం 11 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from:Hyderabad|Karimnagar|Nizamabad|Suryapet|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati |Kurnool |Anantapur|Nellore

అలోక్‌వర్మ ఇక ఇంటికి



• ప్రధాని మోడీ ఇంట్లో సెలక్షన్ కమిటీ అత్యవసర భేటీ

• సీవీసీ నిర్ణయానికే ఆమోదముద్ర • వ్యతిరేకించిన మల్లికార్జునఖర్గే

రెండు రోజుల్లో పదవి రావడం..ఊడటం జరిగిపోయింది. సీబీఐ డైరక్టర్ అలోక్‌వర్మ సుప్రీంకోర్టు ఆదేశంతో విధుల్లో చేరడం..ప్రధాని నివాసంలో నియామక కమిటీ సమావేశం కావడం..ఆయన మీద ఆరోపణలు నిజమేనని తేల్చడం..వెంటనే ఆయనకు ఉద్వాసన పలకడం ఆగమేఘాల మీద జరిగిపోయాయి. సుప్రీంకోర్టు వారం గడువిచ్చినా కేంద్రం మాత్రం ఆయన్ని వెంటనే పంపించేయాలని నిర్ణయించింది. కమిటీలోని ప్రతిపక్ష సభ్యుడు మల్లికార్జున ఖర్గే ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించినట్టు తెలిసింది.

10 లో

జస్టిస్ లలిత్ నిష్క్రమణ

• లాయర్ అభ్యంతరంతో హఠాత్ నిర్ణయం • అయోధ్య టైటిల్ కేసు

విచారణ మరింత జాప్యం • ఈనెల 29కి వాయిదా

అయోధ్య టైటిల్ వివాదాన్ని విచారించాల్సిన అయిదుగురు జడ్జీల ధర్మాసనం నుంచి జస్టిస్ యుయు లలిత్ వైదొలిగారు. తద్వారా రాబోయే వివాదాల నుంచి ఆయన తనని తాను రక్షించుకున్నట్టయింది. 1994లో ఉత్తరప్రదేశ్ సీఎంగా ఉన్న కల్యాణ్‌సింగ్ తరపున ఇదే అయోధ్య కేసులో జస్టిస్ లలిత్ వాదించారు. ఇదే అంశాన్ని లాయర్ రాజీవ్ ధావన్ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. అయితే ఆయన్ని తొలగించాలని మాత్రం అడగలేదు. జస్టిస్ లలిత్ మాత్రం తప్పుకునేందుకే మొగ్గు చూపారు. దీంతో ఈ విచారణ మరింత జాప్యం కావడం అనివార్యమవుతున్నది.



10 లో



లోక్‌సభ ఎన్నికలకు కేసీఆర్ గూగ్లీ

మల్కాజ్‌గిరి అభ్యర్థిగా ఐఏఎస్ రాజీవ్ శర్మ?

హైదరాబాద్,ఆంధ్రప్రభ: హస్తిన రాజకీయాలపై సీరియస్‌గా దృష్టిపెట్టిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు లోక్‌సభ ఎన్నికల కోసం సరికొత్త అస్త్రాలను సిద్ధం చేస్తున్నారు. పరిపాలనావిభాగంలో 3వ పేజీలో...

ఉమ్మడి జిల్లాలకు మూడేసి పదవులు



ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలుసుకున్న మక్తల్, నారాయణపేట్ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి

50 కీలక పదవుల భర్తీకి కేసీఆర్ సుదీర్ఘ కసరత్తు

పెద్ద జిల్లాకు ఇద్దరు మంత్రులు.. ఒక పార్లమెంటరీ కార్యదర్శి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఖాళీగా ఉన్న 16 మంది మంత్రి పదవులతో పాటు కీలకమైన మొత్తం యాభైకిపైగా పదవుల భర్తీకి తెరాస అధినేత, సీఎం కేసీఆర్ తనదైనశైలిలో కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు కనీసం రెండు పదవులు కల్పించేలా ఆయన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. గత రెండు రోజులుగా పదవుల భర్తీపై కేసీఆర్ సమాలోచనలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు కేసీఆర్‌తో ప్రత్యేకంగా సమావేశమై పదవుల భర్తీపై చర్చలు జరిపినట్టు ప్రచారం జరిగింది. ఆయా సామాజికవర్గాలు, జిల్లాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పనితీరు, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయా జిల్లాల్లో వారు పనిచేసిన విధానం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని జాబితా సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. మంత్రివర్గాన్ని ఏ క్షణంలోనైనా విస్తరించే అవకాశాలు ఉన్నందున అందుకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఈనెల 18న మంత్రివర్గంలోకి కొత్త వారిని తీసుకునేందుకు వీలుగా ముహూర్తం ఖరారైందని ప్రచారం జరుగుతున్నా ఇంతవరకు ఈ విషయంలో సీఎం కేసీఆర్ నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో ఆ రోజున ఈ కార్యక్రమం ఉండకపోచ్చని భావిస్తున్నారు. ఫిబ్రవరి 7వ తేదీన మంచి ముహూర్తం ఉన్నందున అదే రోజున రాజ్‌భవన్‌లో కొత్త మంత్రులను తీసుకునేందుకు వీలుగా మంత్రివర్గాన్ని విస్తరించే అవకాశాలున్నట్టు అధికారులకు ప్రగతి భవన్ వర్గాలు సంకేతాలిచ్చినట్టు సమాచారం. సీఎం కేసీఆర్‌తో పాటు మహమూద్ అలీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. మరో పదహారు మందిని మంత్రులుగా తీసుకునే అవకాశం ఉండడంతో ఆశావహులు ఈ పదవులపై గంపెడాశలు పెట్టుకున్నారు. పది నుంచి పదిహేను మంది వరకు పార్లమెంటరీ కార్యదర్శులను తీసుకునే అవకాశం 3వ పేజీలో...

మమత పిలిచినా.. కోల్‌కతా ర్యాలీకి దూరం

రాహుల్‌తో వేదిక పంచుకునే ప్రసక్తే లేదంటున్న తెరాస

కేసీఆర్ బాటలో

నవీన్ పట్నాయక్

ఆసక్తికరంగా

జాతీయ రాజకీయాలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రాంతీయ విపక్షపార్టీలు, కాంగ్రెస్‌తో కలిసి ఈనెల 19న కోల్‌కతాలో నిర్వహిస్తున్న మహార్యాలీకి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ నేతృత్వం వహిస్తుండగా, కాంగ్రెస్ హాజరయ్యే ఏ వేదికా తాము పంచుకునే ప్రసక్తేలేదని టీఆర్ఎస్ తేల్చిచెప్పింది. కేసీఆర్ గతంలో రెండుసార్లు మమతాబెనర్జీతో భేటీ కాగా, 2వ పేజీలో...

పంచాయతీ బరిలో 27,940 సర్పంచ్ అభ్యర్థులు

97, 690 వార్డు సభ్యులు



మొత్తం 1,25,630

ముగిసిన స్క్రూటినీ

అప్పీళ్లకు నేడు అవకాశం

11 లో



జుట్టుకి రంగేసి అయ్యప్ప గుడిలోకి మహిళ ప్రవేశం

10 లో



ఢిల్లీ తెరపై మళ్లీ షీలా

డీపీసీసీ సారథ్యం

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం

కేజ్రీతో సమన్వయానికే

మూడుసార్లు ఢిల్లీ సీఎంగా పనిచేసిన షీలా దీక్షిత్ మళ్లీ ఢిల్లీ కాంగ్రెస్ తెరమీదికొచ్చారు. ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా రాహుల్‌గాంధీ ఆమెని నియమించారు. ఎనభై ఏళ్ల షీలా దీక్షిత్‌కి ఈ బాధ్యతలు అప్పగించడం వెనక జాతీయ కూటమి రాజకీయాలు ప్రధానపాత్ర వహిస్తున్నట్లు తెలుస్తున్నది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో కాంగ్రెస్ పార్టీ స్నేహం చేయాలని ఆలోచిస్తున్న తరుణంలో షీలా నియామకం ఆ మార్గాన్ని సుగమం చేయగలదని భావిస్తున్నారు.

వెబ్‌సైట్ల వికృత క్రీడలు

సైబర్‌నేర నిరోధక విభాగానికి సవాల్

ఎన్నికల ప్రచారం ముసుగులో ప్రత్యర్థులపై దుష్ప్రచారం

అభాసుపాల్జేసే కుటిల యత్నాలు .. వెర్రితలలు వేస్తున్న సాంకేతిక పరిజ్ఞానం



హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతుండడంతో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ విస్తృత ప్రచార పోకడలపై దృష్టిపెట్టాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రచారంలో సోషల్ మీడియా ప్రాధాన్యత పెరిగింది. ప్రైట్ మీడియా ద్వారా చేయలేని ఆరోపణలు, విమర్శల్ని కూడా సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసుకునే వీలు చిక్కింది. తమ విజయాలు, మేనిఫెస్టోలోని అంశాలు, ఆశయాలు, ఆకాంక్షల కంటే కూడా ప్రత్యర్థులపై దుష్ప్రచారానికి ఇవి సోషల్ మీడియాను వేదిగ్గా ఎంచుకుంటున్నాయి. ఇందుకోసం ఇప్పటికే ప్రధాన పార్టీలన్నీ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకున్నాయి. నిపుణుల్ని ఉద్యోగులుగా నియమించుకున్నాయి. తప్పుడు అడ్రస్‌ల్తో నకిలీ ఐపి సంకేతాల్తో వెబ్‌సైట్లను ప్రారంభించాయి. కాంగ్రెస్ మూల స్థంభాలైన మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూలనుంచి ఇందిర, రాజీవ్, సోనియా, ప్రస్తుత అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వరకు లక్ష్యంగా చేసుకుని ఫోటోషాప్‌లో సృష్టించిన నకిలీ ఫోటోలు, వీడియోలను విస్తృతంగా ప్రచారంలో పెట్టాయి. తద్వారా వారి వ్యక్తిత్వాన్ని కించపర్చడం ద్వారా ఆ పార్టీ పరపతిని ప్రజల్లో దిగజార్చే ప్రయత్నానికి శ్రీకారం చుట్టాయి. అలాగని ఈ విషయంలో కాంగ్రెస్ కూడా ఏం తక్కువ తినలేదు. అదికూడా పెద్ద సంఖ్యలోనే నకిలీ వెబ్‌సైట్లను ప్రారంభించింది. నకిలీ వార్తల్ని ప్రచారంలో పెట్టింది. మోడి అమిత్‌షా, రామ్‌మాధవ్, యడ్యూరప్ప, యోగిఆదిత్యనాథ్ వంటి సీనియర్ నాయకులపై నకిలీ ఫోటోలు, వీడియోలు తయారు చేసి ప్రచారంలోకి తెచ్చింది. ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా ప్రత్యర్థులను ఆభాసుపాల్జేసే ప్రయత్నాలు జోరందుకున్నాయి. ఇటీవల 3వ పేజీలో...



వరల్డ్ నెంబర్ 1 బాక్సర్ మేరీకోమ్

ఏఐబీఏ తాజా ర్యాంకుల్లో వెల్లడి

12 లో



అమెరికాలో చదువు.. కెనడాలో కొలువు

ట్రంప్ ఆంక్షలతో రూటుమార్చిన భారతీయ నిపుణులు

బ్రిటన్‌కూ పెరిగిన వలసలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్1-బీ వీసాల మంజూరును కఠినతరం చేయడంతో భారతీయ నిపుణులు కెనడా, ఇంగ్లాండ్ వైపు దృష్టి సారించారు. ఇమ్మిగ్రేషన్ విధానంలో మార్పు రావడంతో అమెరికాలో ఉన్నత విద్య పూర్తి చేసుకుని ఆ దేశాల్లో ఉద్యోగాలకు వెళ్ళేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గత రెండేళ్ళుగా అమెరికా నుంచి కెనడా, ఇంగ్లాండ్ వెళ్ళి ఉద్యోగ అన్వేషణ చేయడంలో భారతీయులే ముందు వరుసలో నిలిచారు. హెచ్1-బీ వీసాల మంజూరులో కఠినతరం చేయడంతో భారతీయ విద్యార్థులకు ఇస్తున్న వీసాలను వినియోగించుకోకపోవడంతో అక్కడి విశ్వవిద్యాలయాల్లో సీట్లు భర్తీ కాకపోవడంతో యాజమాన్యాల్లో ఆందోళన మొదలైంది. భారత విద్యార్థులు కెనడా, ఇంగ్లాండ్‌వైపు దృష్టి సారించడంతో అమెరికా విశ్వవిద్యాలయాల యాజమాన్యాలు ట్రంప్‌ను కలిసి మొర పెట్టుకున్న సంగతి తెలిసిందే. అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించినప్పటికీ అక్కడ ఎంతోకాలం స్థిరపడే అవకాశం లేనందున కెనడా, ఇంగ్లాండ్ వైపు మొగ్గు చూపుతున్నట్టు ఇండీడ్ సంస్థ తన అధ్యయనంలో వెల్లడించింది. భారతీయ టెక్కీలకు ఇప్పటి వరకు అమెరికాలో 8వ పేజీలో...





వృద్ధ దంపతుల దాతృత్వం

- ప్రభుత్వానికి విరాళంగా వృద్ధాశ్రమం
- రూ. కోటితో నిర్మించిన భవనం
- ప్రశంసించిన కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వృద్ధదంపతుల దాతృత్వాన్ని చూసి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు ఆశ్చర్యపోయారు. అభినందనలజల్లు కురిపించారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు గ్రామంలో నిర్మించిన మేరెడ్డి సత్యనారాయణరెడ్డి, జానకమ్మ వానప్రస్థ ఆశ్రమాన్ని ప్రభుత్వానికి డొనేట్ చేసేందుకు ముందుకు వచ్చారు. ఆశ్రమ నిర్వాహకులు మేరెడ్డి సత్యనారాయణరెడ్డి, జానకమ్మ దంపతులు. ఈమేరకు తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావును గురువారం కలిసి పూర్తివివరాలు అందించారు. ఎకరంన్నర భూమిలో దాదాపు ఆరువేల అడుగుల చదరపుభవనాన్ని సొంత ఖర్చులతో నిర్మించామని, అనారోగ్యం రీత్యా భవనంతో పాటు పూర్తి ఆశ్రమాన్ని ప్రభుత్వానికి విరాళంగా ఇవ్వడం ద్వారా వృద్ధులకు సేవలు కొనసాగేలా చూడాలని కేటీఆర్‌ను కోరారు. ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి యాదాద్రి జిల్లాకలెక్టర్ అనితారామచంద్రన్‌తో మాట్లాడతానని, మీరు ప్రారంభించిన సేవా కార్యక్రమం కొనసాగించేలా ప్రభుత్వం నుండి అవసరమైన సహాయం అందేలా చూస్తామని కేటీఆర్ హామీనిచ్చారు. జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్‌తో కూడా కేటీఆర్ మాట్లాడారు.

ఇదే వేగంతో మహిళా బిల్లు ఓకే చేయాలి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: అగ్రకులాల పేదకు 10శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లు వాయువేగంతో ఉభయసభల్లో ఆమోదంపొందగా, ఇదే వేగంతో మహిళా రిజర్వేషన్ల బిల్లును కూడా ఆమోదించాలని టీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ట్విట్టర్ ద్వారా గురువారం ఆమె తన డిమాండ్ వినిపించారు. మహిళా రిజర్వేషన్లబిల్లుకు ఆమోదముద్ర పడితేనే దేశం నిజమైన ప్రగతి సాధిస్తుందని తెలిపారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లు పాస్ కావాలంటే బలమైన రాజకీయసంకల్పం కావాలన్నారు.

తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సందడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును కలిసేందుకు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, వివిధ సమస్యలతో పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఎంబిసి కార్పొరేషన్ ఉద్యోగులు ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో కలిసి తమ సమస్యలను విన్నవించారు. పలువురు వికలాంగులు తమ పరిస్థితిని వివరించగా, కొందరు పార్టీ నేతలు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పి తమపై ఆశీస్సులు ఉంచాలని కోరారు. ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి నియోజకవర్గంలో ఓటర్లనమోదు కార్యక్రమం జరుగుతున్న తీరును వివరించారు. సీతారామా ప్రాజెక్టుకు అన్ని అనుమతులు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.



దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం అమిత్ వర్ధన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ వినోద్

సహస్ర చండీయాగానికి సన్నాహాలు ముమ్మరం

- ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్
- ఆయుత చండీయాగాన్ని మరిపించేలా సన్నాహాలు



ఫైల్ ఫొటో

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మరో మహాయాగానికి తెలంగాణ నేల సిద్ధమైంది. ఈనెల 21నుండి చతుర్వేద పురస్సర మహారుద్ర సహిత సహస్రచండీయాగం నిర్వహించాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నిర్ణయించారు.

ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలిస్తున్నారు. రాష్ట్రాభివృద్ధి, లోకకల్యాణం కోసం ఈనెల 21నుండి 25వతేదీవరకు ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌజ్‌లో ఈయాగం చేపడుతున్నారు. శృంగేరి శారదా పీఠం ఆధ్వర్యంలో ఈ మహాయాగం జరగనుంది. చతుర్వేద పండితులు మాణిక్య సోమయాజి, నరేంద్ర కాప్రే, పురాణం మహేశ్వర శర్మ తదితరుల ఆధ్వర్యం లో 200మంది రుత్విక్కులతో శృంగేరి పద్ధతిలో ఈయాగం జరగనుంది. 25వ తేదీన పూర్ణాహుతితో యాగం సమాప్తం కానుంది. యాగం సందర్భంగా తొలిరోజుల 100సప్తశతి చండీపారాయణలు, రెండోరోజు 200, మూడోరోజు మూడువందలు, నాలుగోరోజు నాలుగువందల పారాయణలు ఉంటాయి. అంతా కలిపితే వేయి పారాయణలు ఉంటాయని, ఐదవరోజు 11యజ్ఞ కుండాల వద్ద వంద పారాయణల స్వాహాకారాలతో హోమం నిర్వహించనున్నారు.

నాలుగురోజులలో వేయికి పైగా రుద్రపారాయణలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ప్రతిరోజు సాయంత్రం రామాయణ, భాగవత పారాయణలు జరపనుండగా, ఈ మహాయాగానికి పండితులు, యోగులను సీఎం ఆహ్వానించనున్నారు.

భారీగా తరలిరానున్న ప్రజలు

గతంలో ఆయుతచండీయాగం చూసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలిరాగా, ఇపుడు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కోరోజు ఒక్కో విశిష్టతతో ఈయాగం జరగనుండగా, భక్తులకు, అన్నదానం, నీరు, వెహికిల్ పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ హామీ ఏమైంది



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈబీసీ రిజర్వేషన్లపై ఆగమేఘాలమీద బిల్లుపెట్టి ఆమోదింపచేసిన కేంద్రప్రభుత్వం ఎస్సీవర్గీకరణ బిల్లు విషయంలో ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయలేదని వరాజీ ఎంపీ, ఏఐసీసీ కార్యదర్శి వి.హనుమంతరావు ప్రశ్నించారు. వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామన్న ఎన్డీఏ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆ బిల్లును ఎందుకు ప్రవేశపెట్టలేదని నిలదీశారు. ఈబీసీ రిజర్వేషన్లకు తామువ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లలో పేర్కొన్న క్రీమీలేయర్‌ను విధానాన్ని ఎందుకు ఎత్తివేయలేదని ఆయన నిలదీశారు. ఈ అంశంపై ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కూడా ప్రత్యేక దృష్టిని సారించనున్నారని వీహెచ్ వివరించారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం రాష్ట్రంలో గత రెండున్నర దశాబ్దాలుగా ఉద్యమం నడుస్తోందని, అప్పటి యూపీఏ ప్రభుత్వం ఉషామెహ్రా కమిషన్ వేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పిస్తామన్న హామీనీ బీజేపీ నిలబెట్టుకోలేదని ఆయన విమర్శించారు.

రాహుల్ రైతు పక్షపాతి

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ రైతుల పక్షపాతి అని టీ పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. దేశం మొత్తం కాంగ్రెస్ వైపు చూస్తోందని గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేసేందుకు రైతులందరూ ఎదురు చూస్తున్నారని ఆయన చెప్పారు. రాజస్థాన్‌లో బుధవారం జరిగిన సభలో రైతులకు రూ. 2 లక్షలు మాఫీ అమలు చేస్తున్నట్లు ప్రకటించారని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని ఆయన వివరించారు. తెలంగాణలోని టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదని ఆయన నిలదీశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయకుండా సీఎం కేసీఆర్ రైతులకు మోసం చేశారని ఆయన విమర్శించారు.

ఉత్తమ్.. కాంగ్రెస్‌కు పట్టిన శని

- అధిష్టానానికి ఫిర్యాదు చేశా.. సర్వే

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తెలంగాణా పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి శనిలా దాపురించి పార్టీని నిండా ముంచాడని కాంగ్రెస్ సీనియర్ నేత సర్వే సత్యనారాయణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇటీవల ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ టీపీసీసీ నిర్ణయం తీసుకుంది. దీంతో గురువారం ఢిల్లీలో ఏఐసీసీ క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ ఏకే ఆంటోని ఎదుట సర్వే సత్యనారాయణ హాజరై వివరణ ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నిన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడమేంటని ఆంటోని ఆశ్చర్యపోయారని తెలిపారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ కుంతియా తప్పిదాలను ఆంటోనీకి వివరించానని సర్వే వెల్లడించారు. ఏఐసీసీ సభ్యుడినైన తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారం లేకపోయినా పీసీసీ అధ్యక్షుడు సస్పెండ్ చేశారని ఆరోపించారు. ఉత్తమ్ చర్యల వల్ల చంద్రబాబు, ప్రొఫెసర్ కోదండరామ్‌తో పాటు కమ్యూనిస్టు పార్టీల నాయకులూ అభాసు పాలయ్యారని విమర్శించారు. ఉద్దేశ పూర్వకంగానే పార్టీకి నష్టం చేసిన పీసీసీ అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని ఆంటోనీని కోరానని ఆయన తెలిపారు. తన ఆరోపణలన్నిటినీ రాతపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలని ఆంటోనీ చెప్పారని సర్వే సత్యనారాయణ అన్నారు.

కేంద్ర నిధులపై చర్చకు రెడీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి గడిచిన నాలుగేళ్లలో రెండు లక్షల కోట్ల రూపాయలకు పైగా గ్రాంటు నిధులను అందజేసిందని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. ఈ విషయంపై తాను సిఎం కేసీఆర్‌తో గానీ, కేటీఆర్‌తో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. గురువారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు అందలేదని కేటీఆర్ అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ల కల్పనపై అసెంబ్లీలో బిల్లు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ముస్లింలకు మత ప్రాతిపదికన రిజర్వేషన్లు సాధ్యం కాదని సుప్రీంకోర్టు సైతం తేల్చిచెప్పిందన్నారు. అగ్ర కులాల్లోని పేదల కోసం మోడీ ప్రభుత్వం చారిత్రాత్మక రాజ్యాంగ సవరణ చేసిందన్నారు. 70 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత మోడీ ఒక్కడే ఇంత సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. సమాజంలో అగ్రవర్ణాల్లో ఉన్న పేదలకు కూడా న్యాయం చేయడం కోసం ఈ బిల్లు తెచ్చామన్నారు. సుప్రీంకోర్టు పరిశీలనలో సైతం ఈ బిల్లు నిలబడేలా రాజ్యాంగానికి సవరణ చేశామన్నారు.

మమత పిలిచినా.. కోల్‌కతా ర్యాలీకి దూరం

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్, బీజేపీలకు సమాంతరంగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు తాను తీసుకున్న చొరవను వివరించారు. తాజాగా పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉపనేత వినోద్ దీనిపై స్పందించారు. ఈ సమావేశానికి కేసీఆర్‌ను ఆహ్వానించారో లేదో నాకు తెలియదు.. ఒకవేళ ఆహ్వానించినా కాంగ్రెస్ లేదా రాహుల్ పాల్గొనే సమావేశంలో, కార్యక్రమంలో కేసీఆర్ వేదికను పంచుకునే ప్రసక్తే ఉండదు అని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్, టీఆర్ఎస్‌కు ప్రధానప్రతిపక్షంగా ఉండగా జాతీయ స్థాయిలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ రావాలని టీఆర్ఎస్ కోరుకుంటోంది. ఈ నేపథ్యంలో కోల్‌కతా పిలుపువచ్చినా వెళ్ళే అవకాశాలు లేవని టీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. ఒడిస్సా సీఎం పట్నాయక్ కూడా మహాకూటమికి తాము దూరమని చెప్పిన విషయం విదితమే. కేసీఆర్, ఒడిస్సా సీఎం నవీన్ పట్నాయక్ ఇద్దరి ఆలోచనలు ఒకేరకంగా ఉన్నాయి. ఇక ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రతిపాదనను గౌరవిస్తున్నామని, ఆయనను కలిసి చర్చిస్తామని ప్రకటించారు. బిఎస్పీ అధినేత్రి మాయావతి కూడా ఫెడరల్ ఫ్రంట్ ఆలోచనలకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. కేసీఆర్ ఇచ్చిన ఫెడరల్ నినాదంతో దేశంలో రాజకీయ సమీకరణలు సరికొత్త గమ్యం వైపు చూస్తున్నాయని రాజకీయవర్గాలు అంటున్నాయి.

సిద్ధిపేట నేతన్నలకు రుణమాఫీ

- త్రిఫ్ట్ ఫండ్ పథకంతో 565 మందికి లబ్ధి
- రూ. 1.38 కోట్ల మేరకు రుణమాఫీ పత్రాలు అందజేత
- త్వరలో రూ. 1.55 కోట్లతో మరో క్లస్టర్: హరీష్‌రావు

సిద్ధిపేట, ప్రభన్యూస్: ప్రభుత్వం ఏ పథకం తీసుకొచ్చినా సిద్దిపేట ప్రజలకు అందాలన్నదే తన ప్రయత్నమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు పేర్కొన్నారు. గురువారం సిద్దిపేటలోని చేనేత సహకార సంఘంలో చీరలను నేసే ఆధునాతన మగ్గాలను ఆయన పరిశీలించారు. సిద్దిపేటలోని ఐదు సహకార సంఘాల పరిధిలోని 565మందికి త్రిఫ్ట్ ఫండ్ పథకం ద్వారా రూ.1.38కోట్లు రుణమాఫీ పత్రాలు, చెక్కులను బ్యాంకర్‌లకు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ చేనేత అభివృద్ధి పథకం ద్వారా రూ.1.55కోట్లతో బ్లాక్ స్థాయిలో మరో క్లస్టర్‌ను ఈ నెలరోజుల్లో తెచ్చుకోబోతున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వం తరపున ఇవ్వలేకపోయామని, ఇప్పుడు మీకు అందించే రుణమాఫీకి ప్రభుత్వం తరపున మిత్తిని కలిపి ఇచ్చేలా రుణమాఫీని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా 16శాతం జమ చేస్తుందని, ఈ పథకం ద్వారా 26లక్షల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. రూ.1.55 కోట్లతో మరో క్లస్టర్‌ను నెలరోజుల్లో తెచ్చుకోబోతున్నామన్నారు.



చేనేత రంగం ఆధునీకరణకు రూ.1.29కోట్లు

కామన్ ఫెసిలిటీ కేంద్రం, కామన్ వర్క్‌షెడ్ పథకం ద్వారా సిద్దిపేటలోని ఆదర్శ చేనేత సహకార సంఘం, ప్రాజెక్టు చేనేత సహకార సంఘం శ్రీరాములపల్లి, ఇర్కోడు చేనేత సహకార సంఘాల సౌకర్యాల షెడ్‌ల నిర్మాణం ఆధునీకరణకు రూ.1.29కోట్ల నిధులు వెచ్చించినట్లు వెల్లడించారు. అదే విధంగా చేనేత మిత్ర పథకంలో భాగంగా నూలు, రసాయనాలు పథకం క్రింద 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 10 శాతం కేంద్ర ప్రభుత్వంతో కలిపి 50 శాతం సబ్సిడీ అందుతుందన్నారు. ఇందుకు గాను జిల్లాకు రూ.2లక్షలు వచ్చాయని పేర్కొన్నారు.

కొత్త తరం గొల్లభామ చీరలు నేయాలి..

సిద్దిపేట జిల్లాకు గొల్లభామ చీరలకు ప్రాచుర్యం వచ్చిందని, వీటికి ప్రజల ఆదరణ లభిస్తోందన్నారు. అమెజాన్ వెబ్‌సైట్‌లో గొల్లభామ చీరలను విక్రయించేలా అంతర్జాతీయ ఖ్యాతి వచ్చిందని తెలిపారు. గొల్లభామ చీరలను మగ్గాలపై నేసేందుకు చీరకు మూడు రోజుల సమయం పట్టేదని, ఆధునీకరణలో భాగంగా మూడు రోజుల్లో రెండు చీరలు నేసేలా మిషనరీ సహాయం అందుతోందన్నారు. కొత్త తరం వారు గొల్లభామ చీరలను నేయడం లేదని, వయస్సు మీరిన వారే వీటిని వేస్తున్నారన్నారు. కాబట్టి మహిళలకు ప్రత్యేక శిక్షణతో పాటు ఉపాధిని కల్పించేలా గొల్లభామ చీరల తయారీ శిక్షణను నిర్వహించనున్నట్లు తెలిపారు. టైలరింగ్ సొసైటీని ఏర్పాటు చేసి ప్రభుత్వం తరపున కుట్టుమిషన్‌లను అందజేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల డ్రెస్ కోడ్ దుస్తులను మీరే కుట్టి విక్రయాలు జరిపేలా ప్రభుత్వం నుంచి ఆర్డర్‌లు ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు.



కేసీఆర్ క్రాప్‌కాలనీల ఆలోచన అద్భుతం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పంటకాలనీల ఏర్పాటు ఆలోచన అద్భుతమని, దేశమంతా ఆచరణీయమని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి అనుబంధ విభాగం నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్‌సర్వే అండ్ ల్యాండ్ యూజ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కే సింగ్ అభిప్రాయపడ్డారు. వ్యవసాయరంగ అభివృద్ధిలో, రైతాంగ సంక్షేమం పంట కాలనీల ఏర్పాటు కీలక ముందడుగు అని అన్నారు. పంటకాలనీల ఏర్పాటు అంశంపై గురువారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.ప్రవీణ్ రావు ఓ ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో పంటకాలనీల ఏర్పాటుపై సీఎం కేసీఆర్ పట్టుదలతో ఉన్నారని, ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు, నేలలు, నీరు ఇతర వనరులను పరిగణలోకి తీసుకొని మండలాలవారీ పంటల సరళి, ఉత్పత్తి, ఉత్పాదకతల మ్యాప్‌లను రూపొందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. పంటకాలనీల మాప్‌ల ఏర్పాటు తర్వాత ఏయే ప్రాంతాల్లో ఏయే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకి అవకాశం ఉందో ఒక రోడ్‌మ్యాప్ రూపొందించాలని తీర్మానించారు. వీటి రూపకల్పనలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ ఉపకులపతి డాక్టర్ చిండి వాసుదేవప్ప, ఇతర శాస్త్రవేత్తల సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 5, 6వ తేదీలలో ఒక విస్తృత వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రవీణ్ రావు తెలిపారు.

వర్క్‌షాప్‌లో వచ్చిన సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకొని తుది నివేదికను ఫిబ్రవరి నెలాఖరుకి ప్రభుత్వానికి సమర్పించను న్నట్లు ఉపకులపతి ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రాప్ కాలనీల రోడ్‌మ్యాప్‌పై ఫిబ్రవరి 5, 6 తేదీల్లో సదస్సు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన క్రాప్ కాలనీలపై రోడ్‌మ్యాప్ ఖరారు చేసేందుకు ఫిబ్రవరి 5, 6 తేదీల్లో ఉన్నత స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఇందులో వ్యవసాయ శాఖ, ఇతర అధికారులు పాల్గొని క్రాప్ కాలనీలను నిర్ణయించనున్నారు. దీనికి సంబంధించి వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ వి.ప్రవీణ్‌రావు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నాగ్‌పూర్‌లోని నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే డైరెక్టర్ ఎస్‌కే సింగ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. 5, 6 తేదీల్లో ఉన్నత స్థాయి సదస్సు నిర్వహించి రోడ్‌మ్యాప్‌పై ఒక నివేదిక రూపొందించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

పంట బీమాకు మార్గదర్శకాలు

- ఫసల్ బీమా పైనా చర్చ
- ఖరీఫ్ పంటలపై నోటిఫికేషన్
- రైతు ఖాతాలకే పంట నష్ట పరిహారం
- కో-ఆర్డినేషన్ కమిటీ నిర్ణయం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో పంటల బీమా అమలుపై గురువారం రాష్ట్రస్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. 2019-20లో జిల్లాల వారీగా పంటల బీమా అమలుకు విధివిధానాలను సమావేశంలో చర్చించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం మార్గదర్శకాలపై కూడా సమావేశంలో సమీక్షించారు. 2019ఖరీఫ్‌లో అమలు చేయాల్సిన మార్గదర్శకాలను పునఃసమీక్షించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. పంటల బీమాకు సంబంధించి ఒక్క ఏడాది(2019-20)పాటు నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయించారు. టమోటో పంటను కూడా ఆర్‌డబ్ల్యూబీసీఐస్ కింద పైలెట్ బేసిస్‌గా అదిలాబాద్ , రంగారెడ్డి జిల్లాల్లో అమలు చేయాలని సమావేశంలో తీర్మానించారు. పీఎంఎఫ్‌బీవై పథకాన్ని 2019 ఖరీఫ్‌కింద వరి, జోన్న , మొక్కజొన్న, కంది, పెసర, మినుము, వేరుశనగ, సోయాబీన్ , పసుపు పంటలకు అమలు చేయాలని నిర్ణయించారు. 2019-20 రబీ కింద అదనంగా కుసుమ ఎర్ర మిరప , ఉల్లి ,శనగ, జోన్న పంటలకు కూడా అమలు చేయాలని నిర్ణయించారు. ఆర్‌డబ్ల్యూబీసిఐఎస్ కింద ఖరీఫ్‌లో పత్తి, ఎర్ర మిరప, స్వీట్‌లైమ్, ఆయిల్ పాం పంటలకు , రబీలో మామిడి తోటలకు ఆమలు చేయాలని నిర్ణయించారు. పీఎంఎఫ్ బివై పథకం కింద ప్రీమియం చెల్లింపులకు 2019ఖరీఫ్‌లో వరికి ఆగస్ట్ 31, ఇతర పంటలకు జులై 31 చివరి తేదిలుగా నిర్ణయించారు. అదే విధంగా 2019 రబిలో వరి ,జొన్న కంది, పెసర ,మినుము, వేరుశనగ, సోయా , పసుపు పంటలకు డిసెంబర్ 31కటాఫ్ డేట్‌గా నిర్ణయించారు. శనగకు నవంబర్30, మేజ్‌కు డిసెంబర్ 15 కటాఫ్ డేట్‌గా నిర్ణయించారు. 2019 ఖరీఫ్‌లో పత్తికి జులై 15, స్వీట్ లైమ్‌కు ఆగస్ట్ 9, పామ్‌ఆయిల్‌కు జులై 14, మామిడికి డిసెంబర్ ఒకటి కటాఫ్ డేట్‌గా నిర్ణయించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను ఆరు క్లష్టర్లుగా నిర్ణయించారు.

పంటల సాగులో పెట్టుబడులకు బ్యాంకురుణాల ఎంపికలో స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయాధికారాన్ని టీఎస్‌సిఏడికి అప్పగిస్తూ తీర్మానించారు. నిజామబాద్ జిల్లాలో యుపిఐఎస్ పథకం అమలుకు నిర్ణయించారు. పంట నష్టాల్లో భాగంగా పందులు, జింకలు, దుప్పులు,కోతుల వల్ల జరిగే పంటనష్టాలకు బీమా కల్పించాలని , విపత్తు నష్టాలనుకూడా ఈ పథకంలో చేర్చాలని నిర్ణయించారు. పంటల బీమా కంపెనీలకు ఫిబ్రవరిలో బిడ్ డాక్యుమెంట్‌ను ఇచ్చి ,నోటిఫికేషన్ మార్చిలో విడుదల చేయాలని నిర్ణయించారు. 2018లో పంటనష్ట బీమా పరిహారాన్ని యుద్ధప్రాతిపదిక న రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకున్నారు.



ప్రధాని, హోంమంత్రితో
గవర్నర్ భేటీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ ప్రధానమంత్రి నరేంద్రమోడీతో భేటీ అయ్యారు. గురువారం లోక్‌కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసానికి వెళ్లిన గవర్నర్ నరసింహన్ ప్రధానమంత్రి తో సమావేశమయ్యారు. ఏపీ, తెలంగాణలోని తాజా రాజకీయ పరిస్థితులపై సుమారు అరగంటపాటు చర్చలు జరిపినట్లు తెలిసింది. అనంతరం హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఉభయ రాష్ట్రాలలోని తాజా పరిస్థితులపై నివేదిక అందజేశారు. ఇటీవల జరిగిన హైకోర్టు విభజన ప్రక్రియ తదితర అంశాలను ఆయనకు వివరించినట్లు సమాచారం. విభజన చట్టంలో అమలు చేయాల్సిన అంశాల పురోగతి అంశాలపై చర్చ జరిగిందని తెలిసింది. అలాగే రెండు రాష్ట్రాలలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. సమావేశం అనంతరం గవర్నర్ హైదరాబాద్‌కు తిరుగపయనమయ్యారు.

వెబ్‌సైట్ల వికృత క్రీడలు

(మొదటిపేజీ తరువాయి)

ఆల్ఇండియా బిజెపి పేరిట ఫేస్‌బుక్‌లో ఓ పేజీని సృష్టించిన ఆకాష్‌సోని తప్పనిసరి పరిస్థితుల్లో దాన్ని మూసేయాల్సొచ్చింది. ఈ పేజీ నిండా కాంగ్రెస్ వ్యతిరేక అంశాలే. ఆ పార్టీని దేశద్రోహిగా, పాకిస్తాన్ అనుకూలవాదిగా చిత్రీకరించే కథనాలే వెల్లువెత్తాయి. సంఘపరివార్‌తో పాటు బిజెపి కార్యకర్తలు కూడా ఈ పేజీకి పాఠకులుగా మారారు. ఏకంగా పదిలక్షల మంది చదువరులు ఈ పేజీని అనుసరిస్తున్నారు. కాంగ్రెస్ నిర్వహించిన ఓ ర్యాలీలో ప్రదర్శించిన ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ జెండాను ఏకంగా పాకిస్తాన్ జెండాగా పేర్కొంటూ ఇందులో ప్రచురించిన కథనం వివాదాలకు తావిచ్చింది. కాంగ్రెస్‌ను పాకిస్తాన్ అనుకూల పార్టీగా ముద్రవేసేందుకు ఈ వెబ్‌సైట్ ప్రయత్నించిందంటూ ఆకాష్‌సోనిపై దాడి కూడా జరిగింది. ఆకాష్‌సోనికి ఆర్ఎస్ఎస్‌తో దీర్ఘకాల అనుబంధమున్నట్లు ఆ తర్వాత విచారణలో వెల్లడైంది. గతంలో ఇదే వెబ్‌సైట్‌లో జవహర్‌లాల్ నెహ్రూ అర్ధనగ్నంగా ఉన్న కొందరు విదేశీ మహిళల్తో సాన్నిహిత్యంగా ఉన్న ఫోటోను కూడా ప్రచురించింది. అప్పట్లో ఓ సారి వివాదం జరిగినా ఈ వెబ్‌సైట్ తీరు మార్చుకోలేదు. ఎన్నికల నేపధ్యంలో ఇది మరింతగా రెచ్చిపోయింది. అలాగే కాంగ్రెస్ అనుకూల నకిలీ వెబ్‌సైట్లు కూడా తక్కువ తినలేదు. దైలీ ఇన్ ఇండియా వెబ్ సైట్ అయితే మాజీ ప్రధాని మన్మోహన్‌ను ప్రపంచంలోనే అత్యంత నిజాయితీగల నేతగా అమెరికాకు చెందిన ఓ అతిపెద్ద సర్వే సంస్థ నిగ్గుతేల్చిందంటూ వివాదాలకు ప్రచురించింది. అయితే సర్వే చేసిన సంస్థకు సంబంధించి ఎలాంటి వివరాలు ఇది పేర్కొనలేదు. అసలీలాంటి సర్వే ఒకటి జరిగిందన్న దాఖలాలు కూడా ఎక్కడాలేవు.

తెలంగాణా ఎన్నికల్లో కూడా పదుల సంఖ్యలో నకిలీ వెబ్‌సైట్లు పుట్టుకొచ్చాయి. సైబర్‌నేరాల నియంత్రణ విభాగం ఎప్పటికప్పుడు ఈ నకిలీల్ని గుర్తించే ప్రక్రియ చేపట్టింది. గుర్తించిన వాటిని తొలగించింది. అయినా ఐదారు రోజులకు కొత్తవి అడ్రస్‌ల్లో పుట్టుకొచ్చాయి. ఈ ఎన్నికల్లో కూడా అటు టీఆర్ఎస్, ఇటు ప్రజాకూటమిలనే లక్ష్యంగా కొన్ని వెబ్‌సైట్లు నకిలీ వార్తల్ని విస్తృతంగానే ప్రచారం చేశాయి. కెటిఆర్, కవిత, హరీష్‌రావులపై కొన్ని వెబ్‌సైట్లు కథనాలు ప్రచురిస్తే మరికొన్ని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదండరామ్, కొండా సురేఖ, తదితరులపై నకిలీ వార్తలుగుప్పించాయి. ఈ కథనాల్లో ఎక్కువగా కుటుంబ వ్యవహారాలు, వ్యక్తిగత వివరాల్ని కూడా పొందుపర్చాయి. వీటి ప్రభావం ఏ మేరకు కనిపించకపోయినా ఎన్నికల సమయంలో పార్టీల కార్యకర్తల మనోబలాన్ని దెబ్బతీసే ప్రయత్నం మాత్రం విశృంఖలంగా సాగింది.



రానున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని అప్పుడే తెలుగులో కొన్ని వెబ్‌సైట్లు ఆవిర్భవించాయి. ఇవి ప్రధాన పార్టీల నాయకులపై బురదజల్లడం మొదలెట్టాయి. వ్యక్తిగత జీవితంలోకి తొంగిచూసి విమర్శలు గుప్పిస్తున్నాయి. వీటి నిర్వాహకులు కూడా అత్యంత సాంకేతిక నైపుణ్యం కలిగిన వ్యక్తులు. ఎప్పటికప్పుడు వీటి ఐపి అడ్రస్‌లను గుర్తించే ప్రక్రియను పోలీస్ యంత్రాంగం చేస్తున్నా అంతకుమించిన వేగంతో వీరు చిన్న చిన్న మార్పులు చేసి తిరిగి కంప్యూటర్ తెరపై ప్రత్యక్షం అవుతున్నారు. ఈ నకిలీ వార్తా వెబ్‌సైట్లను కట్టడి చేయాల్సిన అవసరాన్ని సామాజిక నిపుణులు నొక్కి చెబుతున్నారు. ఎన్నికల్లో ప్రత్యర్థి బలహీనతలు, తమ బలాలపై ప్రచారం చేసుకోవడం వరకు సంప్రదాయం. అంతకుమించి నకిలీ ఫోటోలు, వీడియోలు సృష్టించి ప్రత్యర్థుల్ని నవ్వులపాలుచేసే ప్రయత్నం ప్రజాస్వామ్య వ్యవస్థలో సరికాదని వీరు సూచిస్తున్నారు. అందొచ్చిన సాంకేతిక పరిజ్ఞానం వెర్రి తలలేసుకుండా మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సైబర్ నేరనిరోధక విభాగానికి వీరు సూచిస్తున్నారు.

అవయవదానాల్లో
మనమే టాప్
తర్వాతి స్థానాల్లో తమిళనాడు, కర్నాటక

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మరణించిన వ్యక్తిని మరో వ్యక్తిలో చూసుకోవాలంటే అవయవదానం సరైందన్న ప్రచారానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ఈ అవయవదానంలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. ఒక మనిషి మరణించిన తర్వాత ఆ వ్యక్తి అవయవాలను దానం చేస్తే కనీసం నలుగురి ప్రాణాలను నిలబెట్టవచ్చు. ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చు. ఈ విషయంలో తెలంగాణ ప్రజలు తన గొప్ప మనసును చాటుకుని సాటి మనిషికి సహాయం చేయడంలో మనకెవరూ సాటిలేరని చాటుకుంటున్నారు. అవయవదానాల విషయంలో వివిధ రాష్ట్రా ల నుంచి సేకరించిన వివరాల మేరకు తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. 2018 సంవత్సరంలో తెలంగాణలో 160 మంది బ్రెయిన్ డెడ్ పేషంట్ల నుంచి కీలక అవయవాలు సేకరిస్తే, రెండవ స్థానంలో 140 మంది నుంచి తమిళనాడులో, 135 మంది నుంచి మహారాష్ట్రలో, 90 మంది నుంచి కర్నాటకలో అవయవాలను సేకరించారు. గతంలో అవయవ సేకరణలో తమిళనాడు అగ్రస్థానంలో ఉండగా, ఈ ఏడాది తెలంగాణ మొదటి స్థానంలో చేరింది. అయితే మహారాష్ట్ర, కర్నాటకల్లో ఈ విషయంలో వృద్ధి నమోదు చేశాయి.

ప్రజల్లో చైతన్యం ముఖ్యం

ఒక వ్యక్తి మరణించాక సాధారణంగా ఆయా కుల, మతాచారాల ప్రకారం అంతిమ క్రియలు నిర్వహిస్తుంటారు. అలాంటి వారి నుంచి నేత్రాలు దానం చేస్తే ఇద్దరికి కంటి చూపును ప్రసాదించినట్లవుతుంది. అదే బ్రెయిన్‌డెడ్ లాంటి కేసుల్లో అయితే నేత్రాలతో పాటు గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు వంటివి సేకరించి, వాటిని అవయవాలు పాడైపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సరైన సమయంలో అమర్చగలిగితే వారికి కొత్త జీవితం ప్రసాదించొచ్చు. ఇవే కాకుండా జీర్ణకోశం, చేతులు, పేగులు, చర్మం ఎముకలు వంటివి ట్రాన్స్‌ప్లాంట్ చేసే అవకాశాలున్నాయి. ఈ విషయంలో సదరు బ్రెయిన్ డెడ్ మృతుని బంధువులను ఒప్పించడం కీలకం. అత్యంత ప్రీతిపాత్రులను కోల్పోవడం తీర్చలేని లోటైనప్పటికీ సదరు వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో మరో నలుగురికి కొత్త జీవితం బహూకరించినట్లవుతుంది. కీలక అవయవాలు వృధాగా మట్టిలో కలిసిపోవడమో లేక బూడిదగా మిగలడమో కాకుండా మరో నలుగురికి ప్రాణం పోయగలిగే ఈ జీవనధానం సమకాలీన పరిస్థితులలో అత్యంత కీలకంగా మారింది. ఇందులో తెలంగాణ అగ్రభాగాన నిలిచింది.

లోక్‌సభ ఎన్నికలకు
కేసీఆర్ గూగ్లీ

(మొదటిపేజీ తరువాయి)

ఉద్దండులైన నిపుణులను రాజకీయాల్లోకి తీసుకురావాలని భావిస్తున్నారు. వారిలో కొందరిని లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిపేందుకు వ్యూహరచన చేస్తున్నారు. రాష్ట్రంలోని లోక్‌సభ స్థానాలన్నీ టీఆర్ఎస్ ఏకపక్షంగా గెలుచుకుంటుందన్న అంచనాల నేపథ్యంలో ఈసారి లోక్‌సభ సీట్లకోసం విపరీతమైన పోటీ ఏర్పడింది. పలువురు ఐఏఎస్ అధికారులు, ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు కూడా అవకాశం ఇవ్వాలంటూ తమ మదిలోని ఆకాంక్షను అధినేత ముందు ఉంచుతున్నారు.

ఢిల్లీ నాడి తెలిసిన రాజీవ్‌శర్మ ?

తెలంగాణ తొలి సీఎస్‌గా విశేష సేవలందించడంతో పాటు ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా ఢిల్లీ స్థాయిలో తెలంగాణ వ్యవహారాలను చక్కబెట్టడంలో, కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా శరవేగంగా అనుమతులు సాధించి పనులు పూర్తిచేయడంలో రాజీవ్‌శర్మది కీలకపాత్ర. ఢిల్లీ రాజకీయాల్లో కేసీఆర్ ఫెడరల్ ఆలోచనలను అద్భుతంగా ముందుకు తీసుకువెళ్ళడానికి రాజీవ్ శర్మ సేవలు వినియోగించుకోవాలని కేసీఆర్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కేంద్ర సర్వీసుల్లో పనిచేసిన రాజీవ్‌శర్మకు ఢిల్లీ స్థాయిలో విస్తృత పరిచయాలు ఉండగా, ఇవి తెలంగాణ ప్రగతికి వినియోగించుకోవాలని, దేశాన్ని తాను ఊహిస్తున్న న్యూ ఎకనామిక్ మోడల్ దిశగా నడిపించేందుకు ఇలాంటివారి మేధస్సు, పరిచయాలు, నేపథ్యం ఉపకరిస్తాయని సీఎం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తెలంగాణలోనే విద్యావంతులు అధికంగా ఉన్న మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి అభ్యర్థిగా రాజీవ్‌శర్మ పేరు పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఇక్కడినుండి మల్లారెడ్డి ప్రాతినిధ్యం వహించగా, మేడ్చల్ శాసనసభ నియోజకవర్గం నుండి ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికైన నేపథ్యంలో ఈ పదవికి రాజీనామా చేశారు. ఈ నియోజకవర్గంలో పార్టీ బలాబలాలపై టీఆర్ఎస్ ఇప్పటికే సర్వే నిర్వహించగా, ఏకపక్షంగా విజయం సాధిస్తుందన్న నివేదిక అందింది. అయితే ప్రత్యక్ష రాజకీయాలకు రాజీవ్‌శర్మ ఆసక్తిగా ఉన్నారా లేదా? సీఎం మదిలో అసలు ఏముంది అన్న అంశాలపై ఉత్కంఠ నెలకొంది. ఇక ఇదే సీటు కోసం మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి, టీఆర్ఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి బండి రమేష్, దేవీప్రసాద్ తదితరులు ఆశలు పెట్టుకున్నారు.

తెరపైకి కొత్తనేతలు

టీఆర్ఎస్ లోక్‌సభ సీట్లకోసం విపరీతమైన పోటీ ఏర్పడింది. ఓవైపు సిట్టింగ్ ఎంపీలున్న చోట కూడా సార్.. వీలుంటే మాకు సేవచేసే అవకాశం కల్పించండి. మా అభ్యర్థిత్వం పరిశీలించండి అంటూ విజ్ఞప్తులు చేస్తున్నారు. ఖమ్మం తెరపైనా కొందరు పారిశ్రామికవేత్తలు కొత్తగా మెరుస్తుండగా, చేవెళ్ళ, పెద్దపల్లి, మహబూబాబాద్, నల్లగొండ స్థానాల కోసం పలువురు ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు రంగంలోకి దిగి అధినేతకు విజ్ఞప్తుల పరంపర చేస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 17స్థానాలుండగా, ఎంఐఎం స్థానం వదిలేస్తే మిగతా 16స్థానాలు తాము గెలుస్తామని టీఆర్ఎస్ చెబుతోంది. రాజకీయ సమీకరణలు, వాతావరణం ఇందుకు అనుగుణంగా ఉండడంతో కొత్తగా రాజకీయ ప్రవేశం కోరుకుంటున్నవారు, పేరున్న ప్రముఖులు కూడా రాజకీయ అరంగేట్రానికి ఇది తగిన సమయమని అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలకు
మూడేసి పదవులు

(మొదటిపేజీ తరువాయి)

ఉందని చెబుతున్నారు. సీఎం కేసీఆర్ కాకుండా 17 మంది మంత్రులు, 12 మంది పార్లమెంటరీ కార్యదర్శులు కలిపితే ఈ సంఖ్య 29కి చేరుతుందని 33 జిల్లాల్లో పెద్ద జిల్లాలకు ఇద్దరు లేదా ముగ్గురు మంత్రులను ఎంపిక చేయాలని చిన్న జిల్లాలకు కనీసం ఇద్దరు మంత్రులు ఉండాలన్నది కేసీఆర్ ఆలోచనగా తెలుస్తోంది. ఒక్కో జిల్లాకు ఒక కేబినెట్ మంత్రితో పాటు ఒక పార్లమెంటరీ కార్యదర్శిని ఎంపికచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. హైదరాబాద్ భాగ్యనగరంలో మూడు లేదా నాలుగు మంత్రులు, పార్లమెంటరీ కార్యదర్శులను నియమించే అవకాశాలున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇవిపోను పదహారు మంది శాసనమండలి సభ్యులను కూడా ఎంపిక చేసేందుకు కేసీఆర్ కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. అన్ని సామాజికవర్గాలను పరిగణలోకి తీసుకుని ఆయా వర్గాలకు కీలక పదవులను కట్టబెట్టాలని భావిస్తున్నారు. మంత్రులు, పార్లమెంటరీ కార్యదర్శులు, ఎమ్మెల్సీలు, స్పీకర్, డిప్యూటి స్పీకర్, చీఫ్‌విప్, మూడు విప్ పదవులు, రెండు నెలల తర్వాత ఖాళీ అవుతున్న కార్పొరేషన్ చైర్మన్ పదవుల భర్తీకి రంగం సిద్ధమవుతున్నట్టు సమాచారం.

ఓటమి అభ్యర్థుల విషయంలో చర్చ

ఎమ్మెల్యేలుగా ఓటమి పాలైన వారిని ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయాలా? వద్దా అన్నది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కేసీఆర్ భావిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల తరపున ఎమ్మెల్సీగా కొనసాగిన పట్నం నరేందర్‌రెడ్డి శాసనసభ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలుపొందారు. ఆ స్థానంలో ఆయన సోదరుడు మాజీ రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. వాస్తవానికి ఈ జిల్లాలో ఈ పదవికి పోటీ పడుతున్న వారు ఎవరూ లేకపోవడంతో మహేందర్‌రెడ్డికి ఈ పదవి కట్టబెట్టవచ్చన్న ఆలోచనతో తెరాస అధినాయకత్వం ఉన్నట్టు తెలుస్తోంది.

ఈ ఎన్నికల్లో పోటీకి దిగాలంటే కనీసం ఐదు కోట్లకు మించి ఖర్చు పెట్టుకోవలసిన పరిస్థితి ఉన్నందున అంతమొత్తంలో డబ్బును ఖర్చు చేసి పోటీలో దిగేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని అందుకే మహేందర్‌రెడ్డి అభ్యర్థిత్వంపై చర్చించి ఒక నిర్ణయానికి రావాలని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ యాదవరెడ్డిపై అనర్హత వేటు వేయాలని ఇప్పటికే శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు తెరాస శాసనసభాపక్షం ఫిర్యాదు చేసింది. ఈ స్థానానికి జిల్లాలో పోటీ అధికంగా ఉంది. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ భూపతిరెడ్డి తెరాసను వీడి కాంగ్రెస్‌లో చేరి ఇటీవల ఎన్నికల్లో ఆయన నిజామాబాద్ రూరల్ నుంచి ఎమ్మెల్యేగా బరిలో దిగారు. ఆయనపై కూడా అనర్హత వేటు వేయాలని తెరాస ఫిర్యాదు చేసింది.

నలుగురికే అవకాశం?

గతంలో మంత్రివర్గంలో పనిచేసిన వారిలో నలుగురైదుగురు మాత్రమే ఈ దఫా అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. వీరు ఎవరన్నది ఇంతవరకు తేలకపోయినా ఆ దిశగా కేసీఆర్ కసరత్తు చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. విస్తరణలో ఖాళీగా ఉన్న పదహారు మంది మంత్రులను ఒకేసారి తీసుకునే అవకాశాలు లేవని వీలైతే మరో విడత మంత్రివర్గాన్ని విస్తరించి అప్పటి వరకు ఖాళీగా ఉన్న పదవులను భర్తీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. శాసనసభ ఎన్నికల్లో పార్టీ విజయానికి విశేష కృషిచేసి అహర్నిశలు పార్టీకోసం కష్టపడిన వారిని మాత్రమే ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లుగా ఎంపిక చేయాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఈ మేరకు ఆయన జాబితాను కూడా సిద్ధం చేసినట్టు సమాచారం. ఆర్టీసీ చైర్మన్‌తో పాటు మిషన్ భగీరథ వైస్ చైర్మన్, సాంస్కృతిక వారధి చైర్మన్లుగా ఆయా వర్గాలకు చెందిన వారికి అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. ఖమ్మం జిల్లా నుంచి ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన తెదేపా ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చ నాగేశ్వరరావులు తెరాసలో చేరితే ఒకరికి మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ పదవిని, నాగేశ్వరరావుకు ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఈ ఇరువురు తెదేపా ఎమ్మెల్యేలు తెరాసలో చేరే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు ఇప్పటికే తమ నియోజకవర్గాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి పార్టీ వీడేందుకు సంబంధించిన సంకేతాలిచ్చినట్టు తెలుస్తోంది.

50 పదవుల భర్తీకి కసరత్తు

ఇప్పటికే పౌర సరఫరాల సంస్థ చైర్మన్ పదవిని భర్తీ చేసిన కేసీఆర్ మంత్రివర్గ విస్తరణతో పాటు మరికొన్ని చైర్మన్ పదవులను భర్తీచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 16 మంత్రి పదవులు, 12 పార్లమెంటరీ కార్యదర్శులు, 16 ఎమ్మెల్సీ పదవులు, 4 చీఫ్ విప్, విప్ పదవులు, రెండు స్పీకర్, డిప్యూటి స్పీకర్ పదవులు మొత్తం 50 పదవుల భర్తీకి కేసీఆర్ తనదైనశైలిలో కసరత్తు జరుపుతున్నారు. మరో రెండు మాసాల్లో ఖాళీ అవుతున్న కార్పొరేషన్ చైర్మన్ల పదవులపై కూడా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. శాసనసభకు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల్లో కొందరికి మంత్రి పదవులను, మిగిలిన వారికి పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించాలని భావిస్తున్నారు.

వరంగల్ తూర్పు నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నన్నపనేని నరేందర్, కోదాడ నుంచి గెలిచిన బొల్లం మల్లయ్య యాదవ్, నర్సంపేట నుంచి గెలిచిన పెద్ది సుదర్శన్‌రెడ్డి, ముషీరాబాద్ నుంచి గెలిచిన ముఠా గోపాల్, అంబర్‌పేట నుంచి గెలిచిన కాలేరు వెంకటేష్, చొప్పదండి నుంచి గెలిచిన సుంకే రవిశంకర్, ఉప్పల్ నుంచి గెలిచిన భేతి సుభాష్‌రెడ్డి, మేడ్చల్ నుంచి గెలిచిన చామకూర మల్లారెడ్డి, అందోల్ నుంచి గెలిచిన క్రాంతి కిరణ్, వికారాబాద్ నుంచి గెలిచిన మెతుకు ఆనంద్, చెన్నూరు నుంచి గెలిచిన బాల్క సుమన్, వనపర్తి నుంచి గెలిచిన నిరంజన్‌రెడ్డి, గద్వాల నుంచి గెలిచిన కృష్ణమోహన్‌రెడ్డి, పరిగి నుంచి గెలిచిన కొప్పుల మహేశ్‌రెడ్డి, జహీరాబాద్ నుంచి గెలిచిన మాణిక్‌రావు, కొడంగల్ నుంచి గెలిచిన పట్నం నరేందర్‌రెడ్డి వంటి వారిలో కొందరికి మంత్రులు, పార్లమెంటరీ కార్యదర్శుల పదవులు దక్కే అవకాశముంది. అయితే ఆయా సామాజికవర్గాలను పరిగణలోకి తీసుకుని ఈ పదవుల్లో నియమించే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా ఇరువురు ఎమ్మెల్సీలను మంత్రులుగా నియమించే అవకాశాలు ఉన్నాయి. శాసనమండలిలో విప్‌గా ఉన్న రాజేశ్వర్‌రెడ్డి మంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్సీగా ఉన్న మహమూద్ అలీని హోంమంత్రిగా నియమించిన సంగతి తెలిసిందే.



స్పీకర్ ఎంపికపై కసరత్తు

గవర్నర్ కోటాలో ఎన్నికైన రాములు నాయక్‌పై కూడా వేటు వేయాలని తెరాస కోరిన సంగతి తెలిసిందే. శాసనసభాధిపతి, ఉప సభాధిపతి పదవుల్లో ఎవరిని ఎంపిక చేయాలన్న అంశంపై కేసీఆర్ తన కసరత్తును ముమ్మరం చేశారు. మాజీ మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, పద్మా దేవేందర్, ఈటల రాజేందర్, రెడ్యానాయక్, కొప్పుల ఈశ్వర్‌లలో ఒకరిని ఎంపిక చేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. స్పీకర్ పదవిని రెడ్డి సామాజికవర్గానికి కట్టబెడితే ఉపసభాపతి పదవిని బీసీ లేదా ఎస్సీ సామాజి కవర్గానికి దక్కే అవకాశముంది. గతంలో చీఫ్‌విప్‌గా పనిచేసిన కొప్పుల ఈశ్వర్ స్థానంలో విప్‌గా పనిచేసిన గంప గోవర్ధన్‌కు అవకాశం దక్కనున్నట్టు సమాచారం. శాసనసభకు ఎన్నికైన ముగ్గురు మహిళా ఎమ్మెల్యేల్లో ఒకరికి మంత్రి పదవి, మరొకరికి పార్లమెంటరీ కార్యదర్శి పదవిని, మిగిలిన మహిళా ఎమ్మెల్యేకు విప్ పదవిని ఇవ్వాలన్న ఆలోచనతో కేసీఆర్ ఉన్నట్టు సమాచారం. త్వరలో ఖాళీ అవుతున్న శాసనమండలి చైర్మన్ పదవికి మాజీ స్పీకర్ కేఆర్ సురేష్ రెడ్డిని ఎంపిక చేసే అవకాశాలు లేకపోలేదటున్నారు. అసెంబ్లీ స్పీకర్‌గా పోచారంని ఎంపికచేస్తే మండలి చైర్మన్‌గా సురేష్‌రెడ్డికి అవకాశం ఉండకపోవచ్చని భావిస్తున్నారు. అందుకే స్పీకర్ పదవికి తాజాగా ఇంద్రకరణ్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తున్నట్టు సమాచారం.

మిగులు బడ్జెట్ వస్తోంది!

- ఆ దిశగా మధ్యంతర బడ్జెట్ రూపొందించనున్న ప్రభుత్వం
- ధనిక రాష్ట్రంగా తెలంగాణ... సాధ్యమైన ఆర్థిక సుస్థిరత
- బడ్జెట్‌లో అదే ముద్ర... భారీ ప్రారంభ నిల్వ
- ఖర్చుల తగ్గింపు... చెల్లింపుల్లపై నియంత్రణ
- కేంద్ర సాయంలో కోత నేపథ్యంలో సొంత రాబడిపై దృష్టి.. సత్ఫలితాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆర్థికరంగంలో సుస్థిరమైన అభివృద్ధి సాధించిన తెలంగాణ ఆ ముద్ర ఉండేలా మధ్యంతర బడ్జెట్‌ను రూపొందిస్తోంది. అభివృద్ధికి దిక్సూచిగా ఎదుగుతున్న తెలంగాణ రాష్ట్రం మరికొద్దిరోజుల్లో ప్రవేశపెట్టే మధ్యంతర బడ్జెట్‌లో మిగులు సాధించేలా కృషి చేస్తోంది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలు తర్వాత ఏర్పడిన సందిగ్ధత పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించిన రాష్ట్ర ప్రభుత్వం అతిత్వరగా సుస్థిరత దిశగా పురోగమించింది. సొంత వనరుల రాబడిలో దేశంలోనే తొలిస్థానంలో నిల్చింది. తద్వారా కేంద్ర నిర్దేశిత రెవెన్యూ మిగులుతోపాటు 14వ ఆర్థికసంఘం సూచించిన మూడు నిబంధనలను పాటించి మిగులు రాష్ట్రంగా ఖ్యాతి దక్కించుకోవడం నల్లేరు మీద నడకే కానుంది. ఇందుకు అనువుగా శాఖల్లో నిధుల సర్దుబాట్లు చేస్తోంది. ఖజానాలో భారీగా ప్రారంభ నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో చెల్లింపులపై నియంత్రణతో ముందుకెళుతోంది. తాజా బడ్జెట్ కూర్పునకు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఇప్పటికే వడివడిగా ఒక్కో శాఖ తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించింది. ఈనెల 15 తర్వాత విడతల వారీగా సీఎం కేసీఆర్ స్వయంగా సమీక్షలు నిర్వహిస్తారని సమాచారం. ఈ మేరకు అవసరాలు, ప్రాధాన్యతల ఆధారంగా కేటాయింపులు నిర్దేశిస్తారు. పథకాలకు అయ్యే ఖర్చును గతంలో ప్రణాళిక వ్యయం కింద చూపుతుండగా, తాజాగా వాటిని వివిధ పద్దులకింద పేర్కొననున్నారు. కేంద్ర ప్రభుత్వ తోడ్పాటుతో నడుస్తున్న పథకాలు, విదేశీ నిధులకింద అమలవుతున్న పథకాలు, నాబార్డు, అప్పులు ఉప శీర్షికతో పేర్కొననున్నారు.

కేంద్ర నిధుల్లో కోత

తాజాగా 2018-19 వార్షిక బడ్జెట్‌లో కేంద్ర ప్రాయోజిత పథకాలతోపాటు, అప్పుల పరిమితి (ఎఫ్‌బీఆర్‌బిఎం)ని మరింతగా పెంచింది. దీంతో మిగులు బడ్జెట్‌లో మొదటి నుంచే ప్రారంభ నిల్వ భారీగా ఉండటంతో మిగులు నిధులను చూపెట్టగలిగారు. రెవెన్యూ మిగులుతోపాటు 14వ ఆర్థికసంఘం సూచించిన మూడు నిబంధనలను తెలంగాణ రాష్ట్రం అమలు చేసింది. ఫలితంగా అదనపు అప్పులకు అనుమతి లభించింది. అయితే కేంద్రవాటా నిధుల విడుదలలో రాష్ట్రం ఇబ్బందులను ఎదుర్కొంటోంది. కేంద్రపన్నులు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ వాటాల్లో అంచనాల చేరికలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018-19)లో ప్రత్యేక అభివృద్ధి నిధులుగా రూ.16,350 కోట్ల అంచనా వేసుకోగా, గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులు కేవలం 27 శాతానికి మించి అందలేదు. కేంద్ర ప్రాయోజిత పథకాలతోపాటు ప్రతీయేటా కొన్ని పథకాలకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధులను కేంద్రంనుంచి కోరతూ రావడం సహజంగా వస్తుంది. ఈ మేరకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ప్రతిపాదనలు పంపినా కేంద్రం పెద్దగా స్పందించడంలేదని ఆర్థిక శాఖ అంటున్నది. 2017-18లో కేంద్రంనుంచి రూ. 23,759 కోట్లు వస్తాయని ఆశించగా, డిసెంబర్ చివరినాటికి అందులో 60 శాతం కూడా అందలేదు. అదేవిధంగా ప్రత్యేక అభివృద్ధి నిధుల్లోనూ తాత్సారం జరుగుతోంది., రూ.11,800 కోట్ల అంచనాలకుగానూ ఇప్పటివరకు కేవలం రూ. 8,702 కోట్లు మాత్రమే వచ్చాయి. ఈ ఏడాది తెలంగాణకు కేంద్ర పన్నుల వాటా స్వల్పంగా పెరిగినట్లు కనిపించినా, కేంద్ర పన్నులు, సుంకాలతోపాటు కేంద్ర ప్రాయోజిత పథకాలు ఇతరత్రా నిధులు ఆశించిన మేర పెరగలేదు.

ప్రత్యేక సాయం ఏదీ?

ఇక రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 94(2) ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేక సాయంగా 2015-16 నుంచి మూడేళ్లపాటు రూ. 450 కోట్ల చొప్పున రూ. 1350 కోట్లను విడుదల చేసింది. ఇక అన్ని రాష్ట్రాలకూ ఇచ్చి నట్లుగానే కేంద్ర ప్రాయోజిత పథకాలకు నాలు గేళ్లలో రూ.23,116 కోట్లను కేటాయింపులు చేసింది. ఇందులో 2014-15లో రూ. 5028కోట్లు, 2015-16లో రూ. 6047కోట్లు, 2016-17లో రూ. 6579కోట్లు, 2017-18లో రూ. 5463కోట్లను కేటాయించింది.

ప్రత్యేక నిధి....

తెలంగాణ బడ్జెట్‌లో 2016-17లో రాష్ట్రప్రభుత్వం విప్లవాత్మకంగా అనుసరించిన పంథాను ఈసారి కొనసాగించనున్నట్లు తెలిసింది. ఏ బడ్జెట్‌లో లేని రీతిలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు అయ్యే వ్యయాలకు, ఆకస్మిక అవసరాలకు ముందస్తు వ్యూహంతో రూ. 4675 కోట్లతో ప్రత్యేక అభివృద్ధి నిధిని ఏర్పాటు చేశారు. వివిధ ప్రభుత్వ కార్య క్రమాలకు అయ్యే వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు కేటాయింపులు చేస్తాయి. ఇలా ముందస్తు అంచనాలతో కేటాయింపులు చేసినప్పటికీ కొన్ని శాఖల్లో నిధుల లేమి, పథకాలకు సరిపడా నిధులు రాక కొరత ఏర్పడుతుంది. ఇది ఏటా జరిగేదే. ఇలాంటి తరుణంలో ప్రభుత్వాలు అప్పటికప్పుడు నిధులను జారీ చేయడమో... ప్రతిపాదనలు చేయడమో చేస్తుంది. దీంతో కొంత జాప్యం కారణంగా పథకాల అమలు క్లిష్టంగా మారిన సందర్భాలు జరుగుతుంటాయి. వనరులను అప్పటికే నిర్దేశిత అవసరాలకు కేటాయించి ఉండటంతో అప్పటికప్పుడు సర్దుబాటు కొంత కష్టంగానే ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. అనుకోని అవస రాలు, ఆకస్మిక కేటాయింపులు కావాల్సి వచ్చిన ప్పుడు ఇ బ్బందులు తలెత్తకుండా ముందస్తు వ్యూహంలో భాగంగా అప్పటికప్పుడు పరిస్థితిని చక్కదిద్దేందుకు ఈ నిధిని కేటాయించారు. ఈ ఏడాదిలో కూడా సీఎం నేతృత్వంలో ఇటువంటి నిధినే బడ్జెట్‌లో పొందుపర్చనున్నారని సమాచారం.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శుక్రవారం 11 జనవరి 2019

ఉత్తరప్రదేశ్ లక్ష్యంగా పార్టీల వ్యూహాలు

దేశంలో అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో 80 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ప్రధానమంత్రి పదవిని చేపట్టిన వారిలో అధిక సంఖ్యాకులు ఆ రాష్ట్రానికి చెందిన వారే. ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ గుజరాత్‌కు చెందిన వారైనా, వారణాసి నుంచి లోక్‌సభ సభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తున్న దృష్ట్యా సాంకేతికంగా ఆయన కూడా యూపీకి చెందిన వారే. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఎక్కడి నుంచి పోటీ చేస్తారో ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. కిందటిసారి దేశమంతటా మోడీ ప్రభంజనం వీచిన దృష్ట్యా ఆయన స్వరాష్ట్రంలోని వడోదరతో పాటు వారణాసి నుంచి పోటీ చేసి రెండు చోట్లా గెలుపొందారు. ఉత్తరప్రదేశ్ నుంచి ఎన్నికైన వారే ప్రధాని పదవిని చేపట్టే ఆనవాయితీ ఉన్నందున ఉత్తరప్రదేశ్ బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి, సమాజ్ వాదీపార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్‌తో పొత్తు కుదుర్చుకుని బరిలోకి దిగుతున్నారు. ఆమె ఎంతో కాలంగా ప్రధాని పదవిని ఆశిస్తున్నారు. ఇందుకోసం ఆమె ముందే తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే, దేశ వ్యాప్తంగా బీజేపీకి ప్రత్యామ్నాయంగా మహాకూటమిని ఏర్పరిచేందుకు తెలుగుదేశం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించిన యత్నాలకు మద్దతు ఇచ్చినట్టే ఇచ్చి చల్లగా జారుకున్నారు. తనతో పాటు అఖిలేష్ యాదవ్ కూడా కూటమికి దూరంగా ఉండేట్లు చేయగలిగారు. ఉత్తరప్రదేశ్‌లో ఈ రెండు పార్టీల పొత్తు గతంలో బాగానే పనిచేసినందున ఇప్పుడు కూడా అదే రీతిలో కలిసి పోటీ చేయాలని అవి నిర్ణయించుకోవడం తప్పు లేదు. సమాజ్ వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ యాదవ్‌కూ, మాయావతికీ గతంలో పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. ఆయన కుమారుడు అఖిలేష్ యాదవ్ మాత్రం మాయావతితో జతకట్టడం యూపీ రాజకీయాల గురించి తెలుసున్న వారందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. అఖిలేష్ యాదవ్ స్వంత నిర్ణయాలు తీసుకుంటుండటంతో ములాయం సింగ్ పార్టీకి దూరంగాఉంటున్నారు. ఆయనకు అత్యంత నమ్మకస్తుడైన పెద్ద సోదరుడు శివపాల్ సింగ్ యాదవ్‌కి తన ఆశీస్సులు అందజేస్తున్నారు. శివపాల్ ప్రగతి శీల సమాజ్ వాదీ లోహియా పార్టీని నెలకొల్పారు.ఆ పార్టీ తరపున మొత్తం 80లోక్ సభ స్థానాలకూ పోటీ చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. శివపాల్‌యాదవ్ సొంత కుంపటి పెట్టడానికి బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షాయే కారణమన్న వార్తలు నిరాధారం కాదు. ప్రతిపక్షాలను చీల్చడంలో అమిత్ షా ఆరితేరిన నాయకుడు. ప్రధాని మోడీ హావభావాలతో ప్రసంగాల ద్వారా ప్రజలను ఆకట్టుకోవడంలో నేర్పరి అయితే, తెరవెనుక రాజకీయాల్లో అమిత్ షా దిట్ట. గడిచిన లోక్ సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌నుంచి 80 లోక్ సభ సీట్లలో 71సీట్లను బీజేపీ సంపాదించి పెట్టడం వల్లనే గుజరాత్ లో ద్వితీయ శ్రేణి నాయకుడైన అమిత్ షాను మోడీ ఏకంగా పార్టీ జాతీయాధ్యక్షునిగా నియమించారు. అమిత్ షా రాజకీయాలు అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుల వరకూ బాగానే పని చేశాయి.

ఇప్పుడు పరిస్థితి మారింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ ప్రసాద్ మౌర్యలు ఖాళీ చేసిన గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అమిత్ షా ఎన్ని జిమ్మిక్కులు చేసినా బీజేపీ ఓటమి పాలైంది. అప్పటి నుంచి ఆయన ప్రభావం తగ్గడం ప్రారంభమైంది. దానికి తోడు మహాకూటమి యత్నాలు ఫలించకుండా చేయడానికి ఆయన అఖిలేష్,మాయావతిలపై సీబీఐ కేసులు తిరగతోడి తెరవెనుక చక్రం తిప్పారు. అమిత్‌షాని ఉద్దేశించి అఖిలేష్‌యాదవ్ పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనం. కమలనాథులు ఎన్ని ప్రయత్నాలు చేసినా సమాజ్‌వాదీ (ఎస్పీ), బహుజన సమాజ్ పార్టీ (బీఎస్‌పీ)ల పొత్తును విడదీయలేరని, వారికి (కమలనాథులకు) సీబీఐ ఉండగా, తమకు కూటమి ఉందని అఖిలేష్ చేసిన వ్యాఖ్య సవాల్ వంటిదే. తమను కమలనాథులు ఏమీ చేయలేరన్న ధీమా ఆయన ప్రకటనలో తొణికిసలాడుతోంది. మాయావతి దళిత ఓటు బ్యాంకుపైనా, అఖిలేష్ వెనకబడిన తరగతుల మద్దతుపైనా ఆధారపడి పొత్తు కుదుర్చుకున్నారు. అయితే, వీరి ఎత్తుకు పై ఎత్తుగా అమిత్‌షా రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న బ్రాహ్మణులను ఆకట్టుకునేందుకు అగ్రవర్ణాల్లో పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంటు ఆమోదం పొందేట్లు తెరవెనక బాగోతం నడిపారు. పశ్చిమ బెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలకు గాలం వేస్తున్నారు. ఒడిషా ముఖ్యమంత్రి, బిజూజనతాదళ్ (బీజేడీ) అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ మహాకూటమిలో చేరకుండా కేంద్రం నుంచి ఒత్తిడి పెంచారు. ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల్లో అమిత్ షా వ్యూహాలు ఫలించకపోయినా, కర్నాటకలో అమిత్ షా ఎత్తులు బెడిసి కొట్టినా, తెలంగాణలో ఒక్క అసెంబ్లీ సీటుతో బీజేపీ సరిపెట్టుకోవల్సి వచ్చినా, ఇప్పటికీ అమిత్ షాపైనే ఎక్కువ ఆధారపడుతున్నారు. రాజస్థాన్,మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్ లలో పార్టీ ఓటమికి అమిత్ షా కట్టిన గ్రూపులు విభేదించడమే కారణం. అయినప్పటికీ ప్రధానమంత్రి మోడీ మాత్రం వరుసగా పదవిని హేనెళ్ళుగా అధికారంలో కొనసాగుతున్నందువల్లే ఆ మూడు రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేకత వల్ల పార్టీ ఓడిపోయిందని అంటు రాష్ట్రాల్లో నిజానికి అమిత్ షా తంత్రాంగమే ఓటమికి కారణం. ఉత్తర ప్రదేశ్‌లో ఈసారి అమిత్ షా ఎత్తులు పని చేయవు. అక్కడ అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అతి స్వల్ప కాలంలోనే వివాదాస్పదుడిగా ప్రజలకు దూరమయ్యారు. అయోధ్య, ఆగ్రాల పేర్లు మార్చడంతో సహా ఆయన తీసుకున్న నిర్ణయాలన్నీ పార్టీ పై ఆగ్రహాన్ని పెంచాయి. గోరక్షకుల దాడుల వల్ల దళితులు, ముస్లింలు అట్టడుగు వర్గాలు దూరమయ్యారు. మరో వంక కాంగ్రెస్ కూడా ఉత్తరప్రదేశ్‌లో బలాన్ని పెంచుకుంది. అందుకే, తమ కూటమిలోకి కాంగ్రెస్ ని రానివ్వకుండా మాయావతి తలుపులు మూసేసినా వెరవకుండా తమపార్టీ ఒంటరిగా, సొంతబలంపై పోటీచేస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. ఉత్తర ప్రదేశ్‌కు గతంలో ఎన్నడూ లేనంతగా కోట్లాది రూపాయలు విలువైన పథకాలను, ప్రాజెక్టులను మోడీ ప్రకటించారు. అగ్రవర్ణాల ఓట్లను కాంగ్రెస్ నుంచి కైవసం చేసుకోవడానికే ఈబీసీ రిజర్వేషన్లను పార్లమెంటు చేత ఆమోదింపజేశారు. అఖిలేష్ యాదవ్ బాబాయ్ ప్రభావం ఏ మేరకు ఉంటుందో ఈ ఎన్నికల్లో తేలిపోతుంది. ప్రతిపక్షాల ఓట్లు చీలిపోవడం తమకే లాభమని కమలనాథులు గంపెడాశతో ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌ ఆగ్రాణా అన్ని పార్టీలూ తమ వ్యూహాలను రూపొందించుకుంటున్నాయి.



తండాలన్నీ కేసీఆర్ వైపే!

లంబాడీలు ఎమ్మెల్యే ఎన్నికల్లో మహా కూటమి దొంగ హామీలను, మాటలను నమ్మకుండా తండాలో, టీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేశారు మళ్ళీ అదే తీర్పును ఇవ్వాలి ఇదే మన తండాలో ఒకసవాల్ గా తీసుకొని అదురు కలిసి తండాల సర్పంచ్‌లను ఏకగ్రీవంగా చేసుకొని అభివృద్ధికి పాటుపబడాలి. దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన గిరిజనతండాలను గ్రామ పంచాయతీలుగా టీఆర్ఎస్ సర్కార్ గుర్తించింది. వంద శాతం గిరిజనులు ఉన్నటువంటి తండాలను గిరిజనులకే రిజర్వు చేయనుండడంతో మన మీద బాధ్యత పెరిగింది. ఇక మన తండాల్లో మన స్వయం పాలన రాబోతుంది. దీనిని మనమందరం కలిసి తొలి పాలకవర్గం ఏకగ్రీవంగా చేసుకొని చరిత్ర తిరగరాద్దాం.. మొదటి ప్రాధ్యానత ఏకగ్రీవం చేసుకోవడం, ఇంకా పోటీ తప్పదు అన్నప్పుడు టీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి.

గిరిజనులలో ఐక్యమతం రాష్ట్రంలో నాలుమూలలు వెల్లువెత్తుతున్న ఆనందోత్సాహాలు ఎన్నో ఏళ్ళ కలసాకారం కేసీఆర్‌తోనే సాధ్యం అయింది. తండా ల పల్లెసీమలు.. రాజకీయాలకు అతీతంగా సర్పంచ్ ఎన్నిక తెలంగాణ ప్రభుత్వం కేటీఆర్ ప్రకటించిన 10 లక్షల నజరా నాతో అభివృద్ధికి ప్రణాళికలు ఏకగ్రీవాలపై కులపెద్దలు, గ్రామస్థులను ఏకం చేస్తున్న యువత తమ భుజస్కంధాలపైన వేసుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. పోటీలేకుండా ఎన్నికవుతున్న సర్పంచ్లు, అలాగే ఏనాడు లేనివిధంగా వేలాది మంది గిరిజనులకు రాజకీయ భవిష్యత్తు ఇచ్చిన సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోవాలి అంటే కొత్త పంచాయతీ ఎన్నికల్లో పోటీ లేకుండా ఏకగ్రీవంగా చేసుకొని కేసీఆర్ కానుకగా ఇవ్వాలి...

''అపనే తాండమా అపన్ రాజ్ చవనోకన్ కత్రాయికో వరసేతి అపన్ హకేవాసు లాడాయి మారేతో కాంగ్రెస్, టీడీపీ పార్టీ తాండేన్ గ్రామపంచాయతీ కిదికోని... అపన్ తాండమా అపన్ నాయకీ, దినో జకో కేసీఆర్ భియా"

సేవాలాల్ మహరాజ్ సప్ నెన్ ససోకిదో సేవాలాల్ మహరాజ్ నామెన్ జగేన్ మాలంకిదో అపన్ కేసీఆర్ భియాలి లిఎక్ జత్, ఎక్ వాత్, ఎక్ సాత్ రేతని సేవాలాల్ మహరాజ్ నామెన్ అంగ్ కాడెన్ గోర్ భాయ్, భియా సే భలన్ ఆంగ్ చలా !...

మా తండాలో... మారాజ్యం సాకారం దిశగా ఇప్పటికే తండాలు గూడలు కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పడి ఎన్నికలు జరుగుతున్న శుభ సందర్భంగా తండాలో కొత్త కోలాహలం నెలకొంది. నవ యువ నాయక్త్వాని గ్రామ సర్పంచిగా గ్రామపంచాయతీ సర్పంచ్‌లను ఎన్నుకోవడానికి తండా ప్రజలందరూ ఆసక్తి చూపిస్తూ తొలి పాలక వర్గానికి ఏకగ్రీవంవైపు మొగ్గు చూపుతున్నారు. తండా పేదలు యువత ఉద్యోగులు అందరు కలిసి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తండాల అభివృద్ధి పట్ల అవగాహన ఉన్న వ్యక్తి, చదువుకొని ఉన్న వ్యక్తి ఏకీగ్రీవం చేయడానికి సర్వ ప్రయత్నాలు చేస్తున్నారు. గత పాలకులు తండాల అభివృద్ధికి నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం చేశారు. మౌలిక సదుపాయాల కల్పించడంలో విఫలం కావడంతో గిరిజన తండాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. 60ఏళ్లు కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏం అభివృద్ధి జరగలేదు. టీఆర్ఎస్ ప్రభుత్వం లోనే అభివృద్ధి వైపు గిరిజన లంబాడీలు... ప్రజాక్షేత్రంలో ఎమ్మెల్యే ఎన్నికల ఫలితాలు రుజువు చేసిన విషయం అందరికి తెలిసిందే. ఆ దెబ్బతో కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ, టీజేఎస్, సీపీఐ, సీపీఎం పార్టీల జాడ లేకుండా చేశారు. ఇక తెలంగాణ అభివృద్ధి సంకె ళ్లు సంకెళ్ళు తెగిపోయాయి. ఎందుకంటే అభివృద్ధి పనులకు, ప్రాజెక్టులకు అనుమతులు రాకుండా కోర్టులో కేసులు పెట్టడం, కేంద్రానికి లేఖలు రాయడం, ఉద్యోగాల నోటిఫికేషన్ భర్తీలను అడ్డుకోవడం, ఒక అబద్ధం 100 సార్లు చెబితే అది నిజం అవుతుందని ప్రతిపక్ష పార్టీలు భావిస్తూ వస్తున్నాయి. పనిగట్టుకొని ఆరోపణలు చేసిన తెలంగాణ ప్రజలు ఎన్నికలలో నమ్మలేదు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి చూసి ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఎన్ని కుట్రలు చేసినా, రాష్ట్ర అభివృద్ధి విషయంలో సీఎం కేసీఆర్ తన పంథాను ఎక్కడా తగ్గలేదు.

ఎన్నో ఏళ్ళుగా గిరిజనులకు ఎన్నికల ముందు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు అభివృద్ధికి పెద్దపీట వేస్తామని మేనిఫెస్టోలో అనేక హామీలు ఇచ్చి ఓట్లు దండుకున్నాయి. టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు హామీలను అమలు చేయలేదు. పట్టించుకున్న పాపాన పోలేదు. అంతేగాకుండా ఎన్నికల ముందు గిరిజనులకు మాయ మాటలు చెప్పి గిరిజనులను మోసం చేయడం కాంగ్రెస్, టీడీపీలకు కొత్తేం కాదు. గత 7దశాబ్దాల్లో గిరిజన ప్రాంతంలో జరగని అభివృద్ధి 4.5 ఏళ్లలో ఆత్మగౌరవంతో బతకడానికి, ప్రతీ గిరిజనుడి ముఖంలో సంతోషం నింపడానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. గిరిజన రిజర్వేషన్ కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని నమ్మకం ఉంది.

గుగులోతు శంకర్ నాయక్, 9908817986

ఎన్నికలకు ఆధారం!



కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ సోషల్ మీడియాలో ఈ నెలలోనే ఒక పోస్టు పెట్టారు. దాని ప్రకారం ఆధార్‌ని గేమ్ ఛేంజర్‌గా అభివర్ణించారు. దానికి కారణం.. మార్చి, 2018 వరకు కేంద్ర ప్రభుత్వానికి ఆధార్ కారణంగా ఏకంగా రూ.90 వేల కోట్ల రూపాయలు మిగిలాయి. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల్లో బోగస్ పేర్లు తొలగిపోవడంతో అంత స్థాయి మొత్తం ప్రభుత్వ ఖజానాకి మిగిలిపోయిందని ఆర్థికమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. అంటే ఆధార్‌ను అమలు చేస్తే.. ఆధార్ ఆధారంగా ప్రభుత్వ పథకాలను అమలు చేస్తే అసలైన లబ్ధిదారులే ప్రయోజనం పొందుతారు. దొంగపేర్లతో చేసుకొనే దరఖాస్తులకు చరమ గీతాన్ని ఆధార్ ఆధారంగా కేంద్ర ప్రభుత్వం పలికిందని సాక్షాత్తు ఆర్థిక మంత్రి ప్రకటన ద్వారా తెలుస్తోంది.

ఆధార్ నెంబర్‌తో అనుసంధానమయ్యే వాటిని ఎవరూ మోసగించలేరని, తప్పుడు ధృవపత్రాలను సమర్పించలేరని ఇప్పటికే జాతీయస్థాయిలో తేటతెల్లమైంది. వంట గ్యాస్‌కి ప్రభుత్వం పెద్ద యెత్తున సబ్సిడీ ఇస్తోంది. దొంగ కనెక్షన్ల కారణంగా వంట గ్యాస్ వాణిజ్య అవసరాలకు తరలిపోయి.. ప్రభుత్వంపై పెను భారం పడేది. వంట గ్యాస్‌ను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో గ్యాస్ దొంగల ముక్కు తాళం వేశారు. ఇలానే ఇతర పథకాల అమల్లో కూడా సబ్సిడీలు, సంక్షేమ పథకాల నిధులు పక్కదారి పట్టకుండా ఆధార్ రక్షిస్తోంది. ఆధార్ శ్రీరామ రక్షగా మారిందని ఆర్థిక మంత్రి జైట్లీ ప్రకటనే చెబుతోంది.

ఇప్పుడు మరో విజయం ఆధార్ ఖాతాలో జమ అయింది. వాహనాల లైసెన్సులు కూడా ఆధార్‌తో అనుసంధానం మొదలైంది. మొన్నటి వరకు డ్రైవింగ్ లైసెన్సులు పొందాలంటే పాన్‌కార్డు, పుట్టిన తేదీ ధృవీకరించే పదో తరగతి మార్కుల జాబితా, స్థానికత వంటి ఇతర వివరాలను సమర్పించాల్సి వచ్చేది. అయితే దళారీల కారణంగా ఈ వ్యవస్థ భ్రష్టు పట్టిపోయింది. ఎవరైనా ఎన్ని డ్రైవింగ్ లైసెన్సులైనా, ఏ ప్రాంతంలో అయినా పొందే పరిస్థితులున్నాయి. దీంతో దొంగ లైసెన్సులు తీసుకొని నేర కార్యకలాపాలకు పాల్పడడం రివాజుగా మారింది. లేదా డూప్లికేట్ లైసెన్సుల తయారీ మాఫీయా కారణంగా ఈ వ్యవస్థ లోపభూయిష్టంగా మారింది. ఇప్పుడు దీనికి పరిష్కారంగా డ్రైవింగ్ లైసెన్సుల జారీకీ ఆధార్ అనుసంధానం చేయాలనే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ చెబుతున్నారు. ఇప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో డ్రైవింగ్ లైసెన్సు జారీకి ఆధార్ ఒక్కటి సమర్పిస్తే సరిపోతోంది. ప్రయోగస్థాయిలో కొన్ని రాష్ట్రాల్లో జరుగుతున్న ఆధార్‌తో డ్రైవింగ్ లైసెన్సు జారీ అనుభవాలతో కేంద్ర ప్రభుత్వం ఒక చట్టం చేసే అవకాశముంది. డ్రైవింగ్ లైసెన్సులను ఆధార్‌తో అనుసంధానం చేస్తే అక్రమాలు ఆగిపోతాయని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ అంటున్నారు. ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లు పారిపోయి, మరోచోట డూప్లికేట్ లైసెన్సులు తెచ్చుకోడం ఇకపై జరగదంటున్నారు. ఆధార్‌తో అనుసంధానం జరిగినప్పుడు ఏం జరుగుతుందో ఒకసారి చూద్దాం. ఏదీని దరఖాస్తుకి అభ్యర్థి మరేదో కారణంతో తప్పుడు పేరు ఇచ్చినా.. అతని బయోమెట్రిక్ కానీ, ఐరిస్ కానీ మార్చలేడు. ఇక్కడే దొంగ దొరికిపోతాడు. ఈ ఒక్క కారణంతోనే ఆధార్ అన్నింటికీ ఆధారమవుతోంది. దీంతోనే జాతీయ స్థాయిలో ఏకీకృత డ్రైవింగ్ లైసెన్స్ విధానానికి కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఇలా అన్ని ఆర్థిక వ్యవహారాలు, పౌర సంబంధమైన అంశాలు, సంక్షేమ పథకాలు, సామాజిక అంశాలు కూడా ఆధార్‌తో దిగ్విజయంగా అనుసంధానం అవుతూ వ్యవస్థ సజావుగా, సక్రమంగా సాగడానికి దోహదపడుతున్న వేళ.. ఓటును కూడా ఆధార్‌తో ఎందుకు అనుసంధానించకూడదనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఓటును ఆధార్‌తో అనుసంధానించడం వినడానికి కొత్తగానే ఉంటుంది. కానీ, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తే కొన్ని ఆసక్తికర అంశాలు తెలియ వస్తాయి. ఓటును ఆధార్‌తో అనుసంధానించాలనే వాదనకు కొన్ని ప్రశ్నలు ముందుకొస్తాయి. ఒకటి.. దేశంలో అందరికీ ఆధార్ ఉందా అన్నది మొదటి ప్రశ్న. ఈ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ స్వయంగా సమాధానం చెప్పారు. ఇప్పటి వరకు 122 కోట్ల ఆధార్ నెంబర్లు జారీ చేసినట్లు వెల్లడించారు. 18 సంవత్సరాలు నిండిన వారిలో 99 శాతానికి ఆధార్ జారీ అయినట్లు జైట్లీ చెప్పారు.

కాబట్టి ఓటుకి ఆధార్‌ను అనుసంధానించడానికి ఓటు హక్కు వేసే వారం దరికీ ఆధార్ ఉన్నట్లుగా రుజవవుతోంది. ఓటుని ఆధార్‌తో అనుసంధానిస్తే అది ప్రజాస్వామ్య స్ఫూర్తికి దెబ్బ అవుతుందనే మరో ప్రశ్నకు అసలు అప్పుడే ప్రజాస్వామ్య స్ఫూర్తి నెరవేరుతుందనే జవాబు వస్తుంది. ఈ కథనంలో ముందుగా చెప్పు కున్నట్లు ఆధార్‌ను ఎవరూ మోసం చేయలేరు కాబట్టి.. ప్రభుత్వ పథకాలు ఎలా సజావుగా అమలవుతున్నాయో.. ఓటును ఆధార్‌తో అనుసంధానం చేస్తే.. దొంగ ఓట్లు లేదా.. ఒకరి ఓటు మరొక రు వేయడం వంటి వాటికి అడ్డుకట్ట పడుతుంది.

ఆధార్‌తో ఓటును అనుసంధానిస్తే.. కేంద్ర ప్రభుత్వానికి మరీ ముఖ్యంగా కేంద్ర ఎన్నికల సంఘానికి పెద్ద భారం తగ్గుతుంది. ఓటర్ల జాబితాను సరిచూడడం, ఓటర్ల నమోదు ప్రక్రియ, ఇంటింటికీ వెళ్లి ఓట్ల నమోదు వంటి కార్యక్రమాలన్నీ అవసరం లేకుండా పోతుంది. వీటికి అయ్యే వ్యయమూ తగ్గిపోతుంది. భారతీయ పౌరులకే ఆధార్ కార్డు ఇస్తుండడంతో చొరబాటుదారులు ఎవ్వరూ ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనకుండా దూరంగా పెట్టడం కూడా తేలిక అవుతుంది. ఓటర్ల జాబితాల నుంచి ఓట్లను తొలగించారనే విపక్షాల విమర్శలకూ ఇక తావుండదు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయి, ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరించిందనే ఆరోపణలు ఆగిపోతాయి. ఆధార్ ఆధారంగా ప్రజలు ఓట్లేయడంతో ఎవరి ఓటు వారే వేసుకుంటారు. ఇతరులు ఓటు వేసే అవకాశమే ఉండదు.

ఓటుని ఆధార్‌తో అనుసంధానించడంలో కొన్ని సాంకేతిక సమస్యలున్నాయి. వాటికీ పరిష్కారాలను ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానమే సమాధానం ఇస్తుంది. దీని కోసం ఈవీఎమ్‌ల పనితీరును సమూలంగా మార్చాల్సి ఉంటుంది. ఆధార్ డేటాతో ఈవీఎమ్‌లను అనుసంధానించాలి. పోలింగ్ ప్రాంతంలో ఇంటర్నెట్ సౌకర్యం ఉండడంతో ఇది సాధ్యమవుతుంది. డిజిటల్ ఇండియా పుణ్యమా అని మారుమూల ప్రాంతాలకు కూడా ఇంటర్నెట్ అందుబాటులో ఉంది. మరీ మారుమూల ప్రాంతాలకు వైర్‌లెస్ సేవలు తీసుకోవచ్చు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారత దేశంలో ఎన్నికలను ఆధార్‌తో అనుసంధానిస్తే.. దీని కోసం శాటిలైట్ సేవలను కూడా అభివృద్ధి చేయడం పెద్ద విషయమేమీ కాదు.

ఆధార్‌తో అనుసంధానికి ఈవీఎమ్‌ల పనితీరును మార్చాల్సి ఉంటుంది. ఓటరు బయోమెట్రిక్‌తో లేదా ఐరిస్‌తో ఈవీఎమ్ తెరుచుకుంటుంది. ఓటరు ఓటేస్తాడు. దాంతో మళ్లీ ఈవీఎమ్ మూసుకొని పోతుంది. మరోసారి అదే ఓటరు ప్రయత్నిస్తే ఈవీఎమ్ తెరుచుకోదు. ఓటరు వేలి ముద్రే ఈవీఎమ్‌కి తాళం అవుతుంది. ఈవీఎమ్‌లను ట్యాంపర్ చేశారనే అపవాదు కూడా దీంతో ఇకపై వినిపించబోదు. ఇక్కడ మరో సౌలభ్యం కూడా ఎన్నికల సంఘానికి కలుగుతుంది. ఆధార్ కారణంగా ఓటరు వయస్సు పద్దెనిమిది సంవత్సరాలు నిండడంతోనే సహజంగా.. ఓటు హక్కు దాఖలవుతుంది. దీంతో ఓట్ల జాబితా తయారీ వంటి భారీ పనుల నుంచి ఎన్నికల సంఘం విముక్తి అవుతుంది. దేశంలో మరింత ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు మరింత సరళతరం, పారదర్శకం అవుతాయి.

ఇక పోస్టల్ బ్యాలెట్ కూడా ఓటును ఆధార్‌తో అనుసంధానించడంతో అవసరం లేకుండా పోతుంది. పోస్టల్ బ్యాలెట్ సౌకర్య సంఘం ఒక పోర్టల్‌ను ఏర్పాటు చేయాలి. ఆ పోర్టల్‌లో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ఉన్నవారు మాత్రమే ఆధార్ ఆధారంగా ఓటేస్తారు. దీంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కపెట్టే శ్రమ, కాలం తగ్గిపోతాయి. ఇప్పటికే అన్నింటికీ ఆధారమైన, అవుతున్న ఆధార్ ఓటుకి కూడా అనుసంధానమైతే.. ప్రజాస్వామ్య ప్రక్రియ మరింత ప్రభావంతంగా, దోష రహితంగా తయారవుతుంది.

-జి.దత్తాత్రేయ

సంజీవయ్యపై కవితల పోటీలు

నిస్వార్థ ప్రజాసేవకు నిలువెత్తు సాక్ష్యం- దామోదరం సంజీవయ్య (అవిభక్త తెలుగు రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి) స్మారక కథ, కవితల పోటీలకు కథలు, కవితలను ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి ఆహ్వానిస్తున్నాము.

కథకు: మొదటి, రెండవ, మూడవ నగదు బహుమతులు వరుసగా రూ.3000, రూ.2000, రూ.1000. **కవితకు:** రూ.2000, రూ.1116, రూ.1000.

చేతిరాతలో కథలు 5-7 పేజీలు, కవితలు 30 పంక్తులు మించకూడదు. జిరాక్స్ కాపీలు పంపవద్దు... **ఆఖరు తేదీ:** ఫిబ్రవరి 14.

పంపవలసిన చిరునామ: డి.ఎస్. సిద్ధార్థ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ, ప్లాట్ నెంబర్ 105, మహాలక్ష్మి టవర్స్, దేవాపురం 5వ లైను, ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం వెనుక, బృందావన్ గార్డెన్స్, గుంటూరు. 522006. మరిన్ని వివరాలకు ఫోన్: 8008189979కు సంప్రదించగలరు.

-ఎస్ఆర్ రావు, కర్నూలు

గంగ కాలువకు శీనన్న పేరు పెట్టాలి

తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా నీళ్ళు అందించేందుకు, నెల్లూరు జిల్లా సస్యశ్యామలం అయ్యేందుకు ప్రణాళిక రూపొందించిన మాజీ రెవిన్యూ మంత్రి, దివంగత నల్లపురెడ్డి శ్రీనివాసుల రెడ్డి (శీనన్న) పేరును గూడూరు రెవిన్యూ డివిజన్ లో ఐదువేల ఎకరాకుపైగా నీరు అందిస్తున్న తెలుగు గంగ ఐదవ బ్రాంచి కాలువకు పెట్టాలి. మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీరామారావుకు సముచితమైన సలహాలు ఇచ్చి తెలుగు గంగ ప్రాజెక్టును చేపట్టేట్టు చేసిన శ్రీనివాసులు రెడ్డి చేసిన కృషికి గుర్తింపుగా ఈ కాలువకు ఆయన పేరు పెట్టడం ఎంతో సముచితం. చెన్నైకి మంచినీరు కోసం ఈ కాలువను నిర్మించారు. ఇందుకోసం శ్రీనివాసులు రెడ్డి ఎంతో కృషి చేశారు. ఈ డివిజన్ లోరైతుల ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు అయ్యేందుకు శ్రీనివాసులు రెడ్డి ఎంతో కృషిచేశారు. ఆయన సేవలను ప్రభుత్వం గుర్తించాలి.

-సుంకర మహేష్ బాబ్జి, విడవలూరు


గళం

పెన్షన్ సొమ్ము పెంచినందుకు కృతజ్ఞతలు


తెలంగాణలో వృద్ధులకు పెన్షన్‌ను వెయ్యి రూపాయిల నుంచి 2016కు పెంచడం, ఏప్రిల్ నుంచి కొత్త పెన్షన్లను అమలు జేయాలని నిర్ణయించడం ముదావహం. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రాష్ట్రంలో సీనియర్ సిటిజన్లు అంతా పెద్ద కొడుకుగానే భావిస్తున్నారు. వికలాంగులు,చేనేత కార్మికులకు క్రమం తప్పకుండా ఆసరా పెన్షన్లు ఇస్తున్నందుకు వారంతా ప్రభుత్వానికి కృతజ్ఞులై ఉంటారు. నిరుద్యోగులైన యువతకు స్వయంఉపాధిని కల్పించేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాల్సిందిగా కోరుచున్నాను.

-కే అరుణ్ రాజీవ్,బోడుప్పల్

సీబీఐలో రోజుకో రచ్చ!



ఆస్థానా



వర్మ

కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) డైరక్టర్ గా అలోక్ వర్మను తిరిగి నియమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించడం, పదవీ బాధ్యతలను స్వీకరించిన 24 గంటలలోపే ఆయనను తొలగిస్తూ ఆ సంస్థ డైరక్టర్ ఎంపిక కమిటీ నిర్ణయం తీసుకోవడంతో ఆ సంస్థ వ్యవహారాలు మరోసారి రచ్చకెక్కాయి. దేశంలో అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన సిబిఐ వ్యవహారాలు రోజుకో మలుపు తీసుకోవడంతో ఆ సంస్థపై నమ్మకం పూర్తిగా సడలిపోయే ప్రమాదం ఏర్పడింది.ఈ నేపథ్యంలో ఆ సంస్థ పూర్వాపరాల గురించి తెలుసుకోవడం సందర్భోచితమే.

బ్రిటిష్ వారి కాలంలో ఏర్పడిన సంస్థలు,వ్యవస్థలు, శిక్షణా సంస్థలను స్వాతంత్ర్యానంతరం కూడా కొనసాగిస్తున్నాం. స్వతంత్ర భారత దేశంలో కూడా వలస పాలన ఛాయలు కొనసాగుతున్నాయి. దేశ సమైక్యతను కాపాడే ఉద్యోగ స్వామ్యంలో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ పోలీసు సర్వీసు (ఐపీఎస్) ముఖ్యమైనవి. బ్రిటిష్ వారి కాలంలో ఉన్న ఇండియన్ సివిల్ సర్వీసు (ఐసీఎస్) నే, ఐఏఎస్ గా మార్చారు.ఇండియన్ పోలీసు సర్వీసు ఆలిండియా సర్వీసులో భాగమే.1990వ దశకం తర్వాత ఆలిండియా సర్వీసులు ఐఏఎస్, ఐపీఎస్,ఇండియన్ ఫారిన్ సర్వీసు (ఐఎఫ్ఎస్) ల సేవలను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలను కాపాడుకునేందుకు వినియోగించుకోవడం జరుగుతోంది. కారణం, రాజకీయ కార్యనిర్వాహక వర్గమైన ప్రధానమంత్రి, మంత్రివర్గం నిర్ణయాలలో ఏకత్వాన్ని చూడటం లేదు. సంకీర్ణ ప్రభుత్వాలు, మైనారిటీ ప్రభుత్వాల పాలనలో ఈ సర్వీసుల స్థితిలో దిగజారుడుతనం ప్రారంభంమైంది.రాజకీయ నిర్వాహక వర్గం అసలైన ప్రభుత్వ కార్యనిర్వాహక వర్గం మధ్య లింకు బాగా ఏర్పడింది. ఒకరి కొనసాగింపు మీద మరొకరు ఆధారపడటం మొదలైంది. ఈ రెండు కార్యనిర్వాహకవర్గాలు- బ్యూరో క్రసీ,పొలిటికల్ ఎగ్జిక్యూటివ్‌ల మధ్య అవగాహన ఏర్పడి పరస్పరం లాభం కలిగే రీతిలో బ్యూరో క్రసీ ఒదిగి పని చేసి మంత్రుల ద్వారా ప్రయోజనాలు పొందే స్థాయికి వచ్చాయి.

బ్యూరోక్రసీ, ఉద్యోగ స్వామ్యం స్వంత నిర్ణయాలు చేయలేవు.రాజకీయ కార్యనిర్వాహక వర్గం ఆదేశాలను అధికారులు అమలు జేస్తారు. అందువల్ల రాజకీయ నిర్ణయానిదేపైచేయి. ఈ నేపథ్యంలో ఐపీఎస్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో పని చేయవలసి రావడంతో తటస్థంగా రాజకీయ ప్రమేయం లేకుండా పని చేసే తీరును మార్చేసుకున్నాయి. ఐఏఎస్‌లు, ఐపీఎస్ లు పదవీ విరమణ తర్వాత వచ్చే నియామకాలపై ముందే కన్ను వేసి స్వతంత్రంగా పని చేయకుండా, రాష్ట్రాల్లో ఎవరు అధికారంలో ఉంటే వారి ఆదేశాలకు అనుగుణంగా పని చేయడంలో ఆరితేరారు. ఐపీఎస్‌లు సర్వీసు పూర్తి అయ్యాక గవర్నర్ పదవులు,సలహాదారుల పదవులు,వివిధ సంస్థల చైర్మన్ల వంటి రాజకీయ పరమైన నియామకాలను ఆశిస్తున్నాయి. దాంతో ఇచ్చి పుచ్చుకునే ధోరణి మొదలైంది. బ్యూరోక్రసీ కూడా మంత్రులు, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రిల చేతులో పని చేసి ప్రయోజనాలు పొందుతున్నాయి. అదే తీరులో మితవాద పార్టీ అయిన బీజేపీ తరపున ముఖ్యమంత్రిగా వ్యవహరించిన నరేంద్రమోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత, ఆయనతో పాటు గుజరాత్ నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌లు పెద్ద ఎత్తున కేంద్రంలో చేరారు. దాంతో వారే విధాన నిర్ణయాల్లో ప్రధానమంత్రిని ప్రభావితం చేస్తున్నారు. ముఖ్యంగా ఐపీఎస్‌లు సీబీఐ వంటి సంస్థల్లో అధికంగా గుజరాత్ నుంచి వచ్చిన వారే ఉన్నారు. గుజరాత్ దేశంలో అంతర్భాగమే అయినప్పటికీ, కేంద్రంలో వచ్చి చేరిన ఐపీఎస్ అధికారుల పనుల్లో అక్కడి మాదిరిగానే వ్యవహరించడం దురదృష్టకరం.

సీబీఐలో సంక్షోభానికి గుజరాత్ నుంచి వచ్చిన ఐపీఎస్ అధికారి రాకేష్ ఆస్థానాయే మూల కారణం. సీబీఐ డైరక్టర్ అలోక్ వర్మకూ, స్పెషల్ డైరక్టర్ రాకేష్ ఆస్థానాకూ మధ్య పొసగలేదు.ఇద్దరూ కలిసి సీబీఐని రచ్చకెక్కించారు.సమస్యలు వాటంతట అవి పరిష్కారం అవుతాయి. కాని మరి కొన్ని తటస్థంగా ఉంటాయి. మన దేశంలో బ్యూరోక్రసీ ఎప్పుడూ తటస్థంగానే ఉండేది. కానీ పరిస్థితుల అవగాహన పెరిగింది. దాంతో ప్రభుత్వ నిబంధనల్లో లొసుగులను గ్రహించిన వారు వాటిని తమ స్వార్థం కోసం వినియోగించుకుని వేలకోట్ల కాంట్రాక్టుల పేరు మీద లాభపడి ప్రభుత్వాలకు పన్నుచెల్లించకుం డా ఎగవేయడంతో సొంత ఆస్తులను అనూహ్యం గా పెంచుకుంటున్నారు. కొందరు ప్రభుత్వ ఆర్థిక సంస్థల్లో రుణాలు పొంది లాభపడుతున్నారు. తిరిగి వాటిని చెల్లించడం లేదు.అధికంగా ఆదా యం పొందిన వారిలో కొందరు ప్రభుత్వం కన్ను గప్పి విదేశీ బ్యాంకుల్లో దాచుకోవడం ప్రారంభిం చారు. ఈ నేపథ్యంలో సంస్కరణల పేరుతో ప్రారంభమైన సరళీకరణ, ప్రపంచీకరణ, మార్కెటీకరణ, వల్ల దేశ సరిహద్దులు దాటి వ్యాపారం, వాణిజ్యం విస్తరించింది. దాంట్లో విదేశీ ధనం వంద శాతం తిరిగి స్వదేశానికి వస్తుంది. పారిశ్రామికవేత్తలు ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులు, ఆదాయం పన్నులు ఎగవేసి విదేశాల్లో నివాసం ఏర్పరుచుకుం టున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)కు ఆ ఎగవేతలను వెలికితీసే బాధ్యతను అప్పగించారు. నల్లధనాన్ని వెలికితీసే పని ఆ సంస్థ చేస్తోంది. అయితే, సీబీఐలో పని చేసే అధికారులు, ఉన్నతాధికారులకు రాజకీయ వాదులతో సంబం ధాల వల్ల, వారి ప్రత్యర్థుల నివాసాలపై దాడులు చేసి వారిని కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ స్థితిలో రాజకీయ నాయకులూ, బ్యూరోక్రాట్ల మధ్య ఉన్న సంబంధాలను గుర్తిం చి ఐపీఎస్ అధికారులు పని చేయాలి. కానీ, వారికి రాజకీయ నాయకులతో సంబంధాల వల్ల ఆ నాయకుల ప్రత్యర్థులపై దాడులు చేయడం ప్రారంభిస్తున్నారు. సీబీఐలో డైరక్టర్‌కూ, స్పెషల్ డైరక్టర్ కూ మధ్య నమ్మకం, విశ్వాసం సన్నగిలింది. వారికి ఉన్న రాజకీయ సంబంధాల నేపథ్యంలో పరస్పర ఆరోపణలు చేసుకోవడంతో వారి అక్రమ సంపాదన సంగతి బయటపడింది.

ఈ ఆరోపణలను తన దృష్టికి వచ్చిన వెంటనే ప్రధాన మంత్రి అదుపు చేసి ఉంటే పరిస్థితి ఇంతవరకూ వచ్చి ఉండేది కాదు. కానీ, మోడీ అలా చేయలేదు. దాంతో ఆస్తానా అలుసుగా తీసుకుని అలోక్ వర్మపై ఆరోపణలు చేసి మొత్తం సీబీఐని భ్రష్టు పట్టించారు.దాంతో సీబిఐ పరువు, ప్రతిష్మ నాశనం అయింది. కేంద్రం అలసత్వమే ఇందుకు కారణం. సీబీఐ అంటే దేశంలో అత్యున్నతమైన నేర పరిశోధనా సంస్థ. ఇందులో మచ్చలేని అధికారులకు పోస్టింగ్ ఇస్తారు.మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత గుజరాత్‌లో తనకు సహకరించిన ఐపీఎస్ అధికారులను తీసుకుని వచ్చి కేంద్రంలో కీలకమైన పదవుల్లో నియమించారు.అలా వచ్చిన అధికారులే ఇప్పుడు ఈ సంక్షోభానికి కారకులు.

సీబీఐ గురించి టూకీగా....స్వాతంత్ర్యం రాక ముందే 1941లో సిబిఐని ఏర్పాటు చేసారు.అప్పట్లో దాని పేరు స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్ మెంట్.అప్పట్లో దీని కేంద్ర కార్యాలయం ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న లాహోర్‌లో ఉండేది. దానికి మొదటి ఎస్పీగా బుర్కాన్ ఆలీఖాన్ పని చేశారు. దేశ విభజన తర్వాత ఆయన పాకిస్తాన్ కు వెళ్ళిపోయారు. ఈ కేసులన్నింటినీ విచారించేందుకు న్యాయసలహాదారు రావు సాహెబ్ కరమ్ చంద్ జైను నియమించారు. విభజన తర్వాత కూడా ఆయనే కొనసాగారు. ఆ తర్వాత 1946లో హోం మంత్రిత్వ తీర్మానంతో బదిలీ అయింది. దాని పేరు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌గా మారింది. 1987లో సిబిఐలో అవినీతి విభాగం, ప్రత్యేక నేరాల విభాగం,ఆర్థిక నేరాల విభాగం అనే మూడు విభాగాలు ఏర్పడ్డాయి. సీబీఐ మొదటి డైరక్టర్‌గా 1963 నుంచి 1968 వరకూ డిపి కోహ్లీ పని చేశారు. ఆ తర్వాత కోహ్లీ ఆధ్వర్యంలోజాతీయ దర్యాప్తు ఏజెన్సీ (ఎన్ఐఏ) ఏర్పడింది. సీబీఐ డైరక్టర్ రాష్ట్రాల డీజీపీ హోదాతో సమానం. రెండేళ్ళ పదవీ కాలానికి నియమితం అవుతారు సిబిఐ ఇంత వరకూ 314 కేసులను నమోదు చేసింది. వీటిలో ఎన్నింటిని పరిష్కరించారు. ఎంతమందికి శిక్షలు పడ్డాయి అనే వివరాలు లేవు. కాల క్రమంలో అవినీతిని అరికట్టే సంస్థ అవినీతి ఊబిలో కూరుకుని పోయింది. 2-జి స్కాం, బొగ్గు కుంభకోణం దర్యాప్తు సందర్భంగా సీబీఐ పేరు దేశమంతా మోగిపోయింది. విదేశాలకు పారిపోయిన మాల్యా, నీరవ్ మోడీ, చోక్సీ వంటి వారి కేసుల దర్యాప్తు బాధ్యతను సిబిఐ ప్రస్తుతం చేపట్టింది. యూపీఏ హయాంలో కుంభకోణాలు అధికంగా వెలుగు చూశాయి. వీటి వల్లే ఆ కూటమిని ప్రజలు దూరంగా ఉంచారు. మోడీనేతృత్వంలోని ఎన్‌డిఏ కూటమి అందుకు భిన్నం కాదని తాజా కుంభకోణాలు రుజువు చేస్తున్నాయి. పైగా, సీబీఐ డైరక్టర్లే పరస్పరం ఆరోపణలు చేసుకోవడంతో మోడీ జమానాలో సీబీఐ ప్రతిష్ఠ పాతాళానికి దిగజారింది.

-కె.ఆనయ్య, 8008359912



ముస్లింల వెనుకబాటుపై అధ్యయనం

• కమిషన్ చైర్మన్ సుధీర్ వెల్లడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ముస్లిం మైనార్టీలు వివిధ రంగాల్లో వెనుకబాటుకు గురైన తీరుపై సమగ్ర అధ్యయం చేస్తున్నామని, మైనార్టీల జీవితాల్లో వెలుగుల దిశగా కృషి చేస్తున్నామని మైనార్టీ అధ్యయన కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జి సుధీర్ పేర్కొన్నారు. గురువారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మైనార్టీ సమస్యలు, అవగాహన, అభివృద్ధిపై జరిగిన శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి కల్పన, రుణ సమీకరణ, దయనీయ జీవనం వంటి రంగాల్లో ముస్లింలపై అధ్యయనం చేసి నివేదిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఉద్యోగ, ఉపాధి, శిక్షణ, అభివృద్ధి కార్యక్రమాల్లో సమాన అవకాశాలు, సచార్ కమిటీ, కుందు కమిటీ సిఫార్సులు అమలు చేయాలని నివేదికలో స్పష్టం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బారీ, అమీర్ ఉల్లాఖాన్, అబ్దుల్ షాబాన్, సంస్థ డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

'రైతుల ఆత్మహత్యల్లో కేసీఆర్ దోషి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైతు బీమాను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ సీనియర్ నేత విజయశాంతి ఆరోపించారు. రోజుకు సగటున 40 మంది రైతులు అప్పులు, వివిధ కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వారికి బీమా డబ్బులను ఎందుకు అందజేయడంలేదని గురువారం ఆమె ఒక ప్రకటనలో విమర్శించారు. చనిపోయిన రైతులకు బీమా డబ్బులు వస్తాయనే నమ్మకం కలిగించలేని స్థితిలో ప్రభుత్వం ఉండటం సిగ్గు చేటన్నారు. రైతులను బంధువుగా ఆదుకుంటానని కేసీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఒకేసారి రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడం, కౌలుదారులకు రైతు బంధు పథకం అమలు కాకపోవడం కూడా ఆత్మహత్యలకు కారణాలని విజయశాంతి అన్నారు.

48 లక్షల మంది విద్యార్థుల ఆధార్ సేకరణ



• విద్యార్థుల ఆధార్‌తో సరిపోలకపోవడంతో నేరుగా సేకరిస్తున్న విద్యా శాఖ • కొత్తగా మిషన్ల కొనుగోలు • కేవలం 10 లక్షల మందివే సరిపోయింది

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌లోని విద్యార్థుల ఆధార్‌ను పాఠశాల విద్య శాఖ సేకరించనుంది. ఇప్పటికే విద్యార్థులకు ఆధార్ నమోదు అయినప్పటికీ అవి సరిపోలకపోవడంతో మరోసారి ఆధార్‌ను నేరుగా పాఠశాల విద్య శాఖనే విద్యార్థుల నుంచి సేకరించాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి కేంద్ర యూఐడీని సంప్రదించగా అందుకు యూఐడీ సమ్మతం తెలిపినట్టు తెలిసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 42 వేల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆధార్ నమోదును చేపట్టాలని నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కలిపి మొత్తం 58 లక్షల మంది విద్యార్థులున్నారు. వారి ఆధార్‌కు సంబంధించి సరిపోల్చడం కోసం పాఠశాల విద్య శాఖ ప్రయత్నం ప్రారంభించింది. అయితే వాటిలో కేవలం 10 లక్షల మంది విద్యార్థుల ఆధార్ మాత్రమే సరిపోల్చబడినట్టు అధికారులు గుర్తించారు. దీంతో మిగిలిన వారికి నేరుగా పాఠశాల విద్యశాఖనే ఆధార్ నమోదు చేయాలని భావించింది. అయితే ఇప్పటికే పాఠశాల విద్య శాఖ దగ్గర 400 ఆధార్ నమోదు యంత్రాలు ఉన్నాయి.

అయితే ఎక్కువ మంది విద్యార్థులు ఉండటంతో మరికొన్ని యంత్రాలు కావాలని పాఠశాల విద్య శాఖ యూఐడీని కోరింది. అందుకు మరో 800 యంత్రాలను ఇవ్వడానికి యూఐడీ అంగీకారం తెలిపింది. దీంతో 800 కొత్త యంత్రాలతోపాటు పాతవి 400తో కలిపి మొత్తం 1200 యంత్రాలతో త్వరలోనే ఆధార్ నమోదు ప్రక్రియను ప్రారంభించనుంది. ఆధార్ సరిపోల్చకపోవడానికి విద్యార్థుల వయస్సు పెరుగుతుండటంతో వారి వేలిముద్రల్లో తేడాలు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ సారి ఆధార్ నమోదులో వేలిముద్రలతోపాటు విద్యార్థుల ఐరిష్ కూడా సేకరించనున్నారు. విద్యార్థుల వయస్సు పెరిగిన సమయంలో వేలిముద్రల్లో మార్పులు వచ్చినా ఐరిష్ ద్వారా ఇకపై వారి ఆధార్ సరిపోల్చడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అందుకే విద్యార్థుల వేలిముద్రలతో పాటు.. ఐరిష్ కూడా సేకరిస్తున్నారు.

అయితే ఇప్పటికే రాష్ట్రంలోని 10 జిల్లాల్లో 12,000 స్కూల్స్‌లో విద్యార్థుల బయోమెట్రిక్ హాజరుతీసుకోవాలని నిర్ణయించిన పాఠశాల విద్య శాఖ ఆయా స్కూల్స్‌కి బయోమెట్రిక్ యంత్రాలను పంపించింది. బయోమెట్రిక్‌లో హాజరు శాతం చాలా తక్కువగా నమోదవుతుండటంతో ఏమీ జరిగిందో తెలుసుకోవడానికి పాఠశాల విద్య శాఖ అధికారులు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దీంతో బయోమెట్రిక్‌లో సాంకేతిక సమస్యలు రావడంతోపాటు బ్రాడ్ బ్యాండ్ సమస్యలు ఉన్నాయి. వాటితోపాటు విద్యార్థుల వేలిముద్రలు కూడా సరిగా మ్యాచ్ కావడం లేదు. దీంతో ఈ మూడు సమస్యలను పరిష్కరించాలని పాఠశాల విద్య ఉన్నతాధికారులు నిర్ణయించారు. అందులో భాగంగానే మొదటి దశలో విద్యార్థులందరి ఆధార్‌ను కొత్తగా నమోదు చేయనున్నారు. తరువాత సాంకేతిక సమస్యలను, బ్రాండ్ బ్యాండ్ సమస్యలను పరిష్కరించనున్నారు.

హిందీ తప్పనిసరికాదు...



న్యూఢిల్లీ: నూతన విద్యా విధానం(ఎన్ఈపీ) రూపకల్పనపై ఏర్పాటైన కమిటీ హిందీ బోధన గురించి చేసిన సిఫారసులపై జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ తోసిపుచ్చారు. ఎనిమిదో తరగతి వరకూ హిందీ తప్పనిసరి చేయాలని కమిటీ సూచించినట్లు వస్తున్న వార్తలను ఖండిస్తున్నట్లు తెలిపిన ఆయన హిందీ బోధనను తప్పనిసరి చేయాలని ఈ కమిటీ సిఫారసు చేయలేదన్నారు. ఈ మేరకు ప్రకాష్ జవదేకర్ ఓ ట్వీట్ చేశారు. నూతన విద్యా విధానంపై కమిటీ తన ముసాయిదా నివేదికలో ఏదైనా భాషను తప్పనిసరి చేయాలని సిఫారసు చేయలేదని,ఓ వర్గం మీడియాలో తప్పుదోవ పట్టించే జగడాలమారి వార్తల నేపథ్యంలో ఈ వివరణ అవసరమైందన్నారు. ఎన్ఈపీ 2020 నుంచి 2040 తరం కోసం ఉద్దేశించిన విధానపరమైన నివేదిక అని జవదేకర్ పలు సందర్భాల్లో పేర్కొన్నారు.

టీఆర్‌టీ ఎస్‌జీటీ అభ్యర్థుల ఎంపిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం కోసం నిర్వహించిన టీఆర్‌టీ ఎస్‌జీటీ ఇంగ్లీష్ మీడియంలో ఎంపికైన అభ్యర్థుల వివరాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు కమిషన్ కార్యదర్శి ఏ వాణిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 909 పోస్టులకు సంబంధించిన ఎంపికైన అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు.

ఏసీబీ వలలో పరిశ్రమల అధికారి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏసీబీ వలలో మహబూబాబాద్ జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వీరేశం చిక్కారు. సబ్సిడీకి సంబంధించిన చెక్కు ఇవ్వడానికి వీరేశం బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడి నుంచి వీరేశం రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.

30 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 30వ తేది నుండి జరగనున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ కేటాయింపులపై ఓటాన్ అకౌంట్ సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమౌతోంది. సమావేశాలను 5రోజుల పాటు జరిగేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. సమావేశాల చివరి రోజున ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది.

సౌకర్యాలు, అభివృద్ధిపైనే దృష్టి

• టీఎస్ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్ శర్మ
• ఈ ఏడాది నష్టాలు అధిగమించేలా ప్రణాళిక



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ఆర్టీసీని ఆర్థికంగా బలోపేతం చేయడమే తన లక్ష్యమని, అందుకు వీలుగా పలు నిర్ణయాలు తీసుకోబోతున్నామని టీఎస్ఆర్టీసీ ఇన్‌ఛార్జ్ ఎండీ సునీల్ శర్మ తెలిపారు. సంస్థ ఈడీలు, ఆర్ఎంలు, పలు విభాగాల ఉన్నతాధికారులతో గురువారం బస్‌భవన్‌లో ఆయన సమీక్ష జరిపారు. 2018 నవంబర్ వరకు లాభాల్లో ఉన్న డిపోలు, డివిజన్లు, రీజియన్ల వివరాలతో పాటు, డిసెంబర్ 2018 వరకు నిర్దేశించుకున్న టార్గెట్లు, నెలవారి ఆదాయం పెంపుపై చర్చించారు. 2019 జనవరి నుంచి మార్చి 2019 వరకు ఆదాయం పెంచుకునేందుకు ఎలాంటి వ్యూహాలను అమలు చేయాలన్న దానిపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ ఏడాది పూర్తయ్యేలోగా డిపోల వారీగా నష్టాలను అధిగమించడం వంటి వాటిపై సమాలోచనలు చేయడంతో పాటు సంస్థ పరిపుష్టి కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారుల అభిప్రాయాలను తీసుకున్నారు. టిక్కటేతర ఆదాయం సమకూర్చుకోవడం, ప్రత్యేక అద్దె బస్సుల రాబడి ఎలా ఉందన్న విషయాలతో పాటు ఎన్నికల సమయంలో కానీ, ఇతరత్రా ప్రత్యేక రోజుల్లో గానీ ప్రత్యేక సర్వీసుల ద్వారా ప్రయాణికులకు సేవలు అందిస్తూ రాబడి పెంచుకోవడానికి గల అవకాశాలను కూడా పరిశీలించాలని అధికారులకు సునీల్‌శర్మ సూచించారు. ప్రయాణికులకు సరైన రవాణా సౌకర్యాలను కల్పించడమే కాకుండా సంస్థ పురోగతి కోసం నిర్మాణాత్మక కార్యాచరణను అమలు పరిచే దిశలో అధికారులను ఆదేశించారు.

జీరో లెవెల్ బ్రేక్‌డౌన్స్

గత నవంబర్ వరకు ఉన్న గణాంకాల ప్రకారం సర్వీసుల బ్రేక్‌డౌన్‌ల వివరాలను తెలుసుకున్న ఆయన రాబోయే రోజుల్లో జీరో బ్రేక్‌డౌన్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలం తీరిన బస్సులను స్క్రాప్ ద్వారా విక్రయించడంతో పాటు ప్రయాణికుల అవసరాల మేరకు బస్సులను సమకూర్చుకోవడంపై ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నారు. వాణిజ్య పరమైన రాబడిని పెంచుకోవడానికి ప్రయత్నించాలని అధికారులకు సూచించిన సునీల్ శర్మ ప్రయాణికులకు మరింత సురక్షిత ప్రయాణం అందించడం కోసం సంస్థ ఇప్పటికే నిర్దిష్ట, నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకుంటామన్నారు. బస్టాండ్లలో ప్రయాణికుల సదుపాయాలు, వసతి కల్పన విషయంలో ప్రత్యేక దృష్టి సారించామని, ప్రయాణికులకు మెరుగైన రవాణా కోసం సంస్థ ఇప్పటికే అనేక చర్యలు తీసుకుందన్నారు. ఖర్చును తగ్గించుకుని ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించే దేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఈడీలు రవీందర్, పురుషోత్తం, కొమురయ్య, వినోద్ తదితరులున్నారు.

సికింద్రాబాద్‌లో కేంబ్రిడ్జ్ పరీక్షా కేంద్రం



పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించిన క్లాస్ క్లాప్ సంస్థ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో భాగమైన కేంబ్రిడ్జ్ ఎసెస్‌మెంట్ ఇంగ్లీష్ పరీక్షా కేంద్రాన్ని క్లాస్‌క్లాప్ భాగస్వామ్యంతో సికింద్రాబాద్‌లో ప్రారంభించారు. పరీక్షా కేంద్రాన్ని క్లాస్‌క్లాప్ కో ఫౌండర్స్ నవీన్ మండవ, వరుణ్ కుమార్‌లు కేంబ్రిడ్జ్ ఎస్సెస్‌మెంట్ ఇంగ్లీష్ రీజనల్ కమర్షియల్ హెడ్ నసీమ్ ఇబు అర్షీద్‌తో కలిసి గురువారం సికింద్రాబాద్‌లో ప్రారంభించారు. దీనిని 1000కి పైగా పాఠశాలలు, 12500 మంది టీచర్లు, 4.25 లక్షల మంది విద్యార్థులు దేశవ్యాప్తంగా స్వీకరించారని వారు తెలిపారు. ఇందులో భాగంగా ఐమ్యాక్స్ కార్యక్రమం ప్రస్తుత పబ్లిషర్‌ను రీప్లేస్ చేయడంతోపాటుగా ఇంటర్నల్ స్కూల్ ఎగ్జామ్స్‌ను సైతం రీప్లేస్ చేస్తాయన్నారు. మార్చిన విధానంలో రెగ్యులర్ స్కూల్ ఎగ్జామ్‌డాటాను వినియోగించి ప్రచురిత వ్యక్తిగతీకరించిన రెమిడియల్ ఇన్‌పుట్‌ను అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు తమ భాషా, వాక్చాతుర్యంను మెరుగుపరచుకోవడంతోపాటు అంతర్జాతీయ సర్టిఫికేషన్‌ను పొందేందుకు క్లాస్‌క్లాప్ చేసిన ప్రయత్నాన్ని నసీమ్ ఇబు అర్షీద్ ప్రశంసించారు.



రైళ్లలో తనిఖీ సిబ్బందికి హెచ్‌హెచ్‌టీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ డిజిటల్ ఇండియా మిషన్‌లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) మరో మైలురాయిని అధిగమించింది. ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో కూడిన హ్యాండ్ హెల్ప్ టర్మినల్స్ (హెచ్‌హెచ్‌టీ)లను టికెట్ల తనిఖీకి ఉపయోగించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ హెచ్‌హెచ్‌టీలు రిజర్వ్ ప్రయాణికుల వివరాలను తనిఖీ చేయడానికి, ఎప్పటికప్పుడు ఖాళీ బెర్తుల వివరాలు తెలుసుకునేందుకు, వివిధ స్టేషన్ల మధ్య ఖాళీ బెర్తులను కేటాయించేందుకు పూర్తి పారదర్శక విధానంలో తనిఖీ సిబ్బందికి ఉపయోగపడనున్నాయి. వీటిని భారత రైల్వేలోని 51 రాజధాని, శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్ళలో ప్రయోగాత్మకంగా అమలు చేయడం జరిగింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఎస్‌సీఆర్ పరిధిలో సదరు రైళ్ళలో పని చేసే తనిఖీ సిబ్బందికి 50 హెచ్‌హెచ్‌టీలు అందించారు. టికెట్ తనిఖీ వ్యవస్థ రూపాంతరం చెందే దిశగా, కదిలే రైళ్ళలో ఎప్పటికప్పుడు ఖాళీ బెర్తుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయాణికుల సౌకర్యాల కల్పనలో గుణాత్మకమైన మార్పు తీసుకు రాగల ఈ హెచ్‌హెచ్‌టీ వ్యవస్థ ప్రారంభమైంది.

ఇస్టోనియా వర్సిటీలపై అధ్యయనం



• టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీలో ప్రపంచంలో నెంబర్ వన్ : ఉన్నత విద్యా మండలి చైర్మన్ పాపిరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: యూరప్‌లోని ఇస్టోనియా దేశంలోని వర్సిటీలపై త్వరలోనే అధ్యయనం చేస్తామని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ఇస్టోనియా దేశంలో వ్యవస్థలు చాలా బాగా ఉన్నాయని తెలిపారు. టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీలో ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో ఇస్టోనియా ఉందని, అందుకే అక్కడి యూనివర్సిటీల్లోని ఉన్నత విద్య అమలును పరిశీలించడం కోసం ఇస్టోనియాలో పర్యటించనున్నట్టు పాపిరెడ్డి తెలిపారు. ఇస్టోనియా రాయబారి రీహో క్రూవ్‌తోపాటు తెలంగాణ ఉన్నత విద్యా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రాతో కలిసి ఆయన గురువారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సమావేశంలో ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్లు ఆచార్య లింబాద్రి, ఆచార్య వెంకటరమణ, మండలి సభ్యులు ఓ. నర్సింహారెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఎన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీలో ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్న ఇస్టోనియాతో తెలంగాణ ఐటీ శాఖ అవగాహన ఒప్పందం చేసుకుంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా రాయబారి రీహో క్రూవ్ మాట్లాడుతూ తాము తెలంగాణ ప్రభుత్వంతో ఈ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన ఒప్పందం చేసుకోనున్నట్టు తెలిపారు. అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో ఐటీ ఉపాధి బాగా పెరుగుతోందన్నారు. యూరప్‌లో ఉన్న తమ దేశంలో యూనివర్సిటీ విద్య చాలా బాగా ఉంటుందని స్పష్టం చేశారు. తమ దేశంలోని యూనివర్సిటీల్లో నాణ్యమైన ఉన్నత విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఆర్థికంగా ఇబ్బంది లేకుండా స్కాలర్‌షిప్స్‌ను అందించడమే కాకుండా.. విద్యార్థులు వారంలో 20 గంటలపాటు ఇతర పనుల ద్వారా ఆదాయం పొందడానికి అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. కోర్సు పూర్తి అయిన తరువాత 9 నెలలపాటు అదేవీసాతో తమ దేశంలో ఉద్యోగం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. 160 డిగ్రీ కోర్సులను అందిస్తున్నట్టు తెలిపారు. ఉన్నత విద్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా మాట్లాడుతూ టెక్నికల్ విద్యపై ఇస్టోనియా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. అలాగే ఇస్టోనియాతో పరిశోధన మరియు అకడమిక్ సహకారంతో పెంపొందాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొఫెసర్ పాపిరెడ్డి మాట్లాడుతూ చిన్న దేశం ఇస్టోనియా అని, ఉన్నత విద్యపై వారు అవలంభిస్తున్న విధానాలు ఎంతో బాగున్నాయన్నారు. దేశంలో కేవలం 7 యూనివర్సిటీలు మాత్రమే ఉన్నాయని, వాటిలో ఒకటి అంతర్జాతీయ స్థాయిలో టాప్- 100లో ఒకటిగా ఉందన్నారు. ఇస్టోనియాలోని వర్సిటీల విధానాన్ని అధ్యయనం చేయడం కోసం ఉన్నత విద్యా మండలి బృందం త్వరలోనే ఆ దేశంలో పర్యటిస్తుందన్నారు.

ఏపీ అభ్యంతరాలు వెల్లడించాం

• జీఎస్టీ సమావేశంలో యనమల

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రాష్ట్రాలను సంప్రదించకుండా జీఎస్టీ కౌన్సిల్ సమావేశ అజెండా రూపొందించడంపై ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన 32వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏపీ అభ్యంతరాలను యనమల సమావేశంలో వివరించారు. పన్నుల్లో మినహాయింపులు, పన్ను రేటు తగ్గింపుపై రాష్ట్రాలకు చాలా సమస్యలున్నాయని కౌన్సిల్ దృష్టికి తీసుకు వచ్చినప్పటికీ చాలా అంశాలపై కౌన్సిల్ సమావేశంలో చర్చ జరగలేదని యనమల అన్నారు. చాలా రాష్ట్రాలు తమ సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చినప్పటికీ చర్చ జరగలేదని తెలిపారు. రాష్ట్రాల అభ్యర్థనలను దృష్టిలో పెట్టుకుని కౌన్సిల్ అజెండా రూపొందించాలని సమావేశంలో డిమాండ్ చేశారు. యనమల వాదనను కర్ణాటక, కేరళ, ఢిల్లీ ఆర్థిక మంత్రులు సమర్థించారు.

రూ. 1 కోటి టర్నోవర్ లిమిట్‌ను కోటిన్నరకు పెంచాలన్న ప్రతిపాదనకు కూడా పలు రాష్ట్రాలు మద్ధతిచ్చాయి. అలాగే జీఎస్టీ రిటర్నులు ఏడాదికోసారి ఉండేలా, పేమెంట్స్ త్రైమాసికంగా ఉండేలా మార్పులు చేయాలన్న ప్రతిపాదనకు కూడా విస్తృత మద్ధతు లభించింది. తద్వారా చిన్న వ్యాపారులకు పన్ను చెల్లింపుల భారం, సమస్యల్ని తగ్గించవచ్చునని సూచించారు. రాష్ట్రాల ఆదాయానికి నష్టం కలుగుతున్నప్పటికీ. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు లాభం చేకూర్చే థ్రెష్ హోల్డ్ లిమిట్‌ను రూ. 20 లక్షల నుంచి రూ. 50 లక్షలకు పెంచాలన్న ప్రతిపాదనకు ఆంధ్రప్రదేశ్ సంపూర్ణ మద్ధతు ప్రకటించింది.

సర్వీస్ సెక్టార్‌లో టర్నోవర్ పరిధిని రూ. 20 లక్షల నుంచి రూ. 50 లక్షలకు పెంచడాన్ని కూడా ఏపీ మంత్రి యనమల రామకృష్ణుడు సమర్థించారు. దీని ద్వారా అనేక చిన్న సర్వీస్ ప్రొవైడర్లకు లబ్ధి చేకూరుతుందని, రాష్ట్రాల ఆదాయం తగ్గినా వారి ప్రయోజనం కోసం అంగీకరిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఐజీఎస్టీ చెల్లింపుల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 7,000 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏపీకి తక్షణమే రూ. 100 కోట్లను కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుందని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏపీ ఉద్యోగులకు తొమ్మిది రోజులు సంక్రాంతి సెలవులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు సంక్రాంతి సంబరాలకు వారానికి పైగా సెలవులు వచ్చాయి. అలాగే వారం రోజులపాటు పాఠశాలలకు సెలవులు రావడంతో కుటుంబమంతా సరదాగా గడిపేందుకు మంచి అవకాశం దొరికింది. ఈనెల 12 నుంచి 20వ తేదీవరకు ఉద్యోగులకు వరుస సెలవులు ఇస్తూ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొన్న తరుణంలో ఉద్యోగులు కూడా తమ స్వస్థలాలకు వెళ్ళే అవకాశం రావడంతో పల్లెలన్నీ సంక్రాంతి సంబరాలతో వెలిగిపోనున్నాయి. సంక్రాంతికి ఇచ్చే సాధారణ సెలవులకు తోడుగా ప్రభుత్వం అదనంగా మరో రెండు క్యాజువల్ లీవ్‌లు ఇస్తోంది.


వారం ముందే ఢిల్లీలో సం'క్రాంతి'



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : వారం రోజుల ముందే దేశ రాజధాని ఢిల్లీకి సంక్రాంతి శోభ వచ్చింది. బొమ్మల కొలువు, గొబ్బెమ్మలు, భోగిపళ్లు, ముత్యాల ముగ్గులు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల నాట్యాలు, ఆడపడుచుల ఆటపాటలతో ఆంధ్ర వనితా మండలి కార్యాలయ ప్రాంగణం పచ్చని పల్లెను తలపించింది. ప్రతి ఏడాది వనితా మండలి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలను ఘనంగా జరుపుతుంటారు. గురువారం ఉదయం 11 నుంచి 4 గంటల వరకు ఐటీవోలోని మండలి ప్రాంగణంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా చదువుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తెలుగు విద్యార్థులు ఇరవై మందికి ఒక్కొక్కరికి 5 వేలు, 4 వేలు, 3 వేల రూపాయల చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఉదయాన్నే మహిళలు అందమైన ముగ్గులు, గొబ్బెమ్మలు పెట్టారు. చిన్నారులకు భోగిపళ్లు పోసి హారతులిచ్చారు. వనితా మండలి ఉపాధ్యక్షురాలు కుసుమ ఆధ్వర్యంలో కార్యవర్గం, సభ్యులు పాడిన పాటలు, చేసిన నృత్యాలు అందరినీ అలరించారు. చిన్నా, పెద్దా అందరూ ఎవరికి తగినట్టు వారు పల్లె పడుచులు, ఎంకీ నాయుడు బావ, హరిదాసు, గంగిరెద్దులు, తదితర వేషధారణలో తమ పాత్రలను పోషించారు. మన సంస్కృతి - సంప్రదాయాలు, పౌరాణిక గాథలను తెలియజెప్పేలా ఏర్పాటు చేసిన అందమైన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంది. అలాగే పసందైన తెలుగు వంటకాలతో విందు భోజనం అనంతరం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అపార్ట్‌మెంట్లు, ఇరుకు ఇళ్లలో కళ్లాపి జల్లి ముగ్గులు పెట్టే భాగ్యం లేకుండా పోయిందని వాపోయే మహిళలు చక్కని ముగ్గులు వేసి మురిసిపోయారు. ఈ పోటీల్లో విజేతలను మార్చి 8న మహిళా దినోత్సవం రోజున ప్రకటిస్తామని వనితా మండలి ఉపాధ్యక్షులు కుసుమ, గిరిజ, ప్రధాన కార్యదర్శి అనసూయ, సంయుక్త కార్యదర్శి పార్వతీరెడ్డి, కోశాధికారి సత్యవతి తెలిపారు.

కన్నుమూసిన కమ్యూనిస్టు యోధుడు

• మాజీ ఎమ్మెల్యే నర్రెడ్డి శివరామిరెడ్డి ఇకలేరు



కడప, ప్రభ న్యూస్ బ్యూరో : కమ్యూనిస్టు ఉద్యమ యోధుడు..సాయుధ పోరాటంలో ప్రాణాలకు తెగించి పోరాడిన ధీరుడు, కమ్యూనిస్టులపై కఠిన నిషేధ సమయంలో సుమారు నాలుగేళ్ళ పాటు అజ్ఞాతంలో కొండలు, గుట్టల్లో గడిపిన ఉద్యమనేత, ఉమ్మడి కమలాపురం, పులివెందుల మొదటి ఎమ్మెల్యే నర్రెడ్డి శివరామిరెడ్డి గురువారం సాయంత్రం కన్నుమూశారు. కమ్యూనిస్టు పార్టీకి 27 ఏళ్ళ పాటు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఎన్నో పోరాటాలు, రచనలు చేసి ప్రజానాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 97 ఏళ్ల వయసు కలిగిన ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో ఉంటూ మృతి చెందారు. ఇసుకమీద అక్షరాలు నేర్చి రచనలు ఎన్నో చేసిన ఆయన కమ్యూనిస్టు ఉద్యమనేతగా ప్రజల కోసం అలుపెరుగని పోరాటం చేశారు. తాడిత పీడిత జనుల కోసం జరిగిన పోరాటంలో ఆస్తులు పోగొట్టుకున్నారు. సాయుధ పోరాటంలో తన భార్య మెడలో వున్న తాళిబొట్టు మినహా 22 తులాల బంగారాన్ని కూడా ఆమె ఉద్యమానికి విరాళంగా సమర్పించారు. జిల్లా కమ్యూనిస్టు చరిత్రలో చెరగని జ్ఞాపకాలు వుంచి మృతి చెందిన శివరామిరెడ్డి మరణం తీరని లోటని కమ్యూనిస్టులతో పాటు రాజకీయ పార్టీలు,ప్రజలు నివాళులు అర్పిస్తున్నారు.

27 ఏళ్ళు కమ్యూనిస్టు కార్యదర్శిగా

మాజీ ఎమ్మెల్యే ఎన్.శివరామిరెడ్డి 1956 నుంచి 1986 వరకు 27 ఏళ్ళ పాటు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నో పోరాటాలు చేశారు. 1952 మొదటి జనరల్ ఎన్నికల్లో కమలాపురం, పులివెందుల ఉమ్మడి నియోజకవర్గం నుంచి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. 1922 ఫిబ్రవరి 25న వీరపునాయునిపల్లె మండలం గడ్డంవారిపల్లెలో జన్మించిన ఈయన ఇసుకపై ఓనమాలు దిద్దారు. 1939 నుంచి 1943 వరకు అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చేశారు. 1943 నుంచ 1945 వరకు మద్రాసు లా కాలేజీలో బిఎల్ పూర్తి చేశారు. ఆ తర్వాత కూడా కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి 1947 లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. 1956 నుంచి 1986 వరకు జిల్లా పార్టీ కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్రరైతు సంఘం ఉపాధ్యక్షునిగా పని చేస్తూ రైతులోకం పత్రికకు సంపాదకులుగా వ్యవహరించిన ఈయన మంచి రచయిత కూడా. జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను అరుణోదయం పేరుతో పుస్తకం రాశారు. పత్రికలకు పలు వ్యాసాలు రాశారు. మూడేళ్ళ క్రితం వరకు చెండ్ర రాజేశ్వరరావు వృద్ధాశ్రమంలో వున్న ఆయన అక్కడ కూడా రెండు పుస్తకాలు రాయడం జరిగింది.

భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా..

భూస్వామ్య వ్యవస్థకు, పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఈ పోరాటంలో తండ్రికి, బంధువులను వ్యతిరేకించారు. 1948 నుంచి 1952 వరకు పార్టీ నిషేధంలో ఉన్నప్పుడు రాత్రిళ్ళు కొండలు, గుట్టల్లో వుంటూ రాత్రి జనసంచారం సద్దుమణిగిన తర్వాత పార్టీ కార్యకలాపాల కోసం కొందరితో మాట్లాడుతూ అజ్ఞాతం సాగించారు. చలి, ఎండ, వాన వేటికి ఒరవకుండా సుమారు నాలుగేళ్ళ పాటు అజ్ఞాతంలో వున్న ఈయనతో పాటు మరి కొందరు రాజుపాలెంకు వచ్చారన తెలియడంతో 1947 లో అక్కడి పోలీసులు చేరుకొని కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో జనాలు ఎదురొడ్డి వీరిని తప్పించారు. ఆ ఘటనలో అక్కడికక్కడే ముగ్గురుచనిపోగా మరో ఇద్దరు తర్వాత మృతి చెందారు. తెలంగాణా సాయుధ పోరాటంలో భార్య బంగారం కూడా పార్టీ కోసం ఇచ్చేసిన శివరామిరెడ్డి ఆ సమయంలో బిడ్డలతో అడవుల్లో గడిపారు. ఆయన జైలు జీవితం కూడా గడిపారు. నిషేధం తర్వాత కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకంగా వుంటూ కమలాపురం, పులివెందుల ఉమ్మడి నియోజకవర్గం ఎమ్మెల్యే అయ్యారు. రాయలసీమ ప్రాజెక్టుల కోసం ఎన్నో ఉద్యమాలు చేశారు. శివరామిరెడ్డి, జె.వెంకట్రామిరెడ్డి, అబ్దుల్ ఖాదర్‌లు చేసిన దీక్షలు, ఆందోళనలతో 1996లో గండికోటకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంఖుస్థాపన చేశారు. కమ్యూనిస్టు ఉద్యమనేతగా రాయలసీమ ప్రాజెక్టుల కోసం, భూస్వామ్య వ్యవస్థ, పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు 97 ఏళ్ళ వయసులో కన్నుమూశారు.

ఆయన పిలుపే ఒక పోరాటం : ఈశ్వరయ్య

నర్రెడ్డి శివరామిరెడ్డి పిలుపే ఒక పోరాటం. ఆయన మరణం తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఆయనతో మాటలు ఉత్తేజపరుస్తాయని అన్నారు. ఆయన ఒక మేధావి, రచయిత, ఉద్యమనేత అని అంతటి కమ్యూనిస్టు యోధుడు మృతి చెందడం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు.



చిన్న వ్యాపారులకు పెద్ద ఊరట!



• జీఎస్టీ మినహాయింపు పరిమితి రెట్టింపు
• రూ. 20 లక్షల నుంచి రూ. 40 లక్షలకు పెంపు
• ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి • ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ

న్యూఢిల్లీ : దేశంలోని చిరు వ్యాపారులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. జీఎస్టి కౌన్సిల్ గురువారం నాడు చిన్న వ్యాపారులకు జీఎస్టి పరిమితిని రెట్టింపు చేసింది. దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు చెందిన చిరు వ్యాపారులకు ఏడాదికి రూ.20 లక్షల వరకు టర్నోవర్‌పై జీఎస్టి పన్ను మినహాయింపు ఇచ్చింది. అదే దేశవ్యాప్తంగా ఉండే చిరువ్యాపారులకు రూ.40 లక్షల వరకు ఈ మినహాయింపు వర్తిస్తుందని ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం నాడు ఇక్కడ మీడియాతో చెప్పారు. జీఎస్టి కాంపన్‌సేషన్ స్కీం కింద చిన్న వ్యాపారులు.. వారి టర్నోవర్‌ను రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్లకు పెంచింది. వారికి జీఎస్టిలో ఒక శాతం పన్ను మినహాయింపు ఇస్తుంది. సవరించిన కొత్త జీఎస్టి వ్యవస్థ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది.

విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం జీఎస్టి పన్ను మినహాయింపును రూ.40 లక్షల పెంచినందుకు ప్రభుత్వానికి ఏడాదికి రూ. 5,200 కోట్ల రెవెన్యూ నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు. అలాగే సర్వీస్ ప్రొవైడర్స్ టర్నోవర్ రూ.50 లక్షలు దాటితే వారు కూడా జీఎస్టి కాంపన్‌సేషన్ స్కీంకింద 6 శాతం పన్ను చెల్లిస్తే చాలని జైట్లీ అన్నారు. కాంపన్‌సేషన్ కింద ఇచ్చే రాయితీల వల్ల ప్రభుత్వ రెవెన్యూపై రూ.3,000 కోట్ల ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. గురువారం జరిగిన జీఎస్టి కౌన్సిల్ 32వ సమావేశం లో తీసు కున్న నిర్ణయాల వల్ల సూక్ష్మ, చిన్న మధ్య తరహా రంగాలకు భారీ ఊరట లభిస్తుందని ఆర్థికమంత్రి జైట్లీ ట్వీట్ చేశారు.



ప్రభుత్వం తాజాగా తీసుకొన్న నిర్ణయం వల్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపా రులకు ఊరట లభిస్తుంది. కేరళ విషయానికి వస్తే ఇటీవల కాలంలో వరదల కారణంగా అతలాకు తల మైంది. దీంతో ఒక శాతం విపత్తు సెస్ విధించుకోవడానికి అనుమ తించింది. కేరళ నుంచి అంతం ష్ట్రాల్లో జరిగే వ్యాపారా లకు వచ్చే రెండు సంవత్సరాల పాటు ఈ సెస్ విధించుకొనే వెసులుబాటు లభిస్తుంది. రియల్ ఎస్టేట్, లాటరీ విషయానికి వస్తే కౌన్సిల్ ఏడు గురు సభ్యులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకుం టుంది. కౌన్సిల్ సమావేశంలో దీనిపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది.

రియల్ ఎస్టేట్ రంగంపై జీఎస్టి ఎంత విధించాలనే అంశంపై సమావేశంలో వివిధ రకాల అభిప్రాయాలు రావడంతో ఏడుగురు సభ్యుల గల మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసినట్లు జైట్లీ చెప్పారు. లాటరీపై కూడా సభ్యులు విభిన్న అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయని తెలిపారు. కాంపన్‌సేషన్ స్కీం కింద ఫైల్ చేయాలను కునే వ్యాపారులు ఏడాదికి ఒకసారి రిటర్న్ ఫైల్ చేస్తే చాలని అయితే పన్నులు మాత్రం ప్రతి త్రైమాసి కం చెల్లించాలని అన్నారు. అలాంటి వారికి అకౌంటింగ్ బిల్లింగ్ సాఫ్ట్‌వేర్ ఉచితంగా ఇస్తామన్నారు. ఏడాదికి రూ.1.5 కోట్ల టర్నోవర్ గల వ్యాపారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవ చ్చునని తెలిపారు. ప్రభుత్వా నికి జీఎస్టి ద్వారా వచ్చే రెవెన్యూ సంఘటితరం గంతో పాటు పెద్ద కంపెనీల నుంచి ఎక్కువ మొత్తంలో వస్తుందన్నారు. ప్రభుత్వం చిన్న మధ్య తరహారంగాలకు చెందిన కంపెనీలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయాలు తీసుకుందన్నారు. ప్రతి వ్యాపారి ముందు పలు ఆప్షన్‌లున్నాయి. సేవలరంగానికి చెందిన వారైతే ఏడాదికి ఆరు శాతం (కంపౌండింగ్) చక్రవడ్డీ కడితే సరిపోతుందని,, అదే తయారీరంగానికి చెందిన వారైతే ఏడాదికి రూ.1.5 కోట్ల టర్నోవర్‌పై ఒక శాతం కౌంపండింగ్ వడ్డీ గిట్టుబాటు అవుతుందన్నారు. అలాగే వ్యాపారాలపై రూ.40 లక్షల టర్నోవర్‌పై పన్ను మినహాయింపు ఎలానూ ఉందని జైట్లీ వివరించారు. వ్యాపారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని లబ్ధి పొంద వచ్చునన్నారు.

రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషన్ పాండే మాట్లాడుతూ ప్రస్తుతం జీఎస్టీ పన్ను మినహాయింపు రూ.20 లక్షల వరకు ఉన్నా 10.93 లక్షల మంది పన్ను చెల్లిస్తున్నారని, వారిలో చాలా మంది రూ.20 లక్షల కంటే తక్కువ టర్నోవర్ వారే పన్ను చెల్లిస్తున్నారన్నారు. ప్రస్తుతం వస్తు సేవల పన్ను కింది సుమారు 1.17 కోట్ల మంది వ్యాపారులు రిజిస్టర్ చేసుకున్నారన్నారు. వారిలో 18 లక్షల మంది కాంపన్‌సేషన్ స్కీంకు బదిలీ అయ్యారని ,తరచూ పన్ను చెల్లించాల్సిన వారు నెల వారి ప్రాతిపదికన చెల్లించా ల్సి ఉంటుందని, అలాగే సప్లయిర్స్ ప్రతి త్రైమాసానికి ఒకసారి పన్ను చెల్లించాల్సి ఉంటుం దన్నారు. కాంపోజిషన్ పన్ను చెల్లింపుదారులు పూర్తిస్థాయి రికార్డు నిర్వహిం చాల్సిన అవసరం లేదని పాండే తెలిపారు.

భారీగా పెరిగిన ద్రవ్యలోటు

• ఎనిమిది నెలల్లో 15 శాతానికి • రెవెన్యూ తగ్గడమే కారణం • డీబీఎస్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఎనిమిది నెలల కాలంలో ద్రవ్యలోటు లక్ష్యం ఏకంగా 15 శాతానికి ఎగబాకింది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం వ్యయం కంటే రెవెన్యూ తగ్గడమే కారణమని సింగపూర్‌కు చెందిన డీబీఎస్ బ్యాంకింగ్ గురువారం నాడు విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. బడ్జెట్ అంచనా ప్రకారం చూస్తే పరోక్ష పన్నుల రెవెన్యూ తగ్గుముఖం పట్టడం, అదే సమయంలో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ నత్తనకడను కొనసాగడం ఆందోళన కలిగించే అంశమని డీబీఎస్ గ్రూపు రీసెర్చి ఆర్థికవేత్త రాధికరావు నివేదికలో పేర్కొన్నారు.

ప్రత్యక్షపన్నుల వసూళ్ల లక్ష్యం అంచనాలో 50 శాతం కంటే తక్కువ వసూలు కావడం ఆందోళన కలిగించే అంశం. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పరిస్థితులు మెరుగుపడే అవకాశాలున్నాయని అంచనా వేసింది. అయితే మార్కెట్లు మాత్రం పరోక్ష పన్నుల వసూళ్లలో పురోగతి ఉండదని భావిస్తున్నాయని రాధికారావు భావిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ప్రభుత్వానికి జీఎస్టి రెవెన్యూ వార్షిక బడ్జెట్ అంచనాలో రూ.70వేల నుంచి రూ.80వేల కోట్ల వరకు తగ్గవచ్చునని అంచనా వేసింది. మరో ఆందోళన కలిగించేఅంశం ఏమిటంటే ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం ఈ ఆర్థికసంవత్సరంలో రూ.80వేల కోట్లుగా నిర్ణయించింది. అయితే వాటిలో ఐదోవంతు కూడా ఇప్పటికి పూర్తికా లేదు. పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రభుత్వం ఇప్పుడి ప్పుడే పీఎస్‌యు కంపెనీల్లో మైనారిటీ వాటాల విక్రయం, షేర్ల బైబ్యాక్ ద్వారా లోటును పూడ్చుకోవాలని చూస్తోందని తెలియజేసింది. లోటును పూరించుకోవ డానికి ప్రభుత్వం పీఎస్‌యు కంపెనీల నుంచి అదనపు డివిడెండ్‌ను డిమాండ్ చేస్తోంది. అలాగే ఆర్‌బీఐ నుంచి రూ.40వేల కోట్ల వరకు డివిడెండ్‌ను ఆశిస్తోంది. ఈ మొతం జీడీపీలో 0.2 శాతంగా తేలింది. ఆర్‌బీఐ కూడా ప్రభుత్వానికి రూ. 40వేల కోట్ల వరకు డివిడెండ్ చెల్లించడానికి సుముఖంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎన్ని రకాల సర్దుబాట్లు చేసినా.. ప్రభుత్వం అంచనా వేసిన ద్రవ్యలోటు లక్ష్యాన్ని సాధించడం కష్టమేనని డీబీఎస్ పేర్కొంది. ప్రస్తుతం రెవెన్యూ వసూళ్లు మందగమనంలో కొనసాగుతున్నాయి. అదీ కాకుండా ప్రభుత్వం బడ్జెట్‌ను ఒక నెల ముందుకు జరిపింది. ఫిబ్రవరి 1వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టడంతో ప్రభుత్వా నికి వచ్చే రెవెన్యూపై ప్రభావం చూపుతుందని డీబీఎస్ ఆర్థికవేత్త అభిప్రాయప డ్డారు.

దుమ్మురేపిన టీసీఎస్!

• క్యూ3 లాభం రూ. 8,105 కోట్లు • రెవెన్యూ రూ. 37,338 కోట్లు
• మధ్యంతర డివిడెండ్ షేరు పై రూ. 4

ముంబై : ఐటి దిగ్గజం టాటా కన్సెల్టీన్సీ సర్వీసెస్ (టీసీఎస్) డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రికార్డుస్థాయిలో లాభాలు ఆర్జించింది. ఏడాది ప్రాతిపదికన చూస్తే క్యూ 3 నికరలాభంలో ఏకంగా 24.1 శాతం వృద్ధితో రూ.8,105 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.6,531 కోట్లు సాధించింది. త్రైమాసికం ప్రాతిపదికన చూస్తే నికరలాభంలో 2.58 శాతం వృద్ధి కనిపించింది. రెవె న్యూ విషయానికి వస్తే ఏడాది ప్రాతిపదికన 20.8 శాతం వృద్ధితో రూ.37,338 కోట్లకు ఎగబాకింది. 2018 సంవత్సరాన్ని బలమైన రెవెన్యూ సాధిం చి సాగనంపామని, డిసెంబర్ త్రైమాసికంలో రెవెన్యూ 12.1 శాతం సాధించామని.. గత 14 త్రైమా సికాల్లో ఇదే అత్యధికమని టీసీఎస్ మేనేజింగ్ డైరె క్టర్, సీఈవో రాజేశ్ గోపీనాథన్ చెప్పారు. ప్రపంచంలోని అన్నీ కీలక మార్కెట్లో మంచి పురోగతిని సాధించామని, క్లయింట్ల సంఖ్య పెరిగిందని, ఐటి పరిశ్రమ డిజిటల్‌కు మారుతుందని అన్నారు. కంపెనీ చేతిలో బలమైన ఆర్డర్ పుస్తకం ఉందని, అన్నీ రకాల కస్టమర్ల నుంచి ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయని సీఈవో వివరించారు. ఇదిలా ఉండగా కంపెనీ బోర్డు మధ్యంతర డివిడెండ్ షేరుపై రూ.4గా ప్రకటించింది.

రెవెన్యూ విషయానికి వస్తే త్రైమాసికం ప్రాతిపదికన చూస్తే 1.8 శాతం, ఏడాది ప్రాతిపదికన 12.1 శాతం సాధించామని, నిర్వహణ మార్జిన్ 0.4 శాతం పెరిగి ఏడాది ప్రాతిపదికన 25.6 శాతానికి చేరిందని, ఎర్నింగ్ ఫర్ షేర్ (ఈపీఎస్) విషయానికి వస్తే ఏడాది ప్రాతిపదికన క్యూ3లో 26.6 శాతం పెరిగి రూ.21.60కి ఎగబాకిందని కంపెనీ ప్రకటనలో పేర్కొంది. రెవెన్యూ విషయానికి వస్తే డిజిటల్ వాటా 30.1 శాతం కాగా.. ఏడాది ప్రాతిపదికన 52.7 శాతానికి చేరింది. కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వి



రామకృష్ణన్ మాట్లాడుతూ డిసెంబర్ త్రైమాసికంలో పరిస్థితులు వ్యతిరేకంగా ఉన్నా.. ఉదాహరణకు రూపాయి బలహీనపడ్డా.. కొన్ని పెద్ద మార్కెట్లలో వ్యా పారాలు ఖరీదైన వ్యవహారం గా మారినా టీసీఎస్ వాటిని తట్టుకొని నిలబడి మంచి లాభాలను ఆర్జించగలిగిం దన్నారు. భవిష్యత్ కోసం పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టి రాబోయే త్రైమాసికంలో మరిన్ని లాభాలను ఆర్జిస్తా మని ఆయన ధీమా వ్యక్తం చేశారు.డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ నికరంగా 6,827 మందిని ఉద్యోగంలోకి తీసుకుంది. దీంతో కంపెనీలో ఉద్యోగుల సంఖ్య 4,17,929కి చేరింది. కంపెనీ నుంచి వలస రేటు గత 12 నెలల కాలంలో 11.2 శాతంగా తేలింది. బీఎస్‌ఈ లోగురువారం టీసీఎస్ షేరు 0.21 శాతం క్షీణించి రూ.1,883 వద్ద ముగిసింది.

రియల్ ఎస్టేట్ కేంద్రం దుబాయ్

• డాన్యూబ్ అధ్యయనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని భావించే వారికి స్వర్గధామంగా దుబాయ్ నిలిచింది. ప్రస్తుత మార్కెటింగ్ ట్రెండ్స్‌ను బట్టి దుబాయ్‌లో పెట్టుబడులు సాలీనా 8 నుంచి 10 శాతం రాబడి ఇస్తూ, ప్రపంచంలోనే శరవేగంగా వృద్ధి చెందుతోంది. దుబాయ్ ప్రభుత్వం విదేశీ పెట్టుబడులపై ఉన్న నిబంధనలను సడలించడంతో భారతీయ ఇన్వెస్టర్లు రియల్ ఎస్టేట్ రంగంపైనే దృష్టిసారించారు. ముంబైకు చెందిన వందలాది మంది సంపన్నులు దుబాయ్‌ని పెట్టుబడుల కేంద్రంగా ఎంచుకున్నారు. పెట్టుబ డులకు రక్షణతో పాటు ఆదాయం కూడా వస్తున్నందున ఇటీవల కాలంలో భారీ స్థాయిలో మొగ్గు చూపుతున్నారు. పశ్చిమ, తూర్పు దేశాల మధ్య ఉన్నందున పెట్టుబడులతో పాటు లగ్జరీ ఫ్లాట్స్ కొనుగోలు చేసేందుకు డిమాండ్ పెరుగుతుందని డాన్యూబ్ సంస్థ అధ్యయనంలో పేర్కొంది. న్యూయార్క్, మిడిల్ ఈస్ట్‌దేశాలతో పోల్చితే దుబాయ్‌లో పెట్టుబడులపై ఎక్కువ ఆదాయం వస్తుందని ఆ సంస్థచైర్మన్ రిజ్వార్ సాజన్ చెప్పారు. నిర్మాణ రంగంలో పెట్టుబడులకు దుబాయ్ అత్యంత అనుకూలమని తమ అధ్యయనంలో తేలిందని ఆయన తెలిపారు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలపై ఇన్వెస్టర్ల దృష్టిసారించాలని, గత పదేళ్ళుగా దుబాయ్ శరవేగంగా విస్తరిస్తోందని రిజ్వార్ అన్నారు.

రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులకు ప్రపంచంలోనే అతి ప్రధానమైన గమ్యస్థానంగా దుబాయ్ అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో మౌలిక వసతులు ఉన్నందున దుబాయ్ మార్కెట్‌కు ప్రతి ఏటా డిమాండ్ పెరుగుతోందని రిజ్వార్ చెప్పారు.

విరాట్‌కోహ్లీ బ్రాండ్ విలువ 170.9 మిలియన్ డాలర్లు

• తర్వాతి స్థానం దీపిక పదుకొనే 102 మిలియన్ డాలర్లు



ముంబై : భారత్ క్రికెట్ స్కిప్పర్ విరాట్ కోహ్లీ దేశంలోనే అత్యంత విలువైన సెలెబ్రిటీ బ్రాండ్ జాబితాలో అగ్రస్థానం దక్కించుకున్నారు. వరుసగా రెండో సంవత్సరం ఆయన నెంబర్ వన్ స్థానంలో నిలిచారు. 2017తో పోల్చుకుంటే ఆయన బ్రాండ్ విలువ 18 శాతం పెరిగి 2018 నాటికి 170.9 మిలియన్ డాలర్లకు ఎగబాకింది. గ్లోబల్ వ్యాల్యూయేషన్ కార్పొరేట్ ఫైనాన్స్ అడ్వయిజర్స్ డఫ్ అండ్ పెల్ప్స్ గురువారం విడుదల చేసిన తాజా ఎడిషన్‌లో ఈ విషయాన్ని పేర్కొంది.

కోహ్లీ తర్వాతి స్థానం బాలీవుడ్ నటి దీపికా పదుకొనే .. 2017 తో పోల్చుకుంటే ఒక ర్యాంకు పైకేగిసింది. ఆమె బ్రాండ్ విలువ 102.5 మిలియన్ డాలర్లు. నవంబర్ 2018 వరకు ఆమె 21 బ్రాండ్‌లకు ప్రచారం చేశారు. వీరిద్దరు సెలెబ్రిటీలు మాత్రమే 100 మిలియన్ డాలర్ల క్లబ్‌లో నిలిచారు. దేశంలోని టాప్ 20 సెలెబ్రిటి బ్రాండ్ విలువ 877 మిలియన్ డాలర్లుగా తేలింది. వారిలో టాప్ 10 సెలెబ్రిటీల వాటా మొత్తం విలువలో 75 శాతం ఆక్రమించారు.

విరాట్‌తో పాటు దీపిక ఇద్దరు తమ ఎండార్స్‌మెంట్‌లు .. ఈక్విటీ రూపంలో తీసుకుంటారు. దీంతో దీర్ఘకాలం పాటు ఆ బ్రాండ్‌లో కొనసాగడానికి అవకాశం ఉంటుంది. బ్రాండ్‌కు విలువ పెరిగితే దీంతో పాటు షేరు విలువ పెరుగుతుంది అలాగే కంపెనీ పనితీరు కూడా మెరుగుపడుతుందని డఫ్ అండ్ పెల్ప్ పేర్కొంది. సెలెబ్రిటి ఎండార్స్‌మెంట్ మార్కెట్ విషయానికి వస్తే ఈ మార్కెట్ పరిపక్వం చెందింది. ప్రొడక్టు ఎండార్స్‌మెంట్ నుంచి భాగస్వామ్యం వరకు వినూత్నమైన రీతిలో ఉదాహరణకు ఈక్విటీ డీల్స్‌తో పాటు వ్యూహాత్మక భాగస్వామ్యం వరకు తమకు అనుకూలమైన రూట్లలో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. అయితే ఈ-కామర్స్, రిటైల్, ఎఫ్‌ఎంసీజీ, స్మార్ట్‌ఫోన్స్ కంపెనీలు మాత్రం మిల్లీనియల్ సెలెబ్రిటిలు.. అంటే యువ సెలెబ్రిటిల వైపు చూస్తున్నాయని, యువతను దృష్టిలో ఉంచుకొని వీరిని ఎండార్స్ చేసుకుంటున్నాయని డఫ్ అండ్ ఫల్ప్స్ మేనేజింగ్ డైరెక్టర్, ఆసియా పసిఫిక్ లీడర్.. వ్యాల్యుయేషన్ సర్వీసెస్ వరుణ్‌గుప్తా చెప్పారు.

బాలీవుడ్ సెలెబ్రిటిలు అక్షయ్‌కుమార్, రణవీర్‌సింగ్‌లు కూడా తమ ర్యాంకు నుంచి ఒక మెట్టుపైకి ఎగబాకారు. వరుసగా మూడు, నాలుగవ స్థానం ఆక్రమించారు. వారి బ్రాండ్ విలువ వరుసగా 67.3 మిలియన్ డాలర్లు, 63 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. షారూఖ్‌ఖాన్ రెండవ స్థానం నుంచి ఐదవ స్థానానికి పడిపోయారు. ఆయన బ్రాండ్ విలువ 60.7 మిలియన్ డాలర్లకు దిగివచ్చింది. అయితే టాప్ 20 సెలెబ్రిటిల జాబితాలో బాలీవుడ్ నటులదే హవా కనిపిస్తోంది. క్రీడాకారుల విషయానికి వస్తే విరాట్‌కోహ్లీ, సచిన్ టెండూల్కర్, ఎంఎస్ దోనీ, పీవీ సింధుల మొత్తం ఎండార్స్‌మెంట్ కలిపితే 241 మిలియన్ డాలర్లకు చేరుతుంది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 27 శాతం పెరిగింది. ఈ ఏడాది విరాట్ కోహ్లీ ఆయన భార్య అనుష్కశర్మ జంట కలిసి యువతను ఆకర్షించేందుకు సుమారు 40 బ్రాండ్‌లకు ప్రచారం చేస్తున్నారు. వాటిలో కొన్ని హెడ్ అండ్ షోల్డర్స్, మాన్యవార్, పెప్సీ, సెల్కాన్, బూస్ట్ ఆడి, ఫాస్ట్ ట్రాక్, జియోనీ, వ్రాంగ్, పోలార్రైడ్ లాంటి కొన్ని ప్రొడక్టులను ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు.



లక్ష మంది చిరు వ్యాపారులకు ఆర్థిక సాయం 'ఆయ్ ఫైనాన్స్'

– సంస్థ ఎండి సంజయ్ శర్మ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : క్యాపిటల్ జి ద్వారా బలపరచిన ఫిన్ టెక్ లెండర్ అయిన ఆయ్‌ఫైనాన్స్ లక్షమైక్రో బిజినెస్‌లకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలను అందించి వారి వ్యాపారాన్ని అభివృద్ధిలోకి తీసుకువచ్చామని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ శర్మ చెప్పారు. తమ సంస్థ లక్షమంది చిరు వ్యాపారులకు ఆర్థిక సాయం అందించే దిశగా పనిచేస్తూ త్వరలో ఆ లక్ష్యాన్ని చేరుకోనున్నామని చెప్పారు. నూతనమైన క్లస్టర్ ఆధారిత అండర్‌రైటింగ్‌ను ఉపయోగించి ఇటువంటి పరివర్తన రుణాలు, సూక్ష్మరంగ సంస్థలలో వృద్ధి కల్పిస్తున్నామని ఆయన అన్నారు. దేశంలో 57 మిలియన్ల సూక్ష్మ, చిన్నతరహా వ్యాపార సంస్థలు ఉండగా, అవి 16 ట్రిలియన్ డాలర్ల నిధుల కొరతవల్ల అభివృద్ధిని సాధించ లేకపోతున్నాయని చెప్పారు.

ఇలాంటి సంస్థలకు ఆర్థిక సాయం అందించి వాటి వర్కింగ్ క్యాపిటల్ సమస్యను తీర్చగలుగుతున్నామని సంజయ్ శర్మ చెప్పారు.ఆర్థికంగా మినహాయించిన చిన్న, సూక్ష్మ వ్యాపార సంస్థలను వ్యవస్థీకృత ఫైనాన్స్‌లోకి తీసుకురావాలన్నదే తమ లక్ష్యమని ఆయన చెప్పారు. ఇప్పటికే లక్ష చిన్న వ్యాపారులను అధికారిక ఆర్థిక వ్యవస్థ జాబితాలోకి తీసుకువస్తున్నామని శర్మ చెప్పారు. చిరు వ్యాపారులు తమ ఉద్యోగుల వేతనాల్లో ఉపాధి, అభివృద్ధిలో స్థిరమైన వనరులు పొందుతారని, ఇది సమాజం ఆర్థికంగా మెరుగుపడేందుకు కొంత మేరకు దోహద పడుతుందని అన్నారు.

జోరుకు విరామం


• 106 పాయింట్లు పతనం • గ్లోబల్ మార్కెట్ల ప్రభావం

ముంబై : వరుసగా గత నాలుగు రోజుల నుంచి లాభాలతో దూసుకుపోయిన స్టాక్ మార్కెట్లకు ఎట్టకేలకు గురువారం నాడు బ్రేక్‌పడింది. పెద్ద కంపెనీల ఫలితాలు వెల్లడికానున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు మార్కెట్లకు దూరంగా ఉన్నారు. దీంతో పాటు బ్యాంకింగ్ షేర్లు పెద్దెత్తున విక్రయించారు. గ్లోబల్ మార్కెట్ల నుంచి అనుకూలమైన సంకేతాలు రాకపోవడంతో పాటు డాలర్ మారకంతో రూపాయి బలహీనపడ్డం తదితర అంశాలు కలిసి మార్కెట్లను కిందికి లాగాయి. ట్రేడింగ్ ముగిసే నాటికి బీఎస్‌ఈ 106.41 పాయింట్లు క్షీణించి 36,106.50 వద్ద, నిఫ్టీ 33.55 పాయింట్లు నష్టపోయి 10,821.60 వద్ద ముగిశాయి. బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్ల అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ప్రధానంగా ఇండస్ఇండ్ బ్యాంకు, కొటక్ బ్యాంకు, ఫెడరల్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ షేర్లు 2.36 శాతం వరకు నష్టపోయాయి. వీటితో పాటు ఓఎన్‌జీసీ, మారుతి సుజుకి, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ, హీరోమోటో, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.31 శాతం వరకు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. టీసీఎస్ షేర్లు ఫ్లాట్‌గా ముగిశాయి. ఫలితాలు సాయంత్రం విడుదల కానున్నాయి. వీటికి వ్యతిరేకంగా టాటామోటార్స్, ఎన్‌టీపీసీ, ఇన్ఫోసిస్, ఎస్‌బ్యాంకు, ఎంఅండ్ఎం, ఎల్అండ్‌టి, భారతి ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్ షేర్లు అత్యధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి 1.34 శాతం వరకు లాభపడ్డాయి. ఇదిలా ఉండగా బుధవారం నాడు విదేశీ సంస్థాగత మదుపరులు రూ.276.14 కోట్ల షేర్లు కొనుగోలు చేస్తే.. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.439.67 కోట్ల షేర్లు కొనుగోలు చేసినట్లు స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. డాలర్ మారకంతో రూపాయి 10 పైసలు క్షీణించి 70.56 వద్ద ముగిసింది. గ్లోబల్ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ అయ్యాయి. అమెరికా - చైనాల వాణిజ్య చర్చలపై ఆశలు ఆవిరయ్యాయి. దీంతో పాటు ముడిచమురు ధర పీపా 60 డాలర్ల మార్కుకు చేరింది. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే ఆసియాతో పాటు ఐరోపా మార్కెట్లకు రెండు నష్టాలతో ముగిశాయి.



ప్రభుత్వానికి ఆర్‌బీఐ జవాబుదారీ

• బిమల్ జలాన్



న్యూఢిల్లీ : రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రభుత్వానికి జవాబుదారి ... ప్రభుత్వ తయారు చేసిన నిబంధనల ఫ్రేంవర్కు పరిధిలోనే ఆర్‌బీఐ పనిచేయాల్సి ఉంటుందని మాజీ రిజర్వుబ్యాంకు గవర్నర్ బిమల్ జలాన్ అభిప్రాయపడ్డారు. కాగా జలాన్ విషయానికి వస్తే ఇటీవల కాలంలో రిజర్వుబ్యాంకుకు ... ప్రభుత్వానికి మధ్య మిగులు నిధులపై ఏర్పడిన వివాదం పరిష్కరించడానికి ఆర్‌బీఐ బోర్డు బిమల్ జలాన్ నేతృత్వంలో ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసి ఈ సమస్యకు పరిష్కారం కొనుగొనాలని ప్యానెల్ చైర్మ న్‌గా నియమించింది. ప్రభుత్వానికి ఆర్‌బీఐకి మధ్య గత కొన్ని నెలల పాటు జరిగిన మిగులు నిధుల బదిలీతో పాటు ఆర్‌బీఐ స్వయంప్రతిపత్తికి ప్రభుత్వం భంగం కలిగిస్తోం దన్న వాదనపై ఆర్‌బీఐకి.. ఆర్థికమంత్రిత్వశాఖకు మధ్య ఘర్షణ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఉర్జిత్‌పటేల్ డిసెంబర్ 10వ తేదీన గవర్నర్ పదవికి రాజీనామా చేసి వెళ్లిపో యారు. అటు తర్వాత ఆయన స్థానంలో ఆర్థికమంత్రి త్వశాఖలో పనిచేసిన శక్తికాంతదాస్‌ను గవర్నర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆర్‌బీఐకి .. మోడీ సర్కార్‌కు ఘర్షణ ఏర్పడి పెద్ద అగాథం ఏర్పడింది. దీని ప్రధాన కారణం రిజర్వుబ్యాంకు బాండ్ల ద్వారా.. కరెన్సీ ట్రేడింగ్ ద్వారా పెద్దమొత్తంలో లాభాలను ఆర్జిస్తోంది. ఆ లాభంలో కొంత వాటా తమకు ఇవ్వాలని ప్రభుత్వం పట్టుబడుతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ఆర్‌బీఐ బోర్డు ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసి ఆర్‌బీఐ వద్ద ఎంత మేరకు నిల్వలు ఉంచుకోవచ్చు. ప్రభుత్వానికి ఎంత మొత్తం బదిలీ చేయవచ్చో జలాన్ ప్యానెల్ అధ్యయనం చేస్తోంది.బిమల్ జలాన్ విషయానికి వస్తే ఆయన ఆర్‌బీఐ గవర్నర్‌గా 1997 నుంచి 2003 వరకు పనిచేశారు. అయితే తన కమిటి ఎలాంటి సిఫారసులు చేయబోతోంది వివరించడానికి నిరాకరించారు. అయితే ప్రభుత్వానికి.. ఆర్‌బీఐ మధ్య ఎలాంటి సంబంధాలు ఉండాలనే అంశాలపై స్పష్టత ఇచ్చారు. ద్రవ్యపరపతి విధానం ప్రకారం చూస్తే ఆర్‌బీఐ ప్రభుత్వానికి జవాబుదారి అని స్పష్టం చేశారు. ఆర్‌బీఐ స్వయంప్రతిపత్తిపై ప్రభుత్వానికి ఆర్‌బీఐకి మధ్య అభిప్రా యభేదాలు ఉండవచ్చు. అయితే ఇక్కడ మోడీ ప్రభుత్వం రాజకీయ అవసరాల కోసం కానీయండి.. లేదా వాస్తవ పరి స్థితులకు అనుకూలంగా కూడా వ్యవహరించి ఉండవచ్చు. మరో పక్క ఆర్‌బీఐ స్వయంప్రతిపత్తి గురించి ప్రస్తావిస్తూ.. ప్రభుత్వం ఆమోదించిన విధానపరమైన ఫ్రేంవర్కుకు ప్రకా రమే ఆర్‌బీఐ వ్యవహరించాల్సి ఉంటుందని ఆయన మరో మారు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆర్‌బీఐకి కొత్త గవర్నర్ వచ్చారు. ఆయన గతంలో ప్రభుత్వంలో పనిచేసిన వారే. ఆయన నేతృత్వంలో ఆర్‌బీఐ చక్కగా పనిచేస్తుందని ఆశిస్తున్నానన్నారు. అభిప్రాయభేదాలుండటంలో తప్పేమీలేదని, అయితే వీటిని దేశ ప్రయోజనాల కోసం సామరస్యంగా పరిష్కరించుకోవాలని అన్నారు. అయితే జలాన్ వ్యాఖ్యలపై ఆర్‌బీఐ నుంచి తక్షణమే ఎలాంటిస్పందన లేదు. కాగా డిసెంబర్ 12వ తేదీన ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే దాస్ ప్రభుత్వంతో కొన్ని విధాన పరమైన అంశాలపై సంప్రదింపులు జరిపారు. దాస్ నేతృత్వంలో ఆర్‌బీఐ మార్చి చివరి నాటికి ప్రభుత్వానికి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు మధ్యంతర డివిడెండ్‌ను బదిలీ చేసే అవకాశాలున్నాయని ఇటీవల మీడియాలో వార్తలువచ్చాయి. కాగా దాస్ బాధ్యతలు చేపట్టిన వెంటనే సూక్ష్మ చిన్న మధ్య తరహా వ్యాపార సంస్థలకు రుణాలు అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. ఇవన్నీ గమనిస్తే.. ఆర్‌బీఐ గవర్నర్ ప్రభుత్వానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

భార్యను చంపి.. పూడ్చి..

- ఆత్మహత్య చేసుకుందని నాటకమాడిన భర్త
- బంధువుల ఫిర్యాదుతో వెలుగుచూసిన నిజం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : భాగ్యనగరంలోని పాతబస్తీ మంగళ్‌హాట్‌లో దారుణం చోటు చేసుకుంది. కట్టుకున్న భార్య పట్ల కరుణచూపకపోగా ఆమె పట్ల రాక్షసుడిగా మారాడో ప్రబుద్ధుడు. ఆమె గొంతు నులిమి హత్య చేసినానంతరం ఆమె మృతదేహాన్ని పూడ్చి పెట్టాడు. ఆత్మహత్య చేసుకుందని నాటకమాడాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో బండారం బట్టబయలైంది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఫైజాన్ హైదరాబాద్‌కు చెందిన తబస్సుమ్‌ను కొన్నేళ్ల కిందట పెండ్లి చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు. కొన్ని నెలలుగా వారి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఏమైందో ఏమో తెలియదు జనవరి ఏడో తేదీన మీ కూతురు చనిపోయింది. అంత్యక్రియలు పూర్తి చేశా అని ఫైజాన్ తబస్సుమ్ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో షాక్ అయిన బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఫైజాన్‌ని తమదైన శైలిలో విచారించడంలో అసలు విషయం కక్కేశాడు ఫైజాన్. తామిద్దరి మధ్య ఘర్షణ జరిగిందని, తర్వాత భార్య తబస్సుమ్ గొంతు నులిమి చంపినట్లు అంగీ కరించాడు. పూడ్చి పెట్టిన ప్రాంతంలో డెడ్ బాడీని కోర్టు ఆదేశాలతో పోలీసులు వెలికి తీయించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలిం చారు. పోస్టుమార్టానికి నివేదికలో కూడా హత్య జరిగినట్లు తేటతెల్లమైంది. దీంతో నిందితుడు తబస్సుమ్ భర్త ఫైజాన్‌తో పాటు అతడికి సహకరించిన మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసులకు చెబితే చంపేస్తాం

- నౌహీరా బాధితులను బెదరిస్తున్న కిరాయి గూండాలు
- సోషల్‌మీడియా ఆధారంగా బెదరింపు వీడియోలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అధిక వడ్డీ ఆశ చూపి జనం నెత్తిన టోపీ పెట్టిన హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత నౌహీరా షేక్ గురించి పోలీసులకు ఫిర్యాదులు చేసినా, వివరాలు చెప్పినా చంపేస్తా మంటూ ఆమె అనుయాయులుగా చెప్పుకుంటున్న కొందరు కిరాయి గూండాలు బాధితులను బెదరిస్తున్నారు. బాధితుల ఫోన్ నెంబర్లు తెలుసుకుని వాటికి వీడియో మెసేజ్‌లు బెదరిస్తున్నారు. మారణాయుధాల సంకేతాలు, హెచ్చరికలతో ఈ సందేశాలు పంపుతూ భయాందోళనలు కలిగిస్తున్నారు. దేశవిదేశాల్లో 15 కంపెనీలను నెలకొల్పి ప్రజల నుంచి ఎనిమిది వేల కోట్ల రూపాయలు దండుకున్న నౌహీరా షేక్ చేతిలో మోసపోయిన చాలామంది ఇప్పటికే ఫిర్యాదు చేశారు. మరెంతోమంది అందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆమె వర్గానికి చెందిన కొందరు బెదరింపులకు పాల్పడుతున్నారు. తాజా పరిణామాలు పోలీసుల దృష్టికి వచ్చాయి తమకు వచ్చిన వీడియో బెదరింపులను ఆధారాలతో సహా బాధితులు పోలీసులకు అందించడంతో వారు అప్రమత్తమయ్యారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. నౌహీరాపై ఫిర్యాదు చేసినా, సాక్ష్యం చెప్పటానికి వచ్చినా చంపేస్తామంటూ బాధితులను తీవ్రస్థాయిలో బెదిరింపులకు గురిచేస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంగా నౌహీరా షేక్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ నౌహీరా షేక్ అధిక వడ్డీ ఆశచూపి వేలాది మంది బాధితుల నుంచి పెట్టుబడులు సేకరించి తిరిగి చెల్లింపులు జరపకపోవడంతో ఈ మోసం బయట పడ్డ సంగతి తెలిసిందే. బంజారాహిల్స్‌లో నివాసముంటున్న ఓ మహిళ తన వద్ద నుంచి కోటి రూపాయలు మదుపు చేయించుకున్న హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ పెట్టుబడి లాభం ఇవ్వకుండా మోసం చేసిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు మోసం బయటపడింది. ఒక వర్గానికి చెందిన వారినే నౌహీరా షేక్ టార్గెట్ చేసి ఘరానా మోసానికి పాల్పడినట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ఈ మోసాలు బయటపడిన వెంటనే నౌహీరా షేక్‌ను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం బెయిల్‌పై రాగా పూణే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఆ తరువాత పీటీ వారెంట్‌పై ఏపీ పోలీసులు నౌహీరాషేక్‌ను తీసుకొచ్చి చిత్తూరు కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. నౌహీరా షేక్‌ను కస్టడీలోకి తీసు కుని విచారించేందుకు ఆ రాష్ట్ర పోలీసులు యత్నిస్తు న్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ బెదరింపుల వ్యవహారం వెలుగు చూసింది.



రంగంలోకి పోలీసులు..

ఇదిలా ఉండగా బాధితులకు బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు బాధితులకు ధైర్యానిచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాయి. ఇందు నిమిత్తం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. నౌహీరా షేక్ కేసుని సీరియస్‌గా దర్యాప్తు చేస్తున్నామని, బాధితులకు రక్షణ కల్పించే బాధ్యత తమపై ఉందని దర్యాప్తు సంస్థలు పేర్కొంటూ అందుకనుగుణంగా వారిని పట్టుకునేందుకు స్పెషల్ బృందాలను రంగంలోకి దింపాయి.

క్యూనెట్ కేసులో మరో ఇద్దరు అరెస్ట్

3 వేల కోట్ల రూపాయలు దండుకున్న క్యూనెట్ కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో సవితను మియాపూర్ పోలీసులు , శ్రీనివాస్ చావలిలను పేట్‌బషీర్‌బాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఇద్దరు నిందితుల అరెస్ట్‌తో మొత్తంగా క్యూనెట్ కేసులో అరెస్ట్ అయిన వారి సంఖ్య 60కి చేరినట్లైంది.

ఒక్కరోజులో ఆమోదమా?

- అగ్రకుల రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నాం: బీసీ సంఘాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అగ్రకులాలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో రాజ్యాంగ సవరణ తీసుకురావడం పార్లమెంటు చరిత్రలోనే రికార్డని జాతీయ బీసీ సంక్షేమ సంఘం విమర్శించింది. ఇప్పటి వరకు 123 రాజ్యాంగ సవరణలు చేశారని కానీ ఏ ఒక్క రాజ్యాంగ సవరణ కూడా ఒక్క రోజులోనే ఇటు లోక్‌సభలోనూ.. అటూ రాజ్యాసభలోనూ పాస్ కాలేదని... కానీ అగ్రకులాలకు రిజర్వేషన్లు కల్పించే 124వ రాజ్యాంగ సవరణ బిల్లు మాత్రం ఒక్క రోజులోనే ఆమోదం పొందడం చరిత్ర అని సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. అగ్రకులాలపై ఉన్న ప్రేమ.. బీసీలపై ఎందుకు లేదని ప్రశ్నించారు. 14 బీసీ సంఘాల సమావేశం గురువారం బీసీ భవన్‌లో జరిగింది. సమా వేశంలో వివిధ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, కోట్ల శ్రీనివాస్, బర్క కృష్ణయాదవ్, టీఆర్ చందర్, జైపాల్ ముదిరాజ్, సి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. అగ్రకులాలకు కల్పించిన రిజర్వేషన్లను వెంటనే ఉపసంహారించుకోవాలని డిమాండ్ చేశారు. నేడు 112 బీసీ కులాల సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించనున్నట్టు స్పష్టం చేశారు.

14 నుంచి జూ.కాలేజీలకు సంక్రాంతి సెలవులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలో రెండో టర్మ్ సెలవులు ప్రకటించారు. 14, 15 తేదిల్లో సంక్రాంతి సెలవులను ఇచ్చినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలేజీలు తిరిగి 16న పునః ప్రారంభం అవుతాయని తెలిపారు.

గుట్కా రవాణా గుట్టురట్టు

- రూ.16 లక్షల విలువగల బ్యాగులు స్వాధీనం



వరంగల్, ప్రభన్యూస్ : కర్ణాటక రాష్ట్రం నుంచి హైదరాబాద్ మీదుగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు నిషేధిత గుట్కా అక్రమ రవాణా సాగుతోంది. ఆ రాష్ట్రంలో తయారైన గుట్కాను హైదరాబాద్‌లో కొనుగోలుచేసి పలువురు వ్యాపారులు వాహనాల్లో గ్రామాలకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఐదుగురు గుట్కా వ్యాపారులను అదుపులోకి తీసుకోవడంతో గుట్కా అక్రమ రవాణా వెలుగులోకి వచ్చింది. జనగామ జిల్లా, నర్మెట మండలం బోతర బర్రె గ్రామానికి చెందిన సిద్దిరాజు, బచ్చన్నపేట మండ లంలోని తమ్మడపల్లి గ్రామానికిచెందిన ముడుపు రాజు, హైదరాబాద్‌కు చెందిన బొద్దుల శ్రీనివాస్, లోరెల్, లక్ష్మణ్‌లు సిండికేట్‌గా ఏర్పడి కర్ణాటకలోని బీదర్ జిల్లా నుంచి వరంగల్ ఉమ్మడి జిల్లాకు గుట్కా రవాణా చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు నిఘా వేసి ఐదుగురు వ్యాపారులను అరెస్టు చేశారు. వారినుంచి రూ.16లక్షలు విలువచేసే 40 గుట్కా బ్యాగులను వాటిని తరలిచేందుకు ఉపయోగించే రెండు కారులతో పాటు బోలెరే వాహనాన్ని వరంగల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు గురువారం నాడు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ డా.వి.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం జనగామ జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు నిషేధిత గుట్కా, అంబర్ ప్యాకెట్లను సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్ ఫోర్స్ ఏసీపీ చక్రవర్తి ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్‌లను అప్రమత్తం చేసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. టాస్క్ ఫోర్స్ సిబ్బంది తొలుత బోతులబర్రె గ్రామంలోని సిద్దంరాజు ఇంటిపై దాడులు చేయడంతో రవాణాకు సిద్ధంగా ఉన్న గుట్కా ప్యాకెట్లు గోదాం నుంచి స్వాధీనం చేసుకున్నారు. రాజు ఇచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్, రాజు, లోరెల్, లక్ష్మణ్‌లు సిండికేటుగా ఏర్పడి తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆలోచనలతో బీదర్ ప్రాంతంలో గుట్కా, అంబర్‌లను కొనుగోలు చేసి కారులు, బొలెరో వాహనాల ద్వారా రాత్రివేళల్లో గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లుగా నిర్ధారణైంది. దీంతో టాస్క్ ఫోర్స్ సిబ్బంది గురువారం నర్మెట శివారు ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తుండగా, గుట్కా రవాణా చేస్తున్న వాహనాలను అనుమానంగా పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లు, మరో బోలెరోతో పాటు వాటిలో రవాణా చేస్తున్న గుట్కా, అంబర్ బ్యాగులను స్వాధీన పర్చుకుని ఐదుగురిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

గల్ఫ్‌లో తెలంగాణవాసి ఆత్మహత్య



ఇందల్వాయి, ప్రభన్యూస్ : వ్యవసాయంలో గిట్టుబాటు కాక అప్పుల పాలైన ఓ యువ రైతు ఉపాధి కోసం బహ్రెయిన్‌కు వెళ్లి అక్కడ ఆత్మహత్యకు పాల్పడ్డారు. వేతనం తక్కువ ఉందని మానసిక ఆందోళనతో గదిలోనే ఉరి వేసుకున్నాడు. మృతుని కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా, ఇందల్వాయి మండలంలోని కొత్తకొరుట్ల తండాకు చెందిన బాదావత్ గణేష్(25) వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో 25 రోజుల క్రితం బహ్రెయిన్ దేశానికి వెళ్లాడు. వేతనం తక్కువగా ఉందని అప్పులు తీర్చే లేదని రోజూ మదన పడుతూ ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం ఒంట్లో నలతగా ఉందని పనికి రాలేదని తన సహచరులకు చెప్పారు. ఈ క్రమంలో తన సహచరులు విధులు ముగించుకుని వచ్చేసరికి గణేష్ ఉరి వేసుకుని విగతజీవిగా గదిలో పడి ఉన్నాడు. దీంతో వారు కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుని భార్య గర్భవతి, వీరికి ఒకకుమార్తె ఉంది. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించే ఏర్పాట్లు చేయాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రిలో పెళ్లిచేసిన పెద్దలు



వికారాబాద్, ప్రభ న్యూస్ : ప్రేమ పెళ్లికి ఒప్పుకోలేదని ఓ ప్రేమ జంట ఆత్మహత్యాయత్నంనకు యత్నించగా గ్రహించిన పెద్దలు విషయం తెలుసుకుని అపస్మారక స్థితిలో ఉన్న వారికి ఆస్పత్రిలోనే పెళ్లి చేసిన సంఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది.ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి . మూడు రోజుల క్రితం ఓ ప్రేమ జంట పురుగుల మందు సేవించగా స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వికారాబాద్ మండలం అత్తెల్లి గ్రామానికి చెందిన రేష్మాబేగం,ధారూర్ మండలం కుక్కింద గ్రామానికిచెందిన మహ్మద్ నవాజ్‌తో కొంత కాలంగా ప్రేమ వ్యవహారం సాగుతుంది. ఇందుకు ఇరువురి ఇళ్లలో అంగీకారం లేకపోవటంతో ఆ ప్రేమ జంట పురుగుల మందు సేవించి ఆత్మహత్య యత్నానికి పాల్పడగా ఇరు కుటుంబాల పెద్దలు దిగి వచ్చి కోలుకుంటున్న ఇద్దరి వివాహం చేస్తామని అంగీకరించారు. గురువారం ఆస్పత్రిలో నవాజ్-రేష్మాల వివాహం చేశారు. గతంలో ఈ ఇరు కుటుంబాల మధ్య బంధుత్వం సహితం ఉన్నప్పటికీ కారు మెకానిక్‌గా పనిచేస్తున్న నవాజ్‌కు ఇచ్చేందుకు రేష్మా కుటుంబీకులు అంగీకరించలేదు .

కొరేగావ్ తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: కొరేగావ్-భీమా అల్లర్ల కేసులో చార్జిషీటు దాఖలు చేసేందుకు 90 రోజులు గడువును పొడిగించేందుకు బాంబే హైకోర్టు తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంని ఆశ్రయించింది. గురువారం మహారాష్ట్ర ప్రభుత్వ వినతిపై సుప్రీంకోర్టు తీర్పుని రిజర్వులో ఉంచింది. నిందితుల, న్యాయవాదుల వాదనలు ముగిసిన తర్వాత సుప్రీం ఆర్డర్స్ జారీ చేస్తుందని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ తెలిపారు. బాంబే హైకోర్టు ఆర్డర్‌పై సుప్రీం స్టే విధించింది. ఈ కేసుకి సంబంధించి పుణే పోలీసులు న్యాయవాది సపురేంద్ర గాడ్లింగ్, నాగ్‌పూర్ యూనివర్శిటీ ప్రొఫెసర్ షోమా సేన్, దళిత కార్యకర్త సుధీర్ దవాలే, యాక్టివిస్ట్ మహేష్ రౌత్, కేరళకు చెందిన రోనా విల్సన్ లను గతేడాది జూన్ లో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

కాశ్మీరీల ఆకాంక్ష మేరకే భవిష్యత్ నిర్ణయం: షా ఫజల్



శ్రీనగర్: కశ్మీర్ ప్రజలు కోరుకుం టున్న దానిపైనే తన భవిష్యత్ ఆధారపడి ఉంటుందని సివిల్ సర్వీస్‌కు రాజీనామా చేసిన ఐఏఎస్ టాపర్ షా ఫేసల్ అన్నారు. రాజకీయాల్లో తన భవిష్యత్‌ను నిర్ణయించేందుకు ప్రత్యేకించి యువత నుంచి సలహాలు కోరుతున్నాను అని ఫేసల్ గురువారం తెలిపారు. ఫేస్‌బుక్‌లో ఆయన మాట్లాడుతూ తనకు ఎలా చేయాలో ఓ ఆలోచన ఉందని, కానీ తుది నిర్ణయం తీసుకునే ముందు ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని కోరుకుంటున్నాను అన్నారు. నా రాజీనామకు సంబంధించి వేలాదిమంది అనేకవిధాలుగా స్పందించారన్నారు. ఇక తను ఏమి చేయబోతున్నాను అనేది కాశ్మీర్ ప్రజలపైనే ఆధారపడి ఉంటుం దన్నారు. ఫేస్‌బుక్, ట్వీటర్ ద్వారా నేడు (శుక్రవారం) శ్రీనగర్‌లో యువతతో సమేకమై వారి ఆలోచనలు తెలుసుకుంటాను అన్నారు. అందరి ఆలోచనలు తెలుసుకున్న తరువాత వివారాలు తెలుపుతాను అని ఫేసల్ తెలిపారు. కాగా ఫేసల్ రాజీనామా నేపథ్యంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మంత్రి చిదంబరం మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారుపై మండిపడ్డారు. వరుస ట్వీట్లతో కేంద్రంపై ధ్వజమెత్తారు. విచారంగా ఉన్నప్పటికీ మిస్టర్ షా ఫేసల్ ఐఏఎస్‌కు సెల్యూట్ చేస్తున్నాను అన్నారు. ఆయన రాజీనామా ప్రకటనలో ప్రతి మాట నిజమే అన్నారు. మొదటి ఐఏఎస్ కశ్మీరీ టాపర్ నరేంద్రమోడీ ప్రభుత్వంపై చేసిన ఆరోపణల్లో యథార్థం ఉందన్నారు. జమ్ము కశ్మీర్‌లో హత్యలను, ముస్లింలపై వివక్షను నిరసిస్తూ 2010 బ్యాచ్ ఐఏఎస్ టాపర్ షా ఫేసల్ తన సర్వీస్‌కు రాజీనామా చేశారు.

బంగ్లాదేశీయుల చొరబాట్లు లేవు

గువహటి: గత పది సంవత్సరాలుగా దేశంలోకి బంగ్లాదేశీయుల అక్రమ చొరబాట్లు జరగలేదని బీజేపీ గురువారం ప్రకటించింది. బీజేపీ అధికార ప్రతినిధి స్వప్నానిల్ బారువా గురువారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోకి అక్రమ చొరబాట్లు తగ్గాయని, గత పదేళ్లుగా బంగ్లాదేశీయులు భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించలేదని తెలిపారు. పౌరసత్వ సవరణ బిల్లు కొత్తగా విదేశీయులను ఎవరినీ దేశంలోకి తీసుకురావటం లేదన్నారు. బంగ్లాదేశీయులు ఎవరూ భారత్‌లోకి వలస రావటం లేదన్నారు. ఆర్థిక కారణాల రీత్యా వారంతా యూరప్, గల్ఫ్ తదితర అభివృద్ధి చెందిన ఇతర ప్రాంతాలకు వెళుతున్నారని బారువా అన్నారు. యూరప్ లేదా గల్ఫ్‌లో వారికి రోజుకు కనీస వేతనం రూ.3వేలు లభిస్తుందని అదే భారత్‌లో వారికి లభించే వేతనం రూ.వెయ్యి మాత్రమే అన్నారు. అలాంటప్పుడు వారు భారత్‌కు ఎందుకు వస్తారన్నారు. మరో అధికార ప్రతినిధి మొమినుల్ అవాల్ మాట్లాడుతూ పౌరసత్వ సవరణ బిల్లు ఆమోదం పొందితే కొత్తగా ఏ హిందూ బంగ్లాదేశీని ఇండియాకు తీసుకువచ్చేది ఉండదన్నారు. కొత్తగా వచ్చినవారికి పౌరసత్వం ఇచ్చే అవకాశం లేదన్నారు. ఇప్పటికే భారత్‌లో నివసిస్తున్నవారికి మాత్రమే పౌరసత్వం లభిస్తుందన్నారు.

యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్‌పై సత్వర విచారణకు సుప్రీం నో

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మీడియా సలహాదారు సంజయ బారు రచించిన పుస్తకం ఆధారంగా తెరకెక్కి జనవరి 11న విడుదల కానున్న యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ సినిమా విడుదలను నిలిపివేయడంతోపాటు యూట్యూబ్‌లోని సినిమా ట్రైలర్‌ను నిషేధించాలని, సత్వరమే విచారణ జరపాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. నిర్దేశించిన క్రమంలోనే పిటిషన్‌పై విచారణ జరపనున్నామని జస్టిస్ ఏకే సిక్రీ ఆధ్వర్యంలోని బెంచ్ వెల్లడించింది. ఈ సినిమా విడుదలైతే రాజ్యాంగబద్ధమైన ప్రధానమంత్రి పదవిని కించేపరచడంతోపాటు ప్రధానమంత్రి పేరు, హుందాతనాన్ని తగ్గించినట్లువుతుందని, సినిమా విడుదలను అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషనర్ కోరిన సంగతి తెలిసిందే.

సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఆర్టీఐ కార్యకర్తపై దేశద్రోహం కేసు

గువహటి: సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అస్సామీ రచయిత హిరెన్ గోహైన్‌తోపాటు సమాచార హక్కు కార్యకర్త, సీనియర్ జర్నలిస్ట్ అఖిల్ గొగొయ్‌పై దేశద్రోహం ఆరోపణలపై కేసు నమోదైంది.మూడురోజులు క్రితం పౌరసత్వ బిల్లుకు సంబంధించి వారుచేసిన వ్యాఖ్యలపై దేశద్రోహ ఆరోపణలతో కేసు నమోదుచేశామని పోలీసులు గురువారం తెలిపారు. ఇండియన్ పీనల్ కోడ్ 124(ఎ), 120(బి) ప్రకారం పోలీసులు వారిపై సుమోటో కేసును లతాసిల్ పోలీస్ స్టేషన్‌లో రిజిస్టర్ చేశారని గువహటి పోలీస్ కమిషనర్ దీపక్ కుమార్ విలేఖరులకు తెలిపారు. నిరసనలకు వ్యతిరేకంగా గువాహటిలోని పలు ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు విధించామని పోలీస్ కమిషనర్ కుమార్ వెల్లడించారు.

స్టీల్ కేబుల్ సస్పెన్షన్ బ్రిడ్జి ప్రారంభం



గువహటి: భారతదేశపు పొడవైన 300 మీటర్ల సింగిల్ లేన్ స్టీల్ కేబుల్ సస్పెన్షన్ బ్రిడ్జిని బుధవారం అరుణాచల్ ప్రదేశ్ సీఎం పెమాఖండు బుధవారం ప్రారంభించారు. సెక్రటేరియట్ భవనానికి కూడా సీఎం శంకుస్థాపన చేశారు. అప్పర్ సియాంగ్ జిల్లాలోని ఇంగ్‌కియాంగ్ వద్ద సియాంగ్ నదిపై ఈ బ్రిడ్జి నిర్మించబడింది. బ్యోరుంగ్ బ్రిడ్జిగా దీనికి నామకరనం చేశారు. 48.43 కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ బ్రిడ్జి ద్వారా ఇంగ్‌కియాంగ్-ట్యుటింగ్ మధ్య 40 కి.మీ. దూరం తగ్గనుందని సీఎం పెమాఖండు తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి డిపార్ట్మెంట్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ నార్త్ ఈస్టర్న్ రీజియన్(డీవోఎన్ఆర్) మంత్రిత్వశాఖ నిధులు ఇచ్చినట్లు తెలిపారు. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద 3,800 కోట్ల విలువైన 286 రోడ్డు ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేసినట్లు సీఎం తెలిపారు.

బులంద్‌షహర్ కేసులో బీజేపీ యువనేత అరెస్ట్

మీరట్: ఉత్తరప్రదేశ్ పోలీసులు గురువారం బులంద్‌షార్ హింసాత్మక దాడి ఘటనకు సంబంధించి స్థానిక బీజేపీ యువనేతను అరెస్టు చేశారు. గత నెలలో బులంద్‌షార్‌లో జరిగిన మూకదాడిలో పోలీస్ ఇన్‌స్పెక్టర్, పౌరుడు ఒకరు హత్యకుగురయ్యారని ఈ ఉదంతంలో స్థానిక బీజేపీ యూత్ వింగ్ లీడర్ షికార్ అగర్వాల్ అలియాస్ శేఖర్ (25)ను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. గత 40రోజులుగా శేఖర్ పరారీలో ఉన్నాడని గురువారం ఉదయం 7.20 సమయంలో హపూర్ జిల్లా సమీపంలోని ఫ్లై ఓవర్‌వద్ద అతడిని అదుపు లోకి తీసుకున్నామని బులంద్‌షార్ సీనియర్ పోలీస్ అధికారి అతుల్ కుమార్ మీడియాకు తెలిపారు. అగర్వాల్‌ను కోర్టులో ప్రవేశపెట్టకముందు పోలీసులు అతడిని విచారించారని, అనంతరం కోర్టులో నిందితుడిని ప్రవేశపెట్టగా న్యాయస్థానం అగర్వాల్‌కు 14రోజుల జ్యూడిషియల్ కస్టడీ విధించిందని అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (బులంద్‌షార్ నగరం) అతుల్ కుమార్ శ్రీ వాస్తవ తెలిపారు. కాగా డిసెంబర్ 3, 2018న జరిగిన హింసాత్మక ఘటనల్లో పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుబోధ్ కుమార్ సింగ్ (44), సుమిత్ కుమార్ (20) హత్యకు గురయ్యారు.

అమెరికాలో చదువు.. కెనడాలో కొలువు

(మొదటిపేజీ తరువాయి)

గుర్తింపు, ప్రాధాన్యత ఇచ్చిన ఆ దేశ కంపెనీలు కూడా ఇప్పుడు హెచ్1-బీ వీసాల సమస్యతో కలవరం చెందుతున్నాయి. ప్రపంచ దిగ్గజాలైన 30 ఐటి కంపెనీల ప్రతినిధులు కూడా అధిక వేతనాల చెల్లింపు షరతులు, వీసాల మంజూరుపై అధ్యక్షుడు ట్రంప్‌ను కలిసి తమ అసంతృప్తిని వ్యక్తంచేసిన విషయం తెలిసిందే.

ఇదిలా ఉండగా, ప్రస్తుతం కెనడా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా దేశాల్లో భారతీయ నిపుణులకు మంచి ప్రాధాన్యత ఇస్తున్నందున ఆ దేశాల వైపు పరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా టెక్నాలజీ, పరిశోధనలు, ఫైనాన్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్ ఎనలిస్టు తదితర ఉద్యోగాల్లో ఆ దేశాల్లో మంచి డిమాండ్‌తో పాటు ఆకర్షణీయమైన వేతనాలు కూడా ఇస్తున్నారు. దీంతో భారతీయ నిపుణులు, ఉన్నత విద్యకు కెనడా ఆ దేశాల వైపు పరుగులు తీస్తున్నారు. కెనడా, ఇంగ్లాండ్ దేశాలు ఇమ్మిగ్రేషన్ విధానాల్లో బ్రెగ్జిట్‌ను అనుసరించడంతో అంతర్జాతీయంగా ఉద్యోగాలు చేయాలనుకున్న వారికి ఆ దేశాలు అనువైన కేంద్రాలుగా అవతరిస్తున్నాయి. కెనడా ప్రభుత్వం ఓపెన్ ఇమ్మిగ్రేషన్ పాలసీ అమలు చేయడంతో భారతీయ విద్యార్థులకు ఓ మంచి అవకాశంగా దొరికింది. ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ, గ్లోబల్ స్కిల్స్, వీసా ప్రోగ్రామ్‌ల ద్వారా విదేశీ నిపుణులకు అవకాశం కల్పిస్తోంది. సాంకేతిక నైపుణ్యం, శాస్త్రీయ పరిశోధనలో మేధోసంపత్తి కలిగిన భారతీయులకు కెనడా సంస్థలు ప్రాధాన్యత ఇవ్వడంతో ఆ దేశానికి పెద్దఎత్తున వలసలు ప్రారంభమయ్యాయి. గత రెండేళ్ళలోనే అమెరికా నుంచి కెనడాకు భారీ ఎత్తున వలసలు వెళ్ళారు. ఆగస్టు 2016 నుంచి జులై 2018 వరకు అమెరికాలో ఉద్యోగాలు వెతుక్కునే భారతీయులు 60 నుంచి 50 శాతానికి తగ్గిపోగా, కెనడాలో 6 నుంచి 13 శాతానికి ఉద్యోగాల అన్వేషణ పెరిగిందని ఇండీడ్ సంస్థ తన అధ్యయనంలో పేర్కొంది.

అలాగే ఇంగ్లాండ్‌లో కూడా గ్లోబల్ టెక్, బ్యాంకింగ్ మేనేజ్‌మెంట్‌లో మంచి అవకాశాలు వస్తున్నాయి. 2015 నుంచి భారతీయుల దరఖాస్తులు 8 నుంచి 10 శాతానికి పెరడంతో ఎక్కువ మంది ఇంగ్లాండ్‌లో స్థిర పడుతున్నారు. ఆ తర్వాత ఫ్రాన్స్, పోలాండ్, ఐర్లాండ్ దేశాల్లో కూడా మన టెక్కీలు, నిపుణులు, పరిశోధకులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి. కెనడాలో టెక్నాలజీ రంగం పురోగతి చెందుతుండడంతో టెక్కీలకు డిమాండ్ పెరిగింది. దీనికి తోడు ఇమ్మిగ్రేషన్ పాలసీని సడలించడంతో అమెరికాలో ఉన్నత విద్య పూర్తిచేసి వెళ్ళేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

కెనడాలో బిజినెస్ ఎనలిస్టు, మెకానికల్, సాఫ్ట్‌వేర్, సివిల్ ఇంజనీర్లకు, సాఫ్ట్‌వేర్, వెబ్, జావా డవలపర్స్, ప్రాజెక్టు మేనేజర్, డాటా సైంటిస్ట్, డాటా అనలిస్ట్‌లకు మంచి డిమాండ్ ఉన్నది. అలాగే ఇంగ్లాండ్‌లో శాస్త్ర పరిశోధకులు, సాఫ్ కన్సల్టెంట్, ఐవోఎస్, అండ్రాయిడ్, జావా డవలపర్స్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ అనలిస్టు, రిసెర్చ్ అసోసియేట్, ఫిజీషియన్, అర్కిటెక్ట్స్‌కు మంచి డిమాండ్ ఉందని ఇండీడ్ అధ్యయనం వెల్లడించింది. ఇన్నాళ్ళుగా అమెరికాపైనే ఆధారపడిన భారతీయ నిపుణులు ఆ దేశ ఆంక్షలతో ప్రపంచ మార్కెట్‌పై అన్వేషణ ప్రారంభించి విజయం సాధిస్తున్నారు. గత నాలుగేళ్ళుగా ఆస్ట్రేలియాపై దృష్టి సారించగా, ఇప్పుడు కెనడా, ఇంగ్లాండ్ బాట పట్టారు. ముఖ్యంగా 2017 నుంచి అమెరికా నుంచి కెనడా, ఇంగ్లాండ్‌కు పెద్దఎత్తున తరలిపోవడంతో భారతీయులకు ఆ రెండు దేశాలు ప్రత్యామ్నాయ ఉద్యోగ కేంద్రాలుగా నిలిచాయని ఇండీడ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శశికుమార్ పేర్కొన్నారు.

జైళ్ల సంస్కరణల్లో తెలంగాణ ఆదర్శం

● జైళ్లశాఖ డీజీ వీకే సింగ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : జైళ్లశాఖలో చేపట్టిన సంస్కరణలతో సత్ఫలితాలు సాధించామని, ఈ విషయంలో తెలంగాణ జైళ్లశాఖ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆ శాఖ డీజీ వీకేసింగ్ చెప్పారు. 2020 నాటికి స్వయం సమృద్ధి సాధన దిశగా తెలంగాణ జైళ్ల శాఖ పురోగమిస్తోందని డీజీ వీకే సింగ్ స్పష్టం చేశారు. జైళ్ల శాఖ 2018 వార్షిక నివేదకను గురువారం వెల్లడించారు. తాము అమలు చేసిన సంస్కరణల ఫలితంగా ఖైదీల మరణాలు గణనీయంగా తగ్గాయని, 2014లో ఖైదీల మరణాలు 56 ఉంటే, 2018లో 8కి తగ్గించామన్నారు. జైళ్లశాఖలో అవినీతి నిరూపిస్తే రూ.10వేల నజరానా అని ప్రకటించామని, ఆ క్రమంలో ఒకే ఒక్క ఫిర్యాదు మాత్రమే నిరూపితమవ్వగా, సదరు ఫిర్యాదుదారునికి రూ.10వేల బహుమతి అందించామన్నారు. జైళ్లశాఖ పరిశ్రమ ఉత్పత్తుల ద్వారా 2013లో వార్షిక లాభం పొందగా 2018 సంవత్సరం నాటికి రూ.17 కోట్ల వార్షిక లాభం సాధించ గలిగామన్నారు. ఇది ఇంకా పెరగాల్సి ఉందన్నారు.

పతంజలికి దీటుగా జైళ్లశాఖ ఉత్పత్తులు

పతంజలి ఉత్పత్తుల కంటే జైళ్లశాఖ ఉత్పత్తుల అమ్మకాలను పెంచడమే తమ ధ్యేయమన్నారు. అందుకు సంబంధించి గ్రామాలలో అవుట్‌లెట్లను విస్తరించనున్నా మన్నారు. జైళ్లలో 30 మంది ఉగ్రవాదులు శిక్ష అనుభవిస్తున్నారని, ఉగ్రవాదుల వల్ల సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని, అయినా తాము తీసుకున్న ప్రత్యేక చర్యల కారణంగా 2018లో ఎలాంటి సంఘటన చోటు చేసుకోలేదని వివరించారు. విద్యాదానం ప్రోగ్రాం ద్వారా 2014 నుంచి 2018 వరకూ 1,32,705 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దామన్నారు. జైళ్లశాఖకు సంబంధించి ప్రమోషన్ ఆర్డర్స్ విషయంలో జాప్యం లేకుండా సత్వరమే అందజేస్తున్నామని ఓ ప్రశ్నకు సమాధానంగా డీజీ వీకే సింగ్ తెలిపారు. ఎక్కువగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డ వారు జైళ్లకు వస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 వేలు వచ్చాయన్నారు. అదే విధంగా ప్రిజనర్స్‌కు గత మూడేళ్లలో మొత్తంగా 197 మందికి రూ.50,95,500 రుణాలను మంజూరు చేశామని తెలిపారు. పెట్రోల్ పంప్‌ల ఏర్పాటులో జాప్యం జరుగు తోందని, ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేవని, ప్రైవేటు స్థలాల కోసం అన్వేషణ కొనసాగుతోందన్నారు. ఈ సంవత్సరంలో 100 పెట్రోల్ బంక్‌ల స్థాపనే లక్ష్యమని వివరించారు. ఇక బిచ్చగాళ్ల పునరావాసం విషయంలోనూ డీజీ వీకే సింగ్ స్పందించారు. ఇప్పటి వరకు 7319 మంది పురుష బిచ్చగాళ్ళు, 4475 మంది మహిళా బిచ్చగాళ్లు ఆనందాశ్రమానికి వచ్చారని, వారికి కౌన్సిలింగ్‌ని ఇచ్చి మరల ఆ వృత్తి చేయవద్దని హామీ తీసుకుని పురుష బిచ్చగాళ్లలో 7079 మందిని, మహిళా బిచ్చగాళ్లలో 4440 మందిని పంపివేశామన్నారు. ప్రస్తుతం ఆనందాశ్రమంలో 240 పురుష, 35 మహిళా బిచ్చగాళ్లు ఉన్నారన్నారు. ఇంకా యాచకులు ఉన్నట్లు తెలుస్తోందని, అయితే తమకున్న సిబ్బందితో వారిని తీసుకురావడం కష్టసాధ్యమని, బిచ్చగాళ్లని తీసుకొచ్చే పని పోలీసులు, జీహెచ్ఎంసీ వారు చేసి తమ వద్దకు చేరిస్తే వారికి కౌన్సిలింగ్, ఆశ్రయం కల్పించగలమని వీకే సింగ్ తెలిపారు. జైళ్ల శాఖ పనితీరుపై విడుదలైన ఖైదీల నుంచి ఫీడ్‌బ్యాక్‌ను తీసుకునే విధంగా థర్డ్‌పార్టీ కాల్ సెంటర్ పనిచేస్తోందన్నారు. ఆ ఫీడ్ బ్యాక్లో మొత్తంగా 5623 మంది విడుదలైన ఖైదీలను 2018లో సంప్రదించామన్నారు. వారిలో 5546 మంది ఖైదీలు జైళ్లశాఖ భేష్ అన్న కితాబిచ్చారన్నారు. 77 మంది మాత్రం చిరుపాటి ఫిర్యాదులు చేశారని వెల్లడించారు. అమెరికా, శ్రీలంక ప్రతినిధులు జైళ్లను సందర్శించారని, ఇంకా సందర్శనకు వివిధ దేశాల నుంచి ప్రతి నిధులు వస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడ అమలవుతున్న సంస్కరణలను చూసి కొనియాడుతున్నారన్నారు. ఖైదీల క్షమాభిక్ష అంశంపై అందుకు సంబంధించిన నివేదికను గవర్నర్‌కు పంపామని, అక్కడ్నించీ సమాధానం రాలేదని డీజీ వీకే సింగ్ స్పష్టం చేశారు.

2019 లక్ష్యాలివే...

జైళ్లశాఖ సిబ్బంది, బాగోగులతో పాటు జైళ్లశాఖ ఉత్పత్తుల అమ్మకాల పెంపు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సిబ్బంది బాగుంటే మరింత చురుకుగా పనిచేస్తారని డీజీ వీకే సింగ్ తెలిపారు. బంగారు తెలంగాణ లక్ష్యసాధన దిశగా జైళ్లశాఖ ముందం జలో ఉందన్నారు. తెలంగాణ జైళ్లు బంగారు జైళ్లుగా గుర్తింపుని సంతరిం చుకున్నా యన్నారు. జైళ్లశాఖలో అమలవుతున్న సంస్కరణల పట్ల దేశ, విదేశాలకు చెందిన ప్రతినిధులు సంతృప్తిని వ్యక్తపరుస్తున్న తీరే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

సరిహద్దుల్లో ఆర్మీ పనితీరు భేష్



న్యూఢిల్లీ: చైనా, పాకిస్తాన్ సరి హద్దుల్లోని పరిస్థితు లను భారత ఆర్మీ సమర్థవంతంగా నిర్వహించ గలిగిం దని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ గురువారం వెల్లడిం చారు. వార్షిక మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ఉత్తర, పశ్చిమ సరిహద్దుల వెంబడి పరిస్థితుల ను ఆర్మీ సమర్థవం తంగా నిర్వహించ గలిం దని, ఆందో ళన చెందాల్సిన అవసరం లేదని రావత్ భరోసా ఇచ్చారు. భారత్ మాత్రమే జమ్మూ-కశ్మీర్‌లో శాంతిని స్థాపించగ లుగుతుందని, అక్కడి పరిస్థితులు మెరుగవ్వాల్సి ఉందన్నారు. చర్చలు, ఉగ్రవాదం కలిసి ప్రయాణించడం కుదరదని, జమ్మూ-కశ్మీర్ విషయంలో ఈ పరిస్థితి వర్తిస్తుందని, చర్చలు జరగాల్సి ఉందని ఆయన వెల్లడించారు.

స్వలింగ సంపర్కాలను అనుమతించం

గే సెక్స్, అనైతిక వ్యవహారాలను ఆర్మీలో అనుమతించబోమని జనరల్ రావత్ అన్నారు. గే సెక్స్ చట్టబద్ధమంటూ గతేడాది సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆర్మీలో అమలు కాకపోవచ్చునని అభిప్రాయ పడ్డారు. కుటుంబ సంప్రదా యాలను పాటించే ఆర్మీ లో ఇలాంటి చర్యలకు తావులేదన్నారు. చట్టానికి ఆర్మీ అతీతం కాదని, అయితే ఇలాంటి చర్యలు ఆర్మీలో నిషేధమని, గేసెక్స్‌ను ఆర్మీలో సమర్థించబోమన్నారు. ఓ విలేఖరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా రావత్ ఈ విధంగా స్పందించారు.

అగ్రవర్ణ పేదలకు ఎంతో మేలు

●10 శాతం రిజర్వేషన్లపై ఇంద్రసేనారెడ్డి




హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈబీసీలకు రిజర్వేషన్‌లు తీసుకొచ్చేందుకు కృషి చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి అభినందనలు తెలిపారు. విద్యా, ఉద్యోగాల్లో పోటీ పడలేని అగ్రవర్ణ పేద కుటుంబాలు అంధకారంలో మగ్గిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లోని సోన్ అనేగ్రామంలో బ్రాహ్మణులు పెట్టిన పిండాలను సైతం ఆహారంగా తీసుకుని బతికిన జీవితాలను నా స్టడీలో చూశానని చెప్పారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధికార ప్రతినిధి రాకేష్‌రెడ్డితో కలిసి ఇంద్రసేనారెడ్డి మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం సమభావం, సమానత్వం నరేంద్ర మోడీ పాలనలో నిజమవుతోందని ఆనందం వ్యక్తం చేసారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అనే నినాదం రుజువు చేసి చూపించారని కొనియాడారు. మోడీ పాలనలో ఎస్సీ రిజర్వేషన్ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు, బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా, ఇప్పుడు ఈబీసీ రిజర్వేషన్ ఇలా అన్ని వర్గాల కోసం పని చేస్తున్నారన్నారు. కులం, మతం అనే తేడా లేకుండా పేదలందరికీ న్యాయం చేయాలని డిమాం డ్‌ను మోడీ నెరవేర్చారన్నారు. ఇది పేదలను అదుకునే ప్రభుత్వమని, దేశంలోని ప్రతి పేద వ్యక్తి విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించే అంశాన్ని రాజ్యాంగ సవరణ ద్వారా హక్కులను ప్రసాదించారన్నారు. సంపన్న వర్గాలలోని పేద విద్యార్థులు పోటీ పడలేకపోతున్నారని, పేద విద్యార్థులకు న్యాయం చేయాలనే ఆలోచనతోనే సహజ న్యాయాన్ని మోడీ ప్రభుత్వం కల్పించిం దన్నారు. సమభావన, మానవత్వం, సామాజిక దృష్టి అనేవి రాజ్యాంగ స్ఫూర్తితో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

ఇంగితంలేని రాహుల్

రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యల పట్ల ఇంద్రసేనారెడ్డి మండిపడ్డారు. ఆయన మాట్లాడిన విధానం బాగాలేదన్నారు. మనిషి పెరిగినా విచక్షణ జ్ఞానం పెరగక పోవడం బాధాకరమన్నారు. ఏం మాట్లాడాలి, ఏం మాట్లాడరాదన్న విషయాన్ని రాహుల్ తెలుసుకోకపోవడం బాధాకరమన్నారు. జాతీయ పార్టీకి రాహుల్ అధ్యక్షుడిగా ఉండటం కాంగ్రెస్ పార్టీ దురదృష్టమన్నారు.

పుదుచ్చేరి మంత్రులు సోషల్ వెల్ఫేర్ స్కూల్ సందర్శన



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో అమలు జరుగుతున్న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విధానాన్ని పరిశీలించడం కోసం పాండిచ్చేరి మంత్రుల బృందం రాష్ట్రంలో పర్యటించింది. పాండిచ్చేరి విద్యా శాఖ మంత్రి కమలకన్నన్ వెల్ఫేర్ శాఖ మంత్రి కందస్వామి గురువారం గౌలీదొడ్డిలోని సోషల్ వెల్ఫేర్ రెసిడె న్షియల్ స్కూల్‌ను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెసిడెన్షియల్ విధానాన్ని పాండిచ్చేరి మంత్రులు మెచ్చుకున్నారు. తమ రాష్ట్రంలో ఇటువంటి మోడల్ విధానాన్ని అమలు చేయడం కోసం తాము తెలంగాణ రాష్ట్రంలో పర్యటించినట్టు మంత్రులు తెలిపారు.

పౌరసత్వబిల్లుపై అసోంలో నిరసనలు

గువహటి: పౌరసత్వం బిల్లుకు వ్యతిరేకంగా అసోంలో నిరసనలు కొనసాగుతున్నాయి. డిసెంబర్ 31, 2014కు ముందు పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్‌కు చెందిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కలిపించేందుకు ఉద్దేశించిన పౌరసత్వ సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించటంపై అసోంలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం న్యాయవాదులు, వైద్యులు, విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా తమ నిరసన మరింత ఉద్ధృతం చేశారు. ఈ బిల్లును ఉపసంహరించుకునేంతవరకు ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులను అసోంలో అడుగుపెట్టనివ్వమని క్రిషక్ ముక్తి సంగ్రామ్ సమితి (కేఎంఎస్ఎస్) అధిపతి అఖిల్ గొగొయ్ హెచ్చరించారు. రాష్ట్రంలోనూ సీఎం, బీజేపీ ఎమ్మెల్యేలు సమావేశాలు నిర్వహించకుండా అడ్డుకుంటా మన్నారు. గామోసాస్ (అస్సామీస్ గౌరవ స్కార్ఫ్)ను చేతిలో పెట్టుకుని కేఎంఎస్ఎస్ నేతలతోపాటు ఆందోళనలో పాల్గొంటున్న 70 భాగస్వామ్య సంస్థల నేతులు అసోం సెక్రిటేరియట్ ఎదురుగా సంకల్పదివాస్ పాటించారు. అసోం ప్రజల మనుగడకు ఈ బిల్లు విఘాతం కలిగిస్తోందన్నారు. గువహటి మెడికల్ కాలేజ్, ఆసుపత్రిలో సిబ్బంది, జూనియర్ డాక్టర్లు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. అదేవిధంగా అసోం కాంగ్రెస్ కమిటీ లీగల్ డిపార్ట్‌మెంట్ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. జోయి ఐ అసోం (అసోం ది గ్రేట్) అంటూ నినాదాలు చేస్తూ గామోసాస్‌లను చేతపట్టి అసోం ప్రజల ప్రయోజనాలను కాపాడాతామని ప్రమాణం చేశారు. అసోం వ్యాప్తంగా విద్యార్థులు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు.

'ఫసల్ బీమాలో భారీ కుంభకోణం'



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ' ఫసల్ భీమా యోజన ' పథకం లో భారీ కుంభ కోణం దాగుందని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైతులు సమస్యలు, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానా లపై చర్చించారు. అంతకు ముందు కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడి గా నియమితులైన అన్వేష్‌రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ రాఫెల్ కుంభకోణం కంటే పంట భీమా పథకంలో భారీగా నిధులు గోల్‌మాల్ అయినా యన్నారు. రైతుల నుంచి డబ్బులు వసూలు చేసుకున్న కంపెనీలు.. పంట నష్టానికి డబ్బులు చెల్లించడం లేదని ఆయన విమర్శించారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరను కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనాయని ఆయన ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు మేలు జరిగే విధంగా నిర్ణయాలు ఉంటాయని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రాష్ట్రాల్లో రైతు రుణమాఫీని అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ చేయనుందన్నారు.

130 ఏళ్ల మొసలికి అంత్యక్రియలు

● స్మారకచిహ్నానికి ఏర్పాట్లు



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని ఓ గ్రామంలో మొసలి మృతదేహానికి గ్రామస్థులు అంత్యక్రియలు నిర్వహించారు. మొసలిని తమ రక్షకునిగా ఆరాధించేవారమని బెమితారా జిల్లాలోని మోహ తారా గ్రామస్థులు తెలిపారు. చనిపోయిన మొసలికి సుమారు 130 సంవత్సరాలు వయసు ఉంటుందని దానిని తాము ప్రేమగా గంగారామ్ అని పిలుచుకునే వారమని స్థానికులు తెలిపారు. గ్రామంలోని చెరువులో మొసలి చనిపోయిన తరువాత శోకసంద్రంలో మునిగిపోయామని గ్రామస్థులు ఎవరూ మంగళవారం భోజనం కూడా చేయలేదని తెలిపారు. చెరువు ఒడ్డున మొసలికి అంత్యక్రియలు నిర్వహించిన ప్రాంతంలో స్మారక చిహ్నం నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గ్రామ సర్పంచ్ మోహన్ సాహు విలేఖరులకు తెలిపారు. మొసలికి దేవాలయం కూడా నిర్మించాలనే ఆలోచన కూడా ఉందన్నారు. 3.4 మీటర్ల పొడవున్న మొసలి మృతదేహాన్ని గ్రామంలోని చెరువులో మంగళవారం కనుగొన్నామన్నారు. అటవీశాఖకు తెలిపి మొసలి మృతదేహాన్ని బయటకు తీసి అంత్యక్రియలు నిర్వహించామన్నారు. సుమారు 500మంది గ్రామస్థులు అంత్యక్రియల్లో పాల్గొన్నారని సర్పంచ్ సాహు తెలిపారు.



రైతు నేస్తం ఫౌండేషన్‌ను సందర్శించిన తానా బృందం

బై..బై..



- నా డిమాండ్‌ను అంగీకరించకుంటే చర్చలు ముందుకు సాగవ్
- డెమొక్రాట్లకు తేల్చిచెప్పిన ట్రంప్

వాషింగ్టన్: అమెరికా పాలన ప్రతిష్ఠంభన పరిష్కార చర్చలు మరోదఫా విఫలమయ్యాయి. బుధవారం కాంగ్రెస్ ప్రతినిధులతో ట్రంప్ సంప్రదింపులు కొలిక్కిరాలేదు. దాంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. 19 రోజుల ప్రభుత్వ షట్‌డౌన్ మరికొంత కాలం కొనసాగే పరిస్థితులు ఏర్పడ్డాయి. చర్చలకు బై బై చెప్పాను అంటూ సమావేశం అనంతరం ట్రంప్ ట్వీట్‌చేశారు. డెమోక్రాట్లు ట్రంప్‌తో సంప్రదింపుల కోసం శ్వేతసౌధానికి వెళ్లారు. ప్రభుత్వాన్ని తిరిగి ప్రారంభించాలని విజ్ఞప్తిచేశారు. ట్రంప్ తన డిమాండ్‌ను మళ్లీ వినిపించారు. యూఎస్- మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు కేటాయించాల్సిందేనని పట్టుబట్టారు. చర్చల్లో డెమోక్రాట్లకు, రిపబ్లికన్లకు మధ్య సయోధ్య కుదరలేదు. దీంతో పాక్షిక షట్‌డౌన్ ముగింపు ఆశలు కల్లలయ్యాయి. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులకు శుక్రవారం వేతనాలు లభించడం మృగ్యం అయింది. మొత్తం ఉద్యోగుల్లో సగం మంది వేతన రహిత సేవలు అందిస్తున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్షన్స్ వంటి కీలక సేవలు నిలిపివేయబడ్డాయి. ప్రభుత్వాన్ని తిరిగి ప్రారంభిస్తే, సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు ఇస్తారా? అంటూ స్పీకర్ నాన్సీ పెలోసీని ట్రంప్ సూటిగా ప్రశ్నించారు.., ఇందుకు ఆమె నిస్సంకోచంగా నో అని బదులిచ్చారు. ఆగ్రహించిన ట్రంప్ బల్లపై గట్టిగా చరిచి.. ఇక మనమధ్య చర్చలు అవసరం లేదు.. వెళ్లొస్తా.. బై బై అంటూ సమావేశ మందిరం నుంచి బిరాబిరా వెళ్లిపోయారని సెనెట్ డెమొక్రటిక్ సభ్యుడు చుక్ స్కుమర్ వివరించారు. సరిహద్దులో గోడ లేదా ఉక్కు కంచె ఏర్పాటుపై వెనక్కి తగ్గేదిలేదన్నారని ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ మీడియా ముందు చెప్పాడు.

9 నిముషాలు..4 కోట్ల మంది వీక్షకులు

కాంగ్రెస్ ప్రతినిధులతో చర్చల నుంచి బయటకొచ్చిన ట్రంప్, తన అధికారిక ఓవల్ కార్యాలయం నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 9 నిముషాల నిడివి కలిగిన ఈ లైవ్ వీడియో సందేశంలో సరిహద్దు భద్రత, పాలన ప్రతిష్టంభన గురించి మాట్లాడారు. టెలివిజన్‌లో ప్రసారమైన ఈ ప్రసంగాన్ని 40 మిలియన్ల మంది అమెరికన్లు వీక్షించారు. ఫాక్స్‌న్యూస్, సీఎన్ఎన్, ఎంఎస్ఎన్‌బీసీ నెట్‌వర్క్‌ల ద్వారా మొత్తంగా 16 మిలియన్ల మంది వీక్షించినట్లు లెక్కతేలింది. మిగతా 24 మిలియన్ల మంది ప్రధాన మాధ్యమాల్లోని ప్రత్యేక బులిటెన్ల ద్వారా ట్రంప్ ప్రసంగాన్ని తిలకించారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రసంగమే రికార్డుగా ఉంది. 2011లో ఒసామా బిన్ లాడెన్ మరణవార్తను అధికారికంగా వెల్లడిస్తూ, ఒబామా చేసిన ప్రసంగాన్ని 56.5 మిలియన్ల అమెరికన్లు వీక్షించార. ఇప్పటికిదే జాతీయ రికార్డుగా ఉంది.

సినీ పాలిటిక్స్


ప్రధాని మోడీతో బాలీవుడ్ నటులు భేటీ

సార్వత్రిక సంగ్రామంలోకి బయోపిక్ అస్త్రాలు

- నేడు తెరపైకి యూరి.. ద సర్జికల్ స్ట్రయిక్స్
- టాక్ ఆఫ్ ద పాలిటిక్స్‌గా.. ద యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్, ద తాష్కెంట్ ఫైల్స్, థాక్రే చిత్రాలు
- ఉత్కంఠ రేపుతున్న నరేంద్ర మోడీ చిత్రం

న్యూఢిల్లీ: రాజకీయ ప్రచార హోరు.. సినీస్టార్ల సందడితో ఎన్నికల సంవత్సరం మరింత ఉత్సాహంగా ప్రారంభం కాబోతున్నది. రాజకీయ నేపథ్యంతో కూడిన నాలుగు సినిమాలు సార్వత్రిక సంగ్రామానికి ఊపుతేనున్నాయి. వీటితోపాటు మరో రెండు సినిమాలు కూడా బరిలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. యూరి.. ద సర్జికల్ స్ట్రయిక్స్, ద యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్, ద తాష్కెంట్ ఫైల్స్, బాల్‌థాక్రే అతి త్వరలో ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కించబోతున్నాయి. ప్రధాన పార్టీల మధ్య జరిగే ఉత్కంఠ పోరులో, ఈ సినిమాలు సరికొత్త ప్రచారసాధనాలుగా రంగంలో నిలవనున్నాయి. పై నాలుగు చిత్రాలకు తోడు మరో రెండు బయోపిక్‌ల విడుదలకు ఆయా నిర్మాణ సంస్థలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీవిత కథ ఆధారంగా తీసినది. ఇందులో బీజేపీ ఎంపీ పరేశ్‌రావల్, వివేక్ ఒబెరాయ్‌లు నటిస్తున్నారు. ఈ ఆరు సినిమాలు కూడా అగ్ర కథానాయకులు నటించి భారీ బడ్జెట్ చిత్రాలు కావడం, ఇతివృత్తాలు, నేపథ్యం జాతీయస్థాయికి సంబంధించిన కావడంతో సహజంగానే దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

ఏప్రిల్ చివర్లో లేదా మే నెలలో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున సమాజాంలోని అన్ని వర్గాలను ఇవి ఏమేరకు ప్రభావితం చేస్తాయన్నది ఆసక్తిగా మారింది. సంపన్న, మధ్యతరగతి, విద్యావంతులు, మేధావు లు వీటిని ఏవిధంగా చూస్తారు? ఎన్నికల్లో ఏ పార్టీకి లాభం? ఎవరికి నష్టం? అనే అంచనాలపై రాజకీయ వర్గాలు విశ్లేషించుకుంటున్నాయి. సృజనాత్మక ఆలోచనలు, సైద్ధాంతిక విధానాలు ఆధారంగా ప్రముఖ స్టార్లతో సంచనాలు సృష్టించేందుకు వస్తున్న చిత్రాలుగా సినీరంగం పేర్కొంటున్నది.

యూరి



రోన్నీ స్క్రూవాలా నిర్మిం చిన ఈ చిత్రం ఈ శుక్రవారం థియే టర్లకు చేరనుంది. విక్కీ కౌశల్ హీరోగా నటించారు. 2016 సెప్టెంబర్‌లో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా భారత బలగాలు జరిగిన సాహసోపేత మెరుపు దాడులు ఇతివృత్తమే యూరి. నాటి దాడుల్లో మన సైనికులు పాక్ భూభాగంలోని నాలుగు ఆర్మీ లాంచ్‌ప్యాడ్లను ధ్వంసం చేశారు.


ద యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్

ఈ చిత్రం.. మాజీ ప్రధాని మన్మోహన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కించారు. మన్మోహన్‌కు మీడియా సలహాదారుగా పనిచేసిన సంజయ్ బారు రచించిన పుస్తకం ఆధారంగా ఈ సినిమా నిర్మించబడింది. గాంధీ కుంటుబం నీడలో మన్మోహన్‌కు ఎదురైన అనుభవాలను ఇందులో ప్రధానంగా చూపించబోతున్నట్లు సమాచారం. దీనిపై బీజేపీ విమర్శలు ఎక్కుబెట్టింది. ఇదంతా ప్రేరేపిత కట్టుకథగా పేర్కొంది. 2019 ఎన్నికల సందర్భంలో తమకు వ్యతిరేకంగా దుష్ప్రచారం కోసమే ఈ సినిమా విడుదల చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.



థాక్రే


శివసేన పార్టీ వ్యవస్థాపకుడు బాల్ థాక్రే జీవితకథ ఇది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు సంజయ్‌రౌత్ ఈ చిత్రానికి రచయిత, నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మరాఠా పులి థాక్రే పాత్రను ప్రముఖ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ పోషించాడు. ఈనెల 25న థాక్రే జయంతి రోజున విడుదల కాబోతున్నది.



> "ఈ చిత్రాలను విడుదలను కొందరు ఆక్షేపిస్తున్నారు.. వివాదాస్పదమైన, రాజకీయాలతో ముడిపడివున్న చిత్రాలను కేంద్ర సెన్సార్ బోర్డు నిలిపివేయాలని కోర్టులకెక్కుతున్నారు. పరోక్షంగా ఎన్నికలను ప్రభావితం చేసే చర్యలను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మరొకవర్గం మాత్రం వీళ్ల అభ్యంతరాలను కొట్టిపారేస్తున్నాయి. సినిమాను సినిమాగానే చూడాలని సూక్తులు వల్లెవేస్తున్నాయి."

ద తాష్కెంట్ ఫైల్స్






రాజకీయ చదరంగంలో సత్తా చాటేందుకు సిద్ధమైన మరో సంచలన వివాదాస్పద చిత్రం ద తాష్కెంట్ ఫైల్స్. దేశ రెండవ ప్రధాని లాల్‌బహ దూర్ శాస్త్రి మరణంపై నెలకొన్న సందేహాలు, దానిచుట్టూ అల్లుకున్న ఆనాటి పరిస్థితుల ఆధారంగా ఈ సినిమా రూపొందించారు. బీజేపీ మద్దతుదారు వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వం వహించిన తాష్కెంట్ ఫైల్స్ ఇంకా నిర్మాణదశలోనే ఉంది. ఫిబ్రవరి ఆఖరివారం లేదా మార్చి మొదటి వారంలో వెండితెరపైకి రానుంది.

సాధారణంగా స్వతంత్ర దినోత్సవానికి, గణతంత్ర దినోత్సవానికి దేశభక్తి సినిమాలు విడుదల చేయడం, వాటిని ప్రజలు ఆదరించడం ఇప్పటి వరకు భారతీయ సినీచరిత్ర సంప్రదాయంగా ఉన్నది. ఇప్పుడు అది దిశను మార్చుకుంది. ఎన్నికలకు ముందు వివాదాస్పద రాజకీయ చిత్రాలతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నది. ఇలాంటి ప్రయత్నాలు దర్శక, నిర్మాతలతోపాటు రాజకీయ పార్టీలకూ లాభనష్టాలను పంచిపెట్టబోతున్నాయి.

> "థాక్రే సినిమాలో వివాద అంశాలు.. కొత్త అంశాలు లేవు. బాలాసాహెబ్ జీవితం తెరిచిన పుస్తకం. దీనిపై ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తంచేస్తే అంతకన్నా మూర్ఖత్వం మరొకటి వుండదు. సెన్సార్ బోర్డు వాస్తవిక పరిస్థితిని అర్థంచేసుకోవాలి. కొన్ని అంశాలు అర్థం కావడానికి కొంత సమయం పడుతుంది. థాక్రే సినిమాను నిషేధించడం అన్న ప్రశ్నే లేదు. ఈ సాహసానికి ఎవరూ ఒడిగట్టలేరు - సంజయ్‌రౌత్"

హైకమాండ్‌తో భట్టి భేటీ


సీఎల్పీ పదవిపై చర్చ!



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క బుధవారం ఢిల్లీకి వెళ్లి గురువారం హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. మరో నాలుగైదు రోజుల్లో కాంగ్రెస్ శాసన సభాపక్ష నేత ఎన్నిక నేపథ్యంలో ఢిల్లీ పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకున్నది. అధిష్టానం ఆహ్వానం మేరకే భట్టి ఢిల్లీకి వెళ్లారని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. దీంతో భట్టి ఎన్నిక ఇక లాంఛనమే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కాగా సీఎల్పీ పదవి కోసం కాంగ్రెస్‌లోని పలువురు సీనియర్ నేతలు పోటి పడుతున్న విషయం తెలిసిందే. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, సబితా ఇంద్రారెడ్డి, శ్రీధర్‌బాబుతో పాటు సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కూడా సీఎల్పీ పదవి కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. టీ పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఉండటంతో ఆయనకు సీఎల్పీ పదవి వచ్చే అవకాశం లేదని, మరో వైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటమిపై అధిష్టానం గుర్రుగా ఉన్నట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇకపోతే భట్టి విక్రమార్కకు ఏఐసీసీలోని ఒక కీలకనేతతో రాష్ట్రంలోని పలువురు సీనియర్లు కూడా మద్దతిస్తున్నట్లుగా సమాచారం. డిప్యూటీ స్పీకర్‌గా ప్రభుత్వ చీఫ్‌గా పని చేసిన అనుభం తో పాటు దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా భట్టికి కలిసి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇక పోతే మాజీ మంత్రి శ్రీధర్‌బాబు కూడా శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేసిన అనుభం ఉందన్న విషయాన్ని పలువురు నాయకులు గుర్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే సీఎల్పీ నేత ఎన్నిక బాధ్యతను కర్ణాటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్‌కు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అప్పగించారు. పార్టీ ఎమ్మెల్యేలను సమన్వయం చేసి పార్టీ పక్ష నేత ఎన్నిక సజావుగా సాగేలా చూడాలని రాహుల్ సూచించారు. దీంతో కేసీ వేణుగోపాల్ ఇప్పటికే రాష్ట్రానికి వచ్చి సీనియర్ నేతలతో పాటు ఎమ్మెల్యేల నుంచి కూడా సమాచారణ సేకరణ చేసినట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 17 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండటంతో ఆలోపే సీఎల్పీ నేతను ఎన్నుకోవాల్సి ఉంటుంది. సమావేశాలకు ఒకటి, రెండు రోజుల ముందే కేసీ వేణుగోపాల్ మరోసారి రాష్ట్రానికి వచ్చి అందరి అభిప్రాయాలను సేకరించనున్నారు. కాగా సీఎల్పీ నేత విషయంలో కాంగ్రెస్ అధిష్టానం మాత్రం ఇప్పటికే ఒకనిర్ణయానికి వచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. అందుకనే సీనియర్ నేత భట్టి విక్రమార్కను ఢిల్లీకి పిలిచారనే వార్తలు వినిపిస్తున్నాయి.

లోక్‌సభ ఎన్నికలకు
కమలదళం

- నేటి నుంచి రెండురోజుల పాటు బీజేపీ జాతీయ మండలి సమావేశాలు
- రాంలీలా మైదానంలో తాత్కాలిక పీఎంవో



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : లోక్‌సభ ఎన్నికలకు ముందుకు బీజేపీ జాతీయ మండలి సమావేశాలు నేటి నుంచి ప్రారంభమవుతున్నాయి. శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు రాంలీలా మైదానంలో ఈ సమావేశాలు జరగనున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకులు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఈ సమావేశాల్లో 12వేల మంది బీజేపీ నాయకులు పాల్గొంటున్నారు. రెండు రోజుల పాటు ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమావేశాల్లో పాల్గొంటుండడంతో తాత్కాలికంగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని రాంలీలా మైదానంలో ఏర్పాటు చేస్తున్నారు. పీఎంవోలో ఉండే అన్ని రకాల వసతులను ఇక్కడ సిద్ధం చేస్తున్నట్లు పార్టీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. అలాగే అమిత్‌షా కోసం, సీఎంల కోసం కూడా ప్రత్యేక తాత్కాలిక కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ మండలి సమావేశాలను పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ప్రారంభించనున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ముగింపు ప్రసంగం చేయనున్నారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా వచ్చే లోక్‌సభ ఎన్నికల సన్నాహాలపైనే ప్రధానంగా చర్చించనున్నారు. మోడీ ప్రభుత్వ పాలనలో సాధించిన విజయాలను పల్లె పల్లెలో ప్రచారం చేయడం, లబ్దిదారులను నేరుగా కలుసుకుని వారి మద్దతు కోరేందుకు ప్రచార వ్యూహాలను ఖరారు చేయనున్నారు. అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్ల బిల్లు, ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పరిరక్షణ, జీఎస్టీ పన్నుల తగ్గింపు తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లా ప్రచారం చేయనున్నారు. దేశ భద్రతకు, ఆర్థిక వ్యవస్థ భద్రతకు విఘాతం కలగకుండా ఉండాలంటే మళ్లీ బీజేపీ అధికారంలోకి రావాలన్నదే నినాదంతో ముందుకు వెళ్లేలా జాతీయ మండలి తీర్మానించనుంది. వీటితో పాటు ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో బీజేపీ వచ్చే లోక్‌సభ ఎన్నికలో పోరాటం చేయాలని బీజేపీ జాతీయ మండలి నిర్ణయం తీసుకోనుంది. ఎన్నికల కోసం పార్టీ అనుబంధ విభాగాలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించనున్నారు. ఇప్పటికే యువమోర్చా, కిసాన్‌మోర్చా, మైనార్టీ మోర్చా, మహిళా మోర్చా, గిరిజన మోర్చా తదితర విభాగాలు భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. మోర్చాలు నిర్వహించే బహిరంగసభలలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ హాజరుకానున్నారు. కీలకమైన ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు ఏపీ, తెలంగాణ బీజేపీ నేతలు దత్తాత్రేయ, లక్ష్మణ్, కిషన్‌రెడ్డి పలువురు నేతలు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయినా, లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన మంత్రి ఎవరన్నదే అంశంపైనే ఎన్నికలు జరగనుండడం తమకు కలిసివస్తుందని తెలంగాణ బీజేపీ నేతలు అంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీపై ప్రజలలో ఉన్న విశ్వాసంత తమను తప్పక గెలిపిస్తుందని చెపుతున్నారు.

10% ఎవరు అర్హులు?

- ఎంతమందికి వార్షికాదాయం రూ.8 లక్షలు?
- వెయ్యి గజాల స్థలం ఉన్న ధనికులెంతమంది?
- పలు రాష్ట్రాల్లో రిజర్వేషన్ల కోసం అగ్రవర్ణాల ఆందోళనలు
- గతంలో మరాఠాలకు 16 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన మహారాష్ట్ర



న్యూఢిల్లీ: అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించడానికి వీలు కల్పిస్తూ ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకి అటు లోక్‌సభలో, ఇటు రాజ్యసభలో ఆమోదముద్ర పడింది. ఇక రాష్ట్రపతి సంతకమే తరువాయిగా ఉన్న నేపథ్యంలో ఈ రిజర్వేషన్లకు ఎవరు అర్హులు అవుతారు? ఎవరు కారు అనే వివరాలు ఆసక్తికరంగా మారాయి. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలకు ఇప్పటికే ఉన్న యాభైశాతం రిజర్వేషన్లకు అదనంగా ఈ అగ్ర వర్ణ పేదలకు కేటాయించిన పది శాతంతో మొత్తం రిజర్వేషన్ల శాతం అరవై శాతానికి చేరుకుంది.

ఈ పదిశాతం రిజర్వేషన్లతో హిందువులు, ఇతర మతాల్లోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు లబ్ధిపొందుతాయి. హిందువుల్లో బ్రాహ్మణులు, రాజపుత్రులు, జాట్లు, మరాఠాలు, భూమిహార్లు, వైశ్యులు, పటేళ్లు, గుజ్జర్లు, కాపులు, కమ్మలు, రెడ్డి తదితర సామాజిక వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ పదిశాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి.

కోటాకి ప్రామాణికం ఏదీ?

కుటుంబ ఆదాయం, భూమినే కొలమానంగా ఆర్థిక వెనుకబాటుతనాన్ని గుర్తించి ఈ పది శాతం రిజర్వేషన్లను వర్తింప చేయనున్నారు. వార్షిక ఆదాయం రూ.8 లక్షల కన్నా తక్కువ ఉన్నవారు, వ్యవసాయ భూమి అయిదు ఎకరాలు మించని వారు ఈ రిజర్వేషన్లకు అర్హులవుతారు.

వార్షిక ఆదాయం రూ.8 లక్షలు అంటే నెలకు రూ.66,666 ఆదాయం ఉన్నవారు ఈ రిజర్వేషన్ల పరిధిలోకి వస్తారు. 2011-12 నాటి కుటుంబ వినియోగ వ్యయం సూచీకల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో తలసరి ఆదాయం రూ.4,481, పట్టణ ప్రాంతాల్లో రూ.10,280గా ఉంది. దీని ప్రకారం ఇంట్లో అయిదుగురు ఉండి వారంతా సంపాదిస్తున్నప్పటికీ వార్షిక ఆదాయం రూ.51,405 మించదు. ఇలా అయినప్పటికీ తాజా రిజర్వేషన్లకు ఆదాయ పరిమితి కన్నా ఇంకా తక్కువగానే ఉంటుంది. పైగా 2011 నాటి సాంఘిక, ఆర్థిక, సామాజిక జనాభా గణనలో కూడా గ్రామీణ కుటుంబాల్లో కేవలం 8.25 శాతం మాత్రమే నెలకు రూ.10 వేల ఆదాయం దాటుతోంది. అదే విధంగా 2015-16 వ్యవసాయ గణనలో కూడా దేశంలో అయిదు ఎకరాల కన్నా తక్కువ భూమి ఉన్న రైతులు 86 శాతం మంది ఉన్నారు. వీరంతా ఈ పది శాతం రిజర్వేషన్లకు అర్హులవుతారు.

- అయితే తాజా బిల్లు ప్రకారం వెయ్యి చదరపు అడుగుల కన్నా ఎక్కువ ఇంటి స్థలం ఉన్నవారికి ఈ రిజర్వేషన్లు వర్తించవు. ఇలాంటి వారు దేశ జనాభాలో 20 శాతం కూడా ఉండకపోవచ్చని తెలుస్తోంది.
- దేశంలో ఇరవై శాతం సంపన్నుల ఇంటి స్థలం 500 చదరపు అడుగులు మించదని నేషనల్ శాంపిల్ సర్వే నివేదిక వెల్లడిస్తోంది.
- ఇదే కాకుండా నోటిఫై చేసిన మున్సిపాలిటీల్లో 100 గజాల కన్నా ఎక్కువ ఇంటి స్థలం ఉన్నవారు, నోటిఫై చేయని మున్సిపాలిటీల్లో 200 గజాలకన్నా ఎక్కువ ఇంటి స్థలం ఉన్న వారు ఈ రిజర్వేషన్లకు అర్హులు కారు.
- ఇక ఇప్పటికే సామాజిక వెనుకబాటు ఆధారంగా విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల లబ్ధి పొందుతున్నవారు కూడా తాజా 10 శాతం రిజర్వేషన్లకు అర్హులు కారు.

ఇక్కడే మరో ఆసక్తికర అంశం వెలుగులోకి వస్తోంది. ఇప్పటికే ఉన్న రిజర్వేషన్ల కారణంగా జనాభాలో అత్యధికులు లబ్ధి పొందుతున్నారు. ఓబీసీల జనాభా 45 శాతం ఉండగా, ఎస్సీ, ఎస్టీల జనాభా 23 శాతం ఉంది. దీని ప్రకారం పది శాతం రిజర్వేషన్లు కేవలం 27 నుంచి 27 శాతం ప్రజలకు మాత్రమే అందుబాటులోకి వస్తాయి.

దేశంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు ఉన్నత విద్యకు, ప్రభుత్వ ఉద్యోగాలకు దూరంగా ఉంటున్నారని బిల్లులో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 124వ అధికరణకు చేసిన సవరణల ప్రకారం రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాలకు ఈ వర్గాలు దూరంగా ఉన్నాయని పేర్కొన్నారు. అందుకనే పేదలు కూడా జీవితంలో మంచి అవకాశాలు పొందాలనే రాజ్యాంగ సవరణ చేస్తున్నట్లు ఆ బిల్లులో పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మరాఠాలు, జాట్లు, రాజపుత్రులు వంటి పలుకుబడి ఉన్న సామాజిక వర్గాలు రిజర్వేషన్ల కోసం వీధుల్లోకి వచ్చి ఆందోళనలు నిర్వహించాయి. రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడం కోసం హింసాత్మక ఘటనలకు కారణమయ్యారు. వీరి డిమాండ్లు నెరవేర్చడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాయి. అయితే రాష్ట్ర అసంబ్లె తీర్మానాలు కోర్టుల్లో వీగిపోతూ వచ్చాయి. గతంలో ఇంద్ర శైని కేసులో రిజర్వేషన్లు యాభై శాతం మించరాదని సుప్రీంకోర్టు విస్పష్టమైన తీర్పు అగ్ర వర్ణాల్లో పేదల ఆకాంక్షలకు అడ్డుగా నిలిచింది. గత ఏడాది నవంబర్‌లో మహారాష్ట్ర ప్రభుత్వం మాత్రం మరాఠాలను సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారిగా గుర్తించి 16 శాతం రిజర్వేషన్లను ప్రకటించింది.

బిల్లు ఏం చెబుతోంది?

సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధం

- షెడ్యూల్ వెలువడేలోగా పొత్తులపై నిర్ణయం
- ఓటమితో కుంగిపోం - లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతాం
- కాంగ్రెస్ వార్ రూమ్ మీటింగ్‌లో ఏపీ, తెలంగాణా నేతలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధం కావాలని అధిష్టానం సూచించిందని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తెలిపారు. ఢిల్లీలో కాంగ్రెస్ వార్ రూమ్‌లో జరిగిన సమావేశంలో ఆయనతో పాటు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పొన్నం ప్రభాకర్, పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో బూత్‌స్థాయి నుంచి అన్ని కమిటీలను వెంటనే పూర్తి చేయాలని అధిష్టానం ఆదేశించిందని రఘువీరారెడ్డి చెప్పారు. శక్తి యాప్‌ను బూత్ స్థాయిలోకి తీసుకెళ్లడంతో పాటు ఇంటింటికీ కాంగ్రెస్‌ను తీసుకెళ్లాలని సూచించినట్టు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోపు మేనిఫెస్టో రూపకల్పన, అభ్యర్థుల ఖరారు కూడా చేయాలని అధిష్ఠానం నిర్ణయించిందని పేర్కొన్నారు. పొత్తులపై కూడా ఎన్నికల షెడ్యూల్ వెలువడే లోపు నిర్ణయం తీసుకుంటామని అధిష్ఠానం చెప్పిందని అన్నారు. ఈనెల 20వ తేదీలోపు ఏపీలో తెదేపాతో కాంగ్రెస్ పొత్తు ఉంటుందా లేదా అన్నది తెలుస్తుందని... ఇప్పటివరకైతే పొత్తుపై ఎలాంటి స్పష్టతా లేదని రఘువీరా రెడ్డి వివరించారు.

కాంగ్రెస్ కోర్ కమిటీ అన్ని రాష్ట్రాల పీసీసీలతో సార్వత్రిక ఎన్నికలపై చర్చిస్తోందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. బూత్ కమిటీలు, ప్రచార కమిటీలు మళ్లీ వేసుకుని యుద్ధానికి సిద్ధం కావాలని శ్రేణులకు పిలుపునివ్వాలని, మోడీ ప్రభుత్వ వైఫల్యాలు, రాష్ట్రానికి సంబంధించి మేనిఫెస్టోలో పెట్టాల్సిన అంశాలపై వార్ రూమ్ మీటింగులో చర్చ జరిగిందని పొన్నం వివరించారు. అభ్యర్థుల ఎంపికపై రాష్ట్ర స్థాయిలోనే క్షుణ్ణంగా పరిశీలించి ప్రతిపాదనలు పంపాలని సూచించారని తెలిపారు. మోడీకి, రాహుల్ గాంధీకి మధ్య జరుగుతున్నవే 2019 సార్వత్రిక ఎన్నికలని ఆయన చెప్పుకొచ్చారు. అనంతరం పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణ రెడ్డి మాట్లాడుతూ... జన సంపర్క అభియాన్ ద్వారా ప్రతి ఇంటి నుంచి 25 రూపాయల నుంచి 2 వేల వరకు... ఎవరు ఎంత ఇచ్చినా పార్టీ ఫండ్ తీసుకోవాలని అధిష్ఠానం నిర్ణయించిందని, అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గెలిచినా సార్వత్రిక ఎన్నికల్లో జాతీయ స్థాయిని పరిగణనలోకి తీసుకుని తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



రూ.1.17 కోట్లు సీజ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఇప్పటి వరకు అధికారుల తనిఖీల్లో రూ.1.17కోట్ల నగదు పట్టుబడింది. పట్టుబడిన నగదంతా ఒక్క ఖమ్మం జిల్లా పరిధికి సంబంధించినదే అని అధికారులు వెల్లడించారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే వివిధ రకాల వస్తువులు కూడా పట్టుబడ్డాయి. వీటిలో జగిత్యాల జిల్లాలో రూ.123100, వనపర్తిలో రూ.3500, ఖమ్మంలో రూ.6385, రామగుండంలో రూ.10945 విలువమేరకు వస్తువులను సీజ్ చేశారు. అంతే కాకుండా ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన సంఘటనల్లో ఇప్పటివరకు 17కేసులు నమోదయ్యాయి. అందులో 12కేసులకు సంబంధించి బాధ్యులపై చర్యలు కూడా తీసుకున్నారు. మరో రెండు కేసులు విచారణలో ఉన్నట్టు ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం.అశోక్ కుమార్ వెల్లడించారు.

ఏకగ్రీవ ప్రకటనలు నిలిపేయండి

ఈసీకి రాష్ట్ర ఎన్నికల నిఘా బృందం సూచన



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఏకగ్రీవ పంచాయతీల ఫలితాలను ప్రకటించకుండా నిలిపివేయాలని తెలంగాణ ఎన్నికల నిఘా సభ్యులు రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచించారు. గురువారం తెలంగాణ ఎన్నికల నిఘా బృందం సభ్యులు ఎం పద్మనాభరెడ్డి, రావు చెలికానిలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. తాజా పంచాయతీ ఎన్నికలను కూడా పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘంతో వారు అనేక విషయాలను పంచుకున్నారు. ప్రధానంగా తమ నిఘాలో వెల్లడైన ఏకగ్రీవ పంచాయతీల అంశాన్ని వారు ప్రస్తావించారు. గ్రామ అభివృద్ధి కమిటీలు, కుల సంఘాల పేర్లతో ఏకగ్రీవాలకు పాల్పడుతున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఏకగ్రీవాలకు వేలం పాటలను నిర్వహిస్తున్నారని ఎన్నికల సంఘం దృష్టికి తెచ్చారు. ఒకరకంగా ఏకగ్రీవం పేరుతో సర్పంచ్‌లుగా ఎన్నుకుంటున్నారు. ఈ విధానం నామినేషన్ల ఉపసంహరణ చివరి తేదీ వరకు కొనసాగే అవకాశం ఉందని చెప్పారు. ఇలాంటి ఏకగ్రీవ ప్రకటనలను నిలిపివేయాలని, నిందితులపై భారత శిక్షాస్మృతి ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. కొంతమంది ఎమ్మెల్యేలు రూ. 15 లక్షల ప్రోత్సాహం ఏకగ్రీవ పంచాయతీలకు ఇస్తామని చెప్పడం ప్రలోభాలకిందికే వస్తుందని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ నిబంధనలకు ఇది విరుద్ధమని పేర్కొన్నారు. ఎన్నికల వ్యయం వెల్లడించకుండా పోటీకి అనర్హతకు గురైన అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని కూడా వారు ఎన్నికల సంఘానికి సూచించారు.

300 పంచాయతీలు ఏకగ్రీవం

గ్రామాల్లో ప్రచార వేగాన్ని పెంచిన అభ్యర్థులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో తొలి విడత ఎన్నికలు జరుగుతున్న పంచాయితీల్లో 300 పంచాయితీలు ఏకగ్రీవమైనట్టు జిల్లాల నుంచి వస్తున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. తొలి విడత 4,479 గ్రామ పంచాయితీలకుగానూ సర్పంచ్ పదవులకు 27,940 మంది పోటీ పడుతుండగా, 39,822 వార్డులకుగానూ 97,690 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 21న జరిగే తొలి విడత పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే ఎన్నికల జరుగుతున్న పంచా యితీల్లో 300లకుపైగా పంచా యితీలు ఏకగ్రీవమైనట్టు సమాచారం. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 542 పంచా యితీ లకుగానూ 17 గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవ మయ్యారు. నిజామాబాద్ జిల్లాలో 28 పంచాయి తీలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 20, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 45, మహబూబ్‌నగర్ జిల్లాలో 17, రంగారెడ్డి జిల్లాలో 29, ఆదిలాబాద్ జిల్లాలో 81 పంచాయితీలు ఏకగ్రీవమైనట్టు అధికారులకు సమాచారం అందింది. నామినేషన్ల పర్వం పూర్తవడంతో ఆయా గ్రామ పంచాయితీల్లో పనిచేస్తున్న అభ్యర్థులు ప్రచారంలో వేగం పెంచారు. దీంతో గ్రామాల్లో రాజకీయం వేడెక్కింది. గురువారం నామినేషన్ల పరిశీలన జరిగింది. దీంతో బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను ఆయా గ్రామ పంచాయితీల్లో పని చేస్తున్న రిటర్నింగ్ అధికారులు విడుదల చేశారు. 13న పోటీచేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. అదే రోజు అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు. నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు గ్రామాల్లో, వార్డుల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. గుర్తులను కేటాయించాక ప్రచారం ఊపందుకోనుంది. శుక్రవారం నుంచి రెండో విడత ఎన్నికలకు నామినేషన్లస్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. 16వ తేదీనుంచి మూడో విడత నామినేషన్లస్వీకరణ ప్రక్రియ మొదలవుతుంది.

నేటి నుంచి రెండో విడత నామినేషన్లు

రాష్ట్రంలో శుక్రవారం రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుంది. రెండవ దశ కింద 172 మండలాల పరిధిలోని 4137 గ్రామ పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. వీటి పరిధిలో సర్పంచ్ పదవులతోపాటు 36620 వార్డు స్థానాలకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. 11నుంచి 13వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. 14న స్క్రూటినీ జరపనున్నారు. 17న నామినేషన్ల విత్‌డ్రాకు సమయం కేటాయించారు. ఈనెల 25న ఈ పంచాతీలకు పోలింగ్ జరగనుంది. అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు. ఉప సర్పంచ్ ఎన్నికలు కూడా అదే రోజు నిర్వహించనున్నట్టు ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ వెల్లడించారు.

జుట్టుకి రంగేసి అయ్యప్ప గుడిలోకి



తిరువనంతపురం: వృద్ధ మహిళగా కన్పించేందుకు జుట్టుకు రంగు వేసుకొని మంగళవారం శబరిమళ ఆలయంలోకి ప్రవేశించినట్లు కొల్లంకి చెందిన మంజు(36) అనే దళిత మహిళ తెలిపింది. మహిళ ఫెడరేషన్ కార్యకర్త అయిన ఆమె ఈ మేరకు తన ఫేస్ బుక్ ఖాతాలో తెలిపింది. జుట్టకు రంగేసుకొని ఆలయంలోని 18 మెట్ల ద్వారా దర్శనానికి వెళ్లానని, ఇకపై కూడా ఆలయంలోకి వెళ్తానని ఆమె తెలి పింది. ఆలయంలోకి ప్రవేశించినట్లు ఆధారాలుగా కొన్ని ఫొటోలను, వీడియో ఫుటేజిలను కూడా ఆమె బయటపెట్టింది. ఆ ఫొటోలలో నల్లదుస్తుల్లో తలపై ఇరుముడితో ఆమె ఆలయ పరిసరాల్లో ఉన్నట్లు కన్పిస్తోంది. దమ్ముంటే ఆలయ సంప్రోక్షణ చెయ్యాలంటూ ఆమె తన ఫేస్ బుక్ ద్వారా ఆలయ పూజారికి సవాల్ విసిరింది. గతే డాది అక్టోబర్‌లో శబరిమల ఆలయంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన 20 మంది మహిళల్లో మంజు కూడా ఒకరు. దీంతో ఆందోళనకారులు మంజు ఇంటిపై దాడి చేశారు. అయితే తనకు తానుగా ఆలయంలోకి ప్రవేశించానని మంజు చెప్పడంతో అధికారులు సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నారు. ఆమె ఆలయంలోకి ప్రవేశించింది అని చెప్పడానికి ఎటువంటి సరైన ఆధారాలు లేవని పేర్కొన్నారు. అదేవిధంగా ఆల యంలోకి 10 మహిళలు ప్రవేశించారనే వార్తల్లో కూడా నిజం లేదని తెలిపారు. శబరి మల ఆలయంలోకి అన్నీ వయస్సుల మహిళల ప్రవేశానికి అనుమతిస్తూ తీర్పు చెప్పినప్పటికీ కొన్ని హిందూ ధార్మిక సంఘాలు ఆ తీర్పుని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్న సంగతి తెలిసిందే. వారం రోజుల క్రితం బిందు, కనక దుర్గ అనే ఇద్దరు మహిళలు అయ్యప్పస్వామి దర్శనం చేసుకొని రావడం తీవ్ర దుమారానికి దారి తీసి రాష్ట్రంలో ఆందోళనకు, నిరసనలకు కారణమైన విషయం తెలిసిందే.

వర్మ ఇక ఇంటికి

- ఫైర్ సర్వీస్ విభాగానికి డీజీగా అలోక్ వర్మ
- ఎం.నాగేశ్వరరావుకు సీబీఐ పగ్గాలు
- త్రిసభ్య కమిటీలో వర్మవైపు నిలిచిన ఖర్గే
- సీవీసీ ఆరోపణలపై వివరణ అడగాలని డిమాండ్
- తొలగించాల్సిందేనన్న మోడీ, జస్టిస్ ఏకే సిక్రీ
- రెండు గంటలకు పైగా హైపవర్ కమిటీ భేటీ
- 50 ఏళ్ల సీబీఐ చరిత్రలో తొలిసారి
- జనవరి 31తో పదవీ విరమణ చేయనున్న వర్మ
- తొలగింపుపై భగ్గుమన్న విపక్షాలు



సీబీఐ కార్యాలయం నుంచి వెలుపలికి వస్తున్న అలోక్ వర్మ



సీబీఐ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు

న్యూఢిల్లీ : సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మను తొలగిస్తూ ప్రధాని మోడీ నేతృత్వం వహిస్తున్న త్రిసభ్య కమిటీ సంచలన నిర్ణయం తీసుకుంది. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మను నియ మిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై కమిటీ గురువారం లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ఆయన నివాసంలో రెండో సారి సమా వేశం అయ్యింది. సుమారు రెండు గంటల పాటు ఈ మీటింగ్ కొనసాగింది. సెంట్రల్ విజిలెన్స్ కమిటీ రిపోర్టులో పొందుపర్చిన ఆరోపణలపైనే హైపవర్ కమిటీ మొగ్గు చూపింది. 1979 బ్యాచ్ ఏజీఎంయూటీ ఐపీఎస్ కేడర్ అధికారి వర్మపై వచ్చిన ఆరోపణలన్నీ వాస్తవమే అని, అందుకే అతన్ని సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించింది. జనవరి 31తో వర్మ పదవీ కాలం ముగియనున్న సమయంలో త్రిసభ్య కమిటీ తీసుకున్న నిర్ణయం సంచలనమైంది. 24 గంటల్లోనే హైపవర్ కమిటీ రెండు సార్లు సమావేశమైంది. 55 ఏళ్ల సీబీఐ చరిత్రలో డైరెక్టర్ విషయంలో ఈ తరహా నిర్ణయం తీసుకోవడం ఇదే తొలిసారి. అలోక్ వర్మపై వచ్చిన ఆరోపణలపై ప్రాథమిక సాక్షాధారాలు ఉన్నట్టు హైపవర్ కమిటీ తెలిపింది. అలోక్ వర్మ తొలగింపును ప్రధాని నరేంద్ర మోడీ, జస్టిస్ ఏకే సిక్రీ సమర్థించగా, కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. మోయిన్ ఖురేషీ కేసు, ఐఆర్‌సీటీసీ స్కాంతో పాటు పలు కుంభకోణాల్లో విచారణ జరుపుతున్న 8 మంది అవినీతి అధికారులతో కాంప్రమైజ్ చేసినట్టు వర్మపై ఆరోపణలు ఉన్నాయి. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన తరువాత విధుల్లో చేరిన మరుసటి రోజే అలోక్ వర్మపై వేటు వేయడం గమనార్హం. మోడీ తప్పించేందుకు మొగ్గు చూపగా, వర్మ కేసులపై దర్యాప్తు చేయాలని జస్టిస్ ఏకే సిక్రీ, సీవీసీ ఆరోపణలపై వివరణ అడగాలని ఖర్గే కోరారు.

హెచ్‌ఆర్‌సీని ఆశ్రయిస్తాను : అలోక్ వర్మ

హైపవర్ కమిటీ వర్మను సీబీఐ డైరెక్టర్ నుంచి తొలగించి ఫైర్ సర్వీసెస్ అండ్ హోంగార్డు విభాగం డైరెక్టర్ జనరల్ బాధ్యతలను అప్పగిం చడంపై స్పందించారు. దీనిపై తాను మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తానని తెలిపారు. కమిటీ ముందుకు రావడానికి అనుమతి ఇవ్వడం లేదని తెలిపారు. తనను విచారించకుండానే సీవీసీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా వేటు వేయడం సబబు కాదని తెలిపారు.

ఆస్తానా కేసు బాధ్యతలు మోహిత్ గుప్తాకు..

సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేష్ ఆస్తానాపై నమోదైన అభియోగాలను విచారించేందుకు ఎస్పీ ర్యాంకు ఐపీఎస్ అధికారి మోహిత్ గుప్తాను నియమించడం జరిగింది. 1979 బ్యాచ్ ఏజీఎంయూటీ కేడర్ ఐపీఎస్ అధికారి వి మురగేషన్‌ను యాంటీ కరప్షన్ యూనిట్ - 3కి జాయింట్ డైరెక్టర్‌గా నియమిస్తూ వర్మ నిర్ణయం తీసుకున్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎంకే సిన్హా తప్పుకున్న నేపథ్యంలో ఆస్తానా కేసు వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న తరుణ్ గౌబా, ముర్గేషన్, ఏడీ ఏకే శర్మ, ఎంకే సిన్హాను బదలీ చేశారు. వీరిని ఇన్‌చార్జ్ డైరెక్టర్ నాగేశ్వర్ రావు అపాయింట్ చేశారు. గుప్తా 2006 బ్యాచ్‌కు చెందిన ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ఘాజియా బాద్ ఏజెన్సీకి నేతృత్వం వహిస్తున్నాడు. ఇతన్ని ఆస్తానా కేసులో విచారణ అధికారిగా నియమించారు. ఈయన ఈ కేసులో మూడో విచారణ అధికారి. వర్మపై వేటు వేసిన నేపథ్యంలో ఆయన చేసిన బదలీలు కొనసాగుతాయా..? లేదా..? అనే దానిపై సందిగ్ధత నెలకొంది.

బదలీలు రద్దు చేసిన వర్మ

సీబీఐ చీఫ్, డిప్యూటీస్పెషల్ డైరెక్టర్ రాకేష్ ఆస్తానా మధ్య చెలరేగిన వివాదంలో ఇద్దరు ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకున్నారు. 77 రోజులుగా డైరెక్టర్ బాధ్యతలు చేపట్టిన ఎం. నాగేశ్వర్ రావు హయాంలో జరిగిన 12 మంది బదలీలను రద్దు చేస్తూ సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ నిర్ణయం తీసుకున్నారు. సీబీఐ డైరెక్టర్ హోదాలో ఉన్న నాగేశ్వర రావు, భారీ స్థాయిలో ఉన్నతాధికారులను బదలీ చేశారు. అలోక్ వర్మ కేసు వ్యవహారంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ విచారణ పత్రాలతో పాటు ప్రభుత్వానికి సంబంధించి డాక్యు మెంట్లు సమావేశానికి ముందు అడిగినట్టు మల్లి కార్జున్ ఖర్గే తెలిపారు. కమిటీ ఎదుట హాజరై వివరణ ఇచ్చే అవకాశం అలోక్ వర్మకు ఇవ్వాలని కోరను న్నట్టు వివరించారు.

రాఫెల్ భయంతోనే వర్మ తొలగింపు : రాహుల్

రాఫెల్ కుంభకోణం ఎక్కడ బట్ట బయలు అవు తుందో అని భయపడి సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను తప్పించా ని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. దీని కోసం వడివడి అడుగులు ఎందుకు వేశారో తెలియజేయాలని రాహుల్ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. అలోక్ వర్మను సెలక్షన్ కమిటీ ముందుకు ఎందుకు హాజరు కానివ్వడం లేదు..? ఆయన అభిప్రాయం తెలియజేయడానికి ఎందుకు నిరాకరిస్తోంది..? దీనికి కారణం ఒకటే సమధానం రాఫెల్ కుంభకోణం అని విమర్శించారు. రాఫెల్ కుంభకోణం విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. అవినీతి జరిగిందనేది దేశ ప్రజలందరికీ తెలుసు అని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. రూ.30వేల కోట్ల ప్రజా ధనాన్ని మోడీ తన మిత్రుడు అనిల్ అంబానీకి ఇచ్చారని ఆరోపించారు. వర్మకు ఒక్క చాన్స్ కూడా ఇవ్వకుండా సీవీసీ రిపోర్టు ఆధారంగా తొలగించడం బాధాకరమన్నారు.

వర్మను తొలగించలేరు : సుబ్రమణ్య స్వామి

సెంట్రల్ విజిలెన్స్ కమిటీ రిపోర్టు ఆధారంగా సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను తొలగించలేరని బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్య స్వామి తెలిపారు. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. కొన్ని అనాలోచితమైన తప్పుడు సలహాల కారణంగా ఇది జరుగుతోందని అభిప్రాయపడ్డారు. వర్మను వెళ్లి కలిసినట్టు తెలిపారు. సీవీసీ ఇచ్చిన నివేదికలో అన్నీ అబద్దాలే అని అన్నారు. దీనిపై కూడా విచారణ జరిపించాల్సి అవసరం ఉందన్నారు. వర్మను తొలగిస్తే సమస్య జఠిలం అవుతుందే తప్ప పరిష్కారం కాదని తెలిపారు. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని మోడీని కోరుతున్నట్టు వివరించారు. కేసు విషయంలో వర్మను కలుకోలేదని, వ్యక్తిగతంగా భేటీ అయినట్టు తెలిపారు.

బదలీల రిజర్వ్‌పై హైకోర్టులో పిటిషన్

పలువురు అధికారుల ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లను సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ రిజర్వ్‌లో పెట్టడాన్ని సవాల్ చేస్తూ సీబీఐ డీఎస్పీ దేవేందర్ కుమార్ గురువారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ నజ్మి వాజ్రీ విచారిస్తారు. ఈ నెలాఖరులో అలోక్ వర్మ పదవి కాలంలో ముగియనుండటంతో వారంలోపు తమ నిర్ణయం వెల్లడించాలని ప్యానల్‌కు సుప్రీం కోర్టు సూచించింది. గతేడాది అక్టోబర్‌లో సీబీఐ వివాదం తారా స్థాయి చేరడంతో రాత్రికి రాత్రే కేంద్రం అలోక్ వర్మను సెలవులపై పంపి, రాకేష్‌పై అవినీతిపరమైన చార్జ్‌లు దాఖలు చేసిన విషయం తెలిసిందే.



సీబీఐ డైరెక్టర్‌గా నాగేశ్వర్‌రావు

సీబీఐ అడిషనల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం. నాగేశ్వర్ రావును సీబీఐ డైరెక్టర్ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. నాగేశ్వర్ పనితీరుపై కేంద్రం సంతృప్తికరంగా ఉన్న నేపథ్యంలో అతనికే మళ్లీ పూర్తి స్థాయి బాధ్యతలు అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. నూతన సీబీఐ డైరెక్టర్‌ను నియమించే వరకు నాగేశ్వర్ రావు వర్మ స్థానంలో కొనసాగుతారు. అలోక్ వర్మను లాంగ్ లీవ్‌కు పంపిన తరువాత కేంద్రం ఎం.నాగేశ్వర్ రావుకు ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా నియమించింది. 77 రోజుల పాటు ఆయన సీబీఐ డైరెక్టర్ బాధ్యతలు చేపట్టి తనదైన శైలిలో కేసు లు విచారణ చేపట్టారు. అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికా రులను బదలీ చేశారు. సుప్రీం కోర్టు తీర్పులో భాగంగా అలోక్ వర్మపై ఒత్తిడి తీసుకొచ్చి పదవి నుంచి తప్పించి సెలవులపై పంపడాన్ని తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే.

సీబీఐ చీఫ్‌ను నియమించే, తొలగించే అధికారం త్రిసభ్య కమిటీకి ఉంటుంది. అలోక్ వర్మను కొనసాగించాలా..? వద్దా...? అనే నిర్ణయం కూడా హైపవర్ కమిటీకే ఉంటుంది. కమిటీ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ, కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే, సుప్రీం సీజే రంజన్ గొగొయ్ తరపున జస్టిస్ ఏకే సిక్రి పాల్గొన్నారు. సీవీసీ నుంచి నివేదిక బుధవారం అందకపోవడంతో ఈ విషయమై స్పష్టత రాలేదని, అందుకే మరోమారు సమావేశమైనట్టు కమిటీ చెప్పుకొచ్చింది.



అమరావతిలో విశ్వవాణిజ్యానికి వెల్‌కమ్!

- ఐదు ఎకరాల్లో రూ.44కోట్లతో గ్యాలరీ నిర్మాణం

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్, సింగపూర్ సంబంధాల్లో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాజధాని అమరావతికి అంతర్జాతీయ గుర్తింపుతెచ్చే వెల్‌కమ్ గ్యాలరీకి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సింగపూర్ మంత్రి ఈశ్వరన్ శంకుస్థాపన చేశారు. రాజధాని ప్రాంతంలోని లింగాయపాలెం అంకుర ప్రాంతంలో మొదటి దశలో భాగంగా ఐదు ఎకరాల్లో రూ. 44 కోట్లతో నిర్మించే వెల్‌కమ్ గ్యాలరీ వాణిజ్య అభివృద్ధి కేంద్రంగా విరాజిల్లనుంది. ప్రాచీన తెలుగు సంస్కృతి విశిష్టతను, తెలుగు జాతి వైభవాన్ని, స్మృతులను, గుర్తింపును వెల్‌కమ్ గ్యాలరీ ప్రతిబింబించనుంది. అమరావతి నగర గత వైభవాల వారసత్వ సంపదను స్ఫురణకు తేవడమే కాకుండా భవిష్యత్ తరాలకు స్ఫూర్తిచ్చేలా గ్యాలరీ డిజైన్ రూపొందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఔన్నత్యాన్ని ప్రజా సంస్కృతిని గుర్తుచేసేలా రాజధాని దగ్గర నమూనాను ప్రతిబింబించనుంది. కళలు, వినూత్న సాంకేతిక పరిష్కారాలకు కేంద్రం కానుంది.

శ్రీవారి సేవలో జగన్



తిరుమల, ప్రభన్యూస్: సుదీర్ఘ పాదయాత్ర ముగించుకుని ఇచ్ఛాపురం నుంచి తిరుమల చేరుకున్న జగన్ గురువారం శ్రీవార్ని దర్శించుకున్నారు. అలిపిరి నుంచి ఆయన కాలినడక మార్గంలో తిరుమలలోని జిఎన్‌సి టోల్‌గేట్ వరకు కేవలం మూడుగంటల్లోనే చేరుకున్నారు. అక్కడ్నుంచి వాహనంలో పద్మావతి నగర్‌లోని శ్రీకృష్ణ అతిధిభవనానికొచ్చిన జగన్‌కు టిటిడి డిప్యూటీ ఇఓ బాలాజీ, ఎఇఓ ధనుంజయ్‌లు స్వాగతం పలికారు. కొద్దిసేపు విరామానంతరం సంప్రదాయ దుస్తులు ధరించి దివ్యదర్శనం క్యూలైన్ ద్వారా శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించారు. మహాలఘు దర్శన సమయంలోనే శ్రీవారి సేవలో పాల్గొన్నారు. మెట్ల మార్గంలో జగన్‌ను వేలాదిమంది అనుచరులు, పార్టీ కార్యకర్తలు అనుసరించారు. ఎక్కడా ఆయన సేదదీరలేదు. నిరాటంకంగా నడక కొనసాగించారు. మధ్యలో దివ్యదర్శనం టోకెన్‌కేంద్రం వద్ద ఆయన స్వయంగా టోకెన్ స్వీకరించారు. ఆయన్తో పాటు నడిచొస్తున్న కార్యకర్తలు కూడా దివ్యదర్శనం టోకెన్లు పొందారు. శ్రీవారి దర్శనానంతరం జగన్‌కు రంగనాయకుల మండపం వద్ద వేదపండితులు ఆశీర్వచనం అందించారు. తీర్థప్రసాదాల్ని ఇచ్చారు. జగన్ రాక సందర్భంగా ఆలయం వద్ద కార్యకర్తలు, అభిమానుల ఉత్సాహం కనిపించింది. ఆయన్నుచూసేందుకు భక్తులు కూడా పోటీపడ్డారు. అందరికీ మౌనంగానే ఆయన అభివాదం చేస్తూ ముందుకుసాగారు.

స్వరూపానంద స్వామి ఆశీస్సులు

శ్రీవారి దర్శనానంతరం జగన్ నేరుగా గోగర్భం డ్యామ్ సమీపంలో ఉన్న విశాఖ శారదాపీఠానికి చేరుకున్నారు. అక్కడాయనకు పీఠానికి చెందిన వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి లోనికాహ్వానించారు. పీఠంలో స్వామి స్వరూపానంద సరస్వతిని జగన్ కలుసుకున్నారు. ఆయన ఆశీస్సులందుకున్నారు. అనంతరం ఇరువురు ఏకాంతంగా కొద్దిసేపు చర్చించారు. రాత్రికి అక్కడే జగన్ బస చేశారు. శుక్రవారం ఉదయం ఆయన కడప మీదుగా ఇడుపులపాయకు బయలుదేరి వెళ్తారు. జగన్ వెంట పార్టీకి చెందిన మాజీ ఎమ్పిలు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమా నులున్నారు.


జస్టిస్ లలిత్ నిష్క్రమణ

న్యూఢిల్లీ : అయోధ్య కేసు విచారణ మరోసారి వాయిదాపడింది. కేసును విచారించేందుకు నియమించిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ బెంచ్ నుంచి జస్టిస్ యూయూ లలిత్ వైదొలిగారు. గతంలో అయోధ్య వివాదానికి సంబంధించిన కేసులో లలిత్ న్యాయవాదిగా పనిచేశారని, అలాంటి వ్యక్తిని బెంచ్‌లో ఎలా కొనసాగిస్తారని జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని బెంచ్‌ను సీనియర్ న్యాయవాది రాజీవ్ ధవన్ ప్రశ్నించారు. దీంతో జస్టిస్ లలిత్ స్వచ్ఛందంగా బెంచ్ నుంచి తప్పుకున్నారు. బెంచ్ నుంచి లలిత్‌ను తప్పించాలని న్యాయవాది రాజీవ్ ధవన్ పేర్కొనకపోయినప్పటికీ జస్టిస్ లలిత్ వైదొలిగారు. బెంచ్ నుంచి జస్టిస్ లలిత్ వైదొలగడంతో ఐదుగురు సభ్యులతో కూడిన బెంచ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని, జనవరి 29 నుంచి కేసు విచారణ ప్రారంభమవుతుందని జస్టిస్ రంజన్ గొగోయ్ వెల్లడించారు. తొలత ముగ్గురు సభ్యుల బెంచ్‌తోనే విచారించనున్నారని ప్రకటించారని, అయితే ప్రస్తుతం ఐదుగురు సభ్యులతో కూడిన బెంచ్‌తో కేసు విచారణ జరపడాన్ని ప్రశ్నించిన ధవన్‌కు జస్టిస్ గొగోయ్ వివరణ ఇచ్చారు. కేసు వాస్తువ పరిస్థితులు, భారీగా రికార్డుల పరిశీలన నిమిత్తం ఐదుగురు సభ్యుల బెంచ్‌ను తీసుకున్నామని వెల్లడించారు. దాదాపు 50 పెట్టెలలో భద్రపరిచిన సంస్కృతం, అరబిక్, ఉర్దూ, హిందీ, పర్షియన్ భాషలలో ఉన్న రికార్డులను పరిశీలించి విచారణ జరపాల్సి ఉందని వివరించారు.

ఈబీసీ బిల్లుపై సుప్రీంలో పిటిషన్

- సుప్రీం పరిమితిని మించి రిజర్వేషన్లు విరుద్ధం
- ఆర్థికస్థితి ఆధారంగా రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం
- కోర్టులో పిటిషన్ వేసిన స్వచ్ఛంద సేవా సంస్థ

న్యూఢిల్లీ: అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణకై లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదం పొందిన రిజర్వేషన్ల బిల్లుపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు విధించిన పరిమితిని మించడంతోపాటు ఇదివరకు ఎప్పుడూ లేని విధంగా కేవలం రెండు రోజుల చర్చ ద్వారా బిల్లుకు రెండు సభలు ఆమోదం తెలపడం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని యూత్ ఫర్ ఈక్విటీ అనే స్వచ్ఛంద సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. ఆర్థిక పరిస్థితిని బట్టి రిజర్వేషన్లు కల్పించడం కుదరదని, 1992లో సుప్రీంకోర్టు తీర్పును ఉటంకించింది. ఆర్థిక పరిస్థితి ఆధారంగా జనరల్ కేటగిరి వారికి రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగంలోని సమానత్వపు ప్రాథమిక హక్కుకు విఘాతమని సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. ఇదిలావుండగా అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడినవారికి 10శాతం రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఉల్లంఘనకు పాల్పడలేదని, ఆర్థిక పరిస్థితి ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నామని కేంద్రప్రభుత్వం సమర్థించుకుంటున్న సంగతి తెలిసిందే. బిల్లుకు తాము వ్యతిరేకం కాదని, బిల్లును సెలక్ట్ కమిటీ పరిశీలనకు పంపించాలని కాంగ్రెస్, ఆర్‌జేడీ, డీఎంకే, లెఫ్ట్ ఫ్రంట్ వంటి పార్టీల నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే రెండు సభల్లోనూ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.



మా ఊరు-మా రాజ్యం



ఉప సర్పంచ్‌కూ చెక్ పవర్!



నెం-2 కోసం పోటాపోటీ

కరీంనగర్ బ్యూరో, ప్రభన్యూస్ : ఒకప్పుడు నామమాత్రంగా ఉన్న ఉప సర్పంచ్ పదవి నేడు కీలకం కానుంది. గతంలో గ్రామ కార్యదర్శి, సర్పంచ్‌కు కలిపి జాయింట్ చెక్‌పవర్ ఉండేది. సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు కలిపి జాయింట్ చెక్‌పవర్ ప్రభుత్వం ఇవ్వాలని నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటి సారి జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఉప సర్పంచ్ పదవి ఇక కీలకం కానుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాల్లో, మహిళా రిజర్వు స్థానాల్లో ఉప సర్పంచిగా గెలుపొంది పెత్తనం చెలాయించవచ్చనే ఉద్దేశ్యంతో రిజర్వుడు స్థానాలపై పురుష అభ్యర్థులు దృష్టిసారించారు. జాయింట్ చెక్‌పవర్ రానుండటంతో ఉప సర్పంచ్‌కు పోటీ తీవ్రంగా ఉండే అవకాశాలు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం స్థానంలో తెలంగాణ రాష్ట్ర అవసరాలు, గ్రామాల అభివృద్ధికి పంచాయతీల్లో సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధుల పాత్రను కీలకం చేస్తూ తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018ని అమలులోకి తీసుకువచ్చారు. దీని ప్రకాలం గ్రామాలకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు, ఇతర ఆదాయ మార్గాల ద్వారా సమకూరిన నిధులకు గ్రామాల అభివృద్ధికి కేటాయింపులు, ఖర్చు చేసే విధానాలు, నిర్ణయాలపై తప్పనిసరిగా సర్పంచ్‌తోపాటు ఉప సర్పంచ్ జాయింట్ చెక్‌పవర్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. దీంతో గ్రామాల్లో ఉప సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. గ్రామ సర్పంచ్‌ను నేరుగా ప్రజలు ఎన్నుకోనుండగా ఉప సర్పంచ్‌ను గ్రామంలో ఎన్నికైన మెజారిటీ వార్డు సభ్యులు ఎన్నుకోవాల్సి ఉంటుంది. మెజార్టీ రిజర్వు స్థానాల్లో ఉపసర్పంచ్‌పై కన్నేసిన నేతలు వార్డు సభ్యులను తమకు అనుకూలమైనవారి నిలబెట్టాలని ప్రయత్నిస్తున్నారు. వార్డు సభ్యులకు అయ్యే ఖర్చులను కూడా తామే భరించేందుకు ముందుకు వస్తున్నారంటే ఉప సర్పంచ్‌కు ఏ మేర డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.

- కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలు కలిపి 1211 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో 313 సర్పంచ్ స్థానాలకు మూడు విడతలుగా ఎన్నికలు జరగనుండగా ఇందులో ఎస్టీకి నాలుగు రిజర్వు కాగా ఇందులో మూడు మహిళలకు రిజర్వు అయినాయి. ఈ స్థానాల్లో ఉప సర్పంచ్‌కు పోటీ తీవ్రంగా ఉండనుంది. ఎస్సీకి 80 స్థానాలు రిజర్వ్ కాగా 40 మహిళలకు, 40 జనరల్‌కు రిజర్వు కాబడ్డాయి. ఇందులో ఉప సర్పంచ్‌గా పోటీ చేసేందుకు చాలా మంది సిద్ధమవుతున్నారు. నామినేషన్లు కూడా మొదటి విడతలో ఈ స్థానాల్లో వార్డు సభ్యులకు ఎక్కువగానే దాఖలైనాయి. బీసీలకు 73 రిజర్వు కాగా బీసీ మహిళకు 37, జనరల్‌కు 156 రిజర్వు కాగా 78 మహిళలకు రిజర్వు కాబడ్డాయి. ఇక్కడ సర్పంచ్‌గా మాజీ సర్పంచుల సతీమణులతో పాటు ఉప సర్పంచ్‌కు మాజీ సర్పంచులు పోటీలో దిగే అవకాశాలు ఉన్నాయి.

జగిత్యాల జిల్లాలో మొత్తం 380 పంచాయతీలు ఉండగా ఎస్టీలకు 29 రిజర్వు కాగా 15 మహిళలకు రిజర్వు కాబడ్డాయి. ఎక్కువగా తండాలు పంచాయతీలుగా ఏర్పడి ఎస్టీలకు రిజర్వు కావడంతో ఎస్టీ మహిళకు రిజర్వు అయినా ఉప సర్పంచ్ కోసం ఎస్టీ జనరల్ అభ్యర్థులు పోటీ పడనున్నారు. ఎస్సీకి 82 రిజర్వు కాగా ఎస్టీ మహిళకు 41, బీసీకి 90 రిజర్వు కాగా బీసీ మహిళకు 45, జనరల్‌కు 179 కాగాజనరల్ మహిళకు 90 స్థానాలు రిజర్వుకాబడ్డాయి. ఇక్కడ ఉప సర్పంచ్‌కు ఎక్కువ పోటీ నెలకొనుంది.

పెద్దపల్లి జిల్లాలో మొత్తం 263 పంచాయతీలకు గాను ఎస్టీలకు ఏడు రిజర్వు కాగా అందులో ఎస్టీ మహిళకు 4, ఎస్సీకి 55 రిజర్వు కాగా ఎస్సీ మహిళకు28, బీసీలకు 70 రిజర్వు కాగా బీసీ మహిళకు 35, జనరల్‌కు 130 కాగా జనరల్ మహిళకు 65 రిజర్వు కాబడ్డాయి. ఈ స్థానాల్లో ఉప సర్పంచ్‌కు పోటీ ఎక్కువ నెలకొనుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 254 పంచాయతీలు ఉండా ఎస్టీలకు 25 రిజర్వు కాబడ్డాయి. ఇందులో ఎస్టీ మహిళకు 13 రిజర్వు అయినాయి. ఇక్కడ ఉప సర్పంచ్‌కు ఎస్టీ పురుషులు పోటీ పడనున్నారు. ఎస్సీలకు 52 రిజర్వు కాగా ఎస్సీమహిళకు 26, జనరల్‌కు115 దక్కగా జనరల్ మహిళకు 58 రిజర్వు కాబడ్డాయి. ఈ స్థానాల్లో ఉప సర్పంచులకు పోటీ నెలకొనుంది.

నా పాట 10 లక్షలు...!

ఒకటోసారి .. రెండోసారి

- మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో జోరుగా వేలం పాటలు
- అధికాదాయం ఉన్న పంచాయతీల్లో పాగాకు ప్రయత్నం
- తండాలలోనూ భారీ ఒప్పందాలు

మెదక్ బ్యూరో, ప్రభన్యూస్ : పంచాయతీ ఎన్నికల్లో వేలంపాటల సందడి మొదలైంది. అధికాదాయం ఉన్న పంచాయతీల్లో పాగా వేసేందుకు కొందరు అభ్యర్థులు వేలంపాటల పద్ధతిని ఆశ్రయిస్తున్నారు. ఏకంగా పది నుంచి పాతిక లక్షల వరకు ఖర్చు పెట్టేందుకు సిద్ధమైనారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలి విడత నామినేషన్ల ఘట్టం బుధవారం ముగిసింది. 7 నుంచి నామినేషన్ల పర్వం మొదలు కాగా, చివరి రోజుతో భారీగానే నామినేషన్లను దాఖలు చేశారు. 13 వరకు ఉపసంహరణ గడువు ఉండడంతో ఆశావహులు సర్పంచ్ స్థానాన్ని దక్కించుకునేందుకు కొందరు వేలం పాటలకు దిగుతున్నారు. ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నిస్తున్న కొందరు ప్రత్యర్థులు పోటీకి రాకుండా ఉండేందుకు రూ.లక్షల్లో ఆగ్రాసుకు దిగుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి మెదక్ జిల్లాలో కొన్ని గ్రామ పంచాయతీలు రూ.10-20 లక్షల వరకు వేలం పాటలో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

రియల్‌బూమ్‌తో సర్పంచ్ పదవికి డిమాండ్

ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో పంచాయతీ అగ్రాసులు జోరుగా సాగుతున్నాయి. ఇలావుండగా స్థిరాస్తి వ్యాపారం జోరుగా ఉన్న చోట రియల్టర్లు సర్పంచ్ పదవులను కైవసం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు సాగుతున్నాయి. ఆదాయ వనరులు ఉన్న పంచాయతీల్లో ఎలాగైనా ఏకగ్రీవం చేసేందుకు రూ.లక్షల్లోవేలం పాటలు నిర్వహిస్తున్నారు. మరికొన్ని చోట ఏకగ్రీవం చేసేందుకు పోటీ ఉన్న అభ్యర్థులతో రాజకీయ ఒప్పందాలు కుదుర్చుకొని కొంత నగదుతో పాటు ఉపసర్పంచ్ పదవి ఇవ్వడానికి ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ వ్యవహారమంతా జాతీయ రహదారులు, ఆదాయం ఎక్కువగా ఉన్న పంచాయతీల్లోసాగుతోంది. అక్కడ పోటీ లేకుండా చేసేందుకు ఏమైన చేయడానికి కొందరు పోటీ పడుతున్నారు.



వేలంపాటలపై నోరు జారొద్దు

ఉమ్మడి జిల్లాలో.... ఎక్కువగా మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని పలుచోట్ల ఇప్పటికే ఏకగ్రీవ ఒప్పందాలు పూర్తయ్యాయి. అయితే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పంచాయతీలకు నిర్వహించే వేలం పాటలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీస కుంటామని రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం నాడు ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలో వేలం పాటలను బయటకు పొక్కకుండా ఆశావహులు జాగ్రత్త పడుతున్నారు. ఎవ రైనా చట్టం ఉల్లం ఘనకు పాల్ప డితే ఏడాది జైలుశిక్ష, ఆరే ళ్ళపాటు ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధిస్తామని హెచ్చ రించడంతో గుట్టు చప్పుడు కాకుండా ఊళ్ళ లో అగ్రాస్‌లు జరుగుతున్నాయి.

అక్కడ 30 లక్షలు

సంగారెడ్డి జిల్లాలో ఓ మండలంలో రూ.30 లక్షల వరకు చెల్లించేందుకు ఓ నాయకుడు ముందుకు రావడం జరిగింది. అయినప్పటికీ అభ్యర్థులు నామినేషన్లు వేస్తుండడంతో ఉపసంహరణ వరకు చర్చలు చేసి ఒప్పించేందుకు విశ్వప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం తొలి విడత ఎన్నికలు ఉన్నందున మిగతా విడతల్లో జరిగే పంచాయతీలకు ఇప్పటికే ఒప్పందాలు చేసుకుంటున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ఓ మండలంలో ఎన్ని కుల సంఘాలు ఉన్నాయో ఒక్కో సంఘానికి రూ.లక్ష చొప్పున ఇవ్వడానికి ఒప్పందం కుదిరినట్టు తెలిసింది. అలాగే మరో గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు ఇస్తామని ప్రకటించినట్లు సమాచారం. మెదక్ జిల్లాలో చాలాచోట్ల రాజకీయ ఒప్పందాలు కొనసాగుతున్నాయి. పంచాయతీని ఏకగ్రీవం చేయడానికి ఒక పార్టీ మద్దతుదారునికి సర్పంచ్ పదవి, మరో పార్టీ మద్దతుదారునికి ఉపసర్పంచ్ పదవి అంటూ ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇందులో కూడా చెప్పిన పదవి తీసుకోవడానికి సదరు అభ్యర్థికి లోపాయికారి ఒప్పందాలు కూడా చేస్తున్నట్లు సమాచారం. అయితే అన్నిచోట్లా అగ్రాసులతో కాకుండా నిజాయితీపరులైన నాయకుల కోసం ఏకగ్రీవం చేస్తున్నారు.

పంచాయతీ బరిలో 27,940 సర్పంచ్ అభ్యర్థులు

- నామినేషన్లలో నల్లగొండ రికార్డ్
- వార్డుల్లో సంగారెడ్డి జిల్లా టాప్
- మేడ్చల్‌లో అతి తక్కువ...304 పంచాయతీలకు 2231 నామినేషన్లు
- స్క్రూటినీలో అధికారుల కుస్తీ
- నేడు అప్పీళ్లకు అవకాశం

వార్డు సభ్యులుగా 97, 690
మొత్తం- 1,25,630

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వేలాది మంది ముందుకు వచ్చారు. అభ్యర్థులనుంచి గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీ స్పందన కనిపించింది. తొలివిడతలో జరిగే పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ స్థానాలకు , వార్డు పదవులకు కలిపి దాఖలైన నామినేషన్ల సంఖ్య లక్ష దాటిపోయింది. దీంతో అధికారులు నామినేషన్ల పరిశీలనకు గురువారం పొద్దుపోయేదాక కుస్తీపట్లు పడుతున్నారు. గురువారం ఇది ముగియకపోతే శుక్రవారం ఉదయం కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగించే అవకాశాలు ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. తొలిదశ కింద 4479 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులతోపాటు వాటి పరిధిలోని 39, 822 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తుండగా నామినేషన్ల దాఖలు చేయడానికి గడువు బుధవారం సాయంత్రానికే ముగిసిపోయింది. సర్పంచ్ స్థానాలకు మొత్తం 27,940 నామినేషన్లు దాఖలు కాగా, వార్డు స్థానాలకు 97,690 నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్రంలో నల్లగొండ జిల్లాలో రికార్ట్ స్థాయిలో నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ జిల్లాలో తొలిదశ కింద మొత్తం 304 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగుతుండగా సర్పంచ్ స్థానాలకు 2231 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డు స్థానాలకు దాఖలెన నామినేషన్లలో సంగారెడ్డి జిల్లా రికార్డు సృష్టించింది. ఈ జిల్లాలో 2398 వార్డుల కు జరుతుగున్న ఎన్నికల్లో మొత్తం 7576 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాల వారీగా సర్పంచ్ స్థానాలకు అత్యధికంగా దాఖలైన నామినేషన్లలో సంగారెడ్డిలో 1679, మహబూబ్ నగర్‌లో 1511, ఖమ్మంలో 1125, పెద్దపల్లిలో 1048, వికారాబాద్‌లో 1180 నామినేషన్లు దాఖలయ్యాయి. అతితక్కువ నామి నేషన్లు దాఖలైన జిల్లాల్లో మేడ్చెల్ మల్కాజిగిరి(199), భద్రాద్రి ఖమ్మంలో 276, వరంగల్ అర్బన్ జిల్లాలో 280 నామినేషన్లు దాఖ లయ్యాయి. వార్డు స్థానాలకు అతితక్కువ నామినేషన్లు దాఖలైనవాటిలో మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలో 1178, వరంగల్ అర్బన్ జిల్లాలో 1261 నామినేషన్లు దాఖలయ్యాయి.

జిల్లా	సర్పంచ్ స్థానం	వార్డు స్థానం
అదిలాబాద్	595	1959
కొమరంభీం	646	2087
మంచిర్యాల	792	2441
నిర్మల్	728	1937
జగిత్యాల్	936	2446
కరీంనగర్	906	2980
పెద్దపల్లి	1048	2536
రాజన్న సిరిసిల్ల	660	1920
కొత్తగూడెం	276	1227
ఖమ్మం	1125	4564
జోగులాంబ గద్వాల	523	1883
మహబూబ్ నగర్	1511	5127
నాగర్‌కర్నూల్	852	3199
వనపరి	607	1686
మెదక్	883	3007
సంగారెడ్డి	1679	7576
సిద్దిపేట్	1609	5223
నల్లగొండ	2231	7215
సూర్యాపేట్	1282	4264
యాదాద్రి భువనగిరి	697	2696
కామారెడ్డి	1257	4066
నిజామాబాద్	1155	4205
మేడ్చెల్ మల్కాజిగిరి	199	1178
రంగారెడ్డి	982	4735
వికారాబాద్	1180	4475
జనగాం	645	2063
జయశంకర్ భూపాలపల్లి	956	3350
మహబూబాబాద్	881	3397
వరంగల్ రూరల్	818	2987
వరంగల్ అర్బన్	280	1261
మొత్తం	**27940**	**97690**

శివునిపల్లి వివాదంపై విచారణ వాయిదా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రతివాదుల వాదనలు వినకుండా ఏకపక్షంగా ఉత్తర్వులు ఎలా ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో యోగ్యత ఆధారంగా వాదనలు వింటామని హైకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ పి.కేశవరావు గురువారం ఈ మేరకు వ్యాఖ్యానించారు. తదుపరి విచారణ ఈ నెల 30 కి వాయిదా వేశారు. జనగామ జిల్లా, స్టేషన్ ఘనపూర్ మండలంలోని శివునిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవిని ఎస్టీ జనరల్ కు రిజర్వు చేయడాన్ని సవాలు చేస్తూ గుర్రం.యాదగిరి మరో నలుగురు వ్యక్తులు హైకోర్టు వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాది చిక్కుడు.ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ ..గ్రామంలో ఎస్టీ జనాభా గణన చేపట్టకుండానే సర్పంచ్ పదవిని రిజర్వ్ చేసి ఎన్నికలు నిర్వహించడం అక్రమమని విన్నవించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14,16,19 మరియు 243 లను ఉల్లంఘించడమేనన్నారు. ప్రతివాదుల చర్య సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని తెలిపారు. సుప్రీంకోర్టు మరియు హైకోర్టు ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకమని విన్నవించారు. అందువల్ల ఆ రిజర్వేషన్ ఉత్తర్వులను కొట్టివేయాలని, ఎన్నికలు నిర్వహించకుండా ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ప్రతివాదుల వాదనలు వినకుండా ఉత్తర్వులు ఎలా జారీ చేస్తామని ప్రశ్నించారు. తదుపరి విచారణ ఈ నెల 30 కి వాయిదా వేశారు.

ఆ అనర్హత చెల్లదు

- ఎన్నికల ఖర్చు వివరాలు ఇవ్వని అభ్యర్థులకు ఊరట
- ఎన్నికల సంఘం ఉత్తర్వులను కొట్టేసిన హైకోర్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎన్నికల ఖర్చు వివరాలు సమర్పించని అభ్యర్థులకు హైకోర్టులో ఊరట లభించింది. గతంలో జరిగిన జడ్‌పీటీసీ/ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో చేసిన ఖర్చు వివరాలు సమర్పించని అభ్యర్థులు వచ్చే మూడేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులంటూ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం 2017లో జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ పి.కేశవరావు గురువారం ఈ మేరకు తీర్పును వెలువరించారు. తమకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేయడాన్నిసవాలు చేస్తూ గత ఎన్నికల్లో పోటీ చేసి, ఖర్చు వివరాలు నిర్దేశిత సమయంలో సమర్పించని పలువురు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హైకోర్టు ను ఆశ్రయించారు.

ఏపీ, తెలంగాణ పంచాయత్ రాజ్ చట్టం,1994 ప్రకారం వచ్చే మూడేళ్ల వరకు ఎలాంటి పదవులకు పోటీ చేసేందుకు అనర్హులని పేర్కొంటూ ఎన్నికల ఖర్చు వివరాలు సమర్పించని అభ్యర్థులందరికీ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వులు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని, రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 16, మరియు 21 లను ఉల్లంఘించడమే అవుతుందని పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదించారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేస్తూ తీర్పును వెలువరించారు.

సర్పంచే సర్వాధికారి!



పంచాయతీ కథలు 8

పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి గణాంకాలు కూడా ఎంతో కీలకమైనవి. గ్రామ పంచాయతీల గణాంకాల ద్వారా గ్రామాల్లో ఎంతమందికి సొంత ఇళ్లు లేవు, మరెంతమందికి భూమి లేదు, వయో వృద్ధులు ఎంతమంది, అక్షరాస్యులు, నిరక్షరాస్యుల లెక్కలు ఇతరత్రా సమాచారం అందుబాటులో ఉంటే గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపొందించడం తేలిక అవుతుంది. గ్రామ పంచాయతీల సమాచారంతో కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ కూడా సరైన దిశలో ప్రణాళికలు, పథకాలు రూపొందించడం, అమలు చేయడం సాధ్యమవుతుంది. స్థానిక ప్రణాళికల తయారీకి కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాక కొన్ని మార్గదర్శకాలను కూడా రూపొందించింది. ఇందులో మొదటి పంచాయతీ సామర్థ్యం, రెండవది గణాకాల వినియోగం, మూడవది ప్రజల భాగస్వామ్యం.

పంచాయతీ రాజ్ వ్యవస్థ సక్రమంగా నడవడానికి ఎన్నికైన ప్రజా ప్రతినిధుల పాత్ర ఎంత సమర్ధవంతంగా ఉంటుందన్న దాని బట్టి కూడా ఉంటుంది. పంచాయతీల నిర్వహణలో, ప్రణాళికలు రూపొందించడంలో ప్రభుత్వ అధికారుల ప్రమేయం ఎక్కువగా ఉందని, సర్పంచులు, వార్డు మెంబర్లను పక్కనబెడుతున్నారనే ఫిర్యాదులు కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖకు వెల్లువెత్తాయి. అయితే పంచాయతీ రాజ్ వ్యవస్థ అమల్లోకి వచ్చిన 1990 నాళ్లకి ప్రస్తుత పరిస్థితికి ఎంతో తేడా ఉందంటున్నారు ఈ శాఖ అధికారులు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాలు భారీగా అమలవుతున్నాయని, వాటికి కేటాయించే నిధుల్లో నిర్వహణ కోసం గణనీయ మొత్తాలను వెచ్చిస్తున్నారని చెబుతున్నారు. ఉదాహరణకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల్లో అయిదు నుంచి ఆరు శాతం వరకు నిర్వహణా వ్యయంగా ఉంటోంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో నాలుగు శాతం వరకు, జాతీయ సామాజిక సహాయ కార్యక్రమంలో మూడు శాతం నిధులను నిర్వహణ కోసం కేటాయిస్తున్నారు. కనీసంగా ఈ మూడు కార్యక్రమాల నిర్వహణ నిధులతో పంచాయతీలకు పూర్తిస్థాయి, విద్యార్హతలున్న గ్రామ కార్యదర్శిని నియమించుకోవడం సాధ్యమవుతుంది.

సలహాలు, సూచనలకే గ్రామ కార్యదర్శి

ఈ రోజుల్లో ప్రతి పంచాయతీకీ కనీసం డిగ్రీ వరకు చదువుకున్న గ్రామ కార్యదర్శుల అవసరముంది. స్వయం సహాయక బృందాలకు డేటా ఎంట్రీ కోసం కంప్యూటర్లు కూడా అందిస్తున్నారు. మారిన ఈ పరిస్థితుల్లో పంచాయతీలు కేవలం గ్రామంలో వసూలు అయ్యే లేదా రాష్ట్రాలు కేటాయించే బొటబొటి నిధులతో నడవడం లేదు. పంచాయతీల స్థాయి, ప్రమాణం పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు ఎక్కువగా దృష్టి పెట్టడం కూడా సహజంగా పెరుగుతుంది. అయితే ఇక్కడే ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయం, సహకార వైఖరి అవసరమవుతుంది. ప్రభుత్వ నిర్దేశిత నిబంధనలను అమలు చేయడం ప్రభుత్వ అధికారి ధర్మమైతే, గ్రామానికి అవసరమైన చర్యలను తీసుకొనే అధికారం గ్రామ సర్పంచుకి, వార్డు సభ్యులకూ ఉంటుంది. ఈ రెండు వ్యవస్థలు జోడెద్దుల్లాగా పని చేస్తే పంచాయతీలు సజావుగా సాగుతాయి. గ్రామ కార్యదర్శులుగా నియమితులయ్యే వారు కేవలం సలహాలు, సూచనలు ఇవ్వగలరే కాని తుది నిర్ణయాలు తీసుకోలేరు. ఈ అధికారం గ్రామ పంచాయతీ సర్పంచు, వార్డు సభ్యులతో కూడని కమిటీకి మాత్రమే ఉంటుంది. ఇక్కడ కార్యదర్శి పాత్ర కేవలం పంచాతీయలకు సహకారం అందించడం మాత్రంగానే ఉంటుంది. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులకు అవగాహన పెంచడం, వారికి రాజ్యాంగపరంగా సక్రమించిన అధికారాలను గుర్తు చేయడం అవసరంగా ఉంటుంది.

భారత్‌పై యూఏఈ గెలుపు

చివరివరకు పోరాడి 2-0 తేడాతో భారత్ ఓటమి

అబుదాబి: ఆసియాకప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఆతిథ్య యూఏఈ జట్టు చేతిలో భారత్ 0-2 తేడాతో పరాజయం పాలైంది. గురువారం జరిగిన గ్రూప్ ఎ పోరులో ప్రారంభం నుంచి ఇరు జట్లు హోరాహోరీగా పోరాడాయి. ఆట 7, 11, 28వ నిమిషాల్లో భారత్‌కు కార్నర్ అవకాశాలు వచ్చాయి కాని వాటిని గోల్స్‌గా భారత ఆటగాళ్లు మలచలేకపోయారు. 34, 38వ నిమిషాల్లో యూఏఈకు కార్నర్ లు లభించినప్పటికి భారత డిఫెన్స్ ఆటగాళ్లు వారి ప్రయత్నాలను విజయవంతంగా అడ్డుకోగలిగారు. ఆట 41 నిమిషంలో యూఏఈ గోల్ చేసి 1-0 ఆధిక్యాన్ని పొందింది. అలీ అహ్మాద్ మబ్‌కోత్ అందించిన పాస్‌ను ఖ్ఫాన్ ముబారక్ అద్భుత కిక్‌చేయగా భారత గోల్ కీపర్ దాన్ని నిలువరించలేకపోయాడు. రెండో అర్థభాగం ఆటలో ఇరు జట్లు దూకుడుగా ఆడాయి. ఆటగాళ్లు గాయపడటంతో స్వల్పంగా ఆటకు అంతరాయం కలిగింది. 53వ నిమిషంలో భారత్‌కు ఫ్రీ కిక్ లభించినప్పటికి.. ఉదాంత్ సింగ్ కొట్టిన కిక్ బంతి గోల్ పోస్ట్ రాడ్‌కు తగలింది. 88వ నిమిషంలో యూఏఈ ఆటగాడు అహ్మాద్ మబ్‌కోత్ గోల్ చేసి యూఏఈ లీడ్‌ను 2-0కు పెంచాడు. ఆట ముగిసేసరికి మళ్లీ గోల్స్ నమోదు కాలేదు.







సోనియా లాథర్ (57 కేజీ) 2వ ర్యాంకు

న్యూఢిల్లీ: మహిళా బాక్సింగ్ దిగ్గజం ఎంసి మేరీకోమ్ అంతర్జాతీయ బాక్సింగ్ అసోసియేషన్(ఏఐబీఏ) తాజా ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నెంబర్ వన్‌గా నిలిచింది. గురువారం ఏఐబీఏ ప్రపంచ బాక్సర్ల తాజా ర్యాంకులను విడుదల చేసింది. 2018 నవంబర్ న్యూఢిల్లీలో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో మణిపూర్‌కు చెందిన మేరీ కోమ్ 48 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సాధించి ఈ పోటీల్లో వరుసగా ఆరుసార్లు గెలిచిన తొలి మహిళా బాక్సర్‌గా నిలిచింది. ఏఐబీఏ తాజా ర్యాంకిగుల్లో మేరీ 1700 పాయింట్లతో అగ్రభాగాన నిలిచింది. 36 ఏళ్ల మేరీకోమ్ 2020 ఒలింపిక్స్‌లో 48 కిలోల విభాగాన్ని చేర్చకపోవడంతో 51 కిలోల విభాగంలో బరిలోకి దిగనుంది. ముగ్గురు పిల్లల తల్లి మేరీకోమ్ 2018 ఏడాదిని అద్భుత ప్రదర్శనతో ముగించింది. కామన్వెల్త్ క్రీడల్లో బంగారు పతకంతోపాటు పోలండ్ లో జరిగిన పోటీల్లో కూడా బంగారు పతకాన్ని గెలుచుకుంది. బల్గేరియాలో జరిగిన స్ట్రాండ్జా మెమోరియల్ టోర్నీలో మేరీ రజతాన్ని అందుకుంది. ఏఐబీఏ ర్యాంకుల్లో భారత్‌కు చెందిన పింకి జాంగ్రా 51 కిలోల విభాగం ర్యాంకుల్లో 8వ ర్యాంకులో ఉండగా, ఆసియా క్రీడల్లో రజత పతక విజేత మనీషా మౌన్ 54 కిలోల విభాగంలో 8వ ర్యాంకులోనే ఉంది. 2016 వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో రజత పతక విజేత సోనియా లాథర్ 2018లో అంతగా రాణించనప్పటికి 57 కిలోల విభాగంలో రెండో స్థానంలో ఉంది. ఆసియా క్రీడల్లో కూడా సోనియాకు పతకం రాలేదు. 2018 వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో 64 కిలోల విభాగంలో కాంస్యం గెలిచిన సిమ్రన్‌జిత్ కౌర్ తన విభాగంలో నాలుగో స్థానంలో ఉంది. సిమ్రన్ కొన్ని రోజుల క్రితం జరిగిన జాతీయ బాక్సింగ్‌లో చాంపియన్‌గా నిలిచింది. సరితాదేవి 16వ స్థానంలో ఉంది. లవ్‌లీనా బోర్గోహెయిన్ 69 కిలోల విభాగంలో ఐదో స్థానంలో నిలిచింది. పురుషుల బాక్సింగ్ ర్యాంకులను ఏఐబీఏ అప్‌డేట్ చేయలేదు.

వరల్డ్ నెం.1 మేరీకోమ్

ఏఐబీఏ తాజా ర్యాంకులు వెల్లడి



పింకీ జాంగ్రా (51కేజీ) 8వ ర్యాంకు



లవ్‌లీనా (69 కేజీ) 5వ ర్యాంకు

భారత్‌లో ఆస్ట్రేలియా పర్యటన

హైదరాబాద్ వేదికగా తొలి వన్డే మ్యాచ్



న్యూఢిల్లీ: భారత పర్యటనలో ఆస్ట్రేలియా రెండు టీ20 లు, ఐదు వన్డేలు ఆడనుంది. గురువారం ఆసీస్ పర్యటన వివరాలను బీసీసీఐ మీడియాకు వెల్లడించింది. వచ్చే నెల 24నుంచి ప్రారంభమయ్యే టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్‌కు బెంగళూరు వేదికకానుంది. 27న విశాఖలో రెండవ మ్యాచ్ జరగనుంది. కాగా ఐదు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మ్యాచ్ మార్చి 2న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా జరుగుతుంది. మార్చి 5న రెండో వన్డే నాగపూర్‌లో, 8న మూడో వన్డే రాంచిలో, 10న నాలుగో వన్డే మొహాలీలో. 13న ఐదో వన్డే ఢిల్లీలో జరుగనుంది. టీ20 మ్యాచ్‌లు నైట్ మ్యాచ్‌లుగా సాగుతాయి. ఇవి రాత్రి 7గంటలకు ప్రారంభమవుతాయి. వన్డేలు డే అండ్ నైట్ మ్యాచ్‌లుగా సాగుతాయి. ఇవి మధ్యాహ్నం 1.30గంటలకు ప్రారంభమవుతాయని బీసీసీఐ తన ప్రకటనలో తెలిపింది. ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియాకు ఇది చివరి పర్యటన. మే 30న ప్రారంభం కానుంది. కాగా భారతదేశం ప్రపంచకప్‌కు ముందు దేశంలో జింబాబ్వేతో.. అనంతరం ఐపీఎల్‌ను ఆడనుంది.

పాండ్యా,రాహుల్‌పై నిషేధం నీడలు

రెండు వన్డేల్లో నిషేధించాలని సీవోఏ ఛైర్మన్ వినోద్ రాయ్

విభేదించిన సీవోఏ సభ్యురాలు డయానా

న్యూఢిల్లీ: కాఫీ విత్ కరణ్ టీవీ ప్రదర్శనలో వివాదాస్పద వ్యాఖ్యలతో బీసీసీఐ షోకాజ్ నోటీసులను అందుకున్న భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, రాహుల్‌లు రెండు వన్డేల నిషేధాన్ని విధించాలని సీవోఏ ఛైర్మన్ వినోద్ రాయ్ సూచించాడు. కాగా సీవోఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ వీరిపై విచారణ జరపాలని బీసీసీఐ లీగల్ సెల్‌కు సిఫారసు చేసింది. ఒకవేళ నిషేధాన్ని విధిస్తే.. ఆస్ట్రేలియాతో ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో రెండు వన్డేలు వీరు మిస్సవుతారు. శనివారం సిడ్నీలో తొలి వన్డే మ్యాచ్ జరుగనుంది. పాండ్యా వివరణతో నేను సంతృప్తి పడలేదు. వీరిద్దరిపై రెండు మ్యాచుల నిషేధాన్ని విధించాలని సిఫారసు చేస్తున్నాను. అయితే తుది నిర్ణయం కమిటీ సభ్యురాలు డయానా ఎడుల్జీ అంగీకరిస్తేనే ఈ నిషేధం అమల్లోకి వస్తుంది అని వినోద్ రాయ్ గురువారం మీడియాకు తెలిపాడు. ప్రముఖ చిత్ర నిర్మాత కరణ్ జోహర్ హోస్ట్‌గా వ్యవహరించే కాఫీ విత్ కరణ్ టీవీ షోలో 25 ఏళ్ల ఆల్ రౌండర్ పాండ్యా, బ్యాట్స్‌మన్ కెఎల్ రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాండ్యా మహిళలతో తన వ్యక్తిగత సంబంధాలు, తన శృంగార వాంఛలు తీర్చుకున్న సందర్భాలను వివరించాడు. అనంతరం పాండ్యా వైఖరిపై విమర్శలు రావడంతో.. క్షమాపణలు కోరుతూ.. కాఫీ విత్ కరణ్ షోలో నా వ్యాఖ్యల వల్ల బాధపడిన వారందరిని క్షమించమని కోరుతున్నాను. అని ట్వీట్ చేశాడు. ఈ ఇంటర్వ్యూలో రాహల్ దూరంగా ఉన్నాడు. బీసీసీఐ ఇచ్చిన షోకాజ్ నోటీసులకు 24గంటలు గడువున్నప్పటికి.. వీరు వెంటనే స్పందించారు. చాట్ షోలో నా వ్యాఖ్యలు వీక్షకుల మనోభావాలను దెబ్బతీస్తాయనుకోలేదు. దీనికి నేను మనస్ఫూర్తిగా విచారాన్ని వ్యక్తం చేస్తున్నాను అని బీసీసీఐకిచ్చిన వివరణలో తెలిపాడు. ఆ వ్యాఖ్యలు చేయడం వెనక ఎలాంటి దురద్దేశం లేదు. ఎవరి మనోభావాలను కించపర్చాలనుకోలేదు. ఇటువంటి ఘటనలు మళ్లీ పునరావృతం కావని మీకు హామీఇస్తున్నానని తెలిపాడు. డయానా లీగల్ అభిప్రాయాన్ని కోరింది. ఆమె ఆమోదిస్తేనే వీరిపై నిషేధం అమలవుతుంది. నా మటుకు ఈవిధంగా హీనంగా మాట్లాడటం తప్పుగా అనుకుంటున్నాను అని వినోద్ రాయ్ చెప్పాడు. డయానా బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరీ, ట్రెజరర్ అనురుద్ చౌదరీల అభిప్రాయాన్ని కోరింది. అనిరుద్ ఈ విషయంపై స్పందిస్తూ.. పాండ్యా, రాహుల్‌లను వెంటనే నిషేధించాలన్నాడు. ఒక వినోద కార్యాక్రమంలో బీసీసీఐ కాంట్రాక్టు నిబంధనలు ఉల్లంఘించి పాల్గొనటంపై దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశాడు. ఆటగాళ్లు మహిళలతో సంబంధాలు వెల్లడించడంతో మ్యాచ్ ఫిక్సర్లు, బుకీలు ఇటువంటివారిని తేలికగా తమకు అనుకూలంగా మార్చుకుంటారన్నాడు.





అంతర్జాతీయ రెగెట్టా పోటీల్లో

తెలంగాణ సెయిలర్ల జోరు



10 పతకాలతో రికార్డు

హైదరాబాద్: యూత్ నేషనల్, ఇండియా ఇంటర్నేషనల్ రెగెట్టా-2019 పోటీల్లో తెలంగాణ సెయిలర్లు సత్తా చాటారు. చెన్నై వేదికగా సాగిన ఈ పోటీల్లో తెలంగాణ సెయిలర్లు యూత్ నేషనల్ పోటీల్లో 5 ఇంటర్నేషనల్ పోటీల్లో 5 పతకాలు సాధించారు. వీటిలో 2 స్వర్ణాలు, 2 రజతాలు, 6 కాంస్యాలున్నాయి. గురువారం ముగిసిన ఈ పోటీల్లో ఎక్కువ పతకాలు సొంతం చేసుకున్న రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించింది. సముద్రతీరం లేని తెలంగాణ రాష్ట్రం, భౌగోళికంగా నాలుగు వైపులా భూమిని సరిహద్దుగా కలిగి వుండి రెగెట్టా పోటీల్లో రాణించడం విమర్శకులను సైతం ఆశ్చర్యపరిచింది. సెయిలర్లందరూ హైదరాబాద్‌లోని యాచ్ట్ క్లబ్‌లో శిక్షణ పొందారు. ఈ పోటీల్లో తెలంగాణ 59 మంది సెయిలర్లతో బరిలోకి దిగి మొత్తం పది పతకాలను కైవసం చేసుకుంది. 12 దేశాలు పాల్గొన్న ఇండియా ఇంటర్నేషనల్ రెగెట్టాలో జై కిరణ్ బొల్లి బాలుర విభాగంలో, బాలికల విభాగంలో మహబూబా తుంగరలు రెండు కాంస్యాలను అందించారు. ఇది పోటీలో స్వీడన్ బాలుర, బాలికల విభాగాల్లో స్వర్ణాలను గెలుచుకుంది. రజతాలను బాలుర విభాగంలో కర్నాటక సెయిలర్ విజయ్ సబావత్, బాలికల విభాగంలో మధ్య ప్రదేశ్‌కు చెందిన రితికా డాంగి సొంతం చేసుకుంది. యూత్ నేషనల్ అండ్ ఇండియా ఇంటర్నేషనల్ రెగెట్టాలో పోటీచేసిన జూనియర్ విభాగానికి చెందిన మహిళా సెయిలర్లు రవలి పరాండి, వైష్ణవి వీరవంశం రెండు స్వర్ణాలు, రెండు రజతాలను రాష్ట్రానికి అందించారు. బాలికల విభాగంలో సాన్యా జబీన్ తన తొలి అంతర్జాతీయ పతకం(కాంస్యం) గెలుచుకుంది. యూత్ నేషనల్స్‌లో బాలుర విభాగంలో గౌతం కానకంట్లా కాంస్యాన్ని అందుకోగా, యూత్ నేషనల్స్ లేజర్ రేడియల్ విభాగంలో రిషభ్ నాయర్ మరో కాంస్యాన్ని రాష్ట్రానికి అందించాడు. మరో రెండు కాంస్యాలు.. రామదాస్ సబావత్(బాలుర విభాగం యూత్ నేషనల్స్), కార్తిక్ నీనావత్(బాలుర విభాగం ఇండియా ఇంటర్నేషనల్ పోటీల్లో) కాంస్యాలు సాధించారు. తమ కోచ్ సుహెమ్ షేక్ ఇచ్చిన శిక్షణ, సలహాలు తమకు బాగా ఉపయోగపడ్డాయని విజేతలు తెలిపారు.

క్రీడాప్రభ

గ్రాండ్ స్లామ్ డ్రా కు

మ్యాచ్ దూరంలో ప్రజ్నేష్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ క్వాలిఫయర్ టోర్నీలో ప్రజ్నేష్ గుణేశ్వరన్ గ్రాండ్‌స్లామ్‌లో ప్రవేశించేందుకు మరో మ్యాచ్ దూరంలో ఉండగా, అంకిత రైనా, రామ్‌కుమార్ రామనాథన్‌లు పోరాడి ఓడి టోర్నీకి దూరమయ్యారు. పురుషుల సింగిల్స్‌లో... ఆరో సీడ్ ఆటగాడిగా బరిలోకి దిగిన ప్రజ్నేష్ గురువారం స్పెయిన్‌కు చెందిన ఎన్‌రిక్ లోపెజ్ పెరెజ్‌ను 6-3, 6-3తేడాతో ఓడించాడు. మ్యాచ్ అనంతరం ప్రజ్నేష్ మాట్లాడుతూ.. బుధవారం నాటి మ్యాచ్ కంటే ఈరోజు బాగా ఆడాను. ప్రారంభంనుంచి ఆధిక్యతతో కొనసాగాను. ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాను. నా సర్వీస్‌ను చాలాసార్లు దక్కించుకోగలిగాను. ఈ మ్యాచ్‌లో మానసికంగా, శారీరకంగా సిద్ధమై ఆడాను. అవకాశం దొరికినప్పుడల్లా దూకుడు పెంచాను. నాకు కొన్ని మంచి అవకాశాలు కూడా వచ్చాయి. శుక్రవారంజరిగే ఫైనల్ రౌండ్‌కోసం ఎదురుచూస్తున్నాను అని చెప్పాడు. నేడు జరిగే మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ 112 ప్రజ్నేష్, జపాన్‌కు చెందిన యోసుకె వాటనకి (వరల్డ్ నెంబర్ 192)తో తలపడనున్నాడు. నేటి మ్యాచ్‌లో ప్రజ్నేష్ విజయం సాధిస్తే.. అది అతనికి గ్రాండ్‌స్లామ్‌లో తొలి మెయిన్ డ్రా పోటీగా నిలుస్తుంది. 2018 ఫ్రెంచ్ ఓపెన్లో ప్రజ్నేష్ క్వాలిఫయర్ చివరి మ్యాచ్‌లో మెయిన్ డ్రా మిస్ అయ్యాడు. గాయపడ్డ యూకి బాంబ్రి 2018లో నాలుగు గ్రాండ్ స్లామ్‌లు ఆడాడు.

రామ్ కుమార్ ఓటమి

పురుషుల సింగిల్స్‌లో బరిలోకి దిగిన 132వ స్థానంలో ఉన్న రామ్‌కుమార్ జర్మనీకి చెందిన మోలెకర్(207 ర్యాంక్)తో పోరాడుతూ గెలుపు అంచులవరకు చేరి ఓటమి పొందాడు. తొలి సెట్‌ను 7-5తో గెలిచిన రామ్‌కుమార్, రెండో సెట్లో 5-7తో మూడో సెట్లో 6-7(6) తేడాతో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. నేను సర్వీసులు బాగా చేశాను. చివరి సెట్లో 3-3వద్ద ఉన్నప్పుడు నేను బ్రేక్ పాయింట్ సాధించాను. అనంతరం నేను కొట్టిన షాట్ కోర్టు బయట పడటంతో పాయింట్‌ను కోల్పోయాను. మహిళల సింగిల్స్‌లో అంకితరైనా పోరు కూడా ముగిసింది. ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించిన అంకిత ఒక సెట్ గెలిచి మిగతా రెండు సెట్లు ప్రత్యర్థికి కోల్పోవడంతో పరాజయం పాలైంది. స్పెయిన్‌కు చెందిన 29వ సీడ్ క్రీడాకారిణి పౌలా బడోసా గిబెర్ట్(142 ర్యాంక్) క్రీడాకారిణి చేతిలో 6-4, 2-6, 4-6 తేడాతో పరాజయం పాలైంది. దూకుడుగా ఆడాలని ప్రయత్నించాను. అయితే ఆవిధంగా చేయలేకపోయాను. మూడో సెట్లో మళ్లీ దూకుడుగా ఆడాను. గిబెర్ట్ అద్భుతంగా సర్వీస్‌లు చేసి విజయం సాధించింది అని మ్యాచ్ అనంతరం అంకిత వ్యాఖ్యానించింది.

టాప్‌కు చేరటం సులభం కాదు



బెంగళూరు: 2019 సీజన్‌లో తిరిగి పోటీల్లోకిరావాలనుకుంటున్న టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మునపటి అగ్రస్థానాన్ని అందుకోవడం అంత తేలిక కాదని తెలిపింది. గురువారం, బంగళూరులో ది లేబెల్ బజార్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభ కార్యక్రమంలో సానియా తన సోదరి అనమ్ మీర్జాతో కలిసి పాల్గొంది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సానియా ఇటీవల బిడ్డకు తల్లిగా మారాను, ఒక భార్యగా, తల్లిగా, క్రీడాకారిణిగా కొనసాగుతూ... మళ్లీ ఆటలోకి ఈ ఏడాదిలో వస్తున్నాను. నాకు తెలుసు మునపటి స్థాయికి చేరడం అంత తేలిక కాదని. కాని నా శక్తి మేరకు రాణించాలనుకుంటున్నాను అని తెలిపింది. ఇప్పటికే సానియా టెన్నిస్ శిక్షణను ప్రారంభించింది. ఈ ఏడాది చివరినాటికి పూర్తి స్థాయి క్రీడాకారిణిగా తిరిగి పుంజుకోవాలనుకుంటున్నానని సానియా వివరించింది.

చెన్నైపై బెంగళూరు గెలుపు

బెంగళూరు: పీబీఎల్ సీజన్ 4 చివరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరు రాప్టర్స్, 3-2తో చెన్నై స్మాషర్స్‌ను ఓడించింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో కిదాంబి(బెంగళూరు) ట్రంప్ మ్యాచ్‌గా ఆడి చోంగ్(చెన్నై)ను 15-10, 15-10తో ఓడించాడు. కశ్యప్(చెన్నై) ట్రంప్ మ్యాచ్‌గా ఆడి ప్రణీత్(బెంగళూరు) చేతిలో 11-15, 12-15తేడాతో ఓడాడు. ఇప్పటికే సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకున్న బెంగళూరు ఈ గెలుపుతో నాలుగో స్థానం నుంచి మూడో స్థానంలోకి చేరింది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively
Interaction
For
Ever

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
శుక్రవారం 11 జనవరి 2019





సంక్రాంతి వర్ణ శోభితవై..!

జీవమొలికే
ఆకుపచ్చ
జీవితాన్నిచ్చే రంగు...
పంటరంగు చీరతో
ఇల్లంతా పచ్చని తోరణాలు
కడదాం
సంక్రాంతి లక్ష్మికి స్వాగతం
చెబుదాం

పులుపు
తీపి కలయికల
రేగిపళ్లు
పిల్లల తలపై మురిపెంగా
జారతాయి భోగిపళ్లుగా..
అదేరంగుని
ధరించి....ఆశీస్సులిద్దాం
కుటుంబంలో ఆప్యాయతని
రంగరిద్దాం

సంక్రాంతి పాడిపంటలతో వస్తుంది....

ఇంటింటికీ కొత్తకళ తెస్తుంది...

రంగవల్లులతో, హరిదాసు కీర్తనలతో, గంగిరెద్దుల నాట్యంతో...

నేనొచ్చానంటూ తన ఉనికిని చాటుతుంది...

సంక్రాంతి వర్ణశోభితంగా అందంగా వస్తుంది...

అవును...సంక్రాంతి రోజుల్లో ప్రత్యేకంగా కనిపించే రంగులు...చాలా ఉంటాయి.

సంక్రాంతిలక్ష్మి ధరించి వచ్చే వర్ణాలివే...

వీటిని ఎంపిక చేసుకుంటే...మనం పండుగ ముస్తాబు చేసుకున్నట్టుగా కాదు...

పండుగకే మనం ముస్తాబు చేసినట్టుగా ఉంటుంది మరి

- వి. దుర్గాంబ







రంగులొలికిన
ముగ్గు రమణీయత
కంటికి ఇంపు ఇంటికి సొంపు
ఎన్నెన్నో వర్ణాల మేళవింపైన
మల్టీ రంగుల చీరలో భిన్న
నైపుణ్యాలు చాటుదాం

పాలుపొంగినట్టే
సిరులు పొంగుతాయని...
తెలుపురంగు చీరలో
ధవళ వర్ణ శోభితలై...
పండుగ స్వచ్ఛతకు, పాపల
పోషణకు
అంకితమవుదాం

సుకుమారమైన
బంతిపూల సొగసు
గుమ్మాలకు కడితే మాలలు
అక్కడే ఊగుతుంది మన మనసు
బంతి వర్ణం చీరతో గడపకు
పసుపు రాద్దాం

మెలికల
ముగ్గువేయనిదే
సంక్రాంతికి స్వాగతం
చెప్పినట్టు కాదు
జీవితం మెలుపుల్లాగే ఉన్న
ఆ ముగ్గులేసిన చీర
కట్టి చెబుదాం...గట్టివాళ్లమని

చెరుకుగడల
తీపి
పైకి కఠినమైనా లోలోపల
రుచులూరు రసాలు
చెరుకు మెరుపు రంగుల్లో
మంచి మనసుతో మెరిసి
మురిసిపోదాం

* రంగవల్లిక *



11 చుక్కలు
6 వచ్చేవరకు
మధ్యచుక్క

మీరూ ముగ్గులు పంపొచ్చు

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ,
8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75,
రోడ్ నెం:9, జూబ్లీహిల్స్,
హైదరాబాద్-28
lifepage2012@gmail.com



డి. కల్యాణి, జనగాం

ఇదే మేటి ప్రపంచ యాత్ర!

ఆశయం బలంగా ఉంటే...దానిముందు ఎలాంటి ఆటంకాలు పనిచేయవు. కేరళలోని కొచ్చికి చెందిన విజయన్ దంపతులకు ఇది బాగా వర్తిస్తుంది. పెద్దకలలు కనండి...వాటిని సాకారం చేసుకోండి... అనేమాట వీరికి బాగా వర్తిస్తుంది. 'మనమా విదేశీ ప్రయాణమా...ఎలా చేయగలం...' అని పెదవి విరిచే సగటు మధ్యతరగతి మనుషులు విజయన్ దంపతులను గురించి తెలుసుకుని తీరాలి. వీరిద్దరూ ఇప్పటివరకు 23దేశాలు తిరిగి వచ్చారు. ఎలా సాధ్యమైంది...అనేది చాలా విచిత్రమే. అలాంటి ఆశ్చర్యాన్నే వ్యక్తం చేసిన...మహీంద్రా గ్రూపు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా...వారి సంపద అంతా...వారు జీవితాన్ని చూసే విధానమే ఉందన్నారు. ఈసారి కొచ్చికి వెళ్లినప్పుడు తప్పకుండా విజయన్ టీస్టాల్‌కి వెళతానని...టీ తాగి... విదేశీ ప్రయాణాల్లో వారు సేకరించి...షాపులో ఉంచిన బిల్లులు వగైరాలను చూస్తానని ఆయన ట్విట్టర్లో పేర్కొన్నారు. ఫోర్బ్స్ పత్రిక పేర్కొనే అత్యంత ధనవంతుల లిస్టులో ఉన్నవారు ధనవంతులు కాదని, తన దృష్టిలో వీరే ధనవంతులంటూ ఆనంద్ మహీంద్రా తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఒక ట్రావెల్ బ్లాగర్ రూపొందించిన విజయన్ దంపతుల వీడియోని... తిరిగి ట్వీట్ చేస్తూ...ఆయన తన అభిప్రాయాలు వెల్లడించారు.

జీవితమంటే పెద్ద భవంతులు, బ్యాంక్ బ్యాలన్సులు, విలాసాలు...లాంటి మూసధోరణే కాదని...మనకు నచ్చినట్టుగా జీవితాన్ని డిజైన్ చేసుకోవచ్చని విజయన్ దంపతులు నిరూపించారు. వీరు ప్రతిసారీ ప్రయాణం ప్లాన్ చేసుకున్నపుడు బ్యాంకునుండి రుణం తీసుకుంటారు. తిరిగి వచ్చాక దాదాపు మూడేళ్లపాటు కష్టపడి బ్యాంకు అప్పుని తీరుస్తుంటారు. అన్నిదేశాలకు సంబంధించిన పోస్టర్లను తమ స్టాల్లో గోడలకు తగిస్తుంటారు. అన్ని దేశాలకు సంబంధించిన బిల్లులను కూడా ప్రదర్శనకు ఉంచుతున్నారు.



మనపై మనకున్న జాలే ఆపుతుంది

విజయన్, మోహన ఇద్దరి వయసు ఇప్పుడు దాదాపు 70ఏళ్లు. 45ఏళ్ల క్రితం వారి వివాహం అయింది. విజయన్ భార్య మోహన పెళ్లికాకముందు ఆమె సొంతఊరు ఎర్నాకులంని కూడా దాటి ఎరుగదు. తరువాత భర్తతో కలిసి లండన్, ఈజిప్టు, జోర్డాన్, ప్యారిస్, స్విట్జర్లాండ్, వెనిస్, సింగపూర్ తదితరదేశాలు ప్రయాణించింది. 'విదేశాలను చూసిరావాలంటే ఒక తోడు అవసరం..అంతేకాదు ఆ వ్యక్తికి మన మనసు అర్థమై ఉండాలి...నా భార్య నాకు అలాంటి తోడుగా నిలిచింది... ఆమే నా శక్తికి మూలం' అంటారు విజయన్. వివిధ దేశాలు తిరిగి రావాలనే ఆశ ఉన్నా...మనకంత శక్తిలేదు కదా...అనే స్వీయజాలితో చాలామంది ఆ ప్రయత్నం చేయలేరంటారు ఆయన. ప్రయాణాల్లో ఇతరులు వంద అయిదువందల డాలర్ల నోట్లను మార్చుకుంటూ ఉంటే...తాను ఐదు పది డాలర్ల నోట్లను మారుస్తుంటానంటారు విజయన్.

రోజుకి 300రూ.ల పొదుపుతో...

విజయన్‌కి చిన్నప్పటినుండీ జీవితంలో ఉన్న ఏకైక కోరిక ప్రపంచమంతా చూడాలని. కానీ ఇది చిన్న కోరికకాదని ఆయనకూ తెలుసు. ఎందుకంటే ప్రపంచమంతా విలాసంగా ప్రయాణం చేయాలంటే కోరిక మాత్రమే ఉంటే చాలదు. బాగా ధనవంతులై ఉండాలి. కానీ విజయన్ చేస్తున్నది టీ వ్యాపారం. కొచ్చిలో సెంటర్‌లో శ్రీ బాలాజీ కాఫీ హౌస్‌ని నడుపుతున్నారు ఈ దంపతులు. రోజంతా కష్టపడితే వారు రోజుకి మొత్తం ఖర్చులు పోను 300 వందల రూపాయల చొప్పున పొదుపు చేయగలుగుతారు. మరి ఇంత చిన్న సంపాదన మీద అంత పెద్ద కలని ఎలా నిజం చేసుకోగలుతున్నారు...వీరి షాపులో ఇతర పనివాళ్లంటూ ఉండరు. వాళ్లే మొత్తం పనులు చేస్తారు. తమ ఖర్చులను చాలా వరకు తగ్గించుకుని బతకటం అలవాటు చేసుకున్నారు.

అనుకుంటే...అవుతుంది

అందరూ మిమ్మల్ని పిచ్చివాళ్లుగా భావించడం లేదా...అంటే అవునంటూనే...అందరికీ ఏదోఒక పిచ్చి ఉంటుందంటారు. నిరంతరం ఎగసిపడే సముద్రపు అలల్లాగే జీవితంలో ఏవీ ఆగవని చెబుతారు. ఇప్పటివరకు ప్రయాణంపై ఖర్చుపెట్టిన 10-15 లక్షల డబ్బుతో ఎన్నో ఆస్తులు కొనుక్కుని ఉండవచ్చు కదా...అంటే...తనకు తన ప్రయాణ అనుభవాలు, ప్రయాణాల ద్వారా పొందిన విజ్ఞానమే ఆస్తులు అంటున్నారు విజయన్. 'ఏదైతే మనం నిరంతరం మనకు మనం చెప్పుకుంటూ ఉంటామో...అది సాధ్యమై తీరుతుంది'...అంటూ తమ విజయరహస్యం వెల్లడించారు.

సనాతన వాఙ్మయంలో

అనర్ఘ రత్నం

ఎన్ని కంతాలు పఠించినా, ఎన్ని కలాలు వ్యాఖ్యానం చిందిం చినా, ఎన్ని ప్రవచనాలు ప్రవహించినా, ఎన్ని భాష్యాలు వినిపించినా, గంగ వలె, గోవు వలె, అతి పవిత్ర గీత భగవద్గీత! సమస్త ప్రపంచానికి శ్రీకృష్ణుడందించిన శాస్త్ర సర్వస్వం భగవద్గీత! అధ్యాత్మ సాధకుడికది కరదీపిక. చదువుతున్న కొద్దీ నూతన కోణాలను ఆవిష్కరించే జ్ఞాన భాండాగారం.

వస్తుంది.


దేహమే 'అసలు నీవు' కానపుడు, నీవు కర్తవూ కాదు, నీకు కర్తృ త్వమూ లేదు. జరుగుతున్న అనేక విషయాలలో నీ ప్రమేయం నిజానికి శూన్యం. ఉన్నదంతా అనుకోవటంలోనే ఉన్నది, అటువంటి భావనే కర్మ యోగం. కర్మలన్నిటికీ నీవు కర్తవు కాదు. కర్మలు జరుగుతూనే వుంటయ్.

కనుక, ఆత్మకు చూడటం అంటూ లేదు. ఉండటమే! అదీ సాక్షిగా.

'నేను చేస్తున్నాను' అనే కర్తృత్వభావం ఉన్నంతకాలం, అది కర్మే!

ఆ భావం నశించి కర్మలు జరుగుతుంటే అదే కర్మయోగం.

భగవంతుని పట్ల ఉండే తీవ్ర ఆవేశము, ఉద్విగ్నము,



తాదాత్మ్యము కలిస్తే అది భక్తి. నిర్మలము, నిశ్చలము, అరుణము, నికామము కలిగిన భక్తి భావమే భక్తియోగం.

అహం నశించి, మనసు హృదయంలో లీనమై, ఆత్మ విచారంలో నిలకడ చెందితే అది జ్ఞాన యోగం.

ఆత్మానుభవంతో జీవన్ముక్తుడై, సహజ స్థితిలో స్వాత్మానందుడై, జ్ఞానమే సాకారమైన వ్యక్తి భగవద్గీతను అరచేతిలో ఆమలకంగా అందిస్తే? అందుకోగలిగిన వాడికి అది, ఒక అపురూప ఫలం! అదొక రమణీయ గీతం! ఆ పాత మధుర సంగీతం!

'జననమరణాలు, భూత భవిష్యత్ వర్తమానాలు అనే విభజన మనం చేసుకున్నదే. కాలం అఖండం!

నీవు, నేను అన్న ద్వైతం, మనం అనుకుంటున్నదే!

అపరిణామము, కాలాద్యవిచ్ఛిన్నమైన సత్యమే శాశ్వతం. అది మార్పెరగనిది.

బంధము, బంధన, ముక్తి దేహానికేగాని ఆత్మకు లేవు.

అభ్యాసం ఒక నిరంతర ప్రక్రియ.

వైరాగ్యం ఒక అంతరంగ భావన.

ఇవన్నీ సహజ స్థితులే.

ప్రపంచమంతా పరమాత్మ రూపమే.

నీవు విస్తృతమవుతున్న కొద్దీ పరిపూర్ణత అనుభవంలోకి నీ సాధనతోనే సమాధానం పొందాలి.

మనసును నియంత్రించుకోవటం, అలోచనలను క్రమబద్ధీకరిం చుకోవటం, అభ్యాసం! నిరంతరాభ్యాసం భౌతిక వస్తువుల పరిమితిని తెలియజెప్పి, అవి అందించే సుఖ సంతోషాలు తాత్కాలికమని బోధి స్తుంది. ఒక అనుభవాన్ని కలిగిస్తుంది. అది వివేకాన్ని ప్రసాదిస్తుంది. దానితో వైరాగ్యం లభిస్తుంది. ఇకపై మిగిలినదంతా శాంతే. శాంతి లోపలే ఉన్న దని, ఎవరో యిచ్చేది కాదని, మనంతట మనమే పొందాలని అనుభవమౌతుంది.

నువ్వున్నావన్న వాస్తవమే, దైవమున్నాడనటానికి తిరుగులేని సాక్ష్యం.

పరమాత్మ ప్రకాశాన్ని దర్శించలేక పోవటానికి కారణం, కన్ను భౌతిక స్థితిలో ఉండటమే. అది పని చేయటానికి మూలమైన కార ణాన్ని, వస్తువును, శక్తిని తెలుసుకోగలిగితే, ఆ శక్తే అత్మ అని తెలుస్తుంది. మూడో కన్ను అంటే ఆత్మే! తాను చూడటానికి తన కంటె భిన్నమైన వస్తువేది ప్రత్యేకంగా లేదు

నీలో నీవు ఉంటేనే, నీవు ధ్యానివి!

నీతో నీవు వుంటేనే, నీవు యోగివి!

వాస్తవంలో జీవించమని, వాస్త వాన్ని గ్రహించమని, ఆత్మే వాస్తవ మని భగవద్గీత బోధిస్తుంది.

అనుభవజ్ఞానమే అసలు విద్య

అనుభవమే గురువు

అనుభవమే ఆత్మ

సర్వ ప్రాణుల హృదయాలలో ఉన్న 'నేను' ఆత్మే!



- వి.యస్.ఆర్. మూర్తి
9440603499

చింతన

అన్ని జీవాలలోనూ పరమాత్మనే చూసే వారికి కొన్ని అలౌకికమైన చర్యల వల్ల వచ్చే బాధలు తెలియవు. అలాగే సమాధి స్థితిలోనికి వెళ్లి చుట్టూ ఏమి జరుగుతున్నదో తెలియనివారు ఎందరో. అటువంటివారు మన వాఙ్మయంలో ఎంతో మంది కనిపిస్తారు. శరీరం చుట్టూ పుట్టలు వెలసినా తెలియని వాల్మీకి,


సదాశివబ్రహ్మేంద్రుడు

చ్యవనుల విషయం తెలిసిందే. పరీక్షిత్తు వేటలో అలసిపోయి శమీకుని ఆశ్రమానికి వచ్చి నీరు అడిగితే ఆయనకు పరీక్షిత్తు ఏమి అడిగాడో తెలియలేదు. కోపంలో వివేకం నశించి పరీక్షిత్తు ఆయన మెడలో

సమాధినిష్ఠులకు బాధలు తెలియవు


మహనీయుల జీవకారుణ్యం

చచ్చిన పామును వేసినా అదీ ఆయనకు తెలియలేదు. అది చూచిన ఆయన కుమారుడు శృంగి మాత్రం పరీక్షిత్తును శపించాడు. సమాధి స్థితిలో ఉండగా సర్వం మరచిన వారు ఆ రోజుల్లోనూ ఉన్నారు. ఆధునిక కాలంలోనూ ఉన్నారు. 17 - 18 శతాబ్దాలకు చెందినవానిగా భావిస్తున్న సదాశివ బ్రహ్మేంద్ర యోగి నదుల నీట మునిగి లోపల తపస్సమాధిలో నెలల తరబడి ఉండేవారని చెబుతారు. ఇక గజానన్ మహరాజ్ విషయానికి వస్తే ఆయన ఒకసారి తన భక్తులు బంకట్ లాల్, పీతాంబరుడు, భాస్కరుడు మొదలైనవారితో పొలానికి వెళ్లారు. అక్కడ ఏపుగా పెరిగి జొన్న చేను కనిపించింది. అందరూ జొన్న కంకులను కాల్చుకుని తిందామనే నిర్ణయానికి వచ్చారు. జొన్న కంకులను కాల్చటం మొద లుపెట్టారు. అకస్మాత్తుగా అక్కడి తేనెపట్టు నుంచి తేనెటీగలు చెల్లాచెదరై వీరి వైపు రాసాగాయి. తేనెటీగలు కుడితే బాధ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల అందరూ వాటి బారిన పడకుండా ఉండేందుకు తలోదారి పరుగెత్తారు. గజానన్ మహారాజ్ మాత్రం అక్కడే ఉండిపోయారు. తేనెటీగలు ఆయనను కుట్టనారంభించాయి. 'ఈ తేనెటీగలు నేనే, అగ్నిని నేనే, కాల్చడానికి వచ్చినది నేనే, నేనే సర్వము, నేనే సర్వస్వరూపుడను' అనే భావంతో తాదాత్మ్యం చెందారు. దేహ స్పృహలేని ఆయనకు బాధ ఏముంటుంది? గజానన్ పరుగెత్తడం బంకట్‌లాల్ చూడలేదు. అందువల్ల ఆయన అక్కడే ఒంటరిగా ఉండిపోయారేమోననే అనుమానం ఆయనకు వచ్చింది. వెంటనే ఆయన పరుగు పరుగున గజానన్ సన్నిధికి చేరారు. అప్పటికి తేనెటీగలు శాంతించి పట్టుకు చేరాయి. బంకట్‌లాల్ ఒక మంగలిని పిలిపించి

గజానన్ శరీరంలో ఉన్న తేనెటీగ ముండ్లను తీయించసాగాడు. ఆ ముండ్లన్నీ బయటకు రాక గజానన్ శరీరంలోనే విరిగిపోయాయి. 'ఇదంతా వ్యర్థ ప్రయత్నం. ముండ్లను వెలికితీసే ఉపాయం చెబుతాను' అని గజానన్ వాయువును కుంభించారు. ముండ్లన్ని వాటంతట అవే బయటకు రావడం ఆ ప్రాంతంలో ఉన్న భక్తులందరు చూచారు. ముండ్లన్ని శరీరంలో ఉన్నా గజానన్‌కు బాధ ఏమీ ఉండదు. అయితే భక్తుల అభీష్టం నిమిత్తం ముండ్లను బయటకు తెప్పించారు గజాననులు. తరువాత అందరూ మళ్లీ పొలానికి వెళ్లి జొన్న కుంకులను కాల్చుకు తిన్నారు.

కీటకాల కాట్లకు వెరువని రమణులు

కొన్నాళ్లు బ్రాహ్మణ స్వామిగా, చిన్న స్వామిగా పిలువబడిన రమణ మహర్షి పాతాళ గంగ గుహలో కొన్నాళ్లు ఉన్నారు. ఆత్మనిష్ఠకు అనువైన ప్రదేశంగా ఆయన దానిని భావించారు. ఆ మాళిగలో బొత్తిగా వెలుతురు ఉండేది కాదు. అనారోగ్యకరమైన తేమ ఎప్పుడూ ఉండేది. ఆయన సమాధి స్థితిలోనికి వెళ్లినప్పుడు అక్కడే చిరకాల వాసం చేస్తున్న కీటకాలు, దోమలు, తేళ్లు మొదలైనవి ఆయన రక్తాన్ని తాగేవి. ఆయన కాళ్లు, తొడల అడుగు భాగాలు పుండ్లతో, చీము నెత్తురుతో నిం డిపోయేవి. అయినా ఆ బాధ తెలియలేదు రమణులకు. కాని ఆయన స్థితిని చూసి ఇతరులకు సానుభూతి కలిగేది. అదీ ఆయనకు అక్కరలేదు. శుద్ధ చైతన్యంలో లీనమవటమే ఆయనకు కావలసింది. అది నెరవేరింది. అంతటి తీవ్రమైన సమాధి అవస్థ బాధను పూర్తిగా తొలగించింది మనసు నుంచి.


గజానన్ మహరాజ్

- ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్

కాళికాదేవి


(గత సంచిక తరువాయిభాగం)

"అదే, నేను అందరినీ అడిగాను. అమ్మో! వాళ్లేం ప్రయోగం చేస్తారో అని భయపడతారేమిటి? ఆశ్రమ సమీ పంలో అందరూ ఇళ్లు కట్టుకొని వున్న తరువాత జనపదం లో ఇవి జరపరాదన్న శాసనం గూడా వున్నది. ఆపుచేద్దాం అంటే రారు. పోనీ! నేనే వాళ్లనడిగి చూస్తాను. భగవాన్ అనుజ్ఞ యిస్తే చాలును" అన్నాను. ''అడగటం మంచిది, ఊ-ఊ-వింటారేమో చూద్దాం. భయమెందుకు?" అన్నారు భగవాన్. నాకు ఏనుగంత బలం వచ్చింది.

వెంటనే తిరిగి వచ్చి ఆ రాత్రికే కాళికాదేవిని ప్రార్థిస్తూ ఏడెనిమిది పద్యాలు వ్రాశాను. భావం ఏమంటె- ఓ తల్లీ! ఇది నీ పుత్రుడైన రమణుని ఆశ్రమ ప్రాంతం గదా! ఇక్కడ నీవు సాత్త్వికాకృతితో నుండక ఈ రాజస తామస ప్రకృతిని దాల్చితివేల? నీకంత మాంసమే ప్రియమైతే నా శిరస్సే బలి గొనరాదా? నోరులేని జంతువుల బలిగొనుట నీకు భావ్యమా? నీవాకలి గొన్నచో భక్షించుటకు టెంకాయలున్నవి,పళ్లున్నవి,, భక్ష్యములున్నవి, పొంగలి వున్నది. నా ప్రార్థన నాలించి ఆ సాత్త్వికాహారముతో తృప్తిజెంది ఈ రాజస తామస భావమును పరిత్యజింపుము. నేనేగాక నీ పుత్రుడైన రమణుడును ఈ జంతువుల ఆక్రందనము విని తల్లడిల్లిపోతున్నాడమ్మా" అంటూ ఇల్లాంటి భావం గల పద్యాలే కొన్ని వ్రాసి వుంచి, తెల్లవారిన వెనుక నేనున్న ఇంటి యజమాని రాజు సెట్టితో పై సమాచారమూ భగవానుని అనుజ్ఞ చెప్పి వారి ద్వారానే ఆ అర్చకులను పిలిపించి ''అయ్యా! ఇది నిర్జన ప్రదేశంగా వున్న

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

పుడు మీరేం చేసినా చెల్లిందిగాని, ఇపుడు చెల్లదు. భగవాను గూడా చాలా బాధపడ్డారు. ఇంతటితో ఇది విరమించి సాత్త్విక బలులీయండి" అని సౌమ్యంగానే చెప్పాను. ముందు వారేవో అభ్యంతరాలు చెప్పారు. అల్లాగైతే ఆశ్రమానికిపుడు కలెక్టరు వగైరా ఉద్యోగస్థులంతా వస్తున్నారు. వారితో చెపుతానన్నాను. జనపదంలో ఇవి జరుగరాదన్న 'లా' వున్న సంగతి వారు గ్రహించో, భగవాన్ ఆజ్ఞగదా అన్న గౌరవంతోనో ఆ నాటి నుండీ బలులు విరమించారు. ఖర్చు నేను భరించి బోర్డు తెప్పించి దాన్ని కట్టించి, భగవాన్‌తో జరిగిన సంగతి వివరించాను. భగవాన్ ఆమోద దృష్టితో చూచి ''మంచిదయింది. ఎన్నాళ్లనుంచో ఇది జరుగుతున్నది. ఎవరూ కల్పించుకోలేదు. రాను రాను మరీ ఘోరంగా పరిణమించింది. ఏం జేస్తాం? ఇప్పటికైనా ఆపుదల జరిగింది"అని సెలవిచ్చారు.



నాటి నుండీ నేటి వరకూ అక్కడ జంతుబలులు మాని సాత్త్విక బలులతోటే పూజలు జరుపుతున్నారు. భగవదనుగ్రహ బలమే నాచేత ఆ పని చేయించింది గాని మరొకటి కాదని అంతా ఆశ్చర్యపడ్డారు.

ఓర్పులో భాగం

1976 ఫిబ్రవరిలో నాకు ఆపరేషన్ మద్రాసులోనే జరగటం, విశ్రాంతి నిమిత్తం ముందు బెంగళూరు, తరువాత బొంబాయికి వెళ్లటం ఇత్యాదులు ఈ పుస్తకం ఆదిలో విశద పరిచే వున్నాను. బాగా తేలిక యిచ్చినట్లే వుండి, 1977 జనవరిలో అకస్మాత్తుగా ఎడమభుజానికి వెనక ప్రక్కన విపరీతమైన దురదపుట్టి క్రమంగా మెడనొప్పి ప్రారంభమైనది. ఏదో వాతపు నొప్పేమోనని అన్నారంతాను. నాకేమో సందేహమే!

మా అక్క కొడుకు జి.రవీంద్రనాథశాస్త్రి బరోడాలో వున్న ఇండియన్ పెట్రో కెమికల్ కార్పొరేషన్‌లో పనిచేస్తూ వుండి నన్నక్కడికి రమ్మని ఆహ్వానిస్తే ఆ నొప్పితోనే అక్కడకు వెళ్లాను. ఒక్కనెల అల్లా, అల్లా గడిచింది.. ఆ వెనుక ఆటు, పోటు మంటలతో ఆ నొప్పి అధికమై,లోగడ ఆప రేషన్ చేసినదానికి పై భాగంలో గడ్డకట్టుట కారంభమైనది. అక్కడ డాక్టరు చూచి ''కోబాల్డు వైద్యము వలన వచ్చిందే గాని కాన్సరు కాదని 15రోజులలో ఏవో మందులు, ఇంజ క్షన్‌లు ఇచ్చాడు. అంతకంతకూ బాధ అధికమేగానీ తగ్గుకానక ఏప్రియల్ 5 కల్లా బొంబాయి చేరవలసి వచ్చింది. క్రమంగా ఆ గడ్డ ఎదిగి అధికమైన బాధతో వేధిస్తూ వుంటే పెద్దపెద్ద డాక్టర్లకు చూపిం చారు. వాళ్లు చేయవలసిన పరీక్షలన్నీ చేసి కాన్సరేనని తేల్చారు. ఆపరేషనుకు వీలులేదని పదిరోజులు కోబాల్డు చికిత్స చేశారు. అంతటితో అది ఎఱ్ఱపుండయి భగవాన్ సెలవిచ్చినట్లు సూర్యకాంతి మణిలాగా మారింది. ఇక చేసేదేమీ లేదని వాళ్లు వదిలేశారు. భరించరాని బాధతో కష్టపడుతూ మే మొదటి వారంలో ఈ బాధను సహించే శక్తిని ప్రసాదించమని, భగవానుని ప్రార్థిస్తూ నాల్గు పద్యాలు వ్రాశాను అవి ఏమంటే?

1. అరుణాచల రమణా నీ
దరిజేరిన దాది దేహతాపంబులకై
శరణన్నదాన గాదిపు
డరుదెంచెను అట్టి తరుణమార్త శరణ్యా॥
2. క్యాన్సరనుచు వచ్చి కడు వేదనలతోడ
చంపకుండ నన్ను జంపుచుండె
దీనబాధ నోర్వ దిట్టమౌ గుండె నా
కీగదయ్య శరణమీవె రమణ॥
3. ఎట్టులోర్చుకొంటివేమో నీ చేతిపై
పుట్టినట్టి పుట్టపుండు బాధ
అట్టి దిట్టతనమునందు భాగం బిచ్చి
పట్టినగుట శాంతి బరచుమయ్య॥
4. అల్లనాడు నీబాధకే నాగలేక
భాగమడిగితి నేటికాపగిది వచ్చె
ఇప్పుడడిగెద నోర్పునాకిమ్ము టంచు
జాగుసేయక వరమిమ్ము యోగివంద్య॥

అని పై పద్యములు వ్రాసి ఓర్పునీయమని వేడుకుంటూ వుండటం కంటె చేసేదేమి లేక ఉదాసీన భావంతో వుండిపో యాను. బాధ అంతకంతకూ అధికమై ఇంచుమించు తిరగలేని స్థితి సంక్రమిస్తూ వచ్చింది.

(తరువాయి భాగం వచ్చేసంచికలో)

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

తిరుప్పావై

పాశురం 27

కూడారై వెల్లుమ్ శీర్ గోవిన్దా! ఉన్దన్నై
ప్పాడి ప్పఱైకొన్డు యామ్ పెఱు శమ్మానమ్
నాడు పుగళుమ్ పరిశినాల్ నన్ఱాక
చ్చూడగమే, తోళ్ వళైయే, తోడే,శెవిప్పూవే,
పాడగమే,యైన్ఱనైయ పల్ కలనుమ్ యామణివోమ్,
ఆడైయుడుప్పోమ్; అదన్‌పిన్నే పాల్ శోఱు
మూడ నెయ్ పెయ్‌దు ముళఙ్గై వళివార
క్కూడి యిరున్దు కుళిర్‌న్దేలో రెమ్బావాయ్.

తాత్పర్యం

తన ఉనికిని సహించలేనట్టి శత్రువులైనట్టి వారిని జయించెడి కల్యాణ గుణములు కల గోవిందుడా! నిన్నే కీర్తించి పఱై అను వాయిద్యమును పొంది నీచే పొందింపబడు పెద్ద సమ్మానమును లోకులందరునూ ప్రశంసించురీతిలో చేతి కంకణములు, భుజముల ధరించు కర్ణాభరణములు, కర్ణ పుష్పములు, పాదముల ధరించు అందియలు యివేగాక మాకు తెలియని యింకనూ అనేక ఆభరణములను మేము నీచే ధరింపజేయబడవలయును. పట్టు వస్త్రములను ధరింతుము. ఆపైన క్షీరాన్నము మునుగునట్లు పోసిన నేతిని, మోచేయిగుండా జారుచుండగ నీతో కలసి కూర్చొని హాయిగ చల్లగ ఆరగింపజేయ బడవలయును. ఇదే మా వ్రత ఫలము.



- జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సౌజన్యంతో



దిన ఫలాలు

మేష రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ప్రయాణాల విషయంలో అనుకూలత ఉంటుంది. విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. వ్యాపార కార్యాలలో ఆనందకర సంఘటనలు చోటుచేసుకొంటాయి. గృహవిషయాల్లో ఇబ్బందులు పరిష్కరింపబడతాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. కోర్టు వ్యవహారాల్లో ప్రత్యర్థులు బలహీనపడతారు. ఆదాయంలో అనువైన మార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: కోర్టు వ్యవహారాలు, ప్రక్రియలు ప్రతికూలతను కలిగిస్తాయి. ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆర్థిక లావాదేవీల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ప్రయాణాల ద్వారా ప్రయోజనాలు పొందుతారు. శారీరక రుగ్మతలు ఉంటాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగ వ్యవహారాల్లో చిరుసమస్యలను ఎదుర్కొంటారు. ఆదాయం పర్వాలేదు.

మిథున రాశి: ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆర్థిక ప్రయత్నాలు పర్వాలేదు. మానసిక రుగ్మతలు పెరుగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. అధికప్రయత్నాలతో అనుకూల పరిస్థితులు ఆర్థికంగా ఉంటాయి.

కర్కాటక రాశి: శత్రుభీతి పోతుంది. ఆర్థికలావాదేవీలు, ప్రక్రియలు ఉపకరిస్తాయి. పనులలో ఒత్తిడులు పెరుగుతాయి. ఆరోగ్య ఖర్చులు కొనసాగు తాయి. మిత్రుల ప్రోత్సాహం లోపిస్తుంది. ఆదాయంలో అసహన పరిస్థితులు పెరుగుతాయి.

సింహ రాశి: స్థిరాస్తి నిర్ణయాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ ఉంటుంది. రుణ ఒత్తిడులు తగ్గుతాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార విజయాలు దగ్గరవుతాయి. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: విదేశీ లావాదేవీలు అనుకూలం. స్వతంత్ర నిర్ణయాలు లాభిస్తాయి.వ్యయం నియంత్రించగలుగుతారు. పనులలో వేగం తగ్గుతుంది. ఆరోగ్యంలో, ఆదాయంలో అనుకూల మార్పులు ఉంటాయి.

తులా రాశి: వాహన కొనుగోళ్లు లాభిస్తాయి. ప్రోత్సాహ పరిస్థితులు వృత్తిలో కొనసాగుతాయి. శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. అసహన పరిస్థితులు ఆర్థికంగా ఉంటాయి. ఆదాయాన్ని పెంచుకొనే మార్గాలు కూడా సులభతరమవుతాయి.

వృశ్చిక రాశి: ఉద్యోగ ప్రయత్నాలలో విజయాలు సాధించగలుగుతారు. అసంతృప్తి సంఘటనలు అన్ని రంగాల వారికి కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. అసహన పరిస్థితులను పరిష్కరించుకోలేకపోతారు. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: శ్రమ అధికమవుతుంది. గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. ఆకస్మిక ఖర్చులు లేకపోలేదు. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. గతంలోని పొరపాట్లు వెలుగు చూస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: రుణప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి. వ్యాపారంలో అవమానకర సంఘటనలు ఉంటాయి. ఆదాయ మార్గాలు ఇబ్బందులను పెడతాయి.

కుంభ రాశి: ఆరోగ్యంలో రుగ్మతలు తగ్గుతాయి. చేపట్టే కార్యాలలో అలసత్వం పెరుగుతుంది. ప్రయాణాలు అనుకూలం. శుభవార్తలు వింటారు. ఆదాయం పర్వాలేదు.

మీన రాశి: నూతన కార్యాలలో ప్రోత్సాహం. ఉద్యోగ వ్యవహారాల్లో విజయాలు ఉంటాయి. ఆరోగ్యంలో మెరుగైన మార్పులు ఉంటాయి. ముఖ్య కార్యక్రమాలు సగంలోనే ఆగిపోతాయి కాబట్టి జాగ్రత్తలు తప్పనిసరి. ఆదాయాన్ని ఆశించినంతగా పొందలేకపోతారు.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

Business సరిగమలు


సమయం వచ్చేస్తోంది!

పన్ను మినహాయింపు డాక్యుమెంట్లు సిద్ధం చేసుకోండి

మీ కంపెనీ ఎకౌంట్స్ డిపార్ట్‌మెంట్ మిమ్మల్ని ఇన్‌కమ్‌టాక్స్ సేవింగ్ ప్రూఫ్‌లను సమర్పించమని అడిగే సమయం(జనవరి కాబట్టి)మొదలైంది. దానికి సంబంధించిన కాగితాలను తయారుగా పెట్టుకోవాల్సిన తరుణం వచ్చింది. పోయిన ఏడాది ఏప్రిల్ నుంచి మీరు అంతకుముందు సమర్పించిన కాగితాల ఆధారంగా మీ జీతం మీద ఎంత పన్ను పడుతుందో లెక్కిస్తుంది. ఆదాయపు పన్ను చట్టం, 1961 లో సెక్షన్ 192 కింద పన్నుల మినహాయింపు జరుగుతుంది. ఉద్యోగికి జీతాలు చెల్లించేటప్పుడు ఆ మినహాయింపులు చేసి జీతం చెల్లిస్తారు. అంతకుముందు మీరు కంపెనీకి తెలిపినట్లుగా ఏమేం పెట్టుబడులు పెట్టారో వాటికి సంబంధించిన రుజువులు కంపెనీకి చూపించాల్సి ఉంటుంది. మీరు పన్ను ఆదా జరిగే పెట్టుబడులు పెట్టారా లేక ఇతర విధాలైన పెట్టుబడులు పెట్టారా అనేది కేవలం మీరు ఇచ్చే ఆధారాలబట్టే ఉంటుంది. సరైన డాక్యుమెంట్లు సమర్పించకుంటే అవేవీ పరిగణనలోకి రావు. డాక్యుమెంట్లు సమర్పించే ఆఖరు తేదీ సంస్థను బట్టి వివిధరకాలుగా ఉండవచ్చు. అయితే సాధారణంగా మార్చి 10వ తేదీలోపు సమర్పించవలసి ఉంటుంది. జనవరి నుంచే సమర్పించమని అడుగుతుంటారు. ఎందుకంటే పన్ను మినహాయింపుకు సంబంధించి లెక్కలు వేసుకోవాల్సి వస్తుంది కాబట్టి వారికి ఆ మాత్రం సమయం పడుతుంది. ఒకవేళ పన్ను మినహాయింపులు ఎక్కువైనా, తక్కువైనా అవి ఆర్థిక సంవత్సరం ఆఖరి మూడునెలల్లోనే జరుగుతుంది. మూడు నెలల సమయం ఉంది కదా అని తేలిగ్గా తీసుకుని మార్చి వరకు ఆగి అప్పుడు డాక్యుమెంట్లు సమర్పిద్దాంలే అనుకుంటే అనవసరంగా పన్ను భారం నెత్తిన పడుతుంది. మీ దగ్గర నుంచి డాక్యుమెంట్లు సేకరించిన కంపెనీ, వాటిని ఆదాయపు పన్ను విభాగానికి ఫైలింగ్ కోసం ప్రత్యక్షంగా పంపించదు. కంపెనీనే మన డాక్యుమెంట్ల ఆధారంగా పన్ను మినహాయింపులు, లెక్కలు చూసి ఆదాయపు పన్ను శాఖకు పంపిస్తుంది.ఒకసారి పన్ను ఆదా చేసే పెట్టుబడులు, ఖర్చులు లెక్కలోకి తీసుకున్నాక కంపెనీ యజమాని ఒకసారి పన్ను మినహాయింపులు చేసిన తర్వాత మళ్లీ తర్వాత నెలలో వాటి మీద అడ్జస్ట్‌మెంట్‌లు చేయడం కుదరదు. అటువంటప్పుడు ఫామ్ 16 లో అదనంగా కట్టిన పన్నును టిడిఎస్ కింద క్లెయిమ్ చేసుకోవచ్చు. మీరు ఫైల్ చేసినదాన్నిబట్టి ఐటి విభాగం సరైన ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్ చేస్తుంది. ఇంతకీ మీరు మీ కంపెనీకి సమర్పించాల్సిన పన్ను ఆదా పెట్టుబడి లేదా ఖర్చుల రుజువులు తెలిపే డాక్యుమెంట్లు ఇవి.

80 సెక్షన్ కింద చేసిన పెట్టుబడులు

మ్యూచ్యువల్ ఫండ్స్‌లో ఈక్విటీ లింక్‌డ్ సేవింగ్స్ స్కీమ్, జీవిత బీమా, ఇఎల్ఎస్ఎస్ ఫండ్ స్టేట్‌మెంట్, ప్రీమియం కట్టిన రసీదులు, ఇవన్నీ ఇవ్వాలి. అదే కనుక పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(పిపిఎఫ్) గురించి అయితే అది పోస్టాఫీస్ లేదా బ్యాంకు ద్వారా నిర్వహణ జరుగుతుంది. దానికి జరిగిన లావాదేవీలన్నిటికీ సంబంధించిన పాస్‌బుక్ ఫొటోకాపీలను సమర్పించాలి. ఒకవేళ మీరు ఆన్‌లైన్‌లో పిపిఎఫ్ ఎకౌంట్ నిర్వహిస్తే కనుక ఎలక్ట్రానిక్(ఈ)రసీదుల ప్రింటవుట్ తీసుకోవాలి. దానివలన ఎకౌంట్, ఇంకా ట్రాన్సాక్షన్ వివరాలు తెలుస్తాయి. సుకన్య సమృద్ధి పథకం, ఇంకా పన్ను ఆదా చేసే ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, డిపాజిట్ రసీదులు సమర్పించాలి. పిల్లల చదువుకు కట్టిన ట్యూషన్ ఫీజు రసీదులు ఇవ్వాలి. అందులో ఆ స్కూల్ సీల్, ఫీజు అందుకున్నవారి సంతకం ఉండాలి.



మొదటిసారి ఇల్లు కొనుక్కునేవారు

ఏప్రిల్ 1, 2016 నుంచి మార్చి 31, 2017 లోపు సెక్షన్ 80ఈఈ కింద రుణం మంజూరు అయినవారు, మొదటిసారి రుణం తీసుకుని ఇల్లు కొనుక్కుంటున్నవారు ఇంటిరుణం వడ్డీ మీద లబ్దిని క్లెయిమ్ చేసుకోవచ్చు. ఆదాయపు పన్ను చట్టం కింద, సెక్షన్ 24 ప్రకారం రెండు లక్షలు, అంతకంటే ఎక్కువ మినహాయింపు ఉండవచ్చు. వాటికి సంబంధించిన హార్డ్‌కాపీలను సమర్పించాలి. ఆర్థిక సంవత్సరం 2016-17 లోపు అయితే ఏడాదికి 50,000 రూపాయల మినహాయింపు ఉంటుంది, తర్వాతి సంవత్సరాలలో అయితే రుణం చెల్లింపు పూర్తయేవరకు వర్తిస్తుంది.

ఇంటి అద్దె అలవెన్స్ మినహాయింపు

హెచ్ఆర్ఎ మినహాయింపు క్లెయిమ్ చేసుకునేవారికి ఆ స్థల యజమాని పాన్ నంబర్ తప్పనిసరిగా ఇవ్వాలి. ఈ మినహాయింపు పొందాలంటే ఏడాదికి లక్ష రూపాయలు అంటే నెలకి 8,333 రూపాయలు అద్దెకు మించకూడదు. లీజ్ రెంట్ అగ్రిమెంట్ కాపీ ఒకటి, మీరు అద్దెకి ఉంటున్న ఇంటి యజమాని ఓనర్‌షిప్ ప్రూఫ్, అంటే ఇంటిపన్ను రసీదు లేదా సరి కొత్త ఎలక్ట్రిసిటీ బిల్ లేదా ఒకావేళ కోఆపరేటివ్ సొసైటీ అయితే షేర్ సర్టిఫికేట్ లేదా కొత్త ఎలక్ట్రిసిటీ బిల్లు సమర్పించాలి. ఏప్రిల్ 2018 వరకు ఒరిజినల్ రెంట్ రసీదులు ఇవ్వాలి.



ఇంటిరుణం రీపేమెంట్ (అసలు)

ఏప్రిల్ 2018 నుంచి 2019 మార్చి వరకు ఎంత అసలు కట్టారో తెలియచేసే సర్టిఫికేట్ సమర్పించాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఒక రెండు మూడు నెలల ముందు వరకు లెక్కవేసి ఇంకా ఎంత డబ్బు చెల్లించాలో తెలిపే డాక్యుమెంట్ ఇవ్వమని సంస్థని అడగాలి.

సొంత ఇంటి ఆస్తి నష్టం-ఇంటి రుణం మీద వడ్డీ

ఆ ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు లేదా ఆర్థిక సంస్థల నుంచి వడ్డీ సర్టిఫికేట్‌లో ఎంతెంత వడ్డీ పడింది అనే వివరాలతో సర్టిఫికేట్ అవసరం. ఇల్లు కడుతున్నట్లు నిర్మాణ సర్టిఫికేట్ కాని సొంతం చేసుకున్న సర్టిఫికేట్ కాని ఇవ్వాలి. ఇంకా రుణం ఎప్పుడు తీసుకున్నారు అనే వివరాలు కూడా పన్ను లబ్ది పొందడానికి అవసరం.

సొంత ఇంటి ఆస్తి వల్ల నష్టం-హౌసింగ్ లోన్


రుణంతో కట్టుకున్న ఇల్లు అద్దెకి ఇస్తే అదే విషయాన్ని బ్యాంకుకు తెలియచేయాలి. అందులో ఏప్రిల్ 2018 నుంచి 2019 మార్చి వరకు ఆ ఆర్థిక సంవత్సరానికి అసలు, వడ్డీ ఎంత అయింది అనే వివరాలున్న సర్టిఫికేట్ కావాలి.

కొత్త పెన్షన్ స్కీమ్

ఎన్‌పిఎస్‌లో పెట్టుబడుల గురించిన ఎటువంటి ప్రూఫ్‌లు అవసరం లేదు. ఒకవేళ మీరు మీ సొంతం గా ఎన్‌పిఎస్‌లో 50,000 రూపాయల కంటే తక్కువ పెట్టుబడి పెడితే అది ఔట్‌సైడ్ శాలరీ కింద లెక్కిస్తారు. కాబట్టి పర్మనెంట్ రిటైర్మెంట్ ఎకౌంట్ నంబర్ ఎకౌంట్ కార్డు కాపీలను, టైర్ వన్ ఎకౌంట్ కోసం ఎన్‌పిఎస్ ట్రాన్సాక్షన్ స్టేట్‌మెంట్ సమర్పించాలి.

మెడిక్లెయిమ్ ప్రీమియం

మీ ఇన్సూరర్‌ని పిలిచి సెక్షన్ 80డి కింద టాక్స్ స్టేట్‌మెంట్ పంపించమని అడగండి. ప్రీమియంను క్యాష్ రూపంలో కట్టిఉండకూడదు. చెక్ లేదా డిజిటల్ ట్రాన్సాక్షన్ చేసి ఉండాలి.



విల్లు రాస్తూ వీడియో!

లక్ష్మి ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. ఆమె భర్త చనిపోయారు. భర్త చనిపోయాక తమ ఆస్తిని తన చిన్న కొడుకు పేరు మీద బదిలీ చేస్తున్నట్లు విల్లు రాయాలనుకున్నారు. ఉండటానికి ఇద్దరు కొడుకులున్నా పెద్ద కొడుకుతో ఆమెకు గత పదేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. చిన్న కొడుక్కి మాత్రమే ఆస్తిని రాయడం గురించి పెద్ద కొడుకు గొడవ చేస్తాడని తెలుసు. కోర్టు మెట్లు ఎక్కే అవకాశం ఉందని కూడా తెలుసు. అందుకే ఆమె లీగల్ అడ్వైజర్ ఆమెకు ఒక సలహా ఇచ్చారు. మీరు విల్లు రాస్తుండంగా వీడియో తీసి పెట్టుకోండి. అది మీ అంతట మీరే ఇష్టపూర్వకంగా రాశారని మీకు సాక్ష్యం అనుభవించాలనుకుంటే విల్లు రాయాల్సిన అవసరం ఉంది. వేరే వ్యక్తులు చనిపోయిన వ్యక్తి రాసినట్లుగా దొంగ విల్లులు తయారు చేసే వీలుంటుంది. అందుకే విల్లు రాసేటప్పుడు వీడియో రికార్డింగ్ తప్పనిసరిగా ఉండాలని నిపుణులు తెలుపుతున్నారు. చట్టప్రకారం ఇది ఏవిధంగానూ నియమం కాదు. కేవలం వ్యక్తిగతంగా తీసుకునే జాగ్రత్త మాత్రమే. ఒకవేళ ముమ్మందు విల్లు నిజాయితీ మీద కోర్టులో కేసు పడితే ఇది సాక్ష్యంగా మాత్రమే ఉపయోగపడగలుగుతుంది. స్మార్ట్‌ఫోన్‌లో కాని లేదా కెమెరాలో కాని ఈ రికార్డింగ్ చేయవచ్చు. లేదా 2 లేదా 5 వేలిచ్చి రికార్డు చేయించుకోవచ్చు. వీడియో తీయించుకోవడం వలన ప్రొబేట్ తేలిక అవుతుంది. ప్రొబేట్ అంటే అధికారికంగా కోర్టు చట్టం కింద ధృవీకరణ జరిగినట్లు విల్లు కాపీ దొరుకుతుంది. తర్వాత ఉపయోగపడుతుంది.

విల్లు అంటే ఆ వ్యక్తి తాను చనిపోయిన తర్వాత తనకు సంబంధించిన ఆస్తులను తమ వారసులకు, లేదా నచ్చినవారికి అందాలని తెలియచేసే డాక్యుమెంట్. ఆస్తిపాస్తులున్న ఏ వ్యక్తి అయినా తనకు సంబంధించిన ఆస్తి ఎవరికి చెందాలి అనేది విల్లు రూపంలో రాయడం ముఖ్యం అని చాలామంది ఆర్థిక ప్రణాళికా నిపుణుల అభిప్రాయం. ఒకసారి రాసిన విల్లు అలానే ఉండాలనే నిబంధన ఏం లేదు. దాన్ని ఎన్నిసార్లయినా మార్చి రాసుకోవచ్చు. అన్నిటికంటే ఆఖరున రాసిన విల్లు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.

చాలామంది విల్లు రాయరు. కొంతమంది అవసరమైన ప్రక్రియలు అనుసరించరు. ఇంకొంతమంది విల్లుని టైమ్‌కి అప్‌డేట్ చేయరు. విల్లు రాయడాన్ని సెంటిమెంట్‌గా భావించేవారు కూడా ఉంటారు. చచ్చిపోయేముందు విల్లు రాస్తారు అన్న విషయం బాగా బుర్రలో నాటుకుని పోయింది. చాలా సినిమాల్లో విల్లు రాసే సీన్లు చనిపోయే ముందే జరుగుతుంటాయి. ఇంకో నమ్మకం ఏంటంటే, విల్లు రాయడం అనేది డబ్బున్నవారికి సంబంధించిన విషయం అనుకుంటారు. కాని దానికి పేద, ధనిక తేడాలుండవు. మనిషి చనిపోయిన తర్వాత వారి ఆస్తులు విచ్ఛిన్నం కాకుండా, వారు ఇష్టపడే మనుషులు మాత్రమే వారి ఆస్తిని



అయితే వీడియో తీసుకునేటప్పుడు కొన్ని విషయాలు దృష్టిలో పెట్టుకోవాలి. విల్లు రాస్తున్న మీరు ఆరోగ్యంగా ఉన్నారని కెమెరాకు చెప్పాలి. ఉదాహరణకు, మీ పేరు, మీరు విల్లు రాస్తున్న తేదీ, మీరు ఉంటున్న నగర, ఇది రికార్డు చేస్తున్న సమయం అన్నీ చెప్పాలి. దాంతోపాటు మీరు విల్లు మీ ఇష్టప్రకారం రాస్తున్నట్లు కూడా తెలపాలి. దాన్నిబట్టి విల్లురాసే వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నారని, ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గి రాయడం లేదని అర్థం అవుతుంది. అంతేకాదు. మీరు విల్లులో రాసిన మొదటి పేరాను చదివి వినిపించాలి. అయితే అందులో ఏ ఆస్తి ఎవరికి చెందుతుంది లాటి వివరాలు చెప్పనక్కర్లేదు. అవి రహస్యంగానే ఉంచాలి. విల్లు రాసిన వ్యక్తి, ఇంకా సాక్షి సంతకం దారుడు ఇద్దరూ అందులో కనిపించాలి. మీరు ఆరోగ్యంగానే ఉన్నారని ధృవీకరించి చెప్పే డాక్టర్ కూడా వీడియోలో మాట్లాడితే మంచిది. దాని వలన సాక్ష్యం మరింత బలంగా ఉంటుంది. వీడియో రికార్డింగ్ చేసేటప్పుడు గుర్తుంచుకోవలసిన విషయాలు ఇంకొన్ని ఉన్నాయి. అన్ని వయసుల వారు ఈ విల్లు రాయవచ్చు. సాధారణంగా కోర్టులో చాలా ముసలివారు రాసే విల్లును భయపెట్టి బలవంతంగా రాయించారని నమ్ముతారు. అదే కనుక వీడియో తీస్తే విల్లు రాసిన వ్యక్తి వృద్ధులైనా పూర్తి మానసిక ఆరోగ్యంతో వారి చేత్తో విల్లు మీద సంతకం చేయడం వలన దాని మీద పూర్తి నమ్మకం కలుగుతుంది. అయితే విల్లు డాక్యుమెంట్‌కి ఆ వీడియో ప్రత్యామ్నాయం కాదు. విల్లు రాయడంతో, వీడియో రికార్డింగ్ చేయడంతో అంకం పూర్తవలేదు. వాటిని చాలా జాగ్రత్తగా పదిలపరచుకోవాలి.

క్రెడిట్ కార్డు వినియోగం తెలివిగా

డిజిటల్ మనీ వాడకం పెరిగింది. దానిలో భాగంగా క్రెడిట్ కార్డు వినియోగం కూడా ఎక్కువైంది. క్రెడిట్ కార్డు తీసుకోమని కూడా బ్యాంకులు, బ్యాంకేతర ఆర్థిక సంస్థలు వెంటపడుతుంటాయి. మరి క్రెడిట్ కార్డుల మీద బ్యాంకులు ఎంత లాభపడుతున్నాయో మీకు తెలాసా? ఒక బ్యాంకు కార్డు ఇచ్చిందంటే అది దాని మీద వార్షిక రుసుము , ప్రతి లావాదేవీ మీద ఇంటర్‌ఛేంజ్ ఫీజు సంపాదిస్తుంది. కార్డుహోల్డర్ సమయానికి సరిగా చెల్లించకున్నా, పాక్షికంగా చెల్లించినా మిగిలిన డబ్బు మీద వడ్డీ, లేట్ పేమెంట్ ఫీజు చార్జి వేస్తుంది. కార్డు మీద బ్యాంకు సంపాదించే సొమ్ము నుంచి కొంత రివార్డు పాయింట్ల రూపంలో కార్డుహోల్డర్‌కి ఇస్తుంది. కార్డు ఇచ్చినవారు వేసే ఇంటర్‌ఛేంజ్ ఫీజ్ ఆ కార్డు ఏ విభాగానికి చెందింది అన్నదాన్నిబట్టి ఉంటుంది. గోల్డ్, టిటానియమ్, ప్లాటినమ్, వరల్డ్, సిగ్నేచర్, ఇన్ఫినెట్ ఇలా దాని విభాగం బట్టి ఉంటుంది. పెద్ద కార్డులైన ఇన్ఫినెట్, సిగ్నేచర్ లేదా వరల్డ్‌లు మిగిలిన ప్లాటినమ్, గోల్డ్ కార్డులతో పోలిస్తే వాటికి ఎక్కువ రివార్డు పాయింట్లు దొరుకుతాయి. మరి అటువంటి రివార్డు పాయింట్లు గెలుచుకోవాలంటే ఏం చేయాలి? ప్రతి లావాదేవీకి కార్డుకు పాయింట్లు చేరతాయి. కార్డు ఇచ్చిన బ్యాంకుతో టైఅప్ అయిన దుకాణం నుంచి కొనుగోళ్లు చేస్తే మరిన్ని పాయింట్లు చేరతాయి. సీజన్ అమ్మకాలు, వారాంతపు అమ్మకాలు లాటి సందర్భాలలో అటువంటి ఆఫర్లు అందుతాయి. ఆ పాయింట్లతో ఆన్‌లైన్‌లో కొనుగోల్లు చేసుకోవచ్చు. లేదా సినిమా టికెట్లు, ఎయిర్‌లైన్ టికెట్లు, హోటల్ బుకింగ్‌లు చేసుకోవచ్చు.వినియోగదారుల అవసరాలను బట్టి కార్డు ఇచ్చే సంస్థలు వివిధ ప్రోగ్రామ్‌లు అందచేస్తుంటారు. కేవలం అత్యవసరాలకు అంటే ఉదాహరణకు, ఫర్నిచర్ కొనడానికి, షాపింగ్ చేయడానికి, ప్రయాణాలకు మాత్రమే వాడేవారికి అటువంటి ప్రత్యేక ఆఫర్లు ఉండవు. క్రెడిట్ కార్డును తెలివిగా ఉపయోగించుకుంటే ఎక్కువ లబ్ది పొందవచ్చు.



ఎఫ్‌డిలపై టిడిఎస్ తప్పించుకునే మార్గాలు


పెద్దమొత్తాన్ని కొన్నేళ్ల కోసం బ్యాంకులోనో లేక బ్యాంకేతర ఆర్థిక సంస్థల్లో పెట్టుబడి పెట్టడం(ఫిక్స్‌డ్ డిపాజిట్) సంప్రదాయ పద్ధతి. ఆ నియమిత కాలపరిమితికి దానికి వడ్డీ వస్తుంది. వాస్తవానికి సాధారణ సేవింగ్ ఎకౌంట్‌తో పోలిస్తే ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఎక్కువ వడ్డీ వస్తుంది. కాబట్టి ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడి పెట్టడాన్ని ఇష్టపడతారు. కాని అనుకున్న కాలపరిమితి కంటే ముందుగా ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి డబ్బును విత్‌డ్రా చేసుకుంటే జరిమానా పడుతుంది. అది తెలుసుకునే పెట్టుబడి పెట్టాలి.

ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద పన్ను

సేవింగ్ బ్యాంక్ ఎకౌంట్ లో 10,000 రూపాయల వరకు వడ్డీ పొందితే దానికి సెక్షన్ 80టిటిఎ కింద మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. కాని అదే ఫిక్స్‌డ్ డిపాజిట్ మీద వచ్చే వడ్డీ మీద పూర్తి పన్ను కట్టాలి. అయితే సీనియర్ సిటిజన్‌కు ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద వచ్చే వడ్డీకి 50,000 రూపాయల వరకు సెక్షన్ 80టిటిబి కిందమినహాయింపు పొందవచ్చు. అది బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద, బ్యాంకింగ్ బిజినెస్ చేసే కోఆపరేటివ్ సొసైటీలు, పోస్టాఫీసుల మీద దేని మీద వచ్చే వడ్డీకైనా ఇది వర్తిస్తుంది.

ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద పన్ను మినహాయింపు

ఫిక్స్‌డ్ డిపాజిట్ మెచ్యూర్ అయాక వచ్చే డబ్బు మీద కాని, అప్పుడు చెల్లించే వడ్డీ మీద కాని మినహాయింపు ఉండదు. ఆ ఆర్థిక సంవత్సరంలో అన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి ఉత్పన్నమయ్యే వడ్డీ పది వేల రూపాయలు దాటినప్పుడు పదిశాతం పన్ను పడుతుంది. అదే కనుక బ్యాంకులో ఉన్న సీనియర్ సిటిజన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద వచ్చే వడ్డీ ఆదాయం 50,000 కంటే మించితే పన్ను పడుతుంది. అలాగే బ్యాంకుకు పాన్ సమర్పించకపోతే 20 శాతం పన్ను కట్టవలసి వస్తుంది.



ఫిక్స్‌డ్ డిపాజిట్ మీద పన్ను మినహాయింపు ఎప్పుడు ఉండదు?

మూడు సందర్భాలలో పన్ను పడకుండా చూసుకోవచ్చు. మొదటగా, ఎవరికైతే ఆర్థిక సంవత్సరానికి 250000 రూపాయల కంటే తక్కువ ఆదాయం ఉంటుందో(60 ఏళ్లకు పైబడినవారికి 30,000, 80 ఏళ్లకు పైబడినవారికి 5,00000)వారు నాన్ డిడక్షన్ ఆఫ్ టాక్స్ డిక్లరేషన్ ఫైల్ చేసుకోవచ్చు. ఈ డిక్లరేషన్‌ను ప్రతి ఆర్థిక సంవత్సరం మొదట్లో ఫామ్ 15జి లేక ఫామ్ 15హెచ్(సీనియర్ సిటిజన్)ద్వారా బ్యాంకర్లకు సమర్పించాలి. దానివలన టాక్స్ పడకుండా ఉంటుంది. రెండోది, కొంతమంది వివిధ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తుంటారు. అయినా కూడా కొన్ని సందర్భాలలో అన్ని బ్యాంకుల నుంచి వచ్చే వడ్డీ కలిపినా కూడా ఆ ఆర్థిక సంవత్సరానికి 10,000 కంటే ఎక్కువ అవకూడదు. అలా జరిగితే టాక్స్ పడదు. మూడవది, పెట్టుబడి పెట్టిన ఆర్థిక సంవత్సరంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ మీద వడ్డీ 10,000 కంటే తగ్గితే, అంటే ఉదాహరణకు ఆనంద్ అనే వ్యక్తి 36 నెలల కాలపరిమితి కోసం రెండు లక్షల రూపాయలు 8 శాతం వడ్డీకి అక్టోబర్ 1వ తేదీన డిపాజిట్ చేస్తే 2018-19 కి వచ్చే వడ్డీ 8,000 వస్తుంది. అందుకే అది 2018-19 ఆర్థిక సంవత్సరానికి దానికి పన్నుపడదు.

కొంతమంది కుటుంబ సభ్యుల పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తారు. అటువంటప్పుడు వారి కుటుంబ సభ్యుల ఆదాయం కనీస మినహాయింపు పరిమితి కంటే తక్కువ ఉంటే వారు 15జి /హెచ్ నాన్ డిడక్షన్ ఆఫ్ టాక్స్ కింద ఫైల్ చేసుకోవచ్చు. కొంత పరిమితి దాటినప్పుడు బ్యాంకులు 10 శాతం పన్నువేస్తాయి. అయితే అది వ్యక్తుల వ్యక్తిగత పన్ను చెల్లింపు స్థాయిని బట్టి ఉంటుంది. ఒకవేళ 20,30 టాక్స్ బ్రాకెట్ దాటిన వారయితే అదనంగా పన్నులు చెల్లించవలసి ఉంటుంది. మొత్తం మీద వడ్డీ ఆదాయం 10,000, సీనియర్ సిటిజన్ అయితే 50,000 రూపాయల వరకు ఉంటే బ్యాంకులు పన్ను వేయవు. ఫామ్ 15జి /హెచ్ ఫైల్ చేయక్కరలేదు. అందుకే ఏడాది మొదట్లోనే ఎంత వడ్డీ ఆదాయం వస్తుందో లెక్క చూసుకోవాలి. ఒకవేళ అవసరం అయితే అదనపు పన్ను చెల్లించండి. తర్వాత టాక్స్ రిటర్న్ ఫైల్ చేసుకోండి.

రామ్‌చరణ్ అభిమానిగా సినిమా చేశా...



- దర్శకుడు బోయపాటి శ్రీను

మాస్ సినిమాల దర్శకుడిగా తనకంటూ ఓ ప్రత్యేకత తెచ్చుకున్నారు బోయపాటి శ్రీనివాస్. రామ్ చరణ్ కథానాయకుడిగా ఆయన రూపొందిస్తున్న కొత్త చిత్రం వినయ విధేయ రామ. అన్ని వాణిజ్య విలువలతో పాటు కుటుంబ కథా చిత్రంగా వినయ విధేయ రామ సినిమా తెరకెక్కింది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దానయ్య నిర్మించిన ఈ సినిమా ఇవాళ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా వినయ విధేయ రామ గురించి దర్శకుడు బోయపాటి శ్రీనివాస్ చెప్పిన విశేషాలు చూస్తే..

✦ రామ్ చరణ్ కథను చిరంజీవి గారికి చెప్పమన్నారు. వారం పది రోజులు సమయం తీసుకుని పూర్తి కథను ఆయనకు వినిపించాను. కథ విన్నాక చిరంజీవి గారు బాగుంది చేయండి అన్నారు. నువ్వెలా సినిమా చేస్తావో తెలుసు అని చెప్పి తన పూర్తి సహకారం అందించారు.

✦ నాలుగేళ్ల కిందటే రామ్ చరణ్‌కు చెప్పిన కథ ఇది. అప్పటికి ఈ కథకు కావాల్సిన పరిపక్వత చరణ్‌లో లేదనిపించింది. ఇప్పుడు సరిగ్గా ఈ పాత్రకు సరిపోయాడు. సినిమా ప్రారంభించాం. కథలో అన్ని వాణిజ్య అంశాలుంటాయి. కుటుంబ కథతో తెరకెక్కించాం.

✦ సంక్రాంతికి రావాల్సిన సినిమా ఇది. అందుకే ఎనిమిది నెలల కిందటే ఈ సినిమా పండక్కి రావాలని ప్రణాళిక వేసుకున్నాం. సంక్రాంతి మూడు రోజుల పండగ భోజనం, ఆటపాటలు, కోడి పందేలు ఆడుతుంటారు. అలా ఈ సినిమాలో ఆటపాటలు, కుటుంబ అనుబంధాలు, పోరాటాలు అన్నీ ఉన్నాయి.

> చిరంజీవి గారికి తగిన వారసుడు రామ్ చరణ్. నాకింత పెద్ద కుటుంబం ఉంది, పేరుంది అనుకోకుండా నిత్యం శ్రమిస్తుంటారు. ఆయనొక యుద్ధ ట్యాంక్. యుద్ధం చేసేందుకే, గెలిచేందుకే పుట్టారు. రామ్ చరణ్ ఏ కథకైనా న్యాయం చేసేలా నటించగల సమర్థుడైన నటుడు.

✦ దానయ్య గారి దగ్గర రామ్ చరణ్ డేట్స్ ఉన్నాయి. నిర్మాత ఎవరు అనుకుంటున్న సమయంలో దానయ్య గారి పేరు చరణ్ చెప్పారు. ఆయన మంచి నిర్మాత. జ్యూస్ నాది అయితే గ్లాస్ నిర్మాతది. మేమేం చేయాలనుకున్నా నిర్మాత అండగా నిలవక పోతే కుదరదు.

✦ నా అన్ని చిత్రాల్లో నాయికకు మంచి ప్రాధాన్యత ఉంటుంది. ఈ సినిమాలో కైరా అద్వానీ మంచి క్యారెక్టర్ చేసింది. ఆమెకు తల్లిగా నటించిన హేమది కీలకమైన పాత్ర. సామాజిక కార్యక్రమాలు చేసే హేమ పాత్ర ఓ పెద్ద సమస్యను మనకు వివరిస్తుంది. ఇవాళ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్య అది. వీళ్లిద్దరి పాత్రలు నవ్విస్తూ నవ్విస్తూ చివరకు ఆలోచింపజేసేలా సాగుతుంటాయి.

✦ నేను ఏ సినిమా చేసిన ఆ కథానాయకుడి అభిమానిగా భావిస్తూ సినిమా రూపొందిస్తుంటాను. ఈ చిత్రంలో చరణ్ అభిమానిగా ఆలోచించుకుంటూ సినిమా చేశాను. నాకు కథానాయకులంతా ఒక్కటే. అందరితోనూ సినిమాలు చేయాలనుకుంటున్నాను.

✦ నేను చేస్తున్న సినిమాలో అన్ని అంశాలుంటాయి. అయితే రౌద్రం అనేది ఎక్కువగా గుర్తుండిపోతుంది. ఎందుకంటే లక్షలాది అభిమానులు, ప్రేక్షకులు సినిమా చూసేందుకు వచ్చినప్పుడు వాళ్లకు కావాల్సిన అన్ని అంశాలు ఉండేలా సినిమా చేయాలి. అందులో భాగంగానే పోరాట దృశ్యాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంటాం.

✦ వివేక్ ఒబెరాయ్ ముందు సినిమా చేయనన్నాను. తన పాత్ర గురించి విన్నాక అంగీకరించారు. ఆయన పాత్ర కొత్తగా ఉంటుంది. స్నేహ సహనం ఉన్న వదిన పాత్రలో నటించింది. మొత్తం అన్ని పాత్రలు ఏదో ఒక సందర్భంలో కీలకంగా వస్తుంటాయి.

✦ మాతో పాటు పండక్కి వస్తున్న అన్ని చిత్రాలు జనాదరణ పొందాలని కోరుకుంటున్నాను.

ప్రభాస్ బీస్ జాన్



వర్కింగ్ టైటిల్స్ సినిమా పేర్లుగా మారడం చూస్తూనే ఉన్నాం. ప్రచారంలో ఉన్న రెబల్‌స్టార్ ప్రభాస్ 20వ చిత్రం జాన్‌కూ ఇలాంటి ప్రచారమే జరిగింది. తాజాగా తెలిసిన సమాచారం ప్రకారం ఇదే పేరును చిత్ర బృందం ఖరారు చేసుకుంది. సినిమాకు వీఎఫ్ఎక్స్ అందిస్తున్న కమల్ కన్నన్ తన సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా తాను చేస్తున్న కొత్త సినిమాల వివరాలు తెలిపారు. ఇందులో ప్రభాస్ జాన్ సినిమాలో వీఎఫ్ఎక్స్ పనులు ప్రారంభమయ్యాయని, నాణ్యమైన విజువల్ గ్రాఫిక్స్ జాన్‌లో రూపకల్పన చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు సాహో, చిరంజీవి సైరా సినిమాకు అద్భుతమైన వీఎఫ్ఎక్స్ అందిస్తున్నట్లు చెప్పారు. సైరా చాలా భారీస్థాయిలో గొప్ప చిత్రంగా వస్తోం దని ఈ సందర్భంగా తెలిపారు. సాహో ప్రపంచ స్థాయి నాణ్యత ఉందన్నారు. చిత్ర బృందంలోని ఓ కీలక వ్యక్తి చెప్పినట్లు ప్రభాస్ బీస్ మూవీ పేరు జాన్‌గా నిర్ధారణ చేసుకోవచ్చు. ఈ సినిమాను గోపీకృష్ణా మూవీస్, యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జిల్ చిత్ర దర్శకుడు రాధాకృష్ణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. పూజా హెగ్డే నాయికగా నటిస్తోంది. రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కథలో చాలా రోజుల తర్వాత ప్రభాస్‌ను చూపించబోతోంది జాన్. ఈ ఏడాది చివరలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశాలున్నాయి.

ప్రియుడితో విహారానికి వెళ్తే...!



నర్గీస్ ఫక్రి

భయానక చిత్రాల్లో నటించడమంటే ఇష్టమని చెబుతోంది బాలీవుడ్ సుందరి నర్గీస్ ఫక్రి. ఆమె హారర్ చిత్రంలో నటించడమిదే తొలిసారి. సచిన్ జోషి కథానాయకుడిగా నటిస్తున్నారు. సినిమా పేరు అమవాస్. చిత్రీకరణ పూర్తి చేసుకున్న అమవాస్ సినిమా ఫిబ్రవరి 1న విడుదలకు సిద్ధమవుతోంది. గతంలో 1920 ఈవిల్ రిటర్న్, రాగినీ ఎంఎంఎస్ 2, అలోన్ లాంటి భయానక చిత్రాలను రూపొందించిన దర్శకుడు పటేల్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా గురించి నర్గీస్ ఫక్రి మాట్లాడుతూ...అతీంద్రియ శక్తుల నేపథ్యమున్న చిత్రాలు చూడటం నాకిష్టం. ఎందుకంటే అవి భయపెడతాయి. ఆ కథలు మనల్ని ఆ సంఘటనలు జరిగే చోటుకి తీసుకెళ్తాయి. హారర్ చిత్రాలు చూస్తుంటే ఒక ఉద్వేగానికి లోనవుతుంటాం. అది క్రమంగా అలవాటుగా మారుతుంది. ఆరేళ్లుగా ఇలాంటి కథల కోసం ఎదురుచూస్తున్నాను. ఇక అమవాస్ చిత్రంలో ప్రేమలో పడిన ఓ యువతిగా కనిపిస్తాను. ప్రేమికుడిని విహారం కోసం ఒక కోట దగ్గరకు తీసుకెళ్తాను. ఆ కోటలో నమ్మలేని సంఘటనలు జరుగుతుంటాయి. అని చెప్పింది. తాను అదృశ్య శక్తులు ఉంటాయని నమ్మనని అయితే హారర్ చిత్రాల్లో నటించడం మాత్రం ఇష్టమని తెలిపింది నర్గీస్.

ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ కొత్త చిత్రం

పాత్రికేయుడు మహేష్ కోనేరు నిర్మాతగా మారి నిర్మిస్తున్న మూడో చిత్రం ఇవాళ లాంఛనంగా ప్రారంభమైంది. నాయిక కీర్తి సురేష్ ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తోంది. నరేంద్ర ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్, హీరో కళ్యాణ్ రామ్, దర్శకులు



వెంకీ అట్లూరి, హరీష్ శంకర్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీర్తి సురేష్ మాట్లాడుతూ... తెలుగులో మహానటి తర్వాత నేను చేస్తున్న చిత్రమిది. నాయిక ప్రధానంగా సాగుతుంది. ప్రతి అమ్మాయికీ నచ్చే సినిమా అవుతుంది. ఎక్కువ భాగం అమెరికాలో చిత్రీకరణ జరుగుతుంది. దర్శకుడు నరేంద్ర మంచి కథను సిద్ధం చేశారు. నాకు మరింత పేరు తీసుకొచ్చే సినిమా అవుతుందని నమ్మకముంది. అన్నారు. దర్శకుడు నరేంద్ర మాట్లాడుతూ...మూడేళ్లుగా ఈ కథపై కసరత్తులు చేస్తున్నాను. అన్ని భావోద్వేగాలు కలిసి కథ ఇది. కీర్తి సురేష్ తప్ప ఈ కథకు మరే నాయికా సరిపోరు. ఒక భాగం మన దేశంలో, మూడొంతులు అమెరికాలో చిత్రీకరణ జరుపుతాం. ఏప్రిల్ నుంచి అమెరికా షెడ్యూల్ ఉంటుంది. ఫిబ్రవరిలో రెగ్యులర్ చిత్రీకరణ మొదలుపెడతాం. అన్నారు. నిర్మాత మహేష్ కోనేరు మాట్లాడుతూ...మహానటి చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్లో కీర్తి సురేష్ గొప్ప స్థానం సంపాదించుకున్నారు. ఇది మహిళా ప్రధాన చిత్రం. ప్రతి అమ్మాయి ఎక్కడో ఒక చోట ఈ చిత్రంలోని సందర్భాలను తన జీవితంలో చూసుకుంటుంది.అన్నారు. ఈ చిత్రానికి కళ్యాణ్ కోడూరి సంగీత దర్శకత్వం వహిస్తున్నారు.

ప్రేమికుల రోజున దేవ్ ఆగమనం

కార్తీక్, రకుల్‌ప్రీత్‌సింగ్ జటంగా నటిస్తున్న చిత్రం దేవ్. రజత్ రవిశంకర్ దర్శకుడు. రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో ఎస్.లక్ష్మణ్ కుమార్, ఠాగూర్ మధు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాగా ఈ చిత్రం ఆడియోను ఈ నెల 14న, సినిమాను ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు తెలిపారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ఫస్ట్‌లుక్, పాటలకు మంచి స్పందన లభించిందని వారు చెప్పారు. యాక్షన్, ఫ్యామిలీ డ్రామా కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని దర్శకుడు ఎంతోబాగా మలుస్తున్నారని తెలిపారు. రమ్యకృష్ణ ఓ కీలక పాత్రలోనూ, నిక్కీగిర్లాని రెండో హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి సంగీతాన్ని హేరీష్ జైరాజ్, ఛాయాగ్రహణాన్ని వేల్‌రాజ్ అందించారు.



కార్తీక్
రకుల్ ప్రీత్‌సింగ్